ఈనాడు

విజయవాడ 11-8-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 2
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పెళ్లికి ముందే అర్థం చేసుకునేలా!

- కాబోయే జంటలకు ఆర్థిక, కుటుంబ వ్యవహారాలపై అవగాహన
- ప్రభుత్వ వన్‌స్టాప్ సెంటర్లలో ఉచిత కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



ప్రస్తుతం చాలా మంది దంపతులు చిన్న చిన్న విషయాలకే పంతాలు, పట్టింపులకు పోయి పోలీసుస్టేషన్లు, కోర్టు మెట్లు ఎక్కడం చూస్తున్నాం. ఇలాంటి కేసుల్లో ముఖ్యంగా అవగాహన కొరవడి, గొడవలు ముదిరి వివాహ బంధం తెంచుకునే వరకు వస్తున్నారు. సమస్య చిన్నదే అయినా చక్కదిద్దుకొనే నేర్పరితనం ఈ తరం వారిలో లేక కుటుంబాల్లో విభేదాలు సృష్టించుకుంటున్నారు. ఇలాంటి సమస్యలను గుర్తించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు.. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తినప్పుడు ఎలా పరిష్కరించుకోవాలనే విషయాలను కాబోయే జంటలకు పెళ్లికి ముందే విడమరిచి చెబితే వారి కాపురం సజావుగా సాగేందుకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. (మిగతా 2లో)



ఏయే విషయాలు చెబుతారంటే..

- పెళ్లయిన తర్వాత అలా ఉండాలి.. ఇలా ఉండాలి.. అంటూ చాలా మంది ఊహాలోకంలో విహరిస్తుంటారు. కాబోయే జంటలు కౌన్సెలింగ్‌లో ఈ విషయాలను ప్రస్తావించినప్పుడు వారి ఆలోచనలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పి, వాస్తవ ప్రపంచం ఏంటనేది తెలియజేస్తారు. ఏది ఎంత వరకు ఆచరణ సాధ్యమనేది వివరిస్తారు. ఉన్న దాంట్లో ఒకరికొకరు ఎలా సర్దుకుపోవాలనేది చెబుతారు.
- ఖర్చులు ఎంతవరకు, వాటిపై నియంత్రణ ఎలా అనేది తెలియజేస్తారు. ఇద్దరూ కలిసి కుటుంబంలో ఆర్థిక నిర్వహణ ఎలా చేపట్టాలనే దానిని వివరిస్తారు.
- చేసే ఉద్యోగం వల్ల గానీ, కుటుంబ సభ్యుల వల్ల గానీ ఇబ్బందులు తలెత్తినప్పుడు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకోవాలో చెప్తారు.
- కాపురం అన్న తర్వాత చిన్న చిన్న విభేదాలు సహజం. ఇద్దరి మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు వాటిని కూర్చొని ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేస్తారు.



ఆడుదాం ఆంధ్రా

ఆట ముగిసింది.. అవినీతి మిగిలింది

'ఆడుదాం ఆంధ్రా'లో భారీగా అక్రమాలు

నివేదిక సిద్ధం చేసిన విజిలెన్స్

మాజీ మంత్రి రోజా, శాప్ మాజీ ఛైర్మన్ బైరెడ్డి పాత్రపై ఆరోపణలు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఫిర్యాదులపై దర్యాప్తు చేసిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. డీజీపీ పరిశీలన తర్వాత ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనుంది. క్రీడా పరికరాల కొనుగోళ్ల నుంచి క్రీడాకారులకు పంపిణీ, పోటీల నిర్వహణ నుంచి విజేతలకు నగదు బహుమతుల కేటాయింపు వరకు అన్ని కోణాల్లోనూ విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. పలు జిల్లాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. విజిలెన్స్ నివేదికలోనే దుర్వినియోగమైన సొమ్ము ఎన్ని కోట్లో బయటపడనుంది. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో అప్పటి క్రీడల శాఖ మంత్రి రోజా, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి (మిగతా 2లో)



వేగంగా టాప్-3లోకి

పరుగులు పెడుతున్న దేశ ఆర్థికవ్యవస్థ

- బెంగళూరు పర్యటనలో ప్రధాని మోదీ
- ట్రంప్ 'డెత్ ఎకానమీ' వ్యాఖ్యలకు పరోక్ష సమాధానం
- మెట్రో ఎల్లో లైన్, 3 వందేభారత్ రైళ్లు ప్రారంభం



బెంగళూరులో మెట్రో రైల్లో ప్రయాణిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ఈనాడు, బెంగళూరు: ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవాలనే లక్ష్యంవైపు భారత్ వేగంగా ప్రయాణిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అన్ని కీలక రంగాల్లో వృద్ధి సాధిస్తూ ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తిని సుదృఢం చేసుకుంటున్నామని అన్నారు. భారత్‌ది 'మృత ఆర్థికవ్యవస్థ' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం బెంగళూరులో పర్యటించిన ప్రధాని.. రూ.15,610 కోట్లతో నిర్మించనున్న మెట్రో మూడో దశ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, రూ.7,160 కోట్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన మెట్రో ఎల్లోలైన్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ... శత్రువులు సరిహద్దుల ఆవల ఎంత దూరంలో ఉన్నా తప్పించుకోలేరని ఆపరేషన్ సిందూర్‌తో రుజువైందని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే పాకిస్థాన్‌ను గంటల్లోనే మోకాళ్లపై కూర్చోబెట్టిన భారత్.. ప్రపంచానికి తన కొత్త శక్తిని పరిచయం చేసిందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో ఆధునిక సాంకేతికత ప్రభావాన్ని, (మిగతా 2లో)


మేమే బాస్ అనుకునేవాళ్లకు భారత్ వృద్ధి నచ్చలేదు

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్య

ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రాధాన్యం 10లో

ప్రత్యర్థితో 'చెస్ యుద్ధం' చేశాం

- 'ఆపరేషన్ సిందూర్' అసాధారణం
- త్రివిధ దళాల సమన్వయానికి పరీక్షగా నిలిచింది
- సీడీఎస్ అనిల్ చౌహాన్, సైన్యాధిపతి ద్వివేది వ్యాఖ్యలు
- పాక్‌కు చెందిన పెద్ద విమానాన్ని కూల్చడం ఘన విజయం
- వైమానిక దళం వెల్లడి



జనరల్ అనిల్ చౌహాన్

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ అసాధారణమని, త్రివిధ దళాల సమన్వయానికి అది పరీక్షగా నిలిచిందని భారత బలగాల అధిపతులు తెలిపారు. ప్రత్యర్థితో చెస్ యుద్ధం చేశామని, వ్యూహం అంతుచిక్కేది కాదని, 4 రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్‌ను ముగించామని, పాకిస్థాన్‌కు చెందిన పెద్ద విమానాన్ని సుదూరం నుంచే కూల్చేశామని చెప్పారు. సైన్యంలో సంస్కరణలు కొనసాగాల్సిన అవసరముందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొనగా, ఆపరేషన్ సిందూర్ సరికొత్త ప్రయాణమని, ఇది ఆరంభమేనని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో గగనతల ఆధిపత్యాన్ని చాటామని వైమానిక దళాధిపతి ఏపీ సింగ్ వివరించారు. సికింద్రాబాద్‌లో డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జనరల్ చౌహాన్, ఐఐటీ మద్రాస్‌లో జరిగిన సదస్సులో జనరల్ ద్వివేది, బెంగళూరులో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఇటీవల మాట్లాడారు. ఈ వివరాలను ఆయా సంస్థలు ఆదివారం వెల్లడించాయి.

కొత్తగా పుట్టుకొస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాల్లో సంస్కరణలు, సమన్వయం, భిన్న పరిసరాలను అనుకూలంగా ఒదిగిపోవడం వంటివి అవసరమని జనరల్ అనిల్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. (మిగతా 2లో)

విశాఖలో రెండు యుద్ధనౌకల జలప్రవేశం 26న



యుద్ధనౌక ఉదయగిరి 2లో

మద్యం కుంభకోణం కేసులో అనుబంధ అభియోగపత్రం

నేడు దాఖలు చేయనున్న సిట్

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీల ప్రమేయంపై అభియోగాలు 3లో

తల్లిదండ్రులను క్షోభకు గురిచేస్తే.. 'రిటర్న్ గిఫ్ట్' తప్పదు!

- తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007తో రక్షణ
- వారసులకు ఇచ్చిన ఆస్తులు తిరిగి పొందొచ్చు
- జీవనభృతికీ అవకాశం



న్యాయం కోసం వచ్చిన వృద్ధులతో ఇటీవల విజయవాడలో మాట్లాడుతున్న ఆర్డీఓ చైతన్య

ఈనాడు, అమరావతి: వారసులు, కుటుంబ సభ్యుల నిరాదరణ కారణంగా క్షోభకు గురవుతున్న వృద్ధులకు 'తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007' రక్షణ కవచంలా నిలుస్తోంది. కాస్త శక్తిని కూడదీసుకొని ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేయగలిగితే తక్కువ సమయంలోనే ఊరట లభిస్తుంది. వారసులకు రాసిచ్చిన ఆస్తి 'గిఫ్ట్ డీడ్'లను రద్దు చేసుకోవచ్చు. పోషణ నిమిత్తం సానుకూల ఉత్తర్వులు పొందే అవకాశం కూడా ఉంటుంది. కిందటి ఆర్థిక సంవత్సరంలో 2,500, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 800 'గిఫ్ట్‌డీడ్'లు రాష్ట్రవ్యాప్తంగా రద్దయ్యాయి. వీటిలో తల్లిదండ్రుల ఆవేదన కారణంగా రద్దయినవే ఎక్కువగా ఉండటం గమనార్హం.

తక్కువ సమయంలోనే ఊరట

- ట్రైబ్యునళ్లకు ఛైర్మన్‌గా రెవెన్యూ డివిజన్ అధికారి/సబ్ కలెక్టర్ వ్యవహరిస్తారు.
- 60 ఏళ్లు దాటిన వారికి ఈ చట్టం వర్తిస్తుంది.
- 60 ఏళ్లు పూర్తికాకున్నా.. పిల్లలు (18 ఏళ్లు నిండి ఉండాలి) చూడనప్పుడు వయసుతో సంబంధంలేకుండా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు.
- తెల్లకాగితంపై వాస్తవాలు రాసుకుని వస్తే సరిపోతుంది. ఫీజు చెల్లించక్కర్లేదు.
- వాదనల అనంతరం ట్రైబ్యునల్‌లో దాఖలైన పిటిషన్లను 90 రోజుల్లోగా పరిష్కరిస్తారు.
- విచారణ అనంతరం వయోవృద్ధులు కోరిన ప్రకారం పిల్లల నుంచి జీవనభృతి, రక్షణ (ఆస్తులు, వ్యక్తిగత) పొందేందుకు వీలుంది.
- వారసుల నుంచి ఆదరణ (మిగతా 2లో)

దస్తావేజులో 'పోషణ' కింద అని రాస్తే మంచిది

ఆస్తులకు సంబంధించి జరిగే 'గిఫ్ట్ డీడ్' దస్తావేజులో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రేమే ప్రతిఫలంగా ఆశిస్తూ అనే వాక్యం బదులు 'నీవు నా పోషణ, ఇతర బాధ్యతల పట్ల శ్రద్ధ వహించగలవని ఆశిస్తూ...అలా చేయని పక్షంలో నా ఆస్తిని ఎప్పుడైనా తిరిగి తీసుకోగలను' అనే షరతుతో రాయిస్తే మంచిది.

– కె.చైతన్య, ఆర్డీఓ, విజయవాడ రెవెన్యూ డివిజన్



చకచకా 'అడవితల్లి బాట'!

గిరిజన ప్రాంతాల్లో రూ.1,000 కోట్లతో చేపట్టిన రహదారుల పనులను వేగవంతం చేయండి

అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: డోలీ రహిత గిరిజన ప్రాంతాలే లక్ష్యంగా చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే 652 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. గిరిజన గ్రామాల్లో 'అడవితల్లి బాట' పేరుతో చేపట్టిన కొత్త రహదారుల పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో ఆయన ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'పీఎం జన్‌మన్ పథకంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, ఉప ప్రణాళిక నిధులతో కలిపి మొత్తం రూ.1,005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల పనులు రెండు దశల్లో చేపట్టాం. ఈ పనుల విషయంలో అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టాలి. రెండు వారాలకోసారి అధికారులు సమీక్షించి పురోగతిపై నివేదిక ఇవ్వాలి. రహదారుల నిర్మాణానికి అటవీశాఖ నుంచి రావలసిన అనుమతులపై త్వరలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటాం' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సవాళ్లను వివరించిన అధికారులు

కొండలపై ఉన్న ఆవాసాలను అనుసంధానిస్తూ కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టడంలో ఎదురవుతున్న సవాళ్లను అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నందున పనుల్లో వేగం తగ్గిందని వివరించారు. 186 పనులు చేపట్టగా మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వివేకా హత్య కేసు దర్యాప్తును పునఃప్రారంభించాలి

ఆయన మృతి సమాచారం బయటకు తెలియక ముందే జగన్‌కు తెలుసు 2లో

చట్టసభల ప్రతినిధులకు వివేకా కుమార్తె సునీత లేఖ

ఎల్‌ఆర్‌ఎస్‌తో సొంతింటి కల సాకారం!

ఇంటి స్థలం కొన్న రిజిస్ట్రేషన్ దస్తావేజు ఉంటే చాలు

క్రమబద్ధీకరణ ఫీజు, ఓపెన్ స్పేస్ ఛార్జీల్లోనూ రాయితీలు

రవీంద్ర గుంటూరులోని గోరంట్ల సమీపంలో 200 గజాల ప్లాట్ (ఇంటి స్థలం) కొన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఏడాది క్రితం నగరపాలక సంస్థ అధికారులను సంప్రదిస్తే అనుమతులివ్వడానికి నిరాకరించారు. అక్రమ లేఔట్‌లో తాను ప్లాట్ కొన్నట్లు అప్పటికి గానీ రవీంద్రకు తెలియలేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలసంఖ్యలో ఉన్న ఇలాంటివారి కోసం ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) తీసుకొచ్చింది.



ఈనాడు, అమరావతి: స్థలం కొన్నట్లు రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌లో ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చు. ఇందుకోసం సమీపంలోని లైసెన్స్ కలిగిన సాంకేతిక నిపుణుడిని (ఎల్‌టీపీ) సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. తగిన పరిజ్ఞానం ఉంటే ప్లాట్ యజమానులు కూడా ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు, దస్తావేజులు, లేఔట్ కాపీ అప్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 13,667 లేఔట్లు అనుమతులు తీసుకోకుండా వేసి, వాటిలో ప్లాట్లు విక్రయించినట్లు అంచనా.

ఎవరు అర్హులు?: అనుమతులు తీసుకోని లేఔట్లలో 2025 జూన్ 30 లోపు ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారంతా (మిగతా 2లో)


ఎండ సోకక.. బాల్యం బరువుగా!



ఎండమొహం చూసేది లేదు.. ఎప్పుడూ ఎల్‌ఈడీ లైట్లలోనే..!
ఐదు నిమిషాలు ఆడింది లేదు.. అస్తమానూ బెంచీలోనో సోఫాలోనో..!
మార్కులు, ర్యాంకుల పోటీ ప్రపంచంలో..
అటు ఆరోగ్యాన్ని, ఇటు ఆనందాన్ని కోల్పోతున్న జీవితాలెన్నో..?

మార్కులు, ర్యాంకుల పోటీ ప్రపంచంలో పిల్లలు చిన్నప్పటి నుంచే రోజంతా తరగతి గదుల్లోనే గడిపేస్తున్నారు. చాలామంది సూర్యోదయం, సూర్యాస్తమయం చూడట్లేదు. పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ, నీట్‌కు సన్నద్ధత పేరుతో నాలుగు గోడల మధ్యనే ఉండిపోతున్నారు. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి మరింతగా బందీ అవుతున్నారు. మొబైల్ ఫోన్ల రాకతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పింది. అదేలోకంగా మారి ఎప్పుడు తెల్లారుతుందో.. ఎప్పుడు చీకటి పడుతుందో కూడా తెలియట్లేదు. గంటల కొద్దీ గదుల్లో, బెంచీలపై కూర్చుని ఉండడం.. ఆటలు లేకపోవడంతో పాటు సూర్యరశ్మి సోకకపోవడం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తరగతుల్లో ఎక్కువ సమయం ఒకే విధంగా కూర్చొని ఉండడం వల్ల వెన్నెముక, మెడ నొప్పులతోపాటు కొన్ని సమయాల్లో కండరాల బలహీనత ఏర్పడుతుంది.



- ఈనాడు, అమరావతి

ఏకాగ్రత లోపిస్తుంది..

- సూర్యరశ్మి తగలని పిల్లల్లో విటమిన్-డి లోపం ఏర్పడుతుంది. దీంతో ఎముకల బలహీనత, అలసట, మూడ్ స్వింగ్స్, దీర్ఘకాలంలో రికెట్స్, దంత సమస్యలు తలెత్తుతాయి.
- ఎక్కువ సమయం కూర్చొనే ఉండడం వల్ల బరువు పెరగడం, చికాకు, ఏకాగ్రత లోపించడం లాంటివి ఏర్పడతాయి.
- బోర్డు, పుస్తకాలను, డిజిటల్ స్క్రీన్‌లను అదేపనిగా చూస్తే కంటిపై ఒత్తిడి పెరిగి, చూపు సమస్య వచ్చే అవకాశం ఉంటుంది.

ఊబకాయానికి దారి...

- ఆటలు లేకపోవడం, శారీరక శ్రమ లేనందున ఇంట్లో, వసతి గృహాల్లో తీసుకునే అధిక క్యాలరీలు కలిగిన ఆహారం వల్ల పిల్లలు బరువు పెరుగుతూ ఉంటారు. ఊబకాయం కారణంగా తొందరగా మధుమేహం లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఆటలు ఆడే పిల్లలు ఆనందంగా ఉల్లాసంగా ఉంటారు.
- శ్వాసకోశ వ్యవస్థ, రక్త ప్రసరణ మెరుగవుతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

ఎల్‌ఈడీ వెలుగుల్లోనే..

- ఎల్‌ఈడీ లైట్లలో నీలికాంతి ఎక్కువగా ఉంటుంది. ఇది అధికంగా ఉన్న తరగతి గదుల్లోని విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఎక్కువ. నిద్రపైనా ప్రభావం చూపుతుంది.
- దీర్ఘకాలం ఈ కాంతిని చూస్తే కంటి రెటీనాపై ఒత్తిడి పడుతుంది.
- కొంతమందిలో మైగ్రేన్ లేదా తలనొప్పులకు దారి తీయొచ్చు.
- చదువుపై ఆసక్తి తగ్గే ప్రమాదం సైతం ఉంది.

ఆటలు, విశ్రాంతికి సమయం ఇవ్వాలి

పిల్లలు తరగతి గదిలోనే బందీలైతే.. అనారోగ్య సమస్యలతోపాటు మానసిక సమస్యలు వస్తాయి. ఒత్తిడి పెరుగుతుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు తగ్గుతాయి. వ్యాయామం లేకపోవడంతో మానసికంగా ఉల్లాసంగా ఉండలేరు. పిల్లలకు కొంత సమయం ఆటలు, విశ్రాంతి ఉండాలి.

పాతూరి వెంకట రామారావు, పిల్లల వైద్యులు, సంచాలకులు, ఆంధ్ర హాస్పిటల్స్

అంతా వారి ఇష్టమే!


ఐఐటీలో సీటుపై తల్లిదండ్రుల ఆశలు

సిలబస్ పూర్తి చేయడమే విద్యాసంస్థల లక్ష్యం

మధ్యలో నిలువునా నలిగిపోతున్న విద్యార్థులు

విజయవాడకు చెందిన భాను ప్రసాద్ ప్రైవేటు కళాశాలలో చేరాడు. ఐఐటీలో సీటు సంపాదించాలి? కళాశాలలో తమ కుమారుడు టాపర్‌గా నిలవాలన్నది అతడి తల్లిదండ్రుల కోరిక. సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలు నిర్వహించడంపైనే అక్కడి టీచర్ల దృష్టి. ఈ క్రమంలో మంచి మార్కులు, ర్యాంకు రాకపోతే తల్లిదండ్రులు ఏమంటారోననే భయం భాను ప్రసాద్‌ను నిరంతరం వెంటాడుతోంది. దీంతో అతను తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాడు. ఇది ఒక్క భాను ప్రసాద్ పరిస్థితే కాదు. రాష్ట్రంలోని లక్షల మంది విద్యార్థులది ఇదే దుస్థితి.

తల్లిదండ్రులు, విద్యా సంస్థల మధ్యలో పిల్లలు ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థుల స్వభావం, సామర్థ్యం గుర్తించకుండా అందరికీ ఒకే పద్ధతిలో విద్యా సంస్థలు బోధన చేస్తున్నాయి. పరీక్షలు, మార్కులు ఆధారంగానే ప్రతిభను నిర్ణయిస్తున్నాయి. కొన్ని విద్యా సంస్థల్లో ప్రతి మూడు నెలలకోసారి సెక్షన్లు మార్చేస్తుంటారు. అంతర్గతంగా



నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. ప్రతి 3 నెలలకోసారి ఏం జరుగుతుందో? అనే ఆందోళన విద్యార్థులను వెంటాడుతోంది. సెక్షన్ మార్పులో స్థాయి దిగజారితే తల్లిదండ్రులు ప్రశ్నిస్తారు. ఇటీవల కాలంలో ఈ ఒత్తిడి పిల్లల్ని నిలువునా దహించివేస్తోంది.

ఏం చేయాలి?

- కళాశాల, తల్లిదండ్రులు, టీచర్లది ఒకే విధానం ఉండాలి.
- మొదట పిల్లల స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రుల కలలను వారిపై రుద్దకూడదు.
- చదువు ఒక్కటే కాకుండా మంచి ప్రతిభావంతులుగా ఎదిగేలా ప్రోత్సహించాలి
- పిల్లలతో ఏకాంతంగా కొంత సమయం గడపాలి. వారి భావాలు, భావోద్వేగాలను వినాలి.
- ప్రతి విద్యార్థిని వేరుగానే చూడాలి. వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే విద్యార్థి మంచి పురోగతి సాధించే అవకాశం ఉంటుంది.
- తరగతి గదిలో భయాన్ని కాకుండా ఆసక్తిని పెంచే పద్ధతులు అమలు చేయాలి
- మానవీయతకు విలువనిస్తూ పిల్లలను తీర్చిదిద్దాలి.

అర్థమైందా? లేదా? అన్నది పట్టించుకోవడం లేదు

– డాక్టర్ విజయలక్ష్మి, హెచ్‌వోడీ, సైకియాట్రీ విభాగం, ఆంధ్ర మెడికల్ కళాశాల

అకడమిక్ సిలబస్ కంటే ముందు ఐఐటీ సిలబస్ చెప్పేస్తున్నారు. వారికి అర్థమైందా? లేదా? అని పట్టించుకోవడం లేదు. పోటీతత్వం కొనసాగుతోంది. అందరూ ఏం చేస్తే మనం అదే చేయాలనే విధానం కొనసాగుతోంది. పిల్లల సామర్థ్యం ఏమిటి? అన్నది చూడడం లేదు. తల్లిదండ్రులు కొంచెం ఆలోచించాలి. పిల్లల్లో ఓవరాల్ అభివృద్ధిని చూడాలి.

– ఈనాడు, అమరావతి

వేగంగా టాప్-3లోకి

(మొదటి పేజీ తరువాయి)

మేకిన్ ఇండియా పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ''గత 11 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థల్లో పదో స్థానం నుంచి టాప్ 5లోకి చేరుకున్నాం. టాప్-3లోకి ప్రవేశించడానికి వేగంగా ముందుకెళుతున్నాం. 2014లో ఐదు నగరాల్లోనే మెట్రో సర్వీసులు ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 24కు చేరుకుంది. 2014కు ముందు రైల్వేలో 20 వేల కిలోమీటర్లకే విద్యుదీకరణ జరగగా కేవలం 11 ఏళ్లలో 40 వేల కిలోమీటర్లకు చేర్చాం. విమానాశ్రయాల సంఖ్యను 74 నుంచి 160కి తీసుకురావడం చిన్న విషయమేమీ కాదు. ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎంల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచలోనే అత్యధిక వినియోగదారులున్న దేశంగా అవతరించాం. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, మొబైళ్లను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుంది' అని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో ప్రయాణిస్తే వికసిత్ భారత్ లక్ష్యాలను వేగంగా చేరుకోవడానికి వీలవుతుందని ఆయన సూచించారు. అంతకుముందు కేఎస్‌ఆర్ బెంగళూరు రైల్వేస్టేషన్‌లో బెంగళూరు-బెళగావి వందేభారత్‌ను నేరుగా, అమృత్‌సర్-మాతా వైష్ణోదేవి కాట్రా, నాగ్‌పుర్-పుణె వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు.

కేంద్ర సహకారంపై సిద్ధూ ఆక్షేపణ

బెంగళూరు మెట్రో ఉమ్మడి ప్రాజెక్టు అయినా రాష్ట్ర వ్యయం 87.37% కాగా కేంద్రం వాటా 12.63% మాత్రమేనని, ఈ మొత్తాన్ని పెంచాలని కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రుణాల రూపంలో కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం చెల్లించే మొత్తం భారంగా మారుతోందని ప్రధాని సమక్షంలోనే ప్రస్తావించారు. కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, హెచ్‌డీ కుమారస్వామి, అశ్వినీ వైష్ణవ్, వి.సోమణ్ణ, శోభా కరంద్లాజె, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.



బెంగళూరు– బెళగావి వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న ప్రధాని మోదీ



మెట్రో రైల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, సోమణ్ణ, శోభాకరంద్లాజె తదితరులతో ప్రధాని మోదీ మాటామంతీ

సామాన్యులతో కాసేపు..!

బెంగళూరు మెట్రోలో కొద్దిదూరం ప్రయాణించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు, మెట్రో మహిళా సిబ్బందితో ముచ్చటించారు. నమ్మ మెట్రో పని విధానాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని మార్గాల్లో మెట్రోను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు ప్రధానిని అడిగారు. పైలట్ రహిత మెట్రో సంచారం గురించి బీఎంఆర్‌సీఎల్ అధికారులు వివరించారు. ఆర్‌వీ రోడ్డు మెట్రో ప్రాంగణం సౌరశక్తి ఆధారితమని తెలుసుకుని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు.

వివేకా హత్య కేసు దర్యాప్తును పునఃప్రారంభించాలి

ఆయన మృతి సమాచారం బయటకు తెలియక ముందే జగన్‌కు తెలుసు

తెలంగాణ హైకోర్టుకు ఈ విషయాన్ని సీబీఐ చెప్పింది

కానీ ఆ కోణంలో విచారణ చేయకుండా దర్యాప్తు నిలిపివేసింది

చట్టసభల ప్రతినిధులకు వివేకా కుమార్తె సునీత లేఖ



ఈనాడు, అమరావతి: వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును పునఃప్రారంభించి దాన్ని పూర్తి చేసేలా సీబీఐపై ఒత్తిడి తేవాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత చట్టసభల సభ్యుల్ని కోరారు. వివేకా మృతి సమాచారం బయట ప్రపంచానికి తెలియడానికి చాలా సమయం ముందే జగన్‌కు తెలుసని, హత్యలో పాల్గొన్నవారితో కీలక నిందితుడైన అవినాష్‌రెడ్డి నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు ఫోన్ కాల్‌డేటా రికార్డుల విశ్లేషణ ద్వారా వెల్లడైందని గతంలో తెలంగాణ హైకోర్టులో సీబీఐ చెప్పిందని గుర్తుచేశారు. అయినా ఆ కోణంలో విచారణ చేయకుండానే కేసు దర్యాప్తును అర్ధంతరంగా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్య వెనకున్న అసలు కుట్రదారులెవరో తేల్చకుండానే.. దర్యాప్తు ముగిసినట్లు ప్రకటించేసిందని వాపోయారు. ఈ నేపథ్యంలో సీబీఐ మళ్లీ దర్యాప్తు ప్రారంభించేలా డిమాండ్ చేయాలని కోరుతూ.. దేశంలోని అందరు ఎంపీలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పక్షాలకు ఆదివారం ఆమె బహిరంగ లేఖ రాశారు. దాన్ని మీడియాకు విడుదల చేశారు. న్యాయం కోసం తాను చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని కోరారు. రాఖీ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని ఒక సోదరిగా తాను మద్దతు కోరుతున్నానని ఆ లేఖలో సునీత వివరించారు. ప్రధానాంశాలివీ..

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసే పరిస్థితి

నా తండ్రి హత్యకేసులో కుట్రదారులకు శిక్షపడాలని ఆరేళ్లుగా పోరాడుతున్నా. ఈ క్రమంలో ప్రతి తలుపూ తట్టా. అనేక రకాల వేధింపులకు గురయ్యా. నాపై తప్పుడు కేసులు పెట్టారు. నా తండ్రి మద్దతు, సాయంతో ఏర్పడ్డ వైకాపా ప్రభుత్వమే నన్ను తీవ్రంగా వేధించింది. అయినా ఇప్పటికీ మాకు న్యాయం దక్కలేదు. నేరగాళ్లు ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసే పరిస్థితి వచ్చింది. వివేకా హత్యలో పాల్గొన్నవారిని పట్టుకున్నారు. కుట్రదారుల జోలికి మాత్రం వెళ్లలేదు. అందుకే ఈ పోరాటంలో మీ మద్దతు కావాలి.

నాకు న్యాయం జరగకుండా చేసి..

నా తండ్రి హత్యను ఎన్నికల ప్రచార ఆయుధంగా మలచుకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో నాటి అధికార పక్షమైన తెదేపాపై వైకాపా బురద చల్లింది. ఆ తర్వాత పరిణామాల్లో నా సోదరుడు జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. హంతకులను పట్టుకుంటానని.. అలా చేయకపోతే అది తనకు తీవ్ర అవమానమని జగన్ నాకు హామీ ఇచ్చారు. అప్పట్లో ఈ కేసు బాధ్యతలు చూసిన సిట్.. దర్యాప్తును కీలకదశకు తీసుకొచ్చిన సమయంలో దాన్ని జగన్ మార్చేశారు. సీబీఐ దర్యాప్తు కూడా అవసరం లేదని, అలా చేస్తే అవినాష్‌రెడ్డి పార్టీ మారిపోయే అవకాశముందని నాతో అన్నారు. దీంతో వారు నాకు న్యాయం జరగకుండా చేస్తున్నారని అప్పుడే స్పష్టమైంది.

నా తండ్రి ఆత్మ క్షోభిస్తోంది

హత్య జరిగి ఆరేళ్లు దాటిపోయింది. న్యాయం కోసం నా తండ్రి ఆత్మ క్షోభిస్తోంది. సాక్షి టీవీ ఛానల్‌లో వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారంటూ తొలుత ప్రసారం చేశారు. నేను పులివెందులకు చేరుకుని చూసేసరికి నా తండ్రి శరీరంపై గాయాలున్నాయి. అవి కనిపించకుండా బ్యాండేజీలు చుట్టేశారు. వాటి గురించి ప్రస్తావిస్తే.. మాట మార్చేసి తెదేపాపై నిందలు మోపారు. సీబీఐ దర్యాప్తునకు వైకాపా ప్రభుత్వం అనేక ఆటంకాలు కలిగించింది. అధికారులపై తప్పుడు కేసులు పెట్టింది. వై.ఎస్.అవినాష్‌రెడ్డి అరెస్టుకు రాష్ట్ర పోలీసులు సహకరించలేదు. ఈ నేపథ్యంలో మీ మద్దతు అభ్యర్థిస్తున్నా.

ఈ నెలలో విస్తారంగా వర్షాలు..!

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే ఆరు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయంది. ఈ నెల 18న మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని అభిప్రాయపడుతున్నారు. ఆదివారం శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, తిరుపతి, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం వీరాపురంలో 98 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆట ముగిసింది.. అవినీతి మిగిలింది

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలకు పాల్పడినట్లు కూటమి ఎమ్మెల్యేలు ఆరోపించారు. శాప్ ప్రస్తుత ఛైర్మన్ రవినాయుడు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజయవాడలోని శాప్ ప్రధాన కార్యాలయంతోపాటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయాల్లోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి పలు కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి అందజేసే నివేదిక అత్యంత ప్రాధాన్యం సంతరించుకోనుంది.

- గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఖర్చు చేసిన రూ.119 కోట్లలో భారీగా అక్రమాలు జరిగాయన్నది ప్రధాన అభియోగం. ప్రత్యేకించి రూ.37.50 కోట్లతో క్రీడా పరికరాల కొనుగోళ్లలో కమీషన్ల వ్యవహారం నడిచినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన ఆరు సంస్థల నుంచే క్రీడా పరికరాలు కొనుగోలు చేశారు. క్రీడలతో సంబంధం లేని రోడ్లు, భవనాల శాఖ ద్వారా అప్పట్లో టెండర్లు పిలిచి సరఫరా సంస్థలను ఎంపిక చేశారు. ఆడడం మొదలుపెట్టిన వెంటనే క్రికెట్ బ్యాట్లు విరిగిపోవడంతో అప్పట్లో వీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.
- అత్యధిక జిల్లాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునే క్రీడాకారులు లేక పోటీలు తూతూమంత్రంగా నిర్వహించారు. దారినపోయే వారందర్నీ తీసుకొచ్చి పోటీల్లో పెట్టిన సందర్భాలూ లేకపోలేదు. పోటీల నిర్వహణకు రూ.14.99 కోట్లు ఖర్చుగా చూపారు. విజేతలకు నగదు బహుమతుల కేటాయింపులోనూ భారీగా అక్రమాలు జరిగాయి. వైకాపా కార్యకర్తలకు, జిల్లా క్రీడా అధికారుల కుటుంబసభ్యులు, అనుచరులకు కూడా నగదు బహుమతులు ఇచ్చేశారు. ప్రకాశం జిల్లాల్లో అక్కడి క్రీడా అధికారి తన కుటుంబసభ్యుల పేర్లు విజేతల జాబితాలో చేర్చి నగదు కేటాయించేశారు. ఈ విషయం సమాచార హక్కు చట్టం కింద ఒకరు బయటకు తీశారు. చాలా జిల్లాల్లో నగదు బహుమతుల కేటాయింపుల్లో భారీగా అక్రమాలు జరిగాయి.
- క్రీడాకారులకు టీ షర్టుల కొనుగోళ్లలోనూ పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయన్నది అభియోగం. నాసిరకం టీ షర్టులు కొని కొందరు కమీషన్లు జేబుల్లో వేసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు శాప్‌లోని కొందరు అధికారులు తొత్తులుగా వ్యవహరించారు. వీరిలో కొందరు ఇప్పటికీ కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు.
- విశాఖలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమం కోసం చేసిన రూ.2.70 కోట్లకుపైగా ఖర్చుపైనా అనుమానాలు ఉన్నాయి. టిడ్కో ఇళ్లలో క్రీడాకారులకు వసతి కల్పించి ఇందుకోసం రూ.45 లక్షలకుపైగా వెచ్చించినట్లు చూపారు. భోజనాలకు రూ.65.51 లక్షలు ఖర్చు చూపించగా.. సరైన భోజన సదుపాయం కల్పించలేదని అప్పట్లో క్రీడాకారులు ఆందోళనలకు దిగారు. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న వీవీఐపీలు, వీఐపీల కోసం రూ.30 లక్షలు, మైదానాల్లో ఏర్పాట్లు, ఫొటో, వీడియోగ్రఫీకి రూ.36 లక్షలు ఖర్చు చేసినట్లు చూపి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.

ప్రత్యర్థితో 'చెస్ యుద్ధం' చేశాం

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త బలాన్ని పెంచుకునేందుకు థియేటర్ కమాండ్స్ రోడ్డు మ్యాప్‌ను రూపొందించుకోవాలని చెప్పారు. టెక్నాలజీ ఆధారిత ఆధునిక యుద్ధ రీతులకు అనుగుణంగా పరివర్తన అవసరమని స్పష్టం చేశారు.

వ్యూహాలను బట్టి కదలికలు

'ఆపరేషన్ సిందూర్‌లో మనం చెస్ ఆడాం. అంటే.. ప్రత్యర్థితోపాటు మన తదుపరి వ్యూహాలేంటో అర్థం కావు. దీనిని మనం గ్రే జోన్ అంటాం. ఈ జోన్‌లో సంప్రదాయ ఆపరేషన్లు ఉండవు. మరేదో కొత్తగా చేస్తాం. సంప్రదాయ యుద్ధంలో మన వద్ద ఆయుధాలన్నీ తీసుకెళ్తాం. వెనక్కి రాగలిగితే వస్తాం. లేదంటే అక్కడే ఉంటాం. గ్రే జోన్‌లో అలా ఉండదు.. ప్రత్యర్థి వ్యూహాలను బట్టి మన కదలికలుంటాయి. మనం చేసింది గ్రేజోన్ యుద్ధమని ఆపరేషన్ సిందూర్ మనకు నేర్పింది. అంటే మనం చెస్‌లో మాదిరిగా పావులు కదిపాం. ప్రత్యర్థి దేశం అలాగే చేసింది. చివరకు మనం చెక్ పెట్టాం' అని జనరల్ ద్వివేది వివరించారు. ఆపరేషన్ సిందూర్‌లో సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఇంతటి రాజకీయ స్పష్టత, డైరెక్షన్‌ను తొలిసారిగా చూశామని, ఎటువంటి నియంత్రణలు లేకుండా యుద్ధం చేశామని వెల్లడించారు. ఇక ముందు యుద్ధం వస్తే 14, 140, 1,400 రోజులైనా కొనసాగవచ్చని, అందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మనం రెండు దేశాల సరిహద్దుల్లో సున్నిత పరిస్థితులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. మనకున్న 12 లక్షల మంది సైన్యంలో ప్రతి ఒక్కరి చేతిలో ఒక డ్రోన్ ఆయుధం ఉండాలని అభిప్రాయపడ్డారు.

దూరం నుంచే కూల్చేశాం

పాకిస్థాన్‌కు చెందిన అతి పెద్ద వ్యూహాత్మక విమానాన్ని కూల్చేశామని, అది కీలక విజయమని ఏపీ సింగ్ అభిప్రాయపడినట్లు వైమానిక దళం వెల్లడించింది. 300 కిలోమీటర్ల దూరం నుంచే దానిని కూల్చేయడం విశేషమని పేర్కొంది. భూతలం నుంచి గగన తలంలోకి ప్రయోగించే క్షిపణితో పాక్ విమానాన్ని కూల్చేశామని, ఇది మనకు పెద్ద ఆస్తి అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపారు. దీంతో పాకిస్థాన్ మానసికంగా, వ్యూహాత్మకంగా దెబ్బ తిందని వెల్లడించారు. ఒక వేళ ఆ పెద్ద విమానం.. ఏఈడబ్ల్యూ అండ్ సీ విమానమైతే మరింత భారీ విజయమవుతుందని అభిప్రాయపడ్డారు. అటువంటి విమానాలు ప్రపంచంలో అతి తక్కువ ఉన్నాయని, అది గగనతల నిఘాలో సిద్ధహస్తురాలని తెలిపారు.



విశాఖలో యుద్ధనౌకల జలప్రవేశం 26న

దిల్లీ: కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి(ఎఫ్35)', 'హిమగిరి(ఎఫ్34)'లను ఈ నెల 26న విశాఖపట్నంలో జలప్రవేశం చేయించేందుకు భారత నౌకాదళం సన్నాహాలు చేస్తోంది. ప్రాజెక్ట్ 17ఏలో భాగంగా తయారు చేసిన నౌకలివి. ఇదే శ్రేణిలో రూపొందించిన మొదటి నౌక(నీలగిరి క్లాస్)ను ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ముంబయి డాక్‌యార్డ్‌లో ప్రారంభించారు. విశాఖపట్నం నుంచి రెండు ప్రధాన యుద్ధనౌకలను ప్రారంభించనుండటం ఇదే తొలిసారని ఆదివారం అధికారులు తెలిపారు. రక్షణ రంగంలో ఈ మైలురాయి భారత్‌లో తయారీ, ఆత్మనిర్భరతల విజయాలను సూచిస్తుందని పేర్కొన్నారు.

పెళ్లికి ముందే అర్థం చేసుకునేలా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇప్పటికే నడుస్తున్న 'వన్‌స్టాప్' కేంద్రాల్లో కాబోయే జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల ఏర్పాట్లు చేసింది. పెళ్లి సంబంధం కుదిరిన తర్వాత ముందుకొచ్చేవారికి ఈ కేంద్రాల్లో ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తారు. వధూవరులు లేదా వారి కుటుంబసభ్యులు నేరుగా వచ్చి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. పూర్తిగా మహిళా అధికారుల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి.

సమస్యలకు చెక్ పెట్టొచ్చు: ఇంట్లో అందరూ బాగుంటేనే కుటుంబం, తద్వారా సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొన్నారు. పెళ్లికి ముందు కౌన్సెలింగ్ అనేది కాస్త కొత్తగా అనిపించినా కాబోయే జంట ఒకరికొకరు తమ భావాలు పంచుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే చాలా సమస్యలకు ముందే చెక్ పెట్టవచ్చని, పెద్దలు కుదిర్చిన లేదా ప్రేమ వివాహం చేసుకునేవారు ఎవరైనా ఇక్కడకు వచ్చి సేవలు పొందవచ్చని చెబుతున్నారు. దాదాపు అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి తెలిపారు. ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న 'వన్‌స్టాప్' కేంద్రాల నిర్వహణాధికారులకు ఈ కౌన్సెలింగ్ బాధ్యతలు అప్పగించామన్నారు.

– ఈనాడు, ఒంగోలు

గ్రహం అనుగ్రహం

11–8–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం

విదియ: ఉ. 11-42 తదుపరి తదియ

శతభిష: మ. 3-05 తదుపరి పూర్వాభాద్ర

వర్జ్యం: రా. 9-15 నుంచి 10-48 వరకు

అమృత ఘడియలు: ఉ. 8-01 నుంచి 9-35 వరకు

దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-21 వరకు తిరిగి 3-03 నుంచి 3-53 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.45; **సూర్యాస్తమయం:** సా.6.26

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విశాఖపట్నం	34.2	26.0
గుంటూరు	34.0	28.0
విజయనగరం	34.0	26.0
ఒంగోలు	33.9	28.0
తిరుపతి	33.8	25.6
తాడేపల్లిగూడెం	32.2	26.5
అనంతపురం	31.2	23.0
విజయవాడ	31.0	26.6
రాజమహేంద్రవరం	30.5	24.0

తల్లిదండ్రులను క్షోభకు గురిచేస్తే.. 'రిటర్న్ గిఫ్ట్' తప్పదు!

(మొదటి పేజీ తరువాయి)

లభించకుంటే..గిఫ్ట్ డీడ్‌లను కూడా రద్దుచేస్తారు.

- ట్రైబ్యునల్ ఉత్తర్వులు ధిక్కరిస్తే జైలు శిక్ష విధిస్తారు.
- న్యాయవాదులు ఉండరు. పోలీసులూ కనిపించరు.
- ఇక్కడిచ్చిన తీర్పు సంతృప్తినివ్వకుంటే జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు.

అందరూ పట్టించుకోవాలి

ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ట్రైబ్యునల్ ఉండాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ కొన్నిచోట్లే వీటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఆర్డీఓలు పట్టించుకోవడంలేదు. 35% కుమారుల చేతుల్లో, 21% కోడళ్ల చేతుల్లో వృద్ధులు దౌర్జన్యాలకు గురవుతున్నారని హెల్ప్‌ఏజ్ ఇండియా నివేదిక చెబుతోంది.

చిన్న గదిలో ఉంచి.. హింసకు గురిచేస్తున్నారు

విజయవాడలోని దుర్గాపురానికి చెందిన దంపతులు గిఫ్ట్ డీడ్ కింద రాసిచ్చిన స్థలంలో కుమారుడు బ్యాంకు రుణంతో భవనాన్ని నిర్మించుకున్నాడు. తర్వాత తల్లిదండ్రులను చిన్నగదిలో ఉంచి హింస పెట్టేవాడు. వృద్ధుల వినతితో విజయవాడ ట్రైబ్యునల్ ఛైర్మన్ విచారణ జరిపారు. ఇళ్లు ఖాళీ చేసి.. అద్దె మొత్తాన్ని తల్లిదండ్రులకు అందించాలని తీర్పునిచ్చారు. అమానుషంగా కొడుతూ, తిడుతూ వేధిస్తోన్న కుమారుడి నుంచి రూ.2 లక్షలకు 'బాండ్ టూ కీప్ ఫర్ గుడ్ బిహేవియర్'ను తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఆస్తి తీసుకొని వృద్ధాశ్రమానికి..

విజయవాడకు చెందిన 82 ఏళ్ల వృద్ధురాలికి భర్తలేరు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెకు గతంలో కొంత ఆస్తిని అమ్మి రూ.5 కోట్లు సమానంగా పంచారు. మిగిలిన ఆస్తిని పెద్దకుమారుడికి ఇవ్వగా..ఆయన తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పించాడు. దీంతో ఆమె ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వాదనల అనంతరం ఛైర్మన్ గిఫ్ట్ డీడ్ రద్దుచేసి, నెలకు రూ.10వేల చొప్పున తల్లికి ఇవ్వాలని వారసులకు ఆదేశాలిచ్చారు.

అవగాహన పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

–వయో వృద్ధుల సంక్షేమ సంఘాల నేతలు మోతుకూరి వెంకటేశ్వర్లు, మేళం దుర్గాప్రసాద్, విజయవాడ, భీమవరం

చాలామందికి చట్టపరమైన హక్కుల గురించి తెలియదు. అవగాహన పెంచాల్సిన ప్రభుత్వాలదే. విచారణ త్వరగా జరిగేలా కృషి చేయాలి.

ఎల్‌ఆర్‌ఎస్‌తో సొంతింటి కల సాకారం!

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హులు. దరఖాస్తు, దస్తావేజులు, లేఔట్ కాపీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక.. ఫీజులో రూ.10వేలకు తగ్గకుండా ప్రాథమికంగా చెల్లించాలి. ఫీజు మొత్తం 45 రోజుల్లో చెల్లిస్తే 10% రాయితీ వర్తిస్తుంది. 45-90 రోజుల్లో జమచేస్తే 5% రాయితీ ఇస్తారు. క్రమబద్ధీకరణ ఫీజు కాకుండా చెల్లించాల్సిన 14% ఓపెన్‌స్పేస్ ఛార్జీలోనూ 7% రాయితీ వర్తిస్తుంది. ఈ అక్టోబరు నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతిస్తారు.

- దరఖాస్తు అనంతరం పుర, నగరపాలక సంస్థల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి సూత్రప్రాయ లేఔట్ నమూనా (ఇన్ ప్రిన్సిపల్ లేఔట్ ప్యాటర్న్) తయారుచేస్తారు. కనిష్ఠంగా 30 అడుగుల రహదారులు ఉండేలా లేఔట్ నమూనా రూపొందించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాల్లేని లేఔట్‌లకు సంబంధించిన దరఖాస్తుదారుల నుంచి మిగిలిన ఫీజు వసూలు చేసి ఆయా ప్లాట్లను క్రమబద్ధీకరిస్తారు.
- లేఔట్ల సమాచారం సమీప పట్టణాభివృద్ధి సంస్థల్లో అందుబాటులో ఉంటుంది. లేఔట్ ప్లాన్ (ఎల్‌పీ) నంబరు చెబితే దానికి అనుమతులు ఉన్నాయా? లేదా అనేది అధికారులు చెబుతారు.
- రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోని 29 గ్రామాల్లో తప్ప మిగిలిన ప్రాంతాలకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తిస్తుంది. ఈ మేరకు ప్లాట్ల క్రమబద్ధీకరణకు సీఆర్‌డీఏ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
- హెల్ప్ లైన్ నంబరు 79816 51881

క్రమబద్ధీకరణతో లాభాలివి..

- ఇళ్ల నిర్మాణాలకు పట్టణ స్థానిక సంస్థల నుంచి అనుమతులొస్తాయి. ■ లేఔట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ■ ఇంటి నిర్మాణానికి బ్యాంకులు రుణాలిస్తాయి. ■ లేఔట్ క్రమబద్ధీకరణ పథకం మళ్లీ వస్తుందో.. లేదో గ్యారంటీ లేదు. ■ క్రమబద్ధీకరణ ఫీజు, 14% ఓపెన్ స్పేస్ ఛార్జీల్లోనూ రాయితీలిచ్చారు.

ఇదీ చరిత్ర

చరిత్రలో ఘనం.. జ్ఞాపకాలు కనం

- వందేళ్లైనా వన్నె తగ్గని చీరాల-పేరాల ఉద్యమ స్వరం
- క్షేత్రస్థాయిలో ఆనవాళ్లు మాయం.. పరిరక్షణ అవశ్యం
- స్మారక నిర్మాణంపై దృష్టిపెట్టాలని స్థానికుల వినతి

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, చీరాల: చీరాల-పేరాల ఉద్యమం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మహోజ్వల ఘట్టం. సహాయ నిరాకరణ ఉద్యమానికి ఊపిరిలూదిన సందర్భంగా, బ్రిటిష్ పార్లమెంటులో వాడీవేడి చర్చ రేకెత్తించిన అంశంగా నిలిచింది. ఓ ఊరంతా పుర బహిష్కరణ చేసి నిరసన తెలపటం, ఇలాంటి ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే అరుదని చెబుతుంటారు. అలాంటి పోరాటానికి నాంది పలికిన వ్యక్తి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. ప్రతి ఒక్కరిలోనూ పోరాట కాంక్షను రగిల్చి యావత్ దేశాన్ని, మహాత్మాగాంధీ దృష్టినీ తనవైపు తిప్పుకొన్న గొప్ప నాయకుడు ఆయన. ఆ ఉద్యమం, ఆయనకు సంబంధించిన ఆనవాళ్లు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కనుమరుగై చారిత్రక విషాదంగా నిలిచే ప్రమాదం కనబడుతోంది.



రామదండు స్థాపన తర్వాత ఆ పతాకంతో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

స్వాతంత్ర్యోద్యమ కాలంలో చీరాల, పేరాల రెండు పంచాయతీలుగా ఉండేవి. 1919లో ప్లేగు వ్యాధి వ్యాపించటంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం దానిపై కమిటీ వేయగా, దాని సూచనల మేరకు రెండు పంచాయతీలను కలిపి 1920లో మున్సిపాలిటీగా ప్రకటించారు. దీంతో పన్నులు భారీగా పెరిగాయి. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తీసుకున్న ఆ నిర్ణయంతో రెండు పంచాయతీల ప్రజలు సహాయ నిరాకరణ చేపట్టారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా శాంతియుతంగా నిరసన తెలిపారు. దీంతో ఆగ్రహించిన బ్రిటిష్ సర్కారు కొంత మందిపై కేసులు పెట్టి జైలుకు పంపింది. అప్పట్లో మహాత్ముడి నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా సాగుతుండటం, సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆయన పిలుపివ్వడం.. విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ నేపథ్యంలో తన రామదండు సేవా కార్యక్రమాలతో చీరాల-పేరాల ఉద్యమకర్త దుగ్గిరాల గోపాలకృష్ణయ్య.. గాంధీ, ముఖ్య నేతల దృష్టిని ఆకర్షించారు. గాంధీ, ముఖ్య నేతలు 1921 ఏప్రిల్ 6న చీరాలకు వచ్చారు. రామ్‌నగర్ వద్ద ప్రజలు పెద్దఎత్తున ఆయనకు స్వాగతం పలకడం, అనంతరం జైలుకెళ్లిన వారిని గాంధీజీ స్వయంగా సన్మానించడం, తదనంతరం జనమంతా పుర బహిష్కరణకు దిగడం.. ఇలా ఎన్నో చారిత్రక ఘట్టాలకు ఆ ఉద్యమం వేదికైంది. ఇలా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చారిత్రక ఉద్యమానికి సారథిగా మారారు.



దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సమాధి ఉన్నట్లు చెబుతున్న ప్రాంతమిదే



చీరాలలోని రామ్‌నగర్ వద్ద గోపాలకృష్ణయ్య వినియోగించిన బావి

● ప్రస్తుతం ఈ చీరాల-పేరాల ఉద్యమ ఆనవాళ్లు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జ్ఞాపకాలు క్షేత్రస్థాయిలో కనుమరుగవుతున్నాయి. ఆయన సమాధి ఎక్కడుందో తెలియని దుస్థితి. ఆయన సమాధి ఉన్నట్లు చెప్పే ప్రాంతంలో ఇప్పుడు ఆర్టీసీ గ్యారేజీకి చెందిన పెద్ద గోడ కనిపిస్తోంది. దీనిపై స్థానికుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. చీరాల-పేరాల ఉద్యమ ఆనవాళ్లను పరిరక్షించడంతో పాటు స్మారకం ఏర్పాటుపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య సమాధి ఆనవాళ్లనూ గుర్తించాలని చీరాలకు చెందిన సంఘసేవకుడు సరివిశెట్టి సుబ్బరామయ్య తదితరులు కోరుతున్నారు.

పోలీసుల అరాచకాలు పెరిగిపోయాయి

వైకాపా అధినేత జగన్

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పోలీసుల అరాచకాలు పెరిగిపోయాయని వైకాపా అధినేత జగన్ విమర్శించారు. వందల మంది వైకాపా నాయకులు, కార్యకర్తల్ని బైండోవర్ చేశారని ఎక్స్ వేదికగా ఆదివారం ఆరోపించారు. "జీవితంలో ఎప్పుడూ పోలీస్ స్టేషన్ గడప తొక్కనివారిని కూడా బైండోవర్ చేస్తున్నారు. పులివెందులలో ఓ వివాహానికి హాజరైన వైకాపా నాయకులు అమరేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సురేశ్‌రెడ్డిల్ని తెదేపా వాళ్లు తీవ్రంగా గాయపరిచారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, నాయకుడు వేల్పుల రామలింగారెడ్డిల ప్రయాణిస్తున్న కారుపైనా దాడి చేశారు" అని విమర్శించారు.

తిరుమలలో జగన్ మేనమామ రాజకీయ ప్రసంగాలు

చర్యలకు సిద్ధమవుతున్న తితిదే



ఆలయం ఎదుట రవీంద్రనాథ్‌రెడ్డి

తిరుమల, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి తితిదే నిబంధనలు ఉల్లంఘించి తిరుమలలో రాజకీయ ప్రసంగాలు చేశారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో వర్షాలు కురవడం లేదు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలను మోసం చేశారు. 2029 ఎన్నికల్లో తిరిగి జగన్ సీఎం కావాలని శ్రీవారిని ప్రార్థించా. పులివెందుల, ఒంటిమిట్టలో జరిగే జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా విజయం సాధిస్తుంది" అని పేర్కొన్నారు. కూటమి పాలనపై, పార్టీలపై ఆయన పలు విమర్శలు చేశారు.

★ రవీంద్రనాథ్‌రెడ్డి ఆలయం ఎదుట చేసిన రాజకీయ వ్యాఖ్యలను తితిదే విజిలెన్స్ విభాగం పరిశీలిస్తోంది. నిబంధనల ఉల్లంఘనపై ఆయనపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది.

రాహుల్‌కు కర్ణాటక ఎన్నికల సంఘం నోటీసులు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: బెంగళూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓట్ల చోరీ అయ్యాయని ఆరోపించిన కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీకి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులిచ్చింది. ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)తో కలిసి నోటీసులు పంపించామని సంబంధిత అధికారులు ఆదివారం ఇక్కడ పేర్కొన్నారు. శకున్ రాణి అనే ఓటరు రెండుసార్లు ఓటు వేసినట్లు రాహుల్ ఆరోపించారు, దర్యాప్తులో ఒక్కసారే ఓటు వేసినట్లు గుర్తించామని తెలిపారు.

రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీ సమాధానమివ్వాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు

ఈనాడు, అమరావతి: వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాల్లో పెద్ద ఎత్తున చోటుచేసుకున్న వ్యత్యాసాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాధానమివ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'ఆరు నెలల రాహుల్‌గాంధీ పరిశీలనలో ఎన్నికల సంఘం భాజపాకు ప్రయోజనం చేకూర్చేలా తీసుకున్న పలు నిర్ణయాలు బహిర్గతమయ్యాయి. 2024లో మహారాష్ట్రలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడి 48 లోక్‌సభ స్థానాల్లో 31 గెలుచుకుంది. కానీ నాలుగు నెలల తర్వాత అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం అనుమానాస్పదంగా ఓటమి చవిచూసింది. ఓటర్లు అంత తక్కువ సమయంలో వారి అభిప్రాయాన్ని మార్చుకోరు కదా? ఇది ఎన్నికల ప్రక్రియపై అనేక సందేహాలను లేవనెత్తుతోంది' అని పేర్కొన్నారు.



మీ జీవితం మెరుగుపడాలంటే..

జీవితం మెరుగుపడాలంటే మీరు బాగా కష్టమైన పనులు చేయనక్కర్లేదు. ఈ కింది సూచనలు పాటించండి చాలు!

- ✦ పని చేస్తున్నప్పుడు పనిపైనే పూర్తిగా మనసు లగ్నం చేయండి.
- ✦ ఉదయం నిద్ర లేవగానే మంచినీరు తాగండి.
- ✦ రోజూ వ్యాయామం చేయండి.
- ✦ ఉదయం ఫోన్ తక్కువగా వాడండి.
- ✦ మీ సంపాదనలో కనీసం 10% మొత్తాన్ని పొదుపు/మదుపు చేయండి.
- ✦ సోషల్ మీడియాలో విహరించడానికి బదులు మంచి పుస్తకం చదవండి.

– డాన్ గో, హై పర్ఫార్మెన్స్ కోచ్

మద్యం కుంభకోణం కేసులో అనుబంధ అభియోగపత్రం

- నేడు దాఖలు చేయనున్న సిట్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు సోమవారం అనుబంధ అభియోగపత్రాన్ని దాఖలు చేయనున్నారు. నాటి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితులైన సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి (ఏ-31), జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల (ఏ-33) పాత్ర, ప్రమేయంపై వివరాలను తాజా అభియోగపత్రంలో సమగ్రంగా పొందుపరిచినట్లు సమాచారం. హైదరాబాద్ శివారు శంషాబాద్‌లోని ఫామ్‌హౌస్ నుంచి సిట్ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల మద్యం ముడుపుల సొమ్ము మూలాలను దీనిలో ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ప్రతినెలా రూ.50-60 కోట్లు వసూలు చేసి ఆ మొత్తాన్ని కె.ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీతో పాటు మరికొంతమంది ముఖ్యుల ద్వారా అప్పటి సీఎం జగన్‌కు చేర్చేవారని సిట్ దర్యాప్తులో గుర్తించింది. వీరు ముగ్గురూ తరచూ రాజ్ కెసిరెడ్డి కార్యాలయానికి వెళ్లేవారని, తిరుగు ప్రయాణంలో వారి వాహనాల్లో నగదుతో కూడిన అట్టపెట్టెలు తీసుకెళ్లేవారని నిందితుల రిమాండు రిపోర్టుల్లో పేర్కొంది. రాజ్ కెసిరెడ్డి నిర్వహించే ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ ముఠాలోని సభ్యులతోనూ వీరు తరచూ భేటీ అయ్యేవారని తేల్చింది. ఈ వివరాలన్నింటినీ తాజా అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం. మనీ ట్రయల్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు, ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణలో వెలుగుచూసిన అంశాలు ఈ అభియోగపత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది.

మద్యం కుంభకోణం కేసులో గత నెల 19న సిట్ అధికారులు ప్రాథమిక అభియోగపత్రం దాఖలు చేశారు. అందులో ఉన్న 9 సంస్థలు, ఏడుగురు వ్యక్తులపై అభియోగాలు మోపింది. ఇప్పుడు దానికి అనుబంధంగా మరో అభియోగపత్రాన్ని దాఖలు చేయనుంది. ఈ కేసులో ఇప్పటివరకూ 19 సంస్థలు, 29 మంది వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. రాజ్ కెసిరెడ్డి (ఏ1), బూనేటి చాణక్య (ఏ-8), పైలా దిలీప్ (ఏ-30), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6), కె.ధనుంజయరెడ్డి (ఏ-31), పి.కృష్ణమోహన్‌రెడ్డి (ఏ-32), గోవిందప్ప బాలాజీ (ఏ-33), సీహెచ్.వెంకటేశ్‌నాయుడు (ఏ-34), చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38), పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ-4), బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), ఈ.నవీన్ కృష్ణ (ఏ-36) సహా మొత్తం 12 మంది అరెస్టయ్యారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. అది పూర్తయ్యాక ఇంకో అనుబంధ అభియోగపత్రాన్ని దాఖలు చేయనున్నారు.

ప్రయోగ పాఠాలు నేర్పే.. 'ల్యాబ్ ఆన్ వీల్స్'

- రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల చొరవతో.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన

ఈనాడు, రాజమహేంద్రవరం: నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే పిల్లలకు మరింత సమగ్రంగా విజ్ఞానం అందాలంటే ప్రయోగా పాఠాలు తప్పనిసరి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని 172 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. 'హైగ్లో' పేరిట 'ల్యాబ్ ఆన్ వీల్స్' నడుపుతోంది. పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు ప్రతి వారం పాఠశాలలకు వెళ్తూ విద్యార్థులతోనే ప్రయోగాలు చేయిస్తూ అవగాహన కల్పిస్తోంది. ఈ ప్రయత్నానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రోత్సాహమందిస్తున్నారు.

అవగాహనతో ఆసక్తి పెంచేలా..

భౌతిక, రసాయన, భూగర్భ, భూగోళ, గణిత శాస్త్రాలతోపాటు ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, లైఫ్‌సైన్సెస్ విభాగాల్లో ప్రయోగాలతో విద్యార్థుల్లో శాస్త్రీయ కుతూహలం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్ట్స్ కళాశాలలోని వివిధ విభాగాల పీజీ, యూజీ విద్యార్థులు 30 మందిని ఎంపిక చేసి వారితో పదోతరగతి లోపు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉదయం బస్సులో విద్యార్థులతో పాటు.. ఐదుగురు అధ్యాపకులు ప్రయోగ పరికరాలతో వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. ప్రతి విభాగంలోనూ 10-15 రకాల ప్రయోగాలు చేస్తున్నారు. ఒక్కో వారం ఒక్కో విభాగంలో అంశాలు వివరిస్తారు. డీఈఓ సూచించిన దుళ్ల, వేమగిరి, నరేంద్రపురం, కోరుకొండ, వెదుళ్లపాకలోని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఈ ప్రయోగాలు చేయిస్తున్నారు. ఈ ఏడాది మరో 10 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు తెలిపారు.

★ 2010 నుంచి సమీప పాఠశాలలకు ఆటోల్లో వెళ్తూ అవగాహన కల్పించేవారు. గతేడాది హైదరాబాద్‌కు చెందిన హస్సు సొల్యూషన్స్ సంస్థ రూ.36 లక్షల విలువైన బస్సును సీఎస్ఆర్ కింద కేటాయించింది. దీంతో జిల్లాలోని పలు పాఠశాలలకు సేవలు విస్తరించారు. ఈ ఏడాది ఎంపికచేసిన పాఠశాలలకు విభాగాల వారీగా రూ.5వేల చొప్పున వెచ్చించి ప్రయోగ సామగ్రిని అందించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు అధ్యాపకులు కోమల లక్ష్మి, సత్యనారాయణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.





ప్రయోగ సామగ్రితో పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమైన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

★ మైక్రోస్కోప్ పనితీరు గురించి తెలుసుకుంటున్న విద్యార్థి

'సంకల్ప్'తో బ్యాడ్, గుడ్ టచ్‌పై అవగాహన..

పాఠశాలలో ప్రయోగాత్మక విద్యతోపాటు ఆర్ట్స్ కళాశాల, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంకల్ప్'తో కొందరు విద్యార్థినులు గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు. నెలసరి సమస్యలు, పరిశుభ్రత, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం తదితర అంశాలను వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాలపై సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తారు. దీనికి సమన్వయకర్తగా అధ్యాపకురాలు సురేఖ వ్యవహరిస్తున్నారు.

రాయలసీమ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- హంద్రీ-నీవా ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీరందించేందుకు చర్యలు
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్

రాయచోటి, న్యూస్‌టుడే: రాయలసీమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీరందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆదివారం నిర్వహించిన పార్టీ శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలు సురక్షితంగా ఉన్నారని.. రాష్ట్రంలోని మైనారిటీలూ పార్టీకి దగ్గర కావాలని కోరారు. కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీని స్ఫూర్తిగా తీసుకొని పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాజపా కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కేలా కూటమి ఎమ్మెల్యేలతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.వి.ఎన్.మాధవ్. చిత్రంలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిత్రపక్ష ధర్మం పాటిస్తూనే ప్రజా సమస్యలపై మాధవ్ ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఎన్నికల సంఘం సహకారంతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించడం అర్థరహితమని అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ఓట్ల నమోదుపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, పోతుగుంట రమేష్‌నాయుడు, ఎమ్మెల్సీ జకియాఖానం పాల్గొన్నారు.

'సృష్టి' వసూళ్లపై ఈడీ దృష్టి

ఎఫ్ఐఆర్‌ల వివరాలివ్వాలని హైదరాబాద్ పోలీసులకు లేఖ

ఈనాడు, హైదరాబాద్: సరోగసీ ముసుగులో శిశువుల విక్రయాలకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. సరోగసీ విధానంలో సంతానం కలిగిస్తామంటూ రూ.కోట్లు వసూలు చేసిన నేపథ్యంలో మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గోపాలపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన 9 కేసుల వివరాలు ఇవ్వాలని హైదరాబాద్ పోలీసులకు ఈడీ తాజాగా లేఖ రాసింది.

847 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 847 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నియమించింది. వీటిలో 26 కమిటీలు అక్టోబర్ 30 వరకు, 821 కమిటీలు జనవరి 30 వరకు పదవిలో ఉంటాయని పేర్కొంటూ వ్యవసాయ శాఖ ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'స్త్రీ శక్తి'కి సర్వం సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఈ నెల 15 నుంచి అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో అందుకు కసరత్తు తుది దశకు చేరుకుంది. విశాఖ మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద పథకంపై బ్యానర్లు ఏర్పాటుచేశారు. టిమ్స్ ద్వారా రాయితీ టికెట్లు ఇవ్వడం మొదలు కొని రద్దీ నియంత్రణ వరకు సిబ్బందికి ఈ నెల 2 నుంచి శిక్షణ ఇస్తున్నారు. బస్సుల్లో మహిళలకు కేటాయించిన సీట్లకు రంగులు వేశారు. టిమ్స్‌లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు.

–ఈనాడు, విశాఖపట్నం



రాయితీ టికెట్



బస్సుల్లో మహిళలకు కేటాయించిన సీట్లకు వేసిన రంగులు



'స్త్రీ శక్తి' టికెట్ల జారీపై విశాఖ మద్దిలపాలెం డిపోలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

2 లక్షల టన్నుల యూరియా నిల్వలున్నాయి

వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రస్తుతం 2.03 లక్షల టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రాబోయే పదిరోజుల్లో మరో 29,310 టన్నులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 'అత్యధికంగా పల్నాడు జిల్లాలో 23,781 టన్నులు, గుంటూరులో 13,815, కర్నూలులో 13,650, బాపట్లలో 13,402, శ్రీకాకుళంలో 12,678, నంద్యాలలో 11,483, పశ్చిమగోదావరిలో 10,665, ఏలూరులో 9,372 టన్నుల నిల్వలున్నాయి. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో 4,200 టన్నుల నుంచి 9వేల టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి. ఈ నెల 11 నుంచి 16వ తేదీ మధ్య కృష్ణా జిల్లాకు 4,600, నంద్యాలకు 4,500, కర్నూలుకు 3,200 టన్నుల నిల్వలు అందుబాటులోకి రానున్నాయి. మిగిలిన అన్ని జిల్లాలకూ 12 నుంచి 19వ తేదీలోగా నిర్దేశిత సమయంలో 17వేల టన్నులకుపైగా యూరియా సరఫరా కానుంది' అని ఢిల్లీరావు వివరించారు.

'హంద్రీ-నీవా'లో కృష్ణమ్మ పరవళ్లతో మనసు పులకిస్తోంది

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాయలసీమ జిల్లాల్లోని 6 లక్షల ఎకరాలకు సాగునీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి తన మనసు పులకిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రికార్డు సమయంలో కాలువల విస్తరణ పనులు చేపట్టడంతో ఈ సీజన్‌లో చివరి భూమికీ నీరందించాలనే కల సాకారమవుతోందని ఎక్స్ వేదికగా ఆదివారం వెల్లడించారు. "ప్రతి ప్రాజెక్టూ నిండేలా, ప్రతి చెరువుకూ నీరందేలా, చివరి భూముల్ని తడిపేలా కృషిచేస్తున్నాం. గరిష్ఠ సామర్థ్యంతో హంద్రీ-నీవా కాలువల్లోని నీటి ప్రవాహాలు రైతన్నల ఆశలు, ఆకాంక్షలను తీరుస్తున్నాయి" అని సీఎం వివరించారు. నీటి విడుదల వీడియోను పోస్టుకు జతచేశారు.

శ్రీవారి నిధులనే భూమన కాజేద్దామనుకున్నారు

- తండ్రీకుమారుల అరెస్టుకు కౌంట్‌డౌన్
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి



తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు అభినయ్‌రెడ్డి తిరుపతిలో అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి ఆరోపించారు. ఆదివారమిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "గత ప్రభుత్వ పాలనలో తిరుపతిలో అన్ని వర్గాల ప్రజలను వేధిస్తూ భయాందోళనకు గురిచేశారు. దళిత యువకుడు పవన్‌ను భూమన అనుచరులు కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టారు. వీడియోలు భయటపడడంతో పవన్‌ని బెదిరించారు. తన సోదరుడే కొట్టాడని బలవంతంగా వాంగ్మూలం ఇప్పించారు. కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు స్వర్ణముఖి నది సమీపంలోని సర్వే నంబర్ 479లో 9 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారు. దీనికి సంబంధించి రెవెన్యూ మంత్రికి విజిలెన్స్ శాఖ నివేదిక అందించింది. భూమనపై క్రిమినల్ కేసులు తప్పవు. కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకుంటాం. శ్రీవారి నిధులనే కాజేయాలని నిత్యం ప్రయత్నించిన వ్యక్తి భూమన. తండ్రీకుమారుల అరెస్టుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ పేరుతో టీడీఆర్ బాండ్లలో జరిగిన అవినీతిపై భూమన కుటుంబంపై విజిలెన్స్ విచారణ పూర్తయింది. అభినయరెడ్డిని కరుణాకర్‌రెడ్డి అవినీతిపరుడిగా మార్చారు. తిరుపతిలో 35 వేల దొంగ ఓట్లు చేర్పించింది అభినయరెడ్డే" అని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి పరసా రత్నం, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బనకచర్లను అడ్డుకుంటాం

తెలంగాణ మంత్రులు భట్టి, ఉత్తమ్



ఈనాడు, మహబూబాబాద్: తెలంగాణకు నష్టం కల్గించే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫిర్యాదుతో బనకచర్ల ప్రాజెక్టు అనుమతులు నిలిచిపోయాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద అంబేడ్కర్ సృజల స్రవంతి ప్రాజెక్టును కట్టి తీరుతామని.. పనులు ప్రారంభించబోతున్నామన్నారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టును ఆదివారం వారు సందర్శించి సమీక్షించారు. రాయలసీమ ఎత్తిపోతల ద్వారా ఏపీ ప్రభుత్వం రోజుకు 11 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తే 25 రోజుల్లో శ్రీశైలం జలాశయం ఖాళీ అవుతుందని, దీని వల్ల నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భద్రాచలం డివిజన్‌లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కకు పెట్టాలని నాడు సోనియాగాంధీకి విజ్ఞప్తి చేయగా చట్టంలోంచి ఆ ఏడు మండలాలను మినహాయించారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా రాష్ట్రంలో భారాసతో కలిసి దొంగచాటుగా ఆర్డినెన్స్ తెచ్చాయని... గిరిజనుల రెండు లక్షల ఎకరాలను పోలవరానికి దారాదత్తం చేశారని భట్టి ఆరోపించారు.

కాంగ్రెస్ ఉత్తర, దక్షిణాంధ్రలకు ఇద్దరు బాధ్యులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ బాధ్యతల్ని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులైన కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, దక్షిణాంధ్ర బాధ్యతల్ని మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీకి అప్పగించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారితో సమావేశమైన షర్మిల పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి గణేశ్‌యాదవ్, ఏపీసీసీ ప్రధానకార్యదర్శి మూసాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారు

డీజీపీకి వైకాపా నేతల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని వైకాపా నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైకాపా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రమేశ్‌యాదవ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఫిర్యాదు చేశారు. కడప జిల్లాలో పోలీసుల అరాచకాలు మితిమీరుతున్నాయని, వారు తెదేపా కార్యకర్తల్లా పని చేస్తున్నారని ఆరోపణలు చేశారు.

దళిత యువకుడు పవన్‌పై దాడి అమానుషం

తెదేపా అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్

ఈనాడు, అమరావతి: తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులు పవన్ అనే దళిత యువకుడిపై విచక్షణారహితంగా దాడిచేయడం అమానుషమని తెదేపా అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ మండిపడ్డారు. నాడు అధికారం ఉందని దాడులు చేసిన వైకాపా వాళ్లు.. ఇప్పుడు ధనబలంతో ఇష్టంవచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారని, ప్రతిపక్షంలోనూ అదే పంథా అనుసరిస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఈనాడు

గాజాలో మానవతా సంక్షోభం

గాజాను పూర్తిగా గుప్పిటపట్టే విషయంలో వెనక్కి తగ్గేది లేదంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గతంలోనే నిర్మొహమాటంగా నిష్కర్షగా తేల్చిచెప్పారు. తన గొంతెమ్మ కోరికను నెరవేర్చుకునే కుతంత్రాలకు తాజాగా తెరతీశారు. గాజా సిటీని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలన్న నెతన్యాహు పంతానికి ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ మొన్న గురువారం ఆమోదముద్ర వేసింది. ఐరాస సహా చాలా దేశాలు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నప్పటికీ నెతన్యాహు విధ్వంసక పోకడల్లో మార్పేమీ కనపడటం లేదు. హమాస్ అంతమే ధ్యేయమంటూ దాదాపు 22 నెలల కిందట గాజాపై దండెత్తిన నెతన్యాహు అక్కడ ఎడతెగని జాతిహననం కొనసాగిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ హమాస్ కోరలు కత్తిరించే నెపంతో అక్కడ మరింతగా నెత్తుటేళ్లు పారించడానికి ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. దానివల్ల గాజాలో మానవతా సంక్షోభం ముమ్మరించి ప్రపంచం ముందు ఇజ్రాయెల్ తలదించుకోవాల్సి వస్తుందని సొంత సైన్యాధికారులు హెచ్చరిస్తున్నా నెతన్యాహు చెవి కెక్కించుకోవట్లేదు. అధికార దుర్వినియోగం, అవినీతి కేసులను నెత్తిన మోస్తున్న ఆయన తన పదవిని కాపాడుకోవడానికే యుద్ధాన్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తూ, మానవతా పతాకాన్ని అవనతం చేస్తున్నారు!

గాజాలో టెల్‌అవీవ్ సాగిస్తున్న మారణకాండలో ఇప్పటిదాకా 61 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వారిలో సగానికి పైగా చిన్నారులు మహిళలే. ఆహార సరఫరాలను ఇజ్రాయెల్ నిర్దాక్షిణ్యంగా తొక్కిపట్టడంతో గాజాలో ఆకలి చావులు పెరుగుతున్నాయి. పోషకాహార సమస్యతో చాలామంది కడతేరిపోతున్నారు. పన్నెండు వేల మంది చిన్నారులు చిక్కి శల్యమయ్యారు. ఆహార పంపిణీ కేంద్రాల దగ్గర అభాగ్యులపై టెల్‌అవీవ్ మూకలు కిరాతకంగా బుల్లెట్ల వర్షం కురిపిస్తుండటంతో వందల మంది విగతజీవులవుతున్నారు. అంతర్జాతీయ చట్టాలకు ఇజ్రాయెల్ పూచికపుల్ల పాటి విలువ ఇవ్వకపోవడాన్ని ఇటీవల 25 దేశాలు తీవ్రంగా నిరసించాయి. గాజాలో యుద్ధం వెంటనే ఆగిపోవాలని అవి పిలుపిచ్చాయి. పాలస్తీనాను ఇప్పటికే 147 దేశాలు ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నాయి. ఇండియాతోపాటు ఫ్రాన్స్, బ్రిటన్ వంటివి సైతం పాలస్తీనా స్వేచ్ఛాకాంక్షకు మద్దతు పలుకుతున్నాయి. పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలంటే నిర్దిష్టమైన సరిహద్దులతో సర్వస్వతంత్ర దేశంగా పాలస్తీనా ఆవిర్భవించాల్సిందే. తమ భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు అక్కడి ప్రజలదే. వారి తలరాతలను మరొకరు నిర్దేశించడం ఏ విధంగానూ న్యాయం కాదు!

హిట్లర్ జాత్యహంకారానికి దాదాపు 60 లక్షల మంది యూదులు బలయ్యారు. నాజీల చేతుల్లో ఆనాడు తమవారు అనుభవించిన నరకబాధల గురించి తెలిసీ నెతన్యాహు నేడు గాజావాసుల పట్ల అంతే రాక్షసంగా వ్యవహరిస్తుండటం హేయం! కర్కశ దమననీతిని అమలుచేసే చోట శాంతి నెలకొనదు. హమాస్‌ను నిర్వీర్యం చేసేందుకంటూ గాజాలో నెతన్యాహు సాగిస్తున్న మారణహోమం వల్ల ఆ సంస్థ ప్రాబల్యం మరింత పెరుగుతుందే తప్ప తగ్గదు. అంతిమంగా అది ఇజ్రాయెల్‌కే నష్టం కలిగిస్తుంది. తాను అధికారంలోకొస్తే ఇజ్రాయెల్‌తో యుద్ధ విరమణ చేయిస్తానని బీరాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడేమో గాజాలో సాగుతోంది నరమేధం కానేకాదని వితండవాదం చేస్తున్నారు. అగ్రరాజ్యం అండ చూసుకునే నెతన్యాహు పేట్రేగిపోతున్నారు. పరిస్థితులు నానాటికీ విషమిస్తున్న నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి నెతన్యాహును ఒప్పించేందుకు అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలి. ఆకలిదప్పులతో అనారోగ్యంతో అల్లాడుతున్న గాజావాసులకు మానవీయ సాయం అందించేందుకు తగిన మార్గాలను అన్వేషించాలి!



సవాళ్లూ అవకాశాలూ కలిసిన ప్రయాణమే జీవితం. సవాళ్లను ఎదుర్కోండి, పాఠాలు నేర్చుకోండి, ఆ క్రమంలో విలువలను మాత్రం మరచిపోకండి. మీకు దిశానిర్దేశం చేసేదీ, మీరెవరో ప్రపంచానికి చాటిచెప్పేదీ మీ విలువలే!

– దువ్వూరి సుబ్బారావు, ఆర్‌బీఐ మాజీ గవర్నర్

ఆత్మస్తుతి... పరనింద!

కురుక్షేత్ర యుద్ధం భీకరంగా సాగుతోంది. దుర్యోధనుడి ప్రాణమిత్రుడు, మహా పరాక్రమవంతుడు అయిన కర్ణుడి ధాటికి పాండవ సైన్యం నిలవలేకపోతోంది. సైనికులు చాలామంది మరణిస్తున్నారు. పాండవ యోధులకు ఏమీ తోచడంలేదు. కర్ణుణ్ని ఎదుర్కొనే వీరుడెవరు అని ఆలోచిస్తున్న ధర్మరాజుకు ఆ శక్తి ఒక్క అర్జునుడికే ఉందని తెలుసు. కానీ అర్జునుడు కర్ణుడితో తప్ప అందరితోనూ యుద్ధం చేస్తున్నాడు. ఇది ధర్మరాజుకు నచ్చలేదు, అందుకే అర్జునుణ్ని కర్ణుడి మీదికి ఉసిగొల్పాలని అనుకున్నాడు.

యుద్ధ ధర్మం ప్రకారం రోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకే పోరాడాలి. అలా ఒకరోజు యుద్ధం ముగిసిన వెంటనే మర్నాడు అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చిస్తున్నారు పాండవులు. అప్పుడు ధర్మరాజు అర్జునుడి వంక చూస్తూ 'నువ్వు గొప్ప పరాక్రమవంతుణ్ని అనుకుంటున్నావు కానీ ఒట్టి పిరికివాడివి. కర్ణుణ్ని ఎదుర్కొనే ధైర్యం లేక నీ ప్రతాపాన్ని బలహీనులైన సైనికుల మీద చూపిస్తున్నావు. శివుణ్ని మెప్పించి శక్తిమంతమైన పాశుపతాస్త్రాన్ని పొందావు, గాండీవధారి అనిపించుకోవడమే తప్ప దాన్ని ప్రయోగించడం నీకు తెలియదా లేక అది కేవలం అలంకరించుకోవడానికే పనికొచ్చేదా?' అంటూ కావాలనే అవహేళనగా మాట్లాడాడు. ఆ మాటలకు అర్జునుడికి చాలా కోపం వచ్చింది. శివుడి దగ్గర నుంచి పాశుపతాస్త్రాన్ని పొందిన నాడే ఒక శపథం చేశాడు అర్జునుడు. ఎవరైనా తన పాశుపతాస్త్రాన్ని అవమానిస్తే వారిని సంహరిస్తానని. కానీ ఇప్పుడు సాక్షాత్తు తన సోదరుడే గాండీవాన్ని అవమానించాడు.



అంతర్యామి

ఏం చేయాలో తెలియక తన సమస్యను కృష్ణుడి దగ్గర మొరపెట్టుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చిరునవ్వుతో 'చిన్నవాళ్లు పెద్దవాళ్లని శిక్షించాల్సిన పరిస్థితుల్లో వారిని దుర్భాషలాడితే సరిపోతుంది. ఎందుకంటే అది వారికి మరణంతో సమానం' అని సలహా ఇచ్చాడు. అప్పుడు అర్జునుడు ధర్మరాజు దగ్గరికి వెళ్లి 'మీవల్లే మాకీ పరిస్థితులు వచ్చాయి, మీరు వ్యసనానికి లోనై, రాజ్యాన్ని పోగొట్టారు, మమ్మల్ని అందరినీ పణంగా పెట్టి ఓడిపోయారు, బానిసలుగా చేశారు, ఇదంతా మీ వల్లే జరిగింది' అంటూ అన్నదమ్ములందరి ఎదుట ధర్మరాజుని నానా నిందలు మోపాడు.

అనడం అయితే అనేశాడు కానీ పెద్దవాడు, ధర్మం తప్పనివాడు అయిన అన్నని నిందించి మాట్లాడినందుకు అర్జునుడు జీర్ణించుకోలేకపోయాడు. తీవ్రమైన మనస్తాపంతో మళ్లీ కృష్ణుణ్నే ప్రాయశ్చిత్తం అడిగాడు. అప్పుడాయన 'నిన్ను నువ్వు పొగుడుకో, నలుగురిలో నీ గురించి నీవే గొప్పగా చెప్పుకో. అదే నీకు ప్రాయశ్చిత్తం. ఎందుకంటే ఆత్మస్తుతి కూడా మరణంతో సమానమే' అంటూ నవ్వుతూ చెప్పాడు. కాబట్టి ఊరికే ఎవరినీ నిందించకుండా, ఆత్మస్తుతి చేసుకోకుండా కలిసికట్టుగా పయనించేవారే... సంఘజీవి అనిపించుకుంటారు.

– ఆచార్యులు జీవీయస్



అందానికి తెరల వల

ఒకప్పుడు పత్రికల్లో సౌందర్య చిట్కాలు చూసి అనుసరించడానికి ప్రయత్నించేది యువత. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలతో పోల్చుకుంటూ అందాన్ని ఇనుమడింపజేసుకోవడానికి ఏకంగా ఆపరేషన్లే చేయించుకుంటోంది. అందుకు దేశ సరిహద్దులు దాటి మరీ వెళ్తున్నారంటే ఈ ట్రెండ్ ఇంకా ఎక్కడికి దారితీస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఓ పదేళ్ల క్రితానికి ఇప్పటికి మన అలవాట్లలో వచ్చిన ప్రధాన మార్పు... మనల్ని మనం చూసుకోవడం ఎక్కువైంది. ఒకప్పుడు ఇంట్లో తయారై బయటికి వెళ్తే మళ్లీ ఇంటికొచ్చాకే ముఖాన్ని అద్దంలో చూసుకునేవారు. ఇప్పుడు రోజు మొత్తంలో పదులసార్లు ముఖం మీదికి దృష్టి పోతోంది. స్మార్ట్‌ఫోన్ తెచ్చిన మార్పు ఇది. సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు.. ఇవి చాలవన్నట్లు జూమ్ సెషన్లు... అన్నీ మనని మనకి తెర మీద చూపిస్తున్నాయి. ఒకప్పుడు నలుగురిలో ఉన్నప్పుడు మనం ఎలా ఉన్నాం అన్న స్పృహే ఉండేది కాదు. ఇప్పుడు నలుగురి ముఖాలు ఒక్కసారే తెరమీద కనపడగానే 'నేనెలా కనిపిస్తున్నాను' అన్న ధ్యాస ఎక్కువవుతోంది. జూమ్ మీటింగ్‌లో తెర మీద కనిపించిన తమ రూపం పట్ల పలువురు అసంతృప్తిని వ్యక్తంచేస్తూ ప్లాస్టిక్ సర్జన్‌లను సంప్రదించడం కొవిడ్ అనంతర పరిణామాల్లో ఒకటి.

ఇవాళా రేపూ ఏ ఇన్‌స్టాగ్రామ్‌లోనో స్నాప్‌చాట్ ఫొటోలోనో చూసిన వ్యక్తిని ప్రత్యక్షంగా కలవాల్సి వస్తే ఇద్దరూ ఒకరేనా కాదా అని సంశయంలో పడిపోయే సందర్భాలే ఎక్కువ. ఫోనులో ఫొటో తీయడానికే బోలెడు సెట్టింగ్స్ ఉంటాయి. ముఖంమీద ఏ మచ్చా కనపడకుండా శరీరఛాయతో సంబంధం లేకుండా పున్నమి జాబిల్లిలా మెరిసిపోతున్నట్లు ఫొటో తీసుకోవచ్చు. దాన్ని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం ఆలస్యం మరి కాస్త మెరుపు అదనంగా చేరుతుంది. ఇక ఫిల్టర్లనూ ఉపయోగిస్తే అందరూ అతిలోక సుందరులే! కాసేపు చూసుకుని మురుసుకోవడానికి అలాంటి ఫొటోలు ఉపయోగపడితే పర్వాలేదు. కానీ ఈ తెర మీది రూపం నిజంగా కావాలని ఆశపడటమే ఆందోళనకు దారితీస్తోంది.



ప్రతిబింబమా... ఫొటోనా..?

'నేను అద్దంలో అందంగా కనిపిస్తాను కానీ ఫొటోల్లో అసలేమాత్రం బాగోను. ఎందుకిలా? అసలు ఏది నిజమైన నేను?' యువతను ఎంతో కాలంగా వేధించిన ఈ ప్రశ్నకి స్మార్ట్‌ఫోన్ సమాధానం చెప్పింది. కొవిడ్ లాక్‌డౌన్ కారణంగా అందరూ ఇంటిపట్టునే ఉన్నప్పుడు ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఫొటో అందాన్ని పెంచే ఫేషియల్ ఫిల్టర్లను ఎడాపెడా వాడేశారు. టిక్‌టాక్‌లో 'ఎన్‌హాన్స్' ఫీచర్, జూమ్‌లో 'టచప్ మై అపియరెన్స్' లాంటివి, 'ఫేస్‌ట్యూన్' లాంటి ఎడిటింగ్ యాప్స్... ఫొటోలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాయి. అంతేకాదు, తమలోని లోపాలను కప్పిపుచ్చుతూ ప్రత్యేకమైన యాంగిల్స్‌లో ఫొటోలు తీసుకోవడమూ సాధ్యమవుతోంది. దాంతో సామాజిక మాధ్యమాల్లో వాటిని సగర్వంగా ప్రదర్శిస్తున్నారు. వాటికి వచ్చే లైకులు, ప్రశంసలు ఇచ్చే ఆనందం కోసం మళ్లీ మళ్లీ అలాంటి ఫొటోలనే షేర్ చేస్తుంటారు. ఫోన్ తెరిస్తే చాలు... కొరియన్ గ్లాస్ స్కిన్, సిల్కీ హెయిర్ అంటూ రీల్స్ సృష్టికర్తలు చెప్పే బ్యూటీ, మేకప్ టిప్స్‌కైతే అంతే లేదు. ఇవన్నీ కలిసి అందం అంటే ఇదీ అంటూ ఒక కొత్త నిర్వచనం చెబుతున్నాయి. వాటితో పోల్చుకుని తమను తాము చిన్నబుచ్చుకుంటోంది యువత. స్క్రోల్ చేసినకొద్దీ వచ్చే ఫొటోలు వారిని బెంబేలెత్తిస్తున్నాయి. టెక్నాలజీ ధైర్యాన్ని ఇవ్వాల్సింది పోయి అభద్రతకు గురిచేస్తోంది. ఈ పరిణామాన్ని తమ ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేసుకోవడానికి విజయవంతంగా ఉపయోగించుకుంటోంది మరో వర్గం. అరచేతిలో స్వర్గం చూపించే వీరి ప్రకటనల మాయలో పడిపోతోంది యువతరం. అందం, ఆకృతి పట్ల మోజు వాస్తవాలను అంగీకరించనీయడం లేదు. శిల్పి శిల్పాన్ని చెక్కినట్లుగా డాక్టర్లు మనిషి ఆకృతిని కూడా తాము కోరినట్లు తీర్చిదిద్దగలరని నమ్ముతున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిన తక్షణం అప్పటివరకూ పోగుపడిన అసంతృప్తిని తరిమేయాలని ప్రయత్నిస్తున్నారు.

ఆఖరికి కుంగుబాటులోకి...


ఎడిట్ చేసిన తమ ఫొటోలలోని రూపం నిజంగా కావాలని కాస్మెటిక్ సర్జన్ల చుట్టూ, బ్యూటీ సెలూన్ల చుట్టూ తిరిగేవారి సంఖ్య పెరిగిపోతోంది. డిజిటల్ సెల్ఫ్‌తో రియల్ సెల్ఫ్ పోటీ పడాల్సివస్తోంది. ముక్కు ఆకృతిని సరిచేయడం, మచ్చలు కనిపించకుండా చేయడం లాంటివి ప్లాస్టిక్ సర్జరీలో సాధారణంగా చేసే చికిత్సలు. వాటివల్ల కాస్త ఫలితం కన్పిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. రైనోప్లాస్టీ లాంటి చికిత్సలవల్ల శ్వాససమస్యలు పరిష్కారమవుతాయి. కానీ ఇప్పటి యువత కోరుకుంటున్నది ఇలాంటి సాధారణమైన చికిత్సలు కావు. ఐబ్రో లిఫ్ట్, చీక్ లిఫ్ట్, ఫేస్ లిఫ్ట్, బ్రెస్ట్ ఆగ్మెంటేషన్, లైపోసక్షన్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్... ఇలాంటివెన్నో. కొందరైతే ఏకంగా ముఖాకృతిని, శరీరాకృతిని కూడా మార్చమని వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆయా సేవలు అందిస్తామని చెప్పుకొంటున్న వ్యాపార సంస్థలు చికిత్సకు ముందు తరవాత... అంటూ ప్రకటనల్లో వాడే ఫొటోలు యువత ఆశలకు రెక్కలు తొడుగుతున్నాయి. ఎంతైనా ఖర్చు చేసికోరుకున్న రూపాన్ని సొంతం చేసుకోవాలని తపించేవారికి టర్కీలాంటి దేశాలు ప్రధాన గమ్యాలుగా మారుతున్నాయి. నిజానికి కాస్మెటిక్ చికిత్సలన్నీ చెప్పిన ఫలితాన్ని ఇవ్వలేవనీ, పైగా చికిత్స అనంతరం ఇన్‌ఫెక్షన్లు, మచ్చలు, నరాలు దెబ్బతినడం.. లాంటి సమస్యలెన్నో తలెత్తుతున్నాయని అంటున్నారు వైద్యులు. మరోపక్క లక్షలు ఖర్చుపెట్టి చేయించుకున్న చికిత్సలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం వల్ల యాంగ్జయిటీ, కుంగుబాటు లాంటి మానసిక సమస్యలకు లోనవుతున్నవారికీ కొదవలేదు. కొందరేమో అదొక వ్యసనంలా ఒకదాని తరవాత మరొక చికిత్స చేయించుకుంటూనే ఉంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ తరం సెల్ఫ్ ఇమేజ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌లతో యుద్ధం చేస్తోందంటున్నారు పరిశోధకులు. సోషల్ మీడియాలో ఎడిట్ చేసిన ఫొటోలను గర్వంగా ప్రదర్శించుకునే వారిని, అసలు వాటి జోలికే పోనివారిని పోల్చి చూస్తే రెండో వర్గమే నిండైన ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. కాబట్టి సోషల్ మీడియాను వాడే టీనేజర్లతో ఈ విషయం గురించి చర్చించడం, వర్చువల్ ప్రపంచానికీ వాస్తవానికీ ఉన్న తేడా అర్థమయ్యేలా చూడడం చాలా అవసరం. అందరిలా కనిపించడంలో కాదు, ఎవరి ప్రత్యేకత వారికి ఉండటంలోనే అందముందని చెప్పాలి.

– డి.పద్మశ్రీ

ఒక్కోసారి అంతే... అంతా అనుకున్నట్లే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. కల నెరవేరుతుంది. తలచుకుంటే ఏదైనా సాధ్యమే కదా అని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నప్పుడే హఠాత్తుగా ఓ సంఘటన జరుగుతుంది. పరిస్థితిని తలకిందులు చేసి మనిషి సంకల్పానికి పరీక్ష పెడుతుంది.

ఎం.పి. అనిల్ కుమార్‌ది తిరువనంతపురం. పైలట్ కావాలన్నది అతడి చిన్ననాటి కల. సైనిక్ స్కూల్‌లో చదివాడు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ప్రవేశం సాధించాడు. 134 మందిలో అత్యుత్తముడిగా నిలిచాడు. పిన్న వయసులోనే పైలట్‌గా ఎంపికై చరిత్ర సృష్టించాడు. ఆ తరవాత తన చిరకాల స్వప్నమైన యుద్ధ విమానం మిగ్ 21కి పైలట్ అయ్యాడు. వాయుసేన అధికారిగా ఇంకా

ఉవ్వెత్తున ఎగసి...



ఎంతో ఎత్తుకు ఎదగాలని కలలు కంటున్న ఆ ఇరవై నాలుగేళ్ల యువకుడు గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రశంసలందుకున్నాడు కానీ అది యుద్ధరంగంలోనో, గగనతలంలోనో కాదు!

ఫ్లైట్ లెఫ్టినెంట్ ఎం.పి. అనిల్ కుమార్ ఒకరోజు రాత్రి విధులు ముగించుకుని బైక్ మీద వెళ్తుండగా ఊహించని రీతిలో రోడ్డుప్రమాదం జరిగింది. దాంతో తల తప్ప శరీరమంతా అచేతనమైంది. ఉరుకులు పరుగులతో ఉత్సాహంగా సాగే జీవితంలో ఒక్కసారిగా శూన్యం ఆవహించింది. అయినా అతడు బాధపడ్డాడే కానీ నిరుత్సాహపడలేదు. తలకిందులైన జీవితాన్ని తిరిగి తన నియంత్రణలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. చక్రాల కుర్చీలో కూర్చునే నోటితో పొడవాటి పెన్సిల్ లాంటిది పట్టుకుని కంప్యూటర్ సాయంతో ఒక వ్యాసం రాశాడు. చిన్నప్పటి నుంచి ప్రమాదం జరిగే వరకు తన జీవిత ప్రయాణం గురించి రాసిన ఆ వ్యాసం శీర్షిక 'ఎయిర్ బోర్న్ టు చెయిర్ బోర్న్'. ఎంత ఎక్కువ కష్టపడితే గెలుపు అంత మధురంగా ఉంటుందని ముగించాడు. దానికి మంచి పేరు వచ్చింది. ఆయన గురించి ఎందరికో తెలిసింది. పుణెలో సైన్యానికి చెందిన దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పాతికేళ్లపాటు జీవించాడు అనిల్‌కుమార్. ఆ సమయంలో సైన్యానికి సంబంధించిన అంశాలపై, ప్రమాదం తరవాత తన జీవితానుభవాలపై, యువతకు స్ఫూర్తినిచ్చే విషయాలపై ఎన్నో వ్యాసాలు రాశాడు. కవితాత్మక రచనాశైలితో ఎందరో అభిమానులను సంపాదించుకున్నాడు. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకూ ఎందరో విద్యార్థులు తరచూ ఆయనను చూడటానికి వస్తుండేవారు. బ్లడ్ క్యాన్సర్ రావడంతో అనిల్ కుమార్ తన యాభయ్యో ఏట కన్నుమూశారు.

డిఫెన్స్ అకాడమీలో అనిల్ సహచరుడైన నితిన్ సాఠే తన మిత్రుడి జీవిత చరిత్రను రాశారు. దాని పేరు 'బోర్న్ టు ఫ్లై'. మలయాళ రచయిత, చిత్రనిర్మాత సోక్రటీస్ కె.వాలత్ 'అండ్ ద ఫ్లైట్ గోస్ ఆన్' పేరుతో డాక్యుమెంటరీ తీశారు. అంతే కాదు, అనిల్ కుమార్ జీవితచరిత్రను కేరళ, మహారాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయిలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాయి. జీవితం ఒక ఆట లాంటిది. అన్నివేళలా గెలుపే కాదు, ఓటమి కూడా ఉంటుంది. ఓడినవారికి మరోసారి గెలిచే అవకాశమూ లభిస్తుందని మరవకూడదు... అని చెప్పేవారు అనిల్.

– పావులూరి శేషారావు

ఆదాయానికి అరటి



పోషకాలు పుష్కలంగా ఉండే అరటిని చాలామంది ఇష్టంగా తింటూ ఉంటారు. అరటి ఉత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం. మన తరవాత చైనా, ఇండోనేసియా, బ్రెజిల్ వంటివి కనపడతాయి. దేశీయంగా ఏటా మూడు కోట్ల టన్నులకు పైగా అరటి ఉత్పత్తి అవుతోంది. పశ్చిమాసియా దేశాలకు మన అరటి ఎక్కువగా తరలివెళ్తోంది. 2022–25 మధ్య ఇండియాలో అరటి ఎగుమతుల విలువ పరంగా 128శాతం, పరిమాణం పరంగా 115శాతం వృద్ధి నెలకొంది. గడిచిన మూడేళ్లలో ఇండియా అరటి ఎగుమతుల విలువ (కోట్ల డాలర్లలో), వాటి పరిమాణం (లక్షల టన్నుల్లో)...

సంవత్సరం	ఎగుమతుల విలువ	పరిమాణం
2022–23	17.56	3.63
2023–24	29.21	5.98
2024–25	37.88	8.29

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఉదాత్త విశ్లేషణల ఉత్తమ గ్రంథకర్త

రాజమహేంద్రవరంలో 1941 సెప్టెంబరు 29న కోడూరి శ్రీరామమూర్తి జన్మించారు. ఆయన తాత స్వాతంత్ర్య సమర యోధుడు దేవత శ్రీరామమూర్తి. తల్లి కోడూరి లీలావతి రాజరాజ నరేంద్రుడి కొడుకు కులోత్తుంగ చోళుడిపై నవల రాసిన ప్రముఖ రచయిత్రి. తండ్రి వాణిజ్యవేత్త పుల్లేశ్వరరావు. శ్రీరామమూర్తి ముప్పైఅయిదేళ్లపాటు బొబ్బిలిలోని రాజారంగారావు కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో పనిచేశారు. ఉద్యోగ విరమణ తరవాత తుదిశ్వాస వరకు రాజమహేంద్రిలో జీవించారు. కథారచయితగా, కథావిమర్శకుడిగా, జీవిత చరిత్ర కర్తగా, గాంధేయవాద గ్రంథకర్తగా సాహిత్యరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. 'భారతి' మొదలు 'ఈనాడు' దాకా పత్రికల్లో వందలకొద్దీ సాహితీ వ్యాసాలు- ముఖ్యంగా కథలపై విమర్శనాత్మకంగా రాశారు. లెక్కకు మిక్కిలిగా పురస్కారాలు పొందారు. ఈ నెల అయిదో తేదీన రాజమహేంద్రవరంలో 84వ ఏట శ్రీరామమూర్తి కీర్తిశేషులయ్యారు.

'పద్యాలలో సీసపద్యమ్ము కడుపెద్ద.. కవులలో నన్నయ్య కవినిబోలి' అన్నట్లు తెలుగు కథా రచయితల్లో విమర్శకుల్లో కోడూరి శ్రీరామమూర్తి ఒక విశిష్ట వ్యక్తి. భాష, భావం, కథనం, శిల్పం వంటి అంశాల్లో చక్కని మెలకువతో ఆయన గొప్ప కథలెన్నో రాశారు. విమర్శకుడిగా కథ లోతులు తెలియజెప్పారు. శ్రీరామమూర్తి రాసిన నలభైకి పైగా గ్రంథాలు వైవిధ్యంతో, సామాజిక ప్రయోజనంతో అలరారతాయి. ఆ సాహితీ బంధువు ఇటీవల కీర్తిశేషులు కావడం సారస్వతాభిమానులకు తీరని లోటు!

నిబద్ధతకు నిదర్శనం

రవీంద్రనాథ్ ఠాగూర్, వల్లభ్‌భాయ్ పటేల్ తదితర మహానుభావుల జీవిత చరిత్రలను కోడూరి శ్రీరామమూర్తి స్ఫూర్తిదాయకంగా రచించారు. మహాత్మా గాంధీ ఆశయ, సిద్ధాంతాల లోతులను వివరిస్తూ 'మనకు తెలియని మహాత్ముడు, మహాత్ముని సత్యాగ్రహాలు' తదితర పుస్తకాలు వెలువరించారు. తెలుగు కథకులు, కథనరీతులు వంటి గ్రంథాలు కథాప్రియుల మన్ననలు అందుకొంటున్నాయి. మనస్తత్వ శాస్త్ర గ్రంథాల అధ్యయనంలో శ్రీరామమూర్తి నిబద్ధతకు 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' గ్రంథం అద్దంపడుతుంది. ఉత్తమ సాహితీ విమర్శగా



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అది సొంతం చేసుకుంది. కౌటిల్యుడి అర్థశాస్త్రం శ్రీరామమూర్తి మనకు సంతరించిపెట్టిన మరో అద్భుత గ్రంథం. ఆయన రచనా వైచిత్రికి, వ్యాఖ్యాన సామర్థ్యానికీ అది నిదర్శనంగా నిలుస్తుంది.

హుందాగా విమర్శ

'మనకు విమర్శకులు కాదు, విశ్లేషకులు కావాలి' అంటారు నగ్నముని. ఈ విషయంలో శ్రీరామమూర్తి ఒకడుగు ముందుంటారు. 'మంచికథలు రాయడానికి కవిత్వం ప్రతిబంధకం కాదు. కానీ, కథ పూర్తిగా కవిత్వంగా ఉండకూడదు' అన్నది శ్రీరామమూర్తి భావన. 'కవి తిలక్ మంచి కథలు రాసినా తగినంత కథాకీర్తి రాకపోవడానికి ఆయన తక్కువ కాలం జీవించడం ఒక కారణం కావచ్చు' అని విశ్లేషించారు. నేటి కథకుల్లో కొందరికి భాషా విషయక ప్రాథమిక పరిజ్ఞానం కొరవడటంపై శ్రీరామమూర్తి ఎంతో ఆవేదన చెందేవారు. యువ రచయితలు రాసే కథల్లో ఏదో ఒక గుణాన్ని గ్రహించి చెప్పి వారి వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. కథా న్యాయనిర్ణేతగా శ్రీరామమూర్తి ఎప్పుడూ న్యాయవాది పాత్రో జడ్జి పాత్రో పోషించేవారు. ఒక సమస్య మీద రచన చేస్తే సరిపోతుందా, లేదంటే దానికి పరిష్కారం కూడా రచయితే చూపించాలా అనే ప్రశ్నకు- 'అక్కర్లేదు, ఆలోచింపజేయడమే రచయిత లక్ష్యం కావాలి' అనేవారు శ్రీరామమూర్తి. తీవ్రమైన విమర్శను సైతం నవ్వుతూ హుందాగా చెప్పడం శ్రీరామమూర్తి సాత్త్విక నైజం.

కథపై ఎనలేని ప్రేమ


నూరుపాళ్ల తెలుగుదనం ఉట్టిపడే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలపైనా, వేగ గమనం తొణికిసలాడే కొడవటిగంటి కథలపైనా శ్రీరామమూర్తి రాసిన వ్యాసాలు మూల రచయితల దృక్పథాలను దర్శింపజేస్తాయి. అనవసర అంశాల జోలికి వెళ్లకుండా చెప్పదలచుకున్నవి నేరుగా చెప్పడంలో ఆయన దిట్ట. తమకు ఇష్టమైన రచనా ప్రక్రియే గొప్పదని, మిగిలినవి తక్కువనేవారు శ్రీరామమూర్తికి నచ్చేవారు కాదు. కథలు, నవలలవైపే తనకు మొగ్గు ఉన్నప్పటికీ సర్వ ప్రక్రియలూ తెలుగు సాహిత్య వృక్ష ఫల శాఖలే అనేవారు. ఓసారి కోడూరి శ్రీరామమూర్తి అమెరికాలోని కాంగ్రెస్ లైబ్రరీకి వెళ్లారు. ప్రపంచ భాషల్లో అనేక గ్రంథాలు అక్కడున్నాయి. శ్రీరామమూర్తి రాసినవేమైనా ఉన్నాయా అని చమత్కారంగా ఆయనే అడిగారు. మూడు పుస్తకాలున్నట్లు అక్కడివారు చెప్పారు. తనకన్నా తన పుస్తకాలే దేశం దాటినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎల్లలు దాటిన కీర్తిని రచయితలంతా సొంతం చేసుకోవాలంటే శ్రీరామమూర్తి రాసిన పలు గ్రంథాలను నిశితంగా చదవాలి. ఆయన గ్రంథ పఠనం ద్వారా జీవనశైలి, రచనాశైలి రెండూ నిండుగా అవగతమవుతాయి.

– సన్నిధానం నరసింహశర్మ

హాయ్! బుజ్జీ!!


భయపడితే గెలవలేం!

లాస్య ఏడో తరగతి చదువుతోంది. తను చాలా బాగా పాటలు పాడుతుంది. కానీ అందరి ముందు పాడాలంటే భయం. అందుకే క్లాస్‌లో ఎప్పుడూ పాడదు. తన స్నేహితులు ఇద్దరుముగ్గురు ఉన్నప్పుడు మాత్రమే పాడుతుంది. ఒకరోజు ఎప్పటిలాగే పాఠం చెప్పి.. 'పిల్లలూ స్వాతంత్ర్య దినోత్సవం వస్తోంది కదా! అందుకోసం మన స్కూల్లో కొన్ని పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్నవాళ్లంతా మీ పేర్లు ఇవ్వండి సరేనా' అన్నారు తెలుగు మాస్టారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, పాటలు, ఉపన్యాసం.. ఇలా



అన్ని పోటీలకు చాలామంది విద్యార్థులు పేర్లు ఇచ్చారు. కానీ లాస్య మాత్రం మౌనంగా కూర్చుంది. అది గమనించిన కావ్య.. 'మాస్టారు! లాస్య పాటలు చక్కగా పాడుతుంది' అని చెప్పింది. అప్పుడాయన.. 'అవునా..! తల్లీ లాస్య ఒక పాట పాడమ్మా!' అన్నారు. 'లేదు మాస్టారూ..! నేను పాడలేను. నాకు భయం' అంది లాస్య. దాంతో మాస్టారు ఎలాగైనా తనలో భయాన్ని పోగొట్టాలని అనుకున్నారు. మరుసటి రోజు ఖాళీ తరగతి గదిలో లాస్యని కళ్లు మూసుకుని పాట పాడమని చెప్పారు. తను పాడుతుండగానే కొంతమంది విద్యార్థులను అక్కడ కూర్చోబెట్టారు. తరవాతి రోజు మరో పదిమందిని కూర్చోబెట్టారు. అందరూ చక్కగా చప్పట్లు కొడుతూ తనని అభినందించారు. అలా మెల్లగా తనలోని భయమంతా పోయింది. పాటల పోటీల్లో కూడా పాల్గొని మొదటి బహుమతి సాధించింది. 'మనలో ఎంత ప్రతిభ ఉన్నా భయం ఉంటే దాన్ని బయటపెట్టలేం. కాబట్టి భయాన్ని వదిలేయాలి. అప్పుడే లాస్యలా విజయం సాధిస్తారు' అని పిల్లలందరికీ చెప్పారు మాస్టారు. తనలోని భయాన్ని పోగొట్టిన మాస్టారుకు లాస్య కూడా కృతజ్ఞతలు తెలిపింది.

– కూచిమంచి నాగేంద్ర







మువ్వన్నెల వెలుగులు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంటింటా మువ్వన్నెల జెండా పండగ చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఎంజీ రోడ్డులో సెంట్రల్ డివైడర్లపై మువ్వన్నెల రంగుల్లో విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఏపీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం, పరిసర ప్రాంతాలన్నీ మువ్వన్నెల రంగుల్లో విద్యుద్దీపాలను అలంకరించారు.

– ఈనాడు, అమరావతి

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 60,650 క్యూసెక్కులు రాగా, 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 43,500 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు స్వల్పంగా నీటిని తగ్గించి, 17,150 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,042, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 6,908, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ 4,717, బందరు 1,982, కేఈబీ 1,832, ఏలూరు కాలువలకు 1,511 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

స్మార్ట్ కార్డులకు వేళాయె

25 నుంచి రేషన్ పంపిణీకి సన్నాహాలు

ఈనాడు, అమరావతి

ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను కూటమి సర్కారు సాకారం చేస్తోంది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు సాంకేతిక సొబగులు అద్ది స్మార్ట్ కార్డుల పేరుతో పంపిణీ చేస్తోంది. ఆగస్టు 25 నుంచి పంపిణీకి రంగం సిద్ధమైంది. కొత్త కార్డులు వచ్చిన వారు, కొత్త సభ్యులుగా చేరిన వారు ఈ నెల నుంచే సరకులు అందుకోనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రస్తుతం 11,12,832 రేషన్ కార్డులున్నాయి. వీటిల్లో 86 మంది తమకు కార్డులు అవసరం లేదని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. 13,365 కొత్త కార్డులు వచ్చాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య 11,26,111కి చేరింది. వీరందరికీ ఆగస్టు-25 నుంచి స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులు ఇచ్చిన చిరునామాల ప్రకారం ముద్రణ సంస్థ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయాలకు వస్తాయి. అక్కడి నుంచి ఆయా సచివాలయాలకు, అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

దీని ప్రత్యేకతలెన్నో.. వైకాపా ప్రభుత్వం రేషన్ కార్డులకు రాజకీయ రంగు పూసింది. ప్రస్తుతం కూటమి సర్కారు తీసుకొస్తున్న స్మార్ట్ కార్డు ఏటీఎం కార్డు పరిమాణంలో ఉంటుంది. ఇందులో ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర, లబ్ధిదారుడి ఫొటో, కార్డు, చౌక దుకాణం నంబరు ఉంటాయి.

రెండో వైపు లబ్ధిదారుడి కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. కార్డులో ప్రత్యేక చిప్ ఉంటుంది. అందులో లబ్ధిదారుల పూర్తి సమాచారం ఉంటుంది. దాన్నే క్యూఆర్ కోడ్‌గానూ వాడుకునే వెసులుబాటు ఉంటుంది. రేషన్ డీలర్ దగ్గర ఉండే యంత్రంలో ఏటీఎంలా స్వైప్ చేసేందుకు అవకాశం ఉంది. పర్సులో పెట్టుకుని సులభంగా వెంట తీసుకెళ్లవచ్చు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ తదితర గుర్తింపు కార్డుల్లా వాడుకోవచ్చు.



దరఖాస్తులు	ఎన్టీఆర్	కృష్ణా
కొత్త సభ్యుల చేర్పు	33,985	30,397
కొత్తకార్డులు	7,406	5,959
కార్డు విభజన	6,444	5,841
సభ్యుల తొలగింపు	2,167	1,602
చిరునామా మార్పు	1,774	3,354
ఆధార్ అనుసంధానం	473	384
కార్డుల సరెండర్	49	37

రేషన్ ఇచ్చేస్తున్నారు..

ఉమ్మడి జిల్లాలో కొత్తగా కార్డులు వచ్చిన 13,365 లబ్ధిదారులకు, కొత్తగా సభ్యులు చేరిన 64,381 కుటుంబాలకు ఈ నెల నుంచే రేషన్ ఇస్తున్నారు. కార్డులు లేకున్నా..కార్డులు పంపిణీ చేయకున్నా ప్రభుత్వ డేటాబేస్‌లోని వివరాలను ఆధారం చేసుకుని ఆధార్ నంబర్ ద్వారా రేషన్ ఇచ్చేస్తున్నారు. దీంతో 77,746 కుటుంబాలకు ఈ నెలలోనే ప్రయోజనం చేకూరింది. వైకాపా సర్కారు ఐదేళ్ల పాలనలో ఒక్కసారి మాత్రమే కొత్త కార్డులకు అవకాశం ఇవ్వగా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే కొత్త కార్డులు అందించడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నాళ్లిలా.. ఎగిరిపడేలా..?

★ గుంతలు కూడా పూడ్చకుండా ఏళ్ల తరబడి వదిలేసి...

ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్‌లో ఏంటీ దుస్థితి?

ఈనాడు, అమరావతి

'ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్. రహదారులు చూస్తే అత్యంత దారుణం. వందడుగుల సహా అన్ని దారుల్లోనూ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఇవి ఈరోజో.. నిన్నో పడినవి కాదు. రెండు మూడేళ్ల నుంచి ఇలాగే ఉన్నాయి. అయినా మరమ్మతులు చేసే దిక్కు లేదు. ఈ గుంతల్లో పడి నిత్యం ఆటోలు, కార్లు బోల్తాకొట్టే పరిస్థితి. ద్విచక్ర వాహనదారులు ఎగిరి కిందపడుతున్నారు. ఏటా రూ.3కోట్ల నుంచి రూ.5కోట్ల వరకూ పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారు. ఆ నిధులేం చేస్తున్నారు.?

మూడేళ్లుగా.. పరిస్థితి మారలేదు..



వందడుగుల రోడ్డులో మహానాడు రహదారికి సమీపంలో ఉన్న చౌరస్తాలోని ఈ గుంత లోతు చెప్పడానికి ఇదే నిదర్శనం. మనిషి కాలు ఈ గుంతలో పెడితే.. తిరిగి రెండో కాలు గట్టుపై ఉంది. గత మూడేళ్లుగా ఈ గుంత ఇలాగే ఉంది. వేగంగా వచ్చిన వాహనాలు దీనిలో దిగి చక్రాలు విరిగిపోతున్నాయి.

చువ్వ దిగితే అంతే..



వందడుగుల రోడ్డులో చార్మినార్ టీస్టాల్ కూడలిలో రహదారికి మధ్యలో ఉన్న గుంతలో మూడు సిమెంట్ దిమ్మెలు పడేసి వదిలేశారిలా. ఆ దిమ్మెలకు ఉన్న ఇనుప చువ్వలు పైకి తేలి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి.



ప్రభుత్వ కార్యాలయాల మార్గాల్లో..

ఆటోనగర్ ఎస్టేట్ రోడ్డు నంబరు 2లో అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ దారి మొత్తం గుంతల మయంగా ఉంది. ప్రధానంగా ఎస్బీఐ కార్యాలయం నుంచి గుంతలు తేలి రహదారి ప్రమాదకరంగా ఉంది.



నాలుగేళ్లుగా ఈ దారి ఇంతే..

ఆటోనగర్‌లోని మురళీనగర్ రోడ్డులో మూడు అడుగుల లోతున్న గుంతలు ఎన్నున్నాయో లెక్కే లేదు. నాలుగైదేళ్లుగా ఈ దారి పరిస్థితి ఇలాగే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చినా కేవలం మట్టిపోసి వదిలేశారే తప్ప రోడ్డును వేయలేదు.



మలుపులో ప్రమాదం..

బందరు రోడ్డు నుంచి ఆటోనగర్‌లోకి ప్రవేశించే ఆర్చి వద్ద ఇలా రహదారి వేయలేదు. మలుపు తిరిగే ప్రాంతం కావడంతో వాహనాలు ఒక్కసారిగా స్కిడ్ అయి పడిపోయే ప్రమాదం ఉంది.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

అన్నదాతల ట్రాక్టర్ల ప్రదర్శనలో ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసినందుకు కృతజ్ఞతగా నందిగామలో ఆదివారం అన్నదాతలు భారీ ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. కూటమి పార్టీల సారథ్యంలో చేపట్టిన ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి అన్నదాతలు తమ ట్రాక్టర్లను ముస్తాబు చేసుకుని తీసుకువచ్చారు. స్థానిక శ్రీసాయి అయ్యప్ప దేవాలయం వద్ద ర్యాలీని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. అనంతరం చందర్లపాడు రోడ్డు మీదుగా గాంధీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, విజయవాడ రోడ్డు మీదుగా సీఎం రోడ్డు వరకు ర్యాలీ సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ... రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు తొలి విడత రూ.ఏడు వేలు బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. జగన్ హయాంలో అరాచక పాలన సాగిందని ఆరోపించారు. సూపర్-6 పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే రైతులకు పెట్టుబడి సహాయం అందించినట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచినట్లు తెలిపారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, భాజపా నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, యార్డు ఛైర్మన్ కోగంటి బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ట్రాక్టర్ ర్యాలీలో భారీగా రైతులు



కుంగిపోతే కష్టం.. కూలిపోతే నష్టం



కృష్ణా పుష్కరాల సమయంలో పర్యవేక్షణ కోసం దుర్గాఘాట్ వద్ద ఆధునిక వసతులతో అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ రూం నిర్మించారు. ఇక్కడి నుంచి భక్తులు స్నానమాచరించే ఘాట్లు, పోలీసింగ్ వ్యవస్థ నిర్వహణ చూసేవారు. తర్వాత ఇక్కడ నిర్వహణ బాధ్యతలు పట్టించుకోకపోవడంతో నది వైపు ఆవరణ లోపలికి కుంగిపోతోంది. వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో అపరిశుభ్రంగా తయారవుతోంది. త్వరలో దసరా ఉత్సవాలు రానున్నాయి. కంట్రోల్ రూం ఆవరణలో మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

– ఈనాడు అమరావతి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 11వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు అందించవచ్చని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

ఇంద్రకీలాద్రిపై ముగిసిన పవిత్రోత్సవాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: మూడు రోజులుగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. అందులో భాగంగా ఈవో శీనానాయక్ దంపతులు పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానాచార్యులు శివప్రసాదశర్మ, ప్రధాన అర్చకుడు కోటప్రసాద్, వేదపండితులు పాల్గొన్నారు.

సొసైటీలకు ఛైర్మన్ల నియామకం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పీఏసీఎస్) ప్రస్తుత పర్సన్ ఇన్‌ఛార్జిల స్థానే, ముగ్గురితో కూడిన పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. ముగ్గురిలో ఒకరు ఛైర్మన్‌గానూ, మిగతా ఇద్దరు సభ్యులుగానూ (పర్సన్లుగా) వ్యవహరిస్తారు. జిల్లాలో మొత్తం 131 సొసైటీలు ఉండగా.. ప్రస్తుతం 93 సొసైటీలకు ఛైర్మన్లను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెడ్డిగూడెంలో 34.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో రెండు మండలాలు మినహా మిగతా అన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డిగూడెం 34.2 మి.మీ., పెనుగంచిప్రోలు 26.4, జి.కొండూరు 24.6, మైలవరం 23.4, జగ్గయ్యపేట 22.4, తిరువూరు 19.8, వీరులపాడు 13.2, కంచికచర్ల 10.4, చందర్లపాడు 7.4, నందిగామ 5.4, ఎ.కొండూరు 4.6, వత్సవాయి 3.6, ఇబ్రహీంపట్నం 1, విజయవాడ గ్రామీణ 0.2, గాంధీనగర్, భవానీపురం 6.2, అజిత్‌సింగ్‌నగర్ 5.6, పటమటలో 5.4 మిల్లీ మీటర్ల వాన కురిసింది.

పల్లె ఆస్తులకు.. యాజమాన్య హక్కు

మొదలైన రెండో విడత స్వామిత్వ సర్వే

ఈనాడు, అమరావతి

పంచాయతీల పరిధిలో ఉన్న భూములు, పొలాలు, భవనాలు, ఇతర ఆస్తులను సర్వే ద్వారా గుర్తించి యజమానులకు ఆస్తి హక్కు పత్రాలు అందించాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన స్వామిత్వ సర్వే వేగంగా సాగుతోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలో రెండో విడత సర్వే ప్రక్రియను మొదలుపెట్టారు. సర్వే నాలుగేళ్ల కిందట మొదలు పెట్టిన వైకాపా సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేసి మూలనపడేసింది. కూటమి సర్కారు రావడంతో మళ్లీ మొదలైంది.

ఈ-ప్రాపర్టీ కార్డులు అందిస్తారు

సాధారణంగా పంచాయతీల్లో భూవివాదాలు, సరిహద్దు సమస్యలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. వైకాపా పాలనలో ఆక్రమణల పర్వం పరాకాష్ఠకు చేరింది. వీటికి ప్రధాన కారణం సరిహద్దులు సరిగ్గా లేకపోవడం.. ప్రభుత్వ ఆస్తులకు స్పష్టమైన రికార్డులు లేకపోవడం..ఉన్నా అధికారుల అలసత్వంగా వ్యవహరించడం.. దీనికి పరిష్కారంగానే ఈ స్వామిత్వ సర్వే చేస్తున్నారు. పంచాయతీల్లో డ్రోన్ ద్వారా సర్వే చేసి సరిహద్దులు సరిచూస్తారు. తప్పులు సరిదిద్దుతారు. ఈ సర్వేని జీరో, మొదటి, రెండు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో జీవో దశ సర్వే పూర్తి చేశారు. మొదటి విడత సర్వే జరుగుతుండగానే సమాంతరంగా రెండో విడత సర్వేకి పంచాయతీలను ఎంపిక చేశారు. దీని వల్ల అక్రమ రిజిస్ట్రేషన్లు, ఒకే ఆస్తిని రెండు సార్లు రిజిస్ట్రేషన్ చేయడం వంటి సమస్యలు నివారించవచ్చు. సర్వే పూర్తి చేసిన తర్వాత ప్రజలకు ఇచ్చే కార్డు ఆధార్ తరహాలోనే 18 అంకెలతో ఉంటుంది. దానిపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ వ్యక్తికి పంచాయతీల పరిధిలో ఉన్న ఆస్తుల వివరాలు తెలుస్తాయి.

జిల్లా	జీరో ఫేజ్	మొదటి దశ	రెండో దశ
ఎన్టీఆర్	28	10	200
కృష్ణా	47	251	193
మొత్తం	75	261	393



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

అక్టోబరులోగా పూర్తి

ఉమ్మడి జిల్లాలో 729 పంచాయతీల్లో సర్వే చేయాల్సి ఉండగా ప్రస్తుతానికి జీరో ఫేజ్‌లో 75 పంచాయతీల్లో పూర్తి చేశారు. తాజాగా ఆగస్టు 1 నుంచి 261 పంచాయతీల్లో మొదలుపెట్టారు. ప్రస్తుతం గ్రామసభలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. సర్వే చేపట్టే గ్రామాల్లోని సర్వేయర్లకు డ్రోన్ ద్వారా పని చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కూడా సర్వేలో పాల్గొంటారు. రెండో దశలో సర్వే చేసేందుకు 393 గ్రామాలకు ఎంపిక చేశారు. సర్వే వివరాలు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారు. మొత్తం సర్వే ప్రక్రియ అక్టోబరు లోగా పూర్తి చేసి యాజమాన్య పత్రాలు, ఈ ప్రాపర్టీ కార్డులు అందించేందుకు అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు.

రూ. 93 కోట్ల రికవరీపై దృష్టి

అద్వైక కుంభకోణంలో త్వరలో ఆస్తుల అటాచ్‌మెంట్!

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

అద్వైక ట్రేడింగ్ మోసంలో పోలీసులు అయాచిత లబ్ధి పొందిన వారి ఆస్తుల అటాచ్‌మెంట్ దిశగా అడుగులు వేస్తున్నారు. రూ.93 కోట్ల మేర పక్కదారి పట్టినట్లు గుర్తించారు. అధిక వడ్డీ ఆశ చూపి ట్రేడింగ్ పేరుతో దాదాపు 1,700 మంది నుంచి రూ.380 కోట్లకు పైగా వసూలు చేసి చేతులెత్తేసిన వ్యవహారంలో దర్యాప్తు వేగవంతం చేశారు. సుమారు 150 మందికి పైగా బాధితులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీ బ్యాంకు ఖాతాలతో పాటు ఆదిత్య బ్యాంకు ఖాతాల లావాదేవీలను నెల రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించి సీపీ రాజశేఖర్‌బాబుకు అందజేశారు. నెల రోజుల్లో ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

11 బృందాలకు పరిధి విభజన

చివరి దశ సిట్ దర్యాప్తు ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు తదితర 50 మందితో సిట్ ఏర్పాటైంది. టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వేదికగా దర్యాప్తు మొదలుపెట్టారు. ఒక్కో బృందానికి ఒక ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తున్నారు. ఇందులో ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లు కూడా ఉన్నారు. ఆయా బృందాలకు నేతృత్వం వహిస్తున్న ఇన్‌స్పెక్టర్లకు ఐవో (ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్) అధికారాలు ఇచ్చారు. ఒక్కో బృందానికి కొంత మంది ఏజెంట్లను అటాచ్ చేశారు. దీనివల్ల దర్యాప్తు తేలిక అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. వీరితో పాటు వారి పరిధిలోని డిపాజిటర్లను పిలిచి స్టేట్‌మెంట్లు తీసుకోవాల్సి ఉంది ఇప్పటికే ఏజెంట్లను పిలిపించి వివరాలు సేకరించి రికార్డు చేస్తున్నారు.

ఇప్పటివరకు 150 ఆస్తుల గుర్తింపు

ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు అధినేత ఆదిత్య, సీఈవో కిరణ్, కీలకమైన 45 మంది ఏజెంట్లకు సంబంధించి ఆస్తులను గుర్తించారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వివరాలు తెప్పించారు. సుమారు రూ.25కోట్ల విలువైన 150 ఆస్తులు ఉన్నట్లు తేలింది. ఇంకా నలుగురు ప్రధాన ఏజెంట్లు పరారీలోనే ఉన్నారు. ఏజెంట్లు, డిపాజిటర్లను మూడు రకాలుగా విభజించారు. రావాల్సిన దాని కంటే ఎక్కువ మొత్తం పొందినవారు, రావాల్సినంత దక్కిన వారు, పాక్షికంగా లేదా అసలురాని వారిగా విభజించి జాబితా సిద్ధం చేస్తున్నారు.

సహకరిస్తే సరే.. లేదంటే కేసులే..

ట్రేడింగ్ పేరుతో వసూలు చేసిన రూ.380 కోట్లలో రూ.93కోట్లు పక్కదారి పట్టినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. కొందరు వ్యక్తులకు అయాచితంగా వెళ్లినట్లు బయటపడింది. అటువంటి వారిని పిలిపించి విచారణ చేస్తున్నారు. రావాల్సిన దాని కంటే ఎక్కువ తీసుకున్నవారి నుంచి రికవరీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికి సహకరిస్తే వారిని కేసులో సాక్షులుగా చేరుస్తారు. లేని పక్షంలో నిందితులుగా చేర్చనున్నారు. ఈ దిశగా పోలీసులు న్యాయపరమైన ప్రక్రియ మొదలుపెట్టారు. వారికి సంబంధించిన ఆస్తులు, ఖాతాలు అటాచ్ చేసేందుకు కసరత్తు మొదలైంది. ఒకటి, రెండు రోజుల్లో ఈ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

పీకలు కోస్తాం.. లోపలికి పోతాం..

సామాజిక మాధ్యమాల్లో బెదిరింపులు
గంజాయి బ్యాచ్ వింత పోకడలు

న్యూస్‌టుడే, చిట్టినగర్: సామాజిక మాధ్యమాల వేదికగా గంజాయి బ్యాచ్ వింత పోకడలకు తెర తీస్తోంది. జైలులో పరిచయాలతో గ్యాంగ్‌గా మారుతున్నారు. గంజాయి మత్తులో రీల్స్ చేస్తూ ప్రత్యర్థి గ్యాంగ్‌కు సవాళ్లు విసురుతున్నారు. పీకలు కోస్తామంటూ, లోపలికి వెళ్తాం అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. గంజాయి పక్కన పెట్టుకుని రీల్స్ చేస్తున్నారంటే పోలీసులు, సమాజం అంటే వారికి ఏమాత్రం భయం ఉన్నది అర్థం చేసుకోవచ్చు. ఓవైపు టాస్క్‌ఫోర్స్, మరోవైపు ఈగల్ బృందం, స్థానిక పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతున్నా ఇలాంటి రీల్స్ పోలీసుల పనితీరునే సవాల్ చేస్తోంది.



గేదెల ఏసోబు

ఎన్టీఆర్ జిల్లా వించిపేట నైజాంగేటు ప్రాంతానికి చెందిన గేదెల ఏసోబు (22), కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన బన్నీ ఇద్దరూ కలిసి 3 నెలల కిందట ఒక రీల్ చేశారు. అందులో టూటౌన్ పీఎస్‌కు వార్త, 'తెలుసుగా పీకలు కోసి లోపలికి వెళ్లిపోతాం' అంటూ ఉంది. దాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో హల్‌చల్ అయ్యింది. ఏసోబు క్యాటరింగ్ పని చేస్తాడు. అతనిపై సత్యనారాయణపురం ఠాణాలో దొంగతనం కేసులు-4, కొట్లాట కేసు-1, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు-1, దొంగతనం కేసు-1 ఉంది. అయినప్పటికీ అతనిపై రౌడీషీట్‌గానీ, సస్పెక్ట్ షీటుగానీ తెరవలేదు. పోనీ పోలీసు నిఘా ఉందంటే అదీ లేదని 2025లో సత్యనారాయపురం పోలీస్‌స్టేషన్‌లో వరుసగా నమోదైన 3 దొంగతనం కేసులు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇక బన్నీ అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి గంజాయి బ్యాచ్‌తో కలిసి తిరుగుతుంటాడు. అతనిపై కూడా కేసులు లేవు.

ఉండేది కొత్తపేట.. వ్యవహారాలు వేరేచోట.. గేదెల యేసోబు నివాసం ఉండేది కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో, దొంగతనం, కొట్లాటలు, హత్యాయత్నం, గంజాయి వంటి ఇతర వ్యవహారాలన్నీ సత్యనారాయణపురం, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేస్తున్నాడు. అటు అక్కడి పోలీసులు గానీ, ఇటు కొత్తపేట పోలీసుల నిఘా కానీ లేకపోవడం వల్లే సామాజిక మాధ్యమాల వేదికగా రెచ్చిపోతున్నారు. ప్రజల్ని భయపెడుతున్నారు.

రౌడీషీటు తెరిచాం: చిన కొండలరావు, సీఐ


రీల్స్‌లో గంజాయి మత్తులో పీకలు కోస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిన ఘటనలో ఏసోబుపై రౌడీషీటు తెరిచాం. బన్నీ పామర్రులో ఉంటున్నాడు. అతనిపై ప్రస్తుతం కేసు నమోదు చేయలేదు.

వాట్సాప్ గ్రూప్ పేరు మారిపోయిందా..!

'ఏపీకే' అనే పేరుతో ఫైల్ వస్తే క్లిక్ చేయకండి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ వాడుతుంటారు. స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు, కార్యాలయాలు వంటి రకరకాల గ్రూపులు ఉంటున్నాయి. చాలా మంది పదుల సంఖ్యల గ్రూపుల్లో సభ్యులుగా ఉంటున్నారు. అయితే.. ఇటీవల ఆయా గ్రూప్ పేర్లు ఒక్కసారిగా మారిపోతున్నాయి. ఎవరూ మార్చకుండానే 'స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా'గా మారిపోతోంది. ఇలా అయ్యిందంటే.. మీ గ్రూప్ హ్యాక్ అయినట్లే.



లింక్ వచ్చిందని..: యోగక్షేమాలు తెలుసుకునేందుకు, వివిధ వేడుకల సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం, శుభాకాంక్షలు తెలుపుకొనేందుకు బంధువులంతా కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల అకస్మాత్తుగా గ్రూప్ పేరు 'యోనో ఎస్‌బీఐ' లోగోతో 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా మారిపోయింది. అందులోని ఒక సభ్యుడి పేరుతో 'యోనో ఎస్‌బీఐ పాన్ అప్‌డేట్.ఏపీకే' పేరుతో ఒక లింక్ వచ్చింది. వెంటనే ఒక సభ్యుడు అప్రమత్తం అయ్యారు. అది వైరస్ ఫైల్ అని, ఎవరూ క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. దాన్ని ఎవరూ క్లిక్ చేయకపోవటంతో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తప్పించుకున్నారు.

అసలేం జరిగిందంటే...: గ్రూప్‌లోని ఒక సభ్యుడు తనకు వచ్చిన ఒక లింక్‌ను క్లిక్ చేశారు. అది వైరస్ ఫైల్ కావడంతో అతని చరవాణి హ్యాక్ అయింది. హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు 'యోనో ఎస్‌బీఐ పాన్ అప్‌డేట్' పేరుతో వైరస్ ఏపీకే ఫైల్‌ను తయారు చేసి ఆ గ్రూప్ సభ్యుడి చరవాణిలో ఉన్న కాంటాక్ట్ నంబర్లన్నింటికీ వారే పంపించేశారు. అంతేకాదు.. అతను ఉన్న ఇతర వాట్సాప్ గ్రూపలన్నింటిలోకి అతని పేరుతో 'యోనో ఎస్‌బీఐ పాన్ అప్‌డేట్.ఏపీకే' వైరస్ ఫైల్ వెళ్లిపోయింది.

క్లిక్ చేస్తే... ఖాతా ఖాళీ: వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న వారు తమ గ్రూప్‌లోని సభ్యుడి పేరుతో వచ్చిన ఆ ఫైల్‌ను తెలియక క్లిక్ చేస్తే.. వెంటనే వారి చరవాణి కూడా హ్యాక్ అవుతుంది. చరవాణిలో బ్యాంకింగ్ ఖాతాలు, యూపీఐ ఖాతాలు, పాస్‌వర్డ్‌లు ఇతరత్రా సమస్త సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరిపోతుంది. వాటిని ఉపయోగించి.. మీ ఖాతాలను నిమిషాల్లో ఖాళీ చేసేస్తారు.

అప్రమత్తత అవసరం: వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న వారంతా ఇలాంటి సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్నారు సైబర్ క్రైం సీఐ గుణరాం. గ్రూప్‌లోని సభ్యుల పేరుతో 'ఏపీకే' ఫైల్ వచ్చినా.. దాన్ని క్లిక్ చేయవద్దు. ఒకవేళ ఎవరైనా తెలియక క్లిక్ చేస్తే.. క్షణాల వ్యవధిలో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ★ వెంటనే సదరు వాట్సాప్ గ్రూప్ నుంచి బయటకు వచ్చేయాలి. ★ చరవాణిని ఫార్మాట్ చేయాలి. ★ కంప్యూటర్ లేదా లాప్‌టాప్‌లో మీ బ్యాంకుకు సంబంధించిన ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కు వెళ్లి.. మీ ఖాతా పాస్‌వర్డ్‌లు మార్చేసుకోవాలి. ★ ఖాతాల నుంచి డబ్బులు పోతే వెంటనే సైబర్ క్రైం పోర్టల్ 1930కు ఫిర్యాదు చేయండి. ★ గంట వ్యవధిలో ఫిర్యాదు చేస్తే.. పోయిన డబ్బును వెనక్కి తీసుకువచ్చేందుకు వీలవుతుంది. ★ బ్యాంకింగ్‌కు లింక్ అయిన చరవాణి నంబరుకు వాట్సాప్ లేకుండా చూసుకోండి. బ్యాంకింగ్ లావాదేవీల సిమ్ కోసం ప్రత్యేకంగా ఒక చరవాణి పెట్టుకోండి. ★ వేరే నంబరుకు వాట్సాప్ ఉండి, అదే చరవాణిలో మీ బ్యాంకింగ్ లావాదేవీల సిమ్ ఉంచవద్దు. అలా చేసినా హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

మూల్యాంకన పుస్తకాల్లో పరీక్షల రాత

అన్ని పాఠశాలలకు సరఫరా ☛ నేటి నుంచి ఎఫ్ఏ-1

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలో నూతన విధానాలు తీసుకొస్తూ.. విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోంది. అందులో భాగంగా మూల్యాంకన పుస్తకాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎఫ్ఏ (ఫార్మెటివ్ ఎసెస్‌మెంట్) -1, 2, 3, 4, ఎస్ఏ (సమ్మెటివ్ ఎసెస్‌మెంట్)-1, 2 పరీక్షలను గతంలో విద్యార్థులు కాగితాలపై రాసేవారు. ఆ విధానానికి స్వస్తి పలికారు. మూల్యాంకనం పుస్తకంలో అన్ని పరీక్షలు రాసేలా ప్రణాళిక రూపొందించారు. నేటి నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాకు 5,47,756, కృష్ణా జిల్లాకు 4,92,315 పుస్తకాలు సరఫరా చేశారు.

తరగతుల వారీగా సరఫరా..: ఎన్టీఆర్ జిల్లాలోని 937 ప్రభుత్వ బడుల్లో 90,509 మంది, కృష్ణా జిల్లాలోని 1316 ప్రభుత్వ పాఠశాలల్లో 1,54,074 మంది విద్యార్థులు చదువుతున్నారు. సబ్జెక్టుల వారీగా మూల్యాంకన పుస్తకాలను అన్ని పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సరఫరా చేశారు. 1, 2 తరగతుల విద్యార్థులకు మూడు, 3, 4, 5 తరగతుల వారికి నాలుగేసి, 6, 7 తరగతులకు ఆరేసి, 8, 9, 10 తరగతుల వారికి ఏడు చొప్పున ఇస్తారు. వాటిలో విద్యార్థికి సంబంధించిన సంభాషణ, వ్యక్తిగత, నాయకత్వ నైపుణ్యాలు, వివేచనాత్మక ఆలోచనల సమాచారాన్ని నమోదు చేయాలి. విద్యార్థిపై ఉపాధ్యాయుడి పరిశీలన, అపార్ ఐడీ, పరీక్షల నిర్వహణ, ప్రాజెక్టుల వివరాలు ఉంటాయి. మార్కులు, గ్రేడింగ్, ఓఎంఆర్ షీటు పొందుపరిచారు. ఫలితంగా విద్యార్థి వివరాలు, వారు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి తెలుసుకోవచ్చు. ఆలోచన, నైపుణ్యాలను అంచనా వేయవచ్చునని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

లోపాలు గుర్తించే వీలు

గతంలో ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలకు విద్యార్థులే కాగితాలు తెచ్చుకొనేవారు. పరీక్ష రాసిన తరువాత వాటిని ఉపాధ్యాయులు తీసుకొని దిద్ది విద్యార్థులకు ఇచ్చేవాళ్లు. పిల్లలు తిరిగి వాటిని ఉపాధ్యాయులకు ఇచ్చేవాళ్లు. అవి కొన్ని రోజులు మాత్రమే భద్రంగా ఉండేవి. తరువాత పక్కన పెట్టేసేవారు. ఫలితంగా విద్యార్థి ప్రగతి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలిసేది కాదు. ప్రస్తుతం మూల్యాంకన పుస్తకంలోనే ప్రతి పరీక్ష రాయాలి. పరీక్షలన్నీ పూర్తయ్యాక మూల్యాంకన సంపూర్ణమైనట్లు ఉపాధ్యాయుల సంతకంతో ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ప్రగతి లేని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. వాటిని ఉపాధ్యాయులే బడుల్లో భద్రపరచాలి. ఏడాది పొడవునా నిర్వహించాలి. నిర్మాణాత్మక మదింపు సమయంలోనే విద్యార్థులకు ఇవ్వాలి. సమాధానాలు రాసిన వెంటనే తీసుకోవాలి. ఓఎంఆర్ షీట్ ఎలా పూరించాలో, ఖాళీ పేజీల్లో సమాధానాలు ఎలా రాయాలో సూచించాలి.


యువతకు మార్గదర్శకుడు శివశంకర్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాజకీయాల్లో యువ నాయకులకు మార్గదర్శకుడు.. దివంగత కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ ... లేనివన్నారు. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి కష్టాల్లో వెన్నంటే ఉండడమే కాకుండా, న్యాయ ...



శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మీనారాయణ, ఉమ, బుద్దప్రసాద్, శివాజీ తదితరులు

... ఎన్నో కష్టాలు అనుభవించి.. కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా ఆయన అందించిన సేవలు మరువ... ఈశ్వర్, ఆడబాల సత్యనారాయణ, చలమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధనలక్ష్మిగా ముత్యాలమ్మ

... అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు అప్పన మణికుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, కొత్త రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

నన్నెవరు ఆపేది..?

అధికారులు అడ్డుకున్నా.. ఆగని అక్రమం



గతంలో అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి సాంబ

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ...



ప్రస్తుతం గుమ్మాల వరకు నిర్మించారిలా...

ఉద్యోగుల సమస్యలకు పోరాటాలే శరణ్యం




ఐక్యత చాటుతున్న రాజారావు, దయామణి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సతీష్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ... చేస్తోందన్నారు. కొందరు అధి... ఇస్తూ.. ఉద్యోగుల పదోన్న... అధోగతికి కారణమవుతున్నా... లను తొలగించాలని ఆయన ... జరిగేలా ప్రభుత్వం చర్యలు ... ని నియమించి, ఉద్యోగులకు ... పోస్టులు భర్తీ చేయాలని, వాటిలో 50శాతం ల్యాబ్‌ల్లో భర్తీ చేయాలని, జూనియర్ అనలిస్ట్‌లను సర్వీసు రెగ్యులర్ చేయాలని, ల్యాబ్ టెక్నీషియన్లకు డిపార్టుమెంటులో అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు, దయామణి, జి.శ్రీనివాసరావు, సతీష్, ఎస్.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్ తదితరులు నినదించారు.

ఇద్దరు మాజీ హోం మంత్రుల కలయిక

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇద్దరు మాజీ హోం మంత్రులు కలుసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలో చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఓ వివాహ వేడుకకు ఆదివారం వెళ్తూ మార్గమధ్యలోని ఐతవరంలో మాజీ హోం మంత్రి, తన స్నేహితుడు వసంత నాగేశ్వరరావును, మాజీ హోం మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జానారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జానారెడ్డి విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ప్రభుత్వంలో తామిద్దరం మంత్రులుగా పని చేశామని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 17 ఏళ్ల పాటు మంత్రిగా పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. మండల వ్యవస్థ ఏర్పాటు కమిటీ ఛైర్మన్‌గా.. ఎన్టీఆర్‌ను ఒప్పించి ఆ వ్యవస్థ అమలుకు కృషి చేశానని తెలిపారు. వసంతకు వయసు సహకరించక, తాను మానసికంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నట్లు చెప్పారు. తన కుమారుడు, వసంత కుమారుడు ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారని, వారు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవ చేయాలని సూచించారు. జానారెడ్డిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సన్మానించి జ్ఞాపిక అందించారు.



జానారెడ్డితో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, వసంత నాగేశ్వరరావు తదితరులు

నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన శీల రమ్య ఆదివారం రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో శీనానాయక్ అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.



దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

సోనోవిజన్ వ్యవస్థాపకుడి జన్మదిన వేడుకలు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: సోనోవిజన్ వ్యవస్థాపకులు పొట్లూరి జనార్దన మూర్తి 88వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని సోనోవిజన్ షోరూంలో ఆదివారం ఏర్పాటు చేసిన వేడుకల్లో కుటుంబ సభ్యులు, కంపెనీ సిబ్బంది మధ్య ఆయన కేక్ కోశారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పలువురు ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపి జనార్ధన మూర్తి, విజయలక్ష్మీ దంపతులను సత్కరించారు. సోనోవిజన్ ఎండీ భాస్కర్ మూర్తి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జనార్దన మూర్తి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

క్షణికావేశంలో దాడి.. ఒకరి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: జూదమాడుతూ ఏర్పడిన గొడవలో ఓ దివ్యాంగుడు ఒకరి తలపై కర్రతో కొట్టడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వెలగలేరులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పగిడాల నాగయ్య(55), గార్లపాటి చిన వెంకటేశ్వరరావులు గ్రామ శివారులోని కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలోని రేకుల షెడ్డులో కొందరితో కలిసి జూదమాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గార్లపాటి చినవెంకటేశ్వరరావు దివ్యాంగుడు కావడంతో అతడితో నాగయ్య దురుసుగా ప్రవర్తించడంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో క్షణికావేశంలో చిన వెంకటేశ్వరరావు తన చేతిలో ఉన్న కర్రతో నాగయ్య తలపై బలంగా కొట్టడంతో అతడు పడిపోగా స్థానిక వైద్యుడు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధరించారు. దీంతో అక్కడ ఉన్న వారంతా పరారయ్యారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చేరదీసి చెరబట్టాడు..!

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబాన్ని వీడి హైదరాబాద్ చేరిన ఓ యువతిని ఒకరు చేరదీసి ఉద్యోగంలో పెట్టించి అటుపై లోబరుచుకున్నాడు. ఆమె గర్భం దాల్చడంతో హాస్టల్‌లో పెట్టి తప్పించుకోవడంతో బాధితురాలు రాచకొండ పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ ఆదివారం వెల్లడించారు.. ఏపీలోని విజయవాడకు చెందిన యువతి(25) 2024లో తల్లిదండ్రులతో గొడవ పడి హైదరాబాద్‌కు వచ్చింది. ఎంజీబీఎస్ బస్టాండ్‌లో బస్సు దిగి అక్కడ ఏదైనా ఉద్యోగం కావాలని స్థానికులను సంప్రదించింది. అక్కడ కలిసిన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన పంది పరమేశ్వర్ అలియాస్ ఈశ్వర్ తన ఫోన్ నంబరు ఇచ్చాడు. పరమేశ్వర్ కొత్తపేటలోని ఓ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో మార్కెటింగ్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. అతను కొన్నాళ్లపాటు రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ విభాగంలో పని చూపించాడు. తర్వాత నాగోల్‌లోని ఓ వృద్ధాశ్రమంలో పెట్టించాడు. అతడిని యువతి పూర్తిగా నమ్మడంతో చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని తంగేడువనంలోకి తరచూ తీసుకొస్తూ లోబరుచుకున్నాడు. దీంతో ఆ యువతి గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. సదరు యువతిని ఎలాగైనా వదిలించుకోవాలని చూసిన పరమేశ్వర్ చైతన్యపురిలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో చేర్పించి అటువైపు రావడం మానేశాడు.



నిందితుడు పరమేశ్వర్

నిందితుడికి రిమాండ్: పరమేశ్వర్‌కు భార్య, పిల్లలు ఉన్నట్లు తెలిసి తాను మోసపోయానని గ్రహించిన యువతి చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 6న ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అత్యాచారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని హైదరాబాద్‌లోని సఖీ కేంద్రంలో ఉంచారు. చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట నిందితుడిని ఆదివారం హాజరుపరుచగా రిమాండ్ విధించడంతో నల్గొండ జైలుకు తరలించారు. నిందితునిపై అత్యాచారం, చీటింగ్ కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ధర వరలు



వంకాయలు-18, టమాటా-48, బెండ-20, పచ్చిమిర్చి-44, కాకర-26, బీర-30/25, క్యాబేజి-22, క్యారెట్-34/46, దొండ-20, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-28, దోస-18, సొర-10/12, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-85, మునగ-5/4, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్ రూట్-30, కీరదోస-40, బీన్స్-74, క్యాప్సికమ్-74, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-8/15, పుదీనా-5/14, ముల్లంగి-10, పచ్చిమామిడి-13/15 **(నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -107 రిటైల్ ధర 129 చికెన్ విత్ స్కిన్ - 187, చికెన్ స్కిన్‌లెస్ - 213. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.97/-.

నాలుగు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

సివిల్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : విజయవాడ నగరం, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన రవిచంద్ర (28) బి.టెక్. చదివారు. విజయవాడలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. రామలింగేశ్వరపేటలో ఒక గది అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటున్నారు. ఈయనకు మధుమేహం ఉండడంతో తలలో రక్తం గడ్డ కట్టింది. పుష్పా హోటల్ సెంటరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికంగానే ఉంటున్న బంధువు ఇసుకపల్లి రామశర్మ ఇంటికి ప్రతి రోజూ వెళ్లి, వారితో మాట్లాడుతూ ఉండేవారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు అలాగే వెళ్లి మాట్లాడి వచ్చారు. ఆ తర్వాత నుంచి ఆయన కనిపించకపోవటంతో రామశర్మ శనివారం మధ్యాహ్నం రవిచంద్ర ఇంటికి వెళ్లగా మంచంపై నిర్జీవంగా పడి ఉన్నాడు. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయి ఉండొచ్చని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గమనించక పోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుళ్లిపోతున్న స్థితిలో మృతదేహం ఉండడంతో.. నాలుగు రోజుల క్రితమే చనిపోయి ఉండొచ్చని అనుమానించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

బాధితులకు ఆర్థిక సాయం

వల్లంపట్ల(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని వల్లంపట్లకు చెందిన బూక్యా పవన్‌కల్యాణ్ వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, మాధవి దంపతులు ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. చికిత్సకు ఆర్థిక స్తోమత లేదని బాధితుని తండ్రి భూక్యా వాచ్యా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఆత్కూరు గ్రామానికి చెందిన మెండెం శ్రీనివాసరావు గత కొంత కాలంగా కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన ఈమని మురళీ కృష్ణ చికిత్స నిమిత్తం ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు సాయం అందించానన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు, న్యూస్‌టుడే: పశువైద్య సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరువూరు మండలం చింతలపాడు పశువైద్యశాల పశువైద్య సహాయకుడు నూతక్కి రాఘవరావు వరుసగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో ఆదివారం జరిగిన సంఘ రాష్ట్ర స్థాయి సమావేశంలో సహ ఉద్యోగులు ఆయన్ను ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.జగదీశ్వరరావు, సహాయక ఎన్నికల అధికారి భారతీప్రసాద్ నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు.



నూతక్కి రాఘవరావు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇబ్రహీంపట్నం రింగుసెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్‌కు వెళ్లే రహదారిలో సాయంత్రం సమయంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది అవుతోంది. దుకాణాల వద్దకు వచ్చిన కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచుతున్నారు. **-రెహమాన్, ఇబ్రహీంపట్నం**

✔ ట్రాఫిక్ సిబ్బంది రింగు కూడలిలో విధులు నిర్వహించడంతో పాటు ఆ మార్గంలో కూడా నిత్యం ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. దుకాణదారులను హెచ్చరించి చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సై**

-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

? దుగ్గిరాలపాడు ఎస్సీ ఏరియాలో కావలి పెద గురవయ్య ఇంటి సమీపంలో పంచాయతీ బోరు భూగర్భ జలం తగ్గిపోయి నీరు అందక తిప్పలు పడుతున్నారు. తక్షణమే బోరు లోతు పెంచి మరమ్మతులు చేపట్టాలి. **-కె.రాంబాబు (గ్రామస్థుడు)**



✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే బోరు లోతు పెంచి సిబ్బందితో మరమ్మతులు చేపడతాం. **-బీవీ రామకృష్ణనాయక్, మండల అభివృద్ధి అధికారి -న్యూస్‌టుడే, జి.కొండూరు**

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కుంటముక్కల గ్రామంలో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే ధన్వంతరి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 92 మంది రోగులు హాజరయ్యారు. మధుమేహం రక్త పరీక్షలు, రక్తపోటు సాధారణ వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలందించారు. అనంతరం రోగులకు నెల రోజులకు సరిపడా మందులను ఉచితంగా ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ జువ్వా వెంకటేశ్వరరావు అందజేశారు. వైద్య శిబిరంలో డా.గౌతమ్, డా.పి.శ్రీవాణి, డా.పవన్, డా.ఈశ్వర్ వైద్య పరీక్షలు చేయగా రామారావు, యేసు, రాజేశ్వరరావు తదితరులు సేవలందించారు.

12 నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని పుట్రేల శ్రీ ఉమాదేవి సమేత ఆకేశ్వర స్వామి వారి ఆలయం(శివాలయం)లో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు నందూరు నాగ వెంకటకృష్ణ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన శుభపత్రిక విడుదల చేశారు.

తగ్గని వేగం.. తప్పని ప్రమాదం

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై అవస్థలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఇటీవల వ్యవసాయ మార్కెట్ వద్ద ఉన్న మలుపులో ప్రైవేటు (ట్రావెల్స్) బస్సు అదుపు తప్పి బోల్తా పడగా ఆ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఇటీవల కీలకమైన కంటైనర్ అర్ధరాత్రి తిరగబడింది...ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలతో పాటు మితిమీరిన వేగంతో జాతీయరహదారి మధ్యలో ఉన్న డివైడర్లపైకి వాహనాలు ఎక్కేస్తున్నాయి.



గొల్లపూడి వద్ద డివైడర్ మీదకు ఎక్కిన లారీ

సరైన భద్రతా చర్యలు లేక

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. నిత్యం ఈ మార్గంలో 35వేల వాహనాలు వెళ్తుంటాయని అధికారులు ఇటీవల అంచనా వేశారు. రద్దీగా ఈ మార్గాల్లో వాహనాలు వాయువేగంతో దూసుకుని వెళ్లడం, రహదారిపై సరైన భద్రతా చర్యలు లేకపోవడం ఓ కారణం. ముఖ్యంగా ప్రమాదకరమైన మలుపులు ఉండడంతో ఇప్పటి వరకు అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. వాటి వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం..డ్రైవర్లు వాహనాలను వేగంగా నడపడం..మలుపులు వచ్చే సరికి అదుపు చేయలేకపోవడంతో అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి.

రాత్రి పూట అంధకారమే

ప్రధాన జాతీయ రహదారిపై రాత్రి సమయంలో లైట్లు వెలగక చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. రహదారులపై ఎవరు వెళ్తున్నారో కూడా తెలియని పరిస్థితి. దీనికి తోడు నల్లకుంట సెంటర్, వ్యవసాయ మార్కెట్ యార్డు, దర్గా హరిజనవాడ, గొల్లపూడి హైస్కూలు తదితర ప్రాంతాల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ముఖ్యంగా టిప్పర్లు, ట్రావెల్స్ బస్సులు, ఇబ్రహీంపట్నం వైపు ఉన్న క్వారీలు, ఫ్లైయాష్‌ను తీసుకువెళ్లే టిప్పర్లు వాయువేగంతో వెళ్తుంటాయి. టిప్పర్ల కారణంగా కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఒక్క దీపమైనా వెలగదిక్కడ

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు



కరపత్రాలు అందిస్తూ..

కొండపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిందని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కొండపల్లి బి.కాలనీలో తెదేపా నాయకులు ఆదివారం నిర్వహించారు. ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. పి.సాంబశివరావు, కె.సత్యనారాయణ, పర్వన్, శంకరరావు, ఎం.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

సుందరాచారికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో ఆంధ్ర రాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి మల్లెపూదండ రచయత శంకరంబాడి సుందరాచారి జయంతి నిర్వహించారు. శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు, చిన్నారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తాగునీటి సరఫరాపై ఆర్డీవో విచారణ

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరాపై మండలంలోని కేశ్యాతండాలో తిరువూరు ఆర్డీవో మాధురి ఆదివారం పర్యటించి గ్రామస్థులను విచారించారు. ఇటీవల నాలుగైదు రోజులు నీటి సరఫరా నిలిచిందని, శనివారం మధ్యాహ్నం నుంచి ట్యాంకర్లతో సరఫరా పునరుద్ధరించారని ఆమెకు వివరించారు. మండలంలోని శుద్ధజలాలు సక్రమంగా అందడం లేదని సామాజిక మాధ్యమాల్లో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు శనివారం ఆగ్రహించిన సంగతి తెలిసిందే. తదుపరి కలెక్టర్ సూచనతో ఆర్డీవో గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. మరో నెలరోజుల్లో కృష్ణా జలాలు శాశ్వతంగా సరఫరా చేస్తారని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నిర్విరామంగా తాగునీరు అందిస్తారని చెప్పారు. ప్రస్తుతం నీరు రంగు మారిందని కొందరు ఆమె దృష్టికి తీసుకురాగా ట్యాంక్ నుంచి నీరు తెప్పించి పరిశీలించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్యాంకులను శుభ్రం చేసి వెంటనే తనకు నివేదిక పంపించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట సాయి లక్ష్మి పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నూతన బార్ పాలసీ విధానంలో భాగంగా గౌడ సామాజిక వర్గానికి 10 శాతం బార్ పాలసీలు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి గీత కార్మికులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పట్టణ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, టీసీ విజయం గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందిమళ్ల శేషగిరిరావు, గీతకార్మికుల సంఘం నాయకులు భాస్కరరావు, చెన్నయ్య, శ్రీను, నరసింహారావు, తెదేపా కౌన్సిలర్ ఎస్‌కే అబ్దుల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో గీతకార్మికులు, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

ముత్యాలమ్మకు విశేష పూజలు

మైలవరం, న్యూస్‌టుడే: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని కొత్తచంద్రగూడెంలో ముత్యాలమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామస్థులు శీలం హనిమిరెడ్డి, ముత్తంశెట్టి నాగయ్య, ఇతర పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



కొత్తచంద్రగూడెం: ఆలయంలో గ్రామస్థుల పూజలు

రెడ్డిగూడెంలో

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. పొంగళ్లు, పిండివంటలతో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.



కోట మహాలక్ష్మమ్మకు సారె

మైలవరం: ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక కోట మహాలక్ష్మమ్మ సారె మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి సారెతో ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తూ. ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నారు.



వివిధ వేషధారణలో కళాకారులు

పదిరోజులుగా నీటి సరఫరా లేదు

మండలంలోని దుగ్గిరాలపాడు గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయి దాహం కేకలు పెడుతున్నారు. దాదాపు పదిరోజులుగా కృష్ణా జలాలు కుళాయిలకు నీటి సరఫరా లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తాగునీటి కోసం వ్యయప్రయాసలకోర్చి పక్క గ్రామాలకు వెళ్తున్నామని ఆవేదన చెందుతున్నారు. మరో పక్క రైల్వేగేటు పడితే గంటల తరబడి సమయం వృథా అవుతోందని మండిపడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**



అసలే శిథిలం..ఆపై రంధ్రం

మండలంలోని కొత్తగూడెం, చిలుకూరివారిగూడెం గ్రామాల మధ్య బుడమేరు వాగుపై వంతెన మూడేళ్ల కిందటే శిథిలమైంది. పలుచోట్ల కుంగడంతో పాటు కోతకు గురైంది. గతేడాది భారీ వర్షాలకు మరింత ధ్వంసమవగా, కొన్నాళ్ల పాటు కేవలం ద్విచక్ర వాహనాల రాకపోకలకే అనుమతించారు. దాని అభివృద్ధికి అంచనాలను పంపారు. తీవ్ర ఇబ్బందుల నేపథ్యంలో కోతకు గురైన గండ్లలో మట్టి నింపి, రాకపోకలను తాత్కాలికంగా పునరుద్ధరించారు. ఇటీవల వర్షాలకు మట్టి పోసిన ప్రాంతంలో మరోసారి భారీగా రంధ్రమేర్పడింది. వర్షాలకు క్రమేపీ పూర్తిగా కుంగిపోయే ప్రమాదం నెలకొంది. ఆదమరిచి వెళ్తే, వాహనాలు గోతిలో పడే ప్రమాదం ఉందని, ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మైలవరం**



ఎగబడుతున్నాయ్.. కరిచేస్తున్నాయ్

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం అటవీ సమీప గ్రామాలతో పాటు కొండపల్లి పురపాలిక పరిధిలో కోతుల సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. వేల సంఖ్యలో కోతులు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల వాటి దాడిలో ఆరుగురికిపైగా గాయాల పాలయ్యారు. ఇళ్లలో చొరబడడం..పెరటి మొక్కలు, పండ్లతోటలను ధ్వంసం చేస్తున్నాయి. గ్రామ కూడళ్ల వద్ద రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టుకుని ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో పట్టిన కోతులను రాత్రుళ్లు ఇక్కడ విడిచిపెట్టి వెళ్లిపోతుంటారని పుర ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, పంచాయతీ అధికారులు కోతుల సమస్యను ఉమ్మడిగా పరిష్కరించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**



ఎన్టీటీపీఎస్ ఏ కాలనీలో కోతుల వీరంగం

సరిహద్దు దారి.. అధ్వానంగా మారి

గంగినేని నుంచి కొత్తపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారై ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ మార్గం ఆంధ్ర-తెలంగాణా రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు కిలోమీటరున్నర మేర తారు లేచిపోయి రాళ్లు బయటపడడంతో ప్రయాణించాలంటే తిప్పలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. సరిహద్దు రహదారి గుంతలతో తీవ్ర అవస్థలకు గురిచేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అధికారులు రహదారి అభివృద్ధిపై దృష్టి సారించి వాహనదారుల అవస్థలు తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



కొత్తపాలెం సమీపంలోని మార్గంలో పెద్ద గుంత

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

కొండపల్లి, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని కొండపల్లి క్రాంతి పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. పీజీ విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పిన హామీ నేటికి ఆచరణలోకి రాలేదన్నారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముందుకెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు జి.గోపి, సీహెచ్ వెంకటేశ్వరరావులు, ఉపాధ్యక్షులు కుమారస్వామి, కుమార్‌నాయక్, మాధవ్, ప్రణీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం మండలం తోటమూలలో తెదేపా నాయకులు కేకు కోశారు. తిరువూరు శ్రీరస్తు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ శ్రేణుల సమక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన కేకు కోశారు. తిరువూరులో జరిగిన వేడుకలో గంపలగూడెం, తిరువూరు మండల, పట్టణ, విస్సన్నపేట, ఎ.కొండూరు మండల శాఖల అధ్యక్షులు పలువురు న్యాయవాదులు, వ్యాపారులు, నీటి సంఘాల అధ్యక్షులు, తెలుగు యువత, మహిళలు పాల్గొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట నూజివీడు రోడ్డులో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని కేకు కోసి పంచిపెట్టారు.



తిరువూరు: ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా శ్రేణులు

మధిర బ్రాంచి కెనాల్‌కు 874 క్యూసెక్కులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 874 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ కె.మహేష్‌బాబు తెలిపారు. మధిర శాఖ కాల్వకు సరఫరా చేసిన సాగర్‌జలాలు గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరాయి.

ఆధ్యాత్మిక సేవా పురస్కారం అందుకున్న దీప్తి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న కొల్లా దీప్తికి ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతీలో నిర్వహించిన వేడుకలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ సోషల్ సర్వీస్ నిర్వాహకులు 'ఆధ్యాత్మిక సేవా పురస్కారం' ప్రదానం చేశారు. గత పదేళ్లుగా హిందూ దేవాలయాల్లో ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సంస్థ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, సభ్యులు ఆమెకు పురస్కారం అందజేశారు. శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్.సుహాసిని సూచించారు. ఆదివారం రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామంలోని డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించి పలు సూచనలు చేశారు. విద్యార్థినులు ఆరోగ్యంలో ఇబ్బందులు తలెత్తినా..జ్వరాలు వచ్చినా వెంటనే రెడ్డిగూడెం పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. తరగతి గదుల్లో దోమల నివారణకు పొగమందు పిచికారీ చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్.మోతీబాబు, రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్.కీర్తి, సీహెచ్‌వో శ్యాంసుందరరావు, సూపర్‌వైజర్లు రాంకుమార్, భవాని, ప్రిన్సిపల్ తబిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బడి ఆవరణలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్.సుహాసిని, సిబ్బంది

కార్మిక హక్కుల సాధనకై కృషి



మాట్లాడుతున్న సీహెచ్.సుధాకర్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం రెడ్డిగూడెం సీఐటీయూ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.సుధాకర్, మండల అధ్యక్షుడు కె.పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడీ పేరుతో బెదిరింపు కేసులో ముమ్మర దర్యాప్తు

మేడికొండూరు, న్యూస్‌టుడే: కారులో పోలీసులు వేషంలో వచ్చి ఈడీ అధికారులమని బెదిరించి రూ.70 లక్షలు నగదు, ముడి బంగారం (మట్టి) ఎత్తుకెళ్లిన కేసులో ఇద్దరు అనుమానితులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ప్రాంతంలో నివాసం ఉంటూ బంగారం, వెండి వస్తువులు నాణ్యత పరీక్షలు చేసే దుకాణం నడుపుతున్న మాణి జగదీష్, అతడి స్నేహితుడు ప్రవీణ్‌లు రాజమహేంద్రవరంలో ఉంటున్న మధ్యవర్తి రంజిత్‌మారుతీపెట్ ద్వారా ముడి బంగారం కొనేందుకు రూ.70 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో వారి కారును గుంటూరు జిల్లా మేడికొండూరు వద్ద నలుగురు వ్యక్తులు అడ్డగించి సొత్తు దోచికెళ్లిన ఘటనపై మేడికొండూరు పోలీస్‌స్టేషన్లో ఇటీవల కేసు నమోదైన సంగతి విదితమే. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేడికొండూరు, గుంటూరు, తాడికొండ పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో గత మూడు రోజులుగా విస్తృతంగా గాలిస్తున్నారు. కాగా, ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న మధ్యవర్తి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.

ఎగిసిపడుతున్నాయ్.. గుండెలదురుతున్నాయ్



పొలాల్లో పడిన రాళ్లు

గడ్డమణుగు లోయ గంగదేవి గుట్ట సమీపంలోని క్వారీల్లో నిర్వహిస్తున్న పేలుళ్లలో స్థానికంగా ఉన్న పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. లోయ పొలాల్లో నిత్యం క్వారీలో రాళ్లు పడి పంట మొత్తం నాశనమవుతోందని వాపోతున్నారు. పేలుళ్లకు భయపడి పొలాల్లో పని చేసేందుకు కూలీలు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా పంట నష్టపోతున్నామంటున్నారు. అదేమని క్వారీ నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబోదిబో మంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విసన్నపేట యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి టీసీహెచ్‌వీ సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ చంటిబాబులు మాట్లాడుతూ..యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిందన్నారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పొందుగలలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. వారి నుంచి రూ.11,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అపూర్వ సమ్మేళనం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-1990 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో సందడిగా జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సాయంత్రం దాకా సంతోషంగా గడిపారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాడు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మత్తూరి రాంమోహన్‌రావు, కాపా సాంబశివరావు, పూర్వ విద్యార్థులు ఎన్‌ఆర్‌ఐలు కనకపూడి రామారావు, పివి.శ్రీధర్ బాబు, మెరుగు రమేష్, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

భాజపా రాష్ట్రాధ్యక్షుడు మాధవ్ పుట్టిన రోజు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ పుట్టిన రోజు వేడుకను పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఎ.క్రాంతికుమార్, వి.సుజాత, ఎన్.యుగంధర్, కె.సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొని కేకు కోసి మిఠాయిలు పంచారు.



కేకు కోస్తున్న భాజపా నాయకులు

నీళ్లింకిన కళ్లు..!



మనసును మెలిపెట్టే బాధ కలిగినా...పట్టరాని ఆనందం వచ్చినా... మనకి తెలియకుండానే జలజలా కన్నీళ్లు రాలుతాయి.

కంటికి, కన్నీటికి ఉన్న బంధం విడదీయలేనిది. కంటి ఆరోగ్యానికి కన్నీళ్లు కీలకం. ఇప్పుడా కన్నీటికే కష్టంవచ్చింది.


ఏమవుతుందో...కన్నీళ్లు రావడం లేదు. కమ్మటం నప్పికే ఆనంద బాష్పాలూ రాలట్లేదు. గంటల తరబడి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలకు అతుక్కుపోవడంతో చాలా మందిలో పొడి బారిన కళ్ల (డ్రై ఐస్) సమస్య రోజురోజుకూ ఎక్కువవుతోందని నిపుణులు చెబుతున్నారు. డ్రైఐస్ రకరకాల కారణాలు ఉన్నప్పటికీ... స్క్రీన్ టైం పెరగడమనేది ఎక్కువ మందిలో ఈ సమస్యకు ప్రధాన కారణమవుతోంది. కళ్లు తడి ఆరిపోవడం వల్ల కళ్లలో మంట, దురద, ఎర్రగా మారడం, నొప్పి, చికాకు, కరకర లాంటి లక్షణాలు వేధిస్తుంటాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ డ్రైఐస్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. పట్టణ యువతలో ఏకంగా 40 శాతం మంది టీనేజర్లలో ఈ డ్రైఐస్ లక్షణాలు కన్పిస్తున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిత్యం కంప్యూటర్లపై పనిచేసే ఐటీ, ఇతర ఉద్యోగులు ఎక్కువగా ఈ సమస్య బారిన పడుతున్నారు.

ఈ లక్షణాలతో జాగ్రత్త...

- కళ్లల్లో ఇరిటేషన్, నొప్పి, మంట లేదా ఎర్రబడడం
- కంటిలో నీరు లేకుండా పొడి బారినట్లు కనిపించడం
- ఆఖరులో కళ్లు చిన్నగా కనిపించడం.. కంట్లో ఏదో పడినట్లు ఇబ్బంది
- దృష్టి మసకబారడం, దీర్ఘకాలంలో కంటి చూపు తగ్గినట్లు అనిపించడం
- ప్రకాశవంతమైన కాంతిని చూడలేకపోవడం
- కొద్దిసేపు పుస్తకం చదివినా కళ్లు అలసిపోయినట్లు అనిపించడం

కనురెప్పలు ఆర్పక పోవడంతో...

- సాధారణంగా ప్రతి వ్యక్తి నిమిషానికి 16 నుంచి 17 సార్లు కళ్లు ఆర్పుతుంటారు. మొబైల్, కంప్యూటర్ స్క్రీన్లు తదేకంగా చూసే సమయంలో ఇది తగ్గిపోతుంది.
- దీనివల్ల కంటిలోని తడి వేగంగా ఆవిరై కళ్లలో ఉండే టియర్ ఫిల్మ్ ప్రభావితం అవుతుంది.
- టియర్ ఫిల్మ్ లిపిడ్ లేయర్, ఆక్వస్ లేయర్, మ్యూకస్ లేయర్ అనే మూడు పొరలతో ఏర్పడుతుంది. వీటి వల్లే కళ్లు తడిగా, తేజోవంతంగా ఉంటాయి.
- కనురెప్పల్లో ఉండే మెబోమియన్ గ్రంథులు టియర్ ఫిల్మ్‌కు అవసరమైన లిపిడ్లను అందిస్తాయి. కంటిలోని తడి ఆవిరి కాకుండా ఈ గ్రంథులు నివారిస్తాయి.
- దీర్ఘకాలం పాటు కళ్లపై ప్రకాశవంతమైన కాంతి పడటం వల్ల టియర్ ఫిల్మ్‌తోపాటు ఈ గ్రంథులు దెబ్బతిని కళ్లు పొడిబారతాయి.
- పర్యావరణ కాలుష్యం, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కాంటాక్ట్ లెన్సుల వాడకం, హార్మోన్ల మార్పులు, కొన్ని రకాల ఔషధాలు, ఎలర్జీలు సైతం ఈ సమస్యను పెంచుతాయి.
- కళ్లు పొడిబారే పరిస్థితిని డ్రై ఐ సంక్షోభమని నిపుణులు చెబుతారు.



ఎంత సేపు చూస్తే...

- రోజుకు 4 గంటల కంటే ఎక్కువ స్క్రీన్ టైం ఉన్నవారికి డ్రైఐస్ అవకాశం రెండింతలు ఉంది.
- పెద్దలకే కాదు...పిల్లలు సైతం ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల వారిలోనూ ముప్పు ఎక్కువే.
- ఫోన్ లేదా కంప్యూటర్ స్క్రీన్లను ఎక్కువ ప్రకాశవంతంగా పెట్టుకుని చూసే వారికి ప్రమాదమే
- ఏసీ గదులలాంటి పొడి వాతావరణంలో ఫోన్లు, కంప్యూటర్లు ఎక్కువగా చూడటంలో సమస్య ఎక్కువవుతుంది.



– ఈనాడు, హైదరాబాద్

చికిత్స సమగ్రంగా...

- డ్రైఐస్ లక్షణాలతో వచ్చేవారికి కార్నియా ఫిలిం ఎనాలసిస్ ఇతర పరీక్షలతో సమస్యను గుర్తించి చికిత్స అందజేయాలి. స్క్రీన్ టైం తగ్గించడమే కాకుండా ఎక్కువసార్లు కళ్లను బ్లింక్ చేయాలి.
- దుమ్ము, ధూళి పడకుండా గాగుల్స్ వాడాలి. కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసేటప్పుడు అల్ట్రావయొలెట్ ఫిల్టరింగ్ అద్దాలను వినియోగించాలి.
- వైద్యుల సూచనలతో లూబ్రికెంట్ డ్రాప్స్ వాడటం వల్ల ఫలితం ఉంటుంది.
- గోరువెచ్చని నీటితో కనురెప్పలు శుభ్రం చేసుకోవడం... కళ్ల చుట్టూ సుతిమెత్తగా మసాజ్ చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుంది.

–డాక్టర్ రాజలింగం, ప్రభుత్వ నేత్ర వైద్య నిపుణులు

20-20-20 నియమంతో మేలు...

రోజుకు 4 గంటలకు పైగా ఫోన్లు, కంప్యూటర్లు వినియోగించే వారిలో డ్రైఐస్ సమస్య ఎక్కువవుతుంది. ఈ సమస్యను పట్టించుకోకపోతే దీర్ఘకాలంలో తీవ్రమవుతుంది. లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్స తీసుకుంటే డ్రైఐస్ నుంచి పూర్తిగా బయటపడొచ్చు. 20-20-20 నియమం పాటించడం వల్ల కొంత వరకు ఉపశమనం ఉంటుంది. ప్రతి 20 నిమిషాలకు 20 అడుగుల దూరంలోని 20 సెకన్ల పాటు చూడాలి. ఫలితంగా ఎక్కువసార్లు కళ్లు ఆర్పినట్టవుతుంది.

–డాక్టర్ సి.జగదీశ్‌రెడ్డి, కార్నియా, రిఫ్రాక్టివ్ సర్జన్

అమ్మలకూ ఓ రేడియో ఛానల్

పాతికేళ్ల యువకుడు నవీన్ ఉదయం నిద్ర లేవగానే వంటగది నుంచి అమ్మ సిద్ధం చేస్తున్న అల్పాహారం తాలూకు కుక్కర్ విజిల్ వంటి శబ్దాలకు తోడు రేడియోలో శ్రావ్యమైన సంగీతం వినవస్తోంది. ఉల్లాసభరితమైన జింగిల్స్, కేరళ జానపద గీతాలు, ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళా సాధికారత కార్యక్రమం 'కుదుంబశ్రీ' విజేతల టాక్‌షోలు ఒకదాని వెంట మరొకటి వస్తున్నాయి. కేరళలోని ఎన్నో ఇళ్లలో నవీన్‌లాంటి యువత తమ తల్లులు వింటున్న ఈ కార్యక్రమాలకు అలవాటుపడిపోయారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన మొబైల్ యాప్ ఆధారిత 'రేడియో శ్రీ' ఛానల్ కేరళలోని ఇళ్లకు అంతలా చేరువైపోయింది. దీనికి ఉన్న 5 లక్షల మందికి పైగా శ్రోతల్లో నడివయసు మహిళలే ఎక్కువ.

– తిరువనంతపురం

అక్కడ చెలమ నీరే ప్రసాదం..!

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రకృతి అందాలకు నెలవైన కొండపై ఏడు శిరస్సుల నాగేంద్రుడి ఆకారంలో ఉన్న రాయి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనమిస్తాడు. ఈయన్ను గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామిగా కూడా పిలుస్తారు. మూలవిరాట్ పక్కన మూడున్నర అడుగుల మేర నీటి ఊట ఉంది. అందులో చెంబుతో తోడినకొద్దీ అంతే పరిమాణంలో నీరు ఊరుతుంది. ఆ నీటిని భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. ఎప్పుడూ నీరు అడుగంటిపోదని భక్తులు చెబుతున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ప్రతి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు.

– న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం



ఆలయంలో చిన్నపాటి నీటిఊట





ఓ మందిరం.. 38 మంది జాతీయ నేతలు

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట కొలువుదీర్చారు రాజమహేంద్రవరం వెంకటేశ్వరనగర్‌కు చెందిన 85 ఏళ్ల కోడూరు రంగారావు. మత్స్యశాఖలో కొంతకాలం ఉద్యోగం చేసిన తర్వాత రాజీనామా చేసి మత్స్య వ్యాపారం చేసిన ఆయన కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నాటి తరం నాయకుల త్యాగం, గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజెప్పాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం కాకినాడ జిల్లా జగ్గంపేట శివారులోని పెద్దాపురం రహదారి వెంట ఉన్న తన సొంత భూమిలో మందిరం లాంటి నిర్మాణం చేపట్టి మొత్తం 38 మంది దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటుచేశారు. ఇందులో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వంటి మహనీయుల విగ్రహాలున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా నత్తారామేశ్వరంలో వీటిని తయారుచేయించి ఇక్కడికి తీసుకొచ్చారు. మందిరం, విగ్రహాల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.40 లక్షలు వెచ్చించారు. ఈ మందిరం పై భాగంలో 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేయనున్నారు.

– ఈనాడు, కాకినాడ

ఈ ఉల్క భూమి కంటే సీనియర్!



అమెరికాలోని జార్జియా రాష్ట్రం హెన్రీ కౌంటీలో ఈ ఏడాది జూన్ 26న పట్టపగలు ఓ ఇంటిపై పడిన ఉల్క రహస్యాన్ని పరిశోధకులు ఛేదించారు. ఇంటి పైకప్పు చీల్చుకొని కిందపడ్డ ఈ ఉల్కతో భూమిపై చిన్నగుంత ఏర్పడింది. జార్జియా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో కలకలం రేపిన ఈ ఉల్క చిన్న చెర్రీ టమాటా పరిమాణంలో 23 గ్రాముల బరువు ఉంది. ఇది సూపర్ సోనిక్ వేగంతో భూమిపై పడినప్పుడు వచ్చిన శబ్దం చుట్టుపక్కల ప్రాంతాలకూ వినిపించింది. దాదాపు 4.56 బిలియన్ సంవత్సరాల క్రితం ఆ ఉల్క తయారైనట్లు జియాలజిస్ట్ స్కాట్ హారిస్ గుర్తించారు. అంటే.. భూమి కంటే 2 కోట్ల ఏళ్ల పూర్వమని చెప్పారు. ఉల్క పడిన చప్పుడు గురించి ఆ ఇంటి యజమాని మాట్లాడుతూ.. బాగా దగ్గరగా తుపాకీ పేల్చినట్లు అనిపించిందన్నారు.

– ఇంటర్నెట్ డెస్క్

ఆవ చేప రుచి అదుర్స్



ప్రకృతిపరమైన అందాలతోపాటు రుచికరమైన ఆహారం ఉభయగోదావరి జిల్లాలకే సొంతం. ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం నేలకోట, తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం సరిహద్దుగా ఉన్న 'రామవరపు ఆవ'(చెరువు) నేలకోట గ్రామ గిరిజనుల సొత్తుగా ఉంది. సుమారు 1,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కొండల మధ్య ఇది ఏర్పడింది. దీంట్లో దొరికే ఆవ చేప అంటే భోజనప్రియులు ఎగిరి గంతేస్తారు. సహజసిద్ధమైన వాతావరణంలో పెరగడమే ఇందుకు కారణం. ఇక్కడ గిరిజనులే చేపల వేట చేసుకునేలా ప్రభుత్వం సొసైటీ ఏర్పాటుచేసింది. 250 కుటుంబాలు ఉన్న నేలకోటలో 100 కుటుంబాలు సొసైటీగా ఏర్పడ్డాయి. అందులో సభ్యత్వం ఉన్నవాళ్లే చేపల వేట సాగించాలి. బయట వ్యక్తులు ఆవలోకి దిగితే నేరంగా పరిగణిస్తారు. ఏటా ఉగాది ముందు వచ్చే కొత్త అమావాస్య రోజున ఊరంతా పండుగ చేసుకుని చేపల వేట ప్రారంభిస్తారు. – న్యూస్‌టుడే, సీతానగరం



తాటినార చొక్కాలోయ్..!



తాటి నారతో వస్త్రాలు వస్తాయని ఎప్పుడైనా అనుకున్నారా? అసాధ్యమనుకున్న ఆ విషయాన్ని సుసాధ్యం చేశారు.. తమిళనాడుకు చెందిన ఓ యువకుడు. దిండుక్కల్ జిల్లా ఓట్టన్‌సత్రం సమీపంలోని విరుప్పాచ్చికి చెందిన సురేష్‌కుమార్ టెక్స్‌టైల్ విభాగంలో ఎంటెక్ పూర్తిచేసి స్వర్ణపతకం సాధించారు. అనంతరం బెంగళూరులోని ఓ వస్త్రపరిశ్రమలో చేరారు. తాటిచెట్లు అంతరించిపోతుండటాన్ని చూసి ఆవేదనకు గురయ్యారు. వాటిని కాపాడేందుకు ఏదైనా కొత్తగా ప్రయత్నిద్దాం అనుకున్నారు. తాటికాయ నుంచి నార తీసి, దానిని పత్తితో కలిపి నూలు తయారుచేస్తున్నారు. ఆ తర్వాత టెక్స్‌టైల్ మిషన్ల ద్వారా వస్త్రం ఉత్పత్తి చేస్తున్నారు. ఒక తాటిపండుకు 40-50 గ్రాముల నార దొరుకుతుండగా.. ఒక చొక్కా తయారీకి 3వేల గ్రాముల నార అవసరమవుతుంది. 2023లో లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ ఫర్ 'ఫ్యూచర్ ఫ్యాబ్రిక్స్'లో ఈ వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు. విదేశాలకు చెందిన వస్త్రరంగ నిపుణులు వీటిని పరిశీలించి సురేష్‌కుమార్‌ను అభినందించారు. ఈ తరహా దుస్తుల తయారీకి ఫ్యాషన్ ఫోర్‌కాస్టింగ్ అనే సంస్థ సహకారం అందించడానికి ముందుకొచ్చిందని ఆయన తెలిపారు.



– న్యూస్‌టుడే, చెన్నై (అర్కేనగర్)



రెండు సీట్లు.. మూడు చక్రాలు..

సాధారణంగా మూడు చక్రాల వాహనాలు దివ్యాంగులు వాడుతుంటారు. ఈ వాహనం కొంత భిన్నమైనది. పెద్ద వయసువారు, మహిళలు, బండిని బ్యాలన్స్ చేయలేమన్న భయం ఉన్న వారికి అనుకూలంగా ఓ కంపెనీ ఈ బ్యాటరీ వాహనాన్ని తయారు చేసింది. దీనికి ముందు, వెనుక రెండు సీట్లున్నాయి. రెండింట్లో చేతులు పెట్టుకోవడానికి హ్యాండ్ రెస్ట్, బ్యాక్ రెస్ట్ అమర్చారు. వెనుక కూర్చున్న వారు పడిపోకుండా ఉండేలా సీటు బెల్టు కూడా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులకు ఇది అనుకూలం. వెనక సీటు కింద ఖాళీ జాగాలో హెల్మెట్, రెయిన్‌కోట్ వంటివి పెట్టుకోవచ్చు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 80 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని దీని యజమాని తెలిపారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గంలో ఈ వాహనం కనిపించింది. – ఈనాడు, హైదరాబాద్

తీపి జ్ఞాపకాలు.. రెజిన్‌లో దాచుకోండి



వివాహ సమయంలో కొత్త దంపతులు మార్చుకున్న పూలదండలు ఎంతో అపురూపం. కానీ రెండు, మూడు రోజులకే అవి వాడిపోతాయి. చిన్నప్పుడు పిల్లల కోసం వినియోగించిన వస్తువులు, బొమ్మలు.. ఇంట్లో పెద్దలు వాడిన కళ్లజోడు, చేతి గడియారం, సోదరీమణులు కట్టిన రాఖీలు.. ఇలా జీవితకాలంలో ఎన్నో విలువైన జ్ఞాపకాలు పోగు చేసుకుంటాం. వాటన్నిటినీ భద్రపరుచుకోవడం మాత్రం ప్రయాసే. దీనికి రెజిన్ ఆర్ట్ పరిష్కారం చూపుతోంది. ఏ వస్తువునైనా మరపురాని జ్ఞాపకంగా మలిచేస్తోంది కళ. ప్రస్తుతం రెజిన్ కళ ఓ ట్రెండ్‌గా మారింది.

ఏమిటీ రెజిన్ ఆర్ట్?

రెజిన్.. గాజులా చాలా దృఢమైన పదార్థం. ఎపోక్సీ రెజిన్ అనే పారదర్శక ద్రవాన్ని ఉపయోగించి రెజిన్ కళాఖండాలు తయారు చేస్తారు. హార్డ్‌నర్, కలర్ పిగ్మెంట్లు, గ్లిటర్లు, ఎండిన పూలు లేదా చిన్న చిన్న వస్తువులను కలిపి అందమైన ఆకృతుల్లో అమర్చి.. తర్వాత రెజిన్‌ను నింపుతారు. ఇది కొన్ని గంటల్లో గట్టి పడుతుంది. పదునుగా ఉండే దీని చివరి భాగాలను యంత్రం సహాయంతో నునుపుగా మారుస్తారు. గాజులా మెరిసేటట్టు తీర్చిదిద్దుతారు. ఈ ప్రక్రియకు కొన్ని రోజుల సమయం పడుతుంది. పిల్లల బొమ్మలే కాదు.. బొడ్డుతాడు, వారు వేసిన మొదటి అడుగుల ముద్రలు.. ఇలా ఏదైనా ఈ కళతో పదిలం చేసుకోవచ్చు. పుట్టినరోజు, పెళ్లిరోజు, ప్రేమికుల రోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో వీటిని బహుమతులుగా ఇచ్చే సంస్కృతి పెరుగుతోంది. వస్తువు ఫ్రేమ్ పరిమాణం ఆధారంగా ధరలుంటాయని హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన తయారీదారు నేహ తెలిపారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు

ఖాళీగా ఉండే మహిళలు ఈ వ్యాపారంలోకి వస్తున్నారు. సృజనాత్మకతతో, రంగురంగుల ఆకృతుల్లో వస్తువులను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్‌లోని చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా శిక్షణ కూడా ఇస్తున్నారు. నేర్చుకున్న మహిళలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

– ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఆసియా సింహాలు పెరిగాయ్



ఆసియా సింహాల సంఖ్య భారత్‌లో గణనీయంగా పెరిగింది. గత అయిదేళ్లలో 32.2 శాతంగా ఈ వృద్ధి నమోదైంది. 2020లో 674గా ఉన్న వీటి సంఖ్య 2025 నాటికి 891కి పెరిగింది. ఆగస్టు 10న 'ప్రపంచ సింహాల దినోత్సవం' సందర్భంగా మృగరాజుల గణాంకాలపై విడుదలైన 16వ అంచనా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఆడ సింహాల సంఖ్యలో 26.9 శాతం పెరుగుదల కనిపించగా.. వీటి సంఖ్య 260 నుంచి 330కు పెరిగింది. ఇది సింహాల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని నిపుణులు పేర్కొన్నారు. గత పదేళ్లలో సింహాల సంఖ్య 70.36 శాతం పెరిగింది. 2015లో 523 సింహాలు ఉండగా, 2025లో 891కి చేరాయి. ఆసియా సింహాలకు భారత్ నిలయంగా ఉండటం గర్వకారణమని, 70 శాతం పెరుగుదల అద్భుత విజయమని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం అత్యధికంగా సింహాలు గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలో ఉన్నాయి. – ఈటీవీ భారత్

ఒక్కో పాత్రకు.. ఒక్కో అర్థం..



ఆదివాసీ సంస్కృతిని చాటే మట్టి పాత్రలివి. ఒక్కో దానికి ఒక్కో అర్థం ఉంటుంది. మూలవాసుల జీవనవిధానంలో ఒక్కో సందర్భానికి తగినట్లుగా ఆయా పాత్రలుండేవట. వంట కోసం చేసే కుండల డిజైన్ ఒకలా ఉంటుంది. దేవతారాధనలో వాడే ప్రమిదలు, దీపాలు, మట్టి పాత్రలకు డిజైన్లు, అలంకరణలు, కొమ్ములతో వేరుగా ఉంటాయి. అంతిమ సంస్కారాల్లో వాడే పాత్రలకు ఎలాంటి అలంకరణలు ఉండవు. నేటి తరం ఆదివాసీలు వీటిలో కొన్ని ఆచారాలను పాటిస్తున్నా వాటి గురించి అందరికీ తెలిపేందుకు ఇటీవల హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో విభిన్నమైన పాత్రలు, పరికరాలతో ప్రదర్శన నిర్వహించారు. – ఈనాడు, హైదరాబాద్

మీ నిర్ణయం తప్పని తెలిస్తే..



మీరు తీసుకున్న నిర్ణయం సరైనది కాదని తెలిసిందా? అయితే వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టండి. అంతేతప్ప- అప్పటికే బాగా శ్రమించామనో, చాలా సమయం-డబ్బు వ్యయం చేశామనో అదే నిర్ణయాన్ని పట్టుకొని వేలాడకండి. ఆ తప్పును సమర్థించుకోకండి. మీరెంత త్వరగా మేల్కొంటే నష్ట తీవ్రత అంతగా తగ్గుతుంది.

– దివ్యా మిత్తల్, ఐఏఎస్ అధికారిణి

రామాయణం పట్టు చీర



గుహుడు సీతారామ లక్ష్మణులను పడవలో నది దాటిస్తున్న ఈ చిత్రం చేనేత పనితనానికి నిదర్శనం. చేనేతలో పలు జాతీయ అవార్డులు అందుకున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కళాకారుడు నాగరాజు దీన్ని పట్టు జరీపై నేశారు. ఇలాగే.. రామాయణంలోని 168 ఘట్టాలను 400 చిత్రాలతో 60 మీటర్ల పొడవైన పట్టు చీరపై చూడముచ్చటగా పొందుపర్చారు. వ్యాసమహర్షి రామాయణాన్ని రచిస్తున్న చిత్రం మొదలు, రాముడి జననం, విద్యలు నేర్చుకోవడం, శివధనుస్సు విరవడం.. తదితర దృశ్యాలన్నీ చీర అంచులపై ఎంతో సృజనాత్మకంగా వచ్చేలా చేశారు. చీర మధ్యలో 'జై శ్రీరామ్' అని సింహళంతో పాటు 13 భాషల్లో నేశారు. ఈ రామాయణ చీర బరువు 16 కిలోలు. - ఈనాడు, అమరావతి

వసుంధర

vasundhara@eenadu.in

బాగా చదువుకుని... మంచి ఉద్యోగం సాధించాలనేది **గంగం నీలిమ** కల. అమ్మాయికి పెళ్లిచేసి అత్తారింటికి పంపితే బాధ్యత తీరిపోతుందనుకున్నారు ఆమె తల్లిదండ్రులు. వాళ్ల మాటను కాదనలేక పోయింది నీలిమ. అలాగని తన కల విషయంలోనూ రాజీ పడలేదు.



ఇష్టపడి... కష్టపడి!

నీలిమది సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ మండలం, రాములపల్లి. తల్లిదండ్రులది అదే మండలంలోని ఉమ్మాపూర్. చిన్నప్పట్నుంచీ చురుకైన విద్యార్థిని. ప్రభుత్వ అధికారిణి కావాలనేది ఆమె లక్ష్యం. బీఫార్మసీ పూర్తిచేశారు. తర్వాత మెడికల్ రిప్రజెంటేటివ్ అయిన వంశీకృష్ణతో పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు. 2018లో అంగన్‌వాడీ టీచర్‌గా చేరారు నీలిమ. అప్పుడు ప్రభుత్వ అధికారులతో మాట్లాడాల్సి వచ్చేది. 'ఇది కదా నా అసలు లక్ష్యం' అని గుర్తుచేసుకుని... చదువుని మళ్లీ పట్టాలెక్కించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి నుంచి పదోన్నతి సాధించాలన్న ఉద్దేశంతో మొదట బీఏ(సోషియాలజీ) పూర్తిచేశారు. కొద్దిపాటి తేడాలతో దాదాపు పోటీ పరీక్షలన్నింటికీ ఒకటే సిలబస్ ఉండటం గమనించిన నీలిమ... ఓవైపు గ్రూప్స్ కోసం సిద్ధమవుతూనే సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగార్హత పరీక్షల్నీ రాశారు. శిక్షణకు వెళ్లే వెసులుబాటు లేకపోవడంతో యూట్యూబ్‌లో పాఠాలు వింటూ నోట్స్ సిద్ధం చేసుకునేవారు. సెలవు రోజుల్లో హుస్నాబాద్ పట్టణంలోని గ్రంథాలయానికి వెళ్లి పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదివేవారు. ఈ క్రమంలో ఏకకాలంలో శిశు సంక్షేమ శాఖ పరిధిలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీఓ), సూపర్‌వైజర్... ఉద్యోగాలను సాధించారామె. 'పిల్లలు, కుటుంబం, విధులు... ఎన్ని పనులున్నా రోజూ ఆరు గంటలు చదివేదాన్ని. సెలవుల్లో ఇంకాస్త ఎక్కువ సమయం కేటాయించేదాన్ని. ఇంటి పనులు చేసుకుంటూనే ఆడియో పాఠాలు వినేదాన్ని. మావారు కూడా వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వచ్చారు. సంకల్పం బలంగా ఉండాలే కానీ, ఏదీ అసాధ్యం కాదు' అని చెప్పే నీలిమ ఇటీవలే మహబూబాబాద్ జిల్లా గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఏసీడీపీఓగా బాధ్యతలు చేపట్టారు.

– పులి అనిల్‌రెడ్డి, సంగారెడ్డి



ప్రారంభంలో మేం 100 మంది వరకూ పెట్టుబడిదారులతో మాట్లాడాం. అందరిదీ ఒకటే మాట... 'ఆసక్తి లేదు' అని. మేం విజయవంతమయ్యాక మాత్రం పెట్టుబడులకు సిద్ధమంటూ తరచూ సంప్రదించేవారు. చాలా వెంచర్ క్యాపిటల్ సంస్థల్లో మహిళలు నిర్ణయాత్మక స్థానాల్లో లేరు. దాంతో మహిళా సంబంధిత వ్యాపారాలపైన వీసీలకు అవగాహన లేకపోయింది.

- అద్వైతా నాయర్, సహ- వ్యవస్థాపకురాలు, సీఈఓ, నైకా

మీకు తెలుసా?

అందంగా కనిపించేందుకు కొందరు అమ్మాయిలు చేయని ప్రయత్నాలు ఉండవు కదా! అయితే, ఈసారి బాగా నిద్రపోయి చూడండి. నిద్రకీ, అందానికీ సంబంధం ఏంటీ అంటారా? కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ పరిశోధనల ప్రకారం... మంచి నిద్ర, మనలో గ్రోత్ హార్మోన్లు పెరిగేలా చేసి, చర్మ కణాలను రిపేర్ చేస్తుందట. స్కిన్ ఎలాస్టిసిటీకి సాయపడే కొలాజన్‌నూ విడుదలయ్యేలా చేసి, అందంగా కనిపించేలా చేస్తుందట.



ఒక్క ఆలోచన జీవితాల్నే మార్చేస్తుందంటారు. అలా తమ విభిన్న ఆలోచనలూ, పరిష్కారాలతో చూపులేని వాళ్లు, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారీ అమ్మాయిలు. వాళ్లెవరో, ఆ స్ఫూర్తిదాయక ప్రయాణం ఎలా మొదలైందో తెలుసుకుందామా...

సానుభూతి కాదు... సాధికారతే లక్ష్యం!

టెక్నాలజీ జోడించి...



సేవకు టెక్నాలజీని జోడించినప్పుడే అది మరింత ప్రభావవంతంగా ఉంటుందని నమ్ముతారు చెన్నైకి చెందిన **ఐశ్వర్య శివకుమార్**. అదే ఆమెను 19ఏళ్లకే 'సాఫ్ట్ హెల్ప్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటుచేసేలా చేసింది. దీని ద్వారా చూపులేని వాళ్లకు ఉపయోగపడేలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారీమె. ఏఐ ఆధారిత పరికరాలు, స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్)విద్య, స్వయం ఉపాధి శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటివి అందించటంతోపాటు దృష్టిలోపం ఉన్న గర్భిణులకు ఆరోగ్య పర్యవేక్షణ, మద్దతు ఇవ్వటం వంటివీ చేస్తున్నారు. ప్రాజెక్ట్ దృష్టి ద్వారా చూపులేని వాళ్లకు ఉపాధి అందేలా 'బ్లైండ్ స్వాన్ కెఫే'ను ఏర్పాటుచేశారు. పదహారేళ్లలో నాలుగు రాష్ట్రాలకు తమ సేవలను విస్తరించి, వేలమంది జీవితాల్లో మార్పు తెస్తున్నారు ఐశ్వర్య.





బ్రెయిలీ సిస్టమ్‌తో...



అది 2002... దృష్టిలోపం ఉన్న మహిళల మీద పరిశోధనాపత్రం రాయాలనుకుంది **షాలినీ ఖన్నా**. ఆ సమయంలోనే... పనికెళ్లిన అమ్మానాన్న తిరిగొస్తే కానీ, నోట్లోకి ముద్ద వెళ్లని వాళ్లను చూసి, చలించిపోయిందట. అలాంటి వారి గురించి మరింత లోతుగా పరిశోధించింది. వాళ్లంతట వాళ్లు బతికేలా చేయాలనుకుంది. దిల్లీలో 'నాబ్ ఇండియా సెంటర్' ఏర్పాటుచేసి దృష్టి లోపం ఉన్న మహిళల కోసం ప్రత్యేక శిక్షణ కోర్సులు తీసుకొచ్చింది. అందులో ఒకటి దిల్లీలో ప్రారంభించిన 'బ్లైండ్ బేక్ కెఫే. ఇందులో ముందుగా దృష్టి లోపం ఉన్నవారికి సొంతంగా వండుకోవటం నేర్పిస్తారు. ఆ తరవాత ఇతరులకూ వండేలా శిక్షణ ఇస్తారు. వీళ్లకు అనువుగా ఉండేందుకు కెఫేలో బ్రెయిలీ సిస్టమ్ ఉండే మెషీన్లూ ఏర్పాటుచేసింది. ఇదొక్కటేకాదు, వాళ్ల ఆసక్తులకు అనుగుణంగా కాల్ సెంటర్, మెడికల్ ఎగ్జామినేషన్ రూమ్, హ్యాండీక్రాఫ్ట్స్, స్పా... వంటి వాటిల్లోనూ శిక్షణ అందిస్తోంది. ఇలా ఏడాదికి ఒక్కో బృందంలో 35-40మంది మహిళల చొప్పున, మూడు నాలుగు బృందాలకు శిక్షణ ఇస్తోంది. 2022లో నీతి ఆయోగ్ 'టాప్ 75 విమెన్ ట్రాన్స్‌ఫామింగ్ ఇండియా' జాబితాలోనూ చోటు దక్కించుకుంది షాలిని.

రాష్ట్రపతి భవన్‌లోనూ ఏర్పాటుచేసి...



ఓ చిన్న విత్తనం... పెద్ద వృక్షమవుతుంది. ఓ మంచి ఆలోచన... పెద్ద మార్పునకు శ్రీకారం చుడుతుంది. అలా బెంగళూరుకి చెందిన **అలీనా ఆలమ్**‌కు వచ్చిన ఆలోచన ఎంతోమంది దివ్యాంగులకు వరమైంది. విద్యార్థినిగా ఉన్నప్పుడు బెంగళూరులోని సమర్థనమ్ ట్రస్ట్‌లో ఇంటర్న్‌గా పనిచేస్తున్న సమయంలో దివ్యాంగుల్లోని సామర్థ్యాన్నీ, ప్రతిభనీ గుర్తించిందట ఆలమ్. అదే 2017లో 'మిట్టీ కెఫే' ప్రారంభానికి కారణమైంది. దీనిద్వారా శారీరక, మానసిక, మేధోపరమైన లోపాలున్న వారికి ఉపాధి అందించటమే కాదు, వారి హక్కుల కోసమూ పోరాడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 50కిపైగా ప్రాంతాల్లో బ్రాంచ్‌లూ ఏర్పాటుచేసింది. ఒక్క బెంగళూరులోనే 26కుపైగా కెఫేలు ఉన్నాయి. రాష్ట్రపతి భవన్, సుప్రీంకోర్టులోనూ ఈ కెఫేలు ఏర్పాటుచేసే అవకాశాన్ని పొందింది. తన ఆలోచనతో ఎంతోమంది దివ్యాంగుల జీవితాలను మార్చిన ఆలమ్... ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా జాబితాలో చోటు సంపాదించుకోవటమేకాదు, యూఎన్ ఇంటర్ కల్చరల్ ఇన్నొవేషన్, యూత్ అవార్డ్... వంటివీ అందుకుంది.





షీరోస్‌తో భరోసా నింపి

యాసిడ్ దాడి బాధితుల్లో అమ్మాయిలే అధికం. ఆపైన వివక్షను ఎదుర్కొనేదీ వీరే. అలాంటి వారు గౌరవప్రదంగా బతికేలా చేయాలనుకుంది చాన్వ్ ఫౌండేషన్. యాసిడ్ బాధితుల కోసం ఏర్పాటయిన ఈ సంస్థ... ఆగ్రా, లఖ్‌నవూ, నోయిడాల్లో 'షీరోస్ హ్యాంగ్ అవుట్' పేరిట కెఫేలను ప్రారంభించి యాసిడ్ బాధిత మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. దీంతోపాటు వైద్య, న్యాయ సంబంధిత సలహాలు, విద్య వంటివి అందిస్తూ ఎంతోమంది అమ్మాయిల్లో భరోసా నింపుతోంది.



ఈ పర్యటనలు వాళ్లకోసమే..!

పగలూ రాత్రీ తేడా లేకుండా సమయంతో పరుగులు పెట్టి అలసిపోయినా... బర్న్‌అవుట్ నుంచి బయటపడాలన్నా... ఆధ్యాత్మిక అంచుల్ని స్పృశించాలన్నా... ప్రతి దానికీ ఇప్పటి అమ్మాయిల ఎంపిక... ప్రయాణాలే. అందుకే ఎప్పటికప్పుడు పక్కాగా ప్రణాళికలు వేసుకుని మరీ టూర్లకు వెళుతున్నారు. సోలోగానే కాదు, గ్రూప్ ట్రిప్‌లంటూ తెలిసిన, తెలియని వాళ్లతో జర్నీ చేస్తూ... వాళ్ల బాధలకు, మానసిక సమస్యలకు చెక్ చెప్పేస్తున్నారు. దీన్నో ట్రెండ్ గానూ ఫాలో అయిపోతున్నారు. అందుకే వాణిజ్య సంస్థలూ... ఎప్పటికప్పుడు తాజా అంశాల్నీ అవసరాల్నీ దృష్టిలో ఉంచుకుని వెకేషన్లను ప్లాన్ చేస్తున్నాయి. దానిలో భాగంగానే 'బ్రేకప్ టూర్ల'ను ప్రవేశపెట్టారు. అమ్మాయిల జీవితంలో వచ్చే అతిపెద్ద తుపాను కదా మరి... అన్నింటికీ ట్రిప్ ఉన్నప్పుడు దీనికెందుకు ఉండకూడదు అనుకున్నారో... ఏమో! దీన్ని కూడా ప్రారంభించారు. రక్షణ, పర్యవేక్షణ బాధ్యతల్నీ వాళ్లే తీసుకుంటున్నారు. వాళ్ల ఉద్దేశమేదైనా డిప్రెషన్, ఆత్మన్యూనతలకు లోనవకుండా చేస్తున్న ఈ ప్రయాణాలపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

శక్తికి చిరుధాన్యాల మొలకలు...

మహిళలు ఇంటిల్లిపాది ఆకలినీ తీరుస్తారు కానీ, తమ శరీరానికి అవసరమయ్యే పోషకాలు తగినంతగా అందుతున్నాయా లేదా అన్నది గమనించుకోరు. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తప్పకపోవచ్చు. వీటిని సులువుగా అధిగమించాలంటే తృణధాన్యాలతో చేసిన మొలకలు చక్కగా ఉపయోగపడతాయి. అదెలాగో తెలుసుకుందామా!



- ✦ రాగి, సజ్జ, జొన్నలు, కొర్రలు... వంటి చిరుధాన్యాల మొలకల్లో ఫోలేట్, ఇనుము, విటమిన్ సి, జింక్, మెగ్నీషియం, ప్రొటీన్... వంటివి ఎక్కువగా ఉంటాయి. ఇవి మొలకెత్తే ప్రక్రియ... ఫైటిక్ యాసిడ్ స్థాయులను తగ్గిస్తుంది. దీనివల్ల శరీరం ఈ పోషకాలను సులువుగా గ్రహిస్తుంది. ఫలితంగా మహిళల్లో రోగనిరోధకశక్తి, శక్తి స్థాయులు పెరుగుతాయి. జీవక్రియా రేటు మెరుగుపడుతుంది.
- ✦ మొలకెత్తిన చిరుధాన్యాల్లో యాంటీ ఆక్సిడెంట్లు(ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు) అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. కొన్ని రకాల క్యాన్సర్ల నివారణలోనూ, ఈస్ట్రోజన్ స్థాయులను సమతుల్యం చేయడంలోనూ సాయపడతాయి.
- ✦ మిల్లెట్ స్ప్రౌట్స్‌లో ఫోలేట్ పుష్కలంగా ఉంటుంది. గర్భస్థ శిశువు మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడుతుంది. అలానే మహిళల్లోని రక్తహీనతను నివారిస్తుంది.
- ✦ బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఎంత తీసుకుంటే అంత మేలు. వీటిలో లభించే పీచు జీర్ణవ్యవస్థ పనితీరును పెంచుతుంది. మొలకల్లో జింక్, ఇనుము, కాల్షియం ఎక్కువగా లభిస్తాయి. ఇవన్నీ శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తాయి. ముఖ్యంగా జింక్ సంతాన సాఫల్య సమస్యల్ని దూరం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది..



సుదీప్తి

పల్లెలే ఆమె ప్రయోగశాల!

ఆమె ఒక ప్రొఫెసర్. కానీ తను పాఠాలు చెప్పేది తరగతి గదిలో కాదు... పల్లెల్లో, పొలాల్లో. సైన్స్ సంగతులు పుస్తకాలకే పరిమితం కావొద్దు, ఆచరణలోకి రావాలి. అప్పుడే దేశం రూపురేఖలు మారేది అంటూ గ్రామాలను బాగు చేస్తున్నారు... **సుదీప్తి అరోరా.**

సాలిడ్ మేనేజ్‌మెంట్ మీద పాఠం చెబుతున్నారు సుదీప్తి... 'ఇవన్నీ నిజ జీవితంలో సాధ్యం కావు. కావాలంటే మా ఊరు రండి' క్లాసు మధ్యలోనే ఓ విద్యార్థి స్పందన. నిజంగానే ఆ విద్యార్థిని వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్లారామె. అక్కడ పోగవుతోన్న చెత్త, పెరుగుతున్న మురికి నీటిని చూశాక వాటిని మార్చాలనుకున్నారామె. సుదీప్తిది జైపుర్. ఐఐటీ రూర్కీ నుంచి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. ఓ బయోటెక్నాలజీ సంస్థకు డైరెక్టర్ అయ్యారు. విద్యార్థులకు బయోటెక్నాలజీ అంశాలపై తరగతులూ చెప్పేవారు. ఆ విద్యార్థి ప్రశ్న తరవాత 'పరిశోధనలు సామాన్య ప్రజలకు ఉపయోగపడనప్పుడు ఇంకెందుకు' అనుకుని 2020లో 'ప్రకృత్ ఫౌండేషన్' ప్రారంభించారు. దీని ద్వారా రాజస్థాన్‌లోని పల్లెలను 'జీరో వేస్ట్ గ్రామాలు'గా తీర్చిదిద్దడంపై దృష్టిపెట్టారు. ఈమె అసోచామ్ విమెన్ వింగ్ ఛైర్‌పర్సన్ కూడా. ప్రభుత్వంతో తన ఆలోచనను పంచుకున్నప్పుడు సానుకూల స్పందన వచ్చింది. రూ.2కోట్ల ఫండింగ్‌నీ దక్కించుకున్నారు. ఆ ఆనందంలో ఉండగానే మరో వార్త... ఆమెకు క్యాన్సర్, రెండో దశలో ఉందని! కానీ సుదీప్తి భయపడలేదు. ఓవైపు కీమోథెరపీ, రేడియేషన్ చేయించుకుంటూనే గ్రామాల్లో చెత్తను వేరు చేయడం, కంపోస్టింగ్ వంటివాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. 'అందీ అనే గ్రామంలో వర్మీ ఫిల్టర్ టెక్నాలజీతో వానపాముల పెంపకం, చెత్తను ఎరువుగా మార్చడం, బయో గ్యాస్ ప్లాంట్, మురికి నీటి శుద్ధి వంటివి అలవాటు చేశాం. అక్కడ విజయవంతమయ్యాక మరో నాలుగు గ్రామాలకు సేవలు కొనసాగించాం. కానీ ఇవన్నీ అనుకున్నంత సులువు కాలేదు. సంస్కృతి-సంప్రదాయాలకు విరుద్ధమనేవారు, మార్పుని అంగీకరించేవారు కాదు. ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది' అంటారు సుదీప్తి. యువతను వలంటీర్లుగా తీర్చిదిద్దారు. 'ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్' ద్వారా స్కూలు పిల్లలకు ఇంగ్లిష్, మేథ్స్ వంటి సబ్జెక్టుల్లో శిక్షణనిస్తున్నారు. రైతులకు సేంద్రియ వ్యవసాయంలో సాయం చేస్తున్నారు. ఇంటి చెత్త ఇంట్లోనే ఎరువుగా మార్చడంలో సాయం చేస్తున్నారు. ఇవన్నీ చూసి 'సిటీలు మురికికి మారుపేరుగా ఉంటాయి కదా? మీరు పల్లెల మీదే ఎందుకు దృష్టిపెట్టారు' అనడిగారట పల్లెవాసులు. దీంతో పట్టణాల మీదా దృష్టిపెట్టారామె. అర్బన్ రెవల్యూషన్ ప్రాజెక్టు పేరుతో ఒక రకం బ్యాక్టీరియాతో ఇంటి చెత్తను కంపోస్టుగా మార్చేలా ఒక పౌడర్ తీసుకొచ్చారు. ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలు, మున్సిపాలిటీలకూ వాటిని అందిస్తున్నారు. టీచర్లు, విద్యార్థులు, ఉద్యోగులకు జీరోవేస్ట్ మీద అవగాహన కల్పిస్తున్నారు. 'ఈ భూమి మీద ఆధారపడి బతుకుతున్నాం. దానికి ఎంతోకొంత తిరిగిచ్చేయాలి కదా! అదే నేను చేస్తున్నదీ' అంటోన్న సుదీప్తి ప్రయాణం... స్ఫూర్తిదాయకమే కదా!



మళ్లీమళ్లీ గుర్తొస్తోంది..!

? అమ్మానాన్నలకు ఇద్దరం అమ్మాయిలం. మా అక్కను అత్తింటివాళ్లు ఆస్తి గొడవల్లో యాక్సిడెంట్ చేయించి చంపేశారు. ఐదేళ్లుగా ఆ కేసు కోర్టులో నడుస్తోంది. ఏడాదికి రెండుసార్లు వాయిదాలకు వెళ్తున్నా. అక్కడికి వెళ్లిన ప్రతిసారి గతమంతా గుర్తుకు వచ్చి చాలా ఇబ్బంది పడుతున్నా. నాలుగైదు రోజులు గది నుంచి బయటికి రాలేకపోతున్నా. అవే ఆలోచనలు, రక్తం, ఆ ప్రమాదం నన్ను నిద్రపోనివ్వడం లేదు. **- రూప, విశాఖపట్నం**

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

■ తోడబుట్టినవాళ్లు ఇలా అసాధారణంగా, హింసాత్మకంగా చనిపోయినప్పుడు తట్టుకోవడం చాలా కష్టం. ఆ ఘటనలు మనసుకు హత్తుకుపోయి, పదేపదే గుర్తొస్తూ మానసిక కుంగుబాటుకు కారణమవుతాయి. దురదృష్టవశాత్తు మీ విషయంలో ఘటనే కాకుండా, దాన్ని గుర్తుచేసే పరిస్థితులూ ఏడాదికి రెండుసార్లు ఎదురవుతున్నాయి. అవే ఆలోచనలతో మీరు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ అంటారు. కానీ, కేసు నడిచినంతకాలం ఇది తప్పదు కాబట్టి... మీరు ఆలస్యం చేయకుండా సైకియాట్రిస్టుని కలవండి. మీ ఆందోళన, చెమటలు పట్టడం, డిప్రెషన్.. లాంటివి నియంత్రించుకునేందుకు వీలుగా మందులు ఇస్తారు. ఇవి ఆరు నెలల నుంచీ సంవత్సరం వరకూ వాడొచ్చు. వీటితో పాటు ట్రామా ఫోకస్డ్ కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీనీ చేస్తారు. దీనిలో ఆ లక్షణాలను ఏ విధంగా నియంత్రించుకోవాలో, ఆ ఘటనను ఎలా ఎదుర్కోవాలో సూచిస్తారు. దాంతో మీ మానసిక స్థితి కూడా మెరుగుపడుతుంది.

ఆ బాధనుంచి బయటపడేదెలా..?

? నాకు 31 ఏళ్లు. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నా. పెళ్లై నాలుగేళ్లు. కెరియర్‌లో స్థిరత్వం వచ్చాక, పిల్లల్ని కనాలని మొదట్లో వద్దనుకున్నాం. ఏడాదిగా పిల్లల కోసం ప్రయత్నిస్తున్నా. ఐదు నెలల క్రితమే గర్భం దాల్చాను. కానీ రెండు నెలలకే అబార్షన్ అయింది. ఆ బాధనుంచి బయటపడలేకున్నా. **- ఓ సోదరి**

■ ఈ మధ్యకాలంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగరీత్యా, ఆర్థికంగా స్థిరపడ్డాకే పిల్లల్ని కనాలి అనుకుంటున్నారు. ఇవన్నీ అయ్యేటప్పటికి అమ్మాయిలకు 30 ఏళ్లు వచ్చేస్తున్నాయి. మీ విషయానికొస్తే, గర్భందాల్చారు కాబట్టి, ఆరోగ్యపరమైన సమస్యలేవి ఉండకపోవచ్చు. ఒక వేళ ఉన్నా... ఇప్పుడు ఆధునిక వైద్య విధానం చాలా మెరుగైంది. వయసు మీరిన వాళ్లు కూడా వీటిద్వారా అమ్మానాన్నలు అవుతున్నారు. లేకలేక వచ్చిన గర్భం పోయింది కాబట్టి మీకు బాధ, ఒత్తిడి, దిగులు సహజం. అబార్షన్ గురించే ఇంకా ఆలోచిస్తూ ఉండకండి. మనసు నిబ్బరం చేసుకోండి. మళ్లీ గర్భందాల్చాలంటే శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక సంతులత కూడా ముఖ్యం. లేదూ డిప్రెషన్ నుంచి బయటపడలేకపోతున్నా అనుకుంటే... సైకియాట్రిస్టుని కలవండి. డిప్రెషన్‌కు సంబంధించిన మందులు ఇస్తారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్, కోపింగ్ స్కిల్స్‌ను నేర్పిస్తారు. అలానే సైకలాజికల్ సపోర్టివ్ థెరపీనీ అందిస్తారు. వీటన్నింటి సహాయంతో మీరు బాధనుంచి బయటపడొచ్చు.

దీపాలకు పక్షుల సందడి...

స్వీట్ హోమ్



ఇంటికి సహజ కాంతి ఎంత ముఖ్యమో, మనం ఎంచుకునే ఇండోర్ ల్యాంప్‌లూ అంతే ముఖ్యం. అందుకే, కాంతులిచ్చే దీపాలపైన మరింత శ్రద్ధ పెడుతున్నారు. అందులో భాగంగానే... 'బర్డ్ కేజ్ ల్యాంప్'లు ట్రెండ్ అవుతున్నాయిప్పుడు. అటు వింటేజ్ లుక్‌తోపాటు, ఇటు ఆధునిక హంగులు ఉండటమూ దీనికి ఓ కారణం. రంగు రంగుల పక్షులు, సున్నితమైన వైర్‌వర్క్, డార్క్ మెటల్ ఫినిషింగ్‌తో ఉండే ఈ పంజరపు దీపాలు... నోస్టాల్జియా ఫీలింగ్ తెస్తాయనడంలో సందేహం లేదు. అందుకే, పెండెంట్ లైట్లు, టేబుల్ ల్యాంపులు, షాండ్లియర్లు... ఇలా అనేక రూపాల్లో ఇంటీరియర్‌లో భాగమవుతున్నాయి. బెడ్‌రూమ్, డైనింగ్ ఏరియా, లివింగ్‌రూమ్... ఇలా ఎక్కడ ఉంచినా సరే, అక్కడి వాతావరణాన్ని ఇట్టే మార్చేస్తాయి. మీకూ నచ్చాయా? ఇంకేం, ఇంటీరియర్ డిజైన్‌లో క్రేజ్ ఉన్న ఈ కేజ్ ల్యాంపులను మీ ఇంట్లోకీ తెచ్చేయండి మరి...



మస్కారా మెరిపిస్తుంది...



కలువ రేకల్లాంటి కళ్లు ముఖాన్ని అందంగా కనిపించేలా చేస్తాయి కదా! అందుకే అలంకరణలో మస్కారాకి అంత ప్రాధాన్యం. అయితే, దీన్ని వేసుకోవడంలో కిటుకులు తెలిసి ఉండాలి. అవి ఏంటంటే...

- ● కంటికి వాడే ఉత్పత్తులు నాణ్యమైనవి ఎంచుకోవాలి. ముఖ్యంగా వాటర్‌ప్రూఫ్ మస్కారాని తీసుకుంటే అది కళ్లు చెమర్చినా, వర్షంలో తడిసినా... చెదిరిపోకుండా ఉంటుంది.
- ● మస్కారా రాసే ముందు ఐ-లాష్ ప్రైమర్‌ని ఉపయోగిస్తే మేలు. అయితే, మస్కారా వేసే ముందు ఐలాష్ కర్లర్‌తో ఓసారి సున్నితంగా మెలితిప్పండి. కంటి కొలను నుంచి మొదలుపెట్టి చివర వరకూ జిగ్‌జాగ్‌గా రాస్తూ వెళ్తే రంగు చక్కగా అతుక్కుంటుంది. సాధారణంగా నలుపు రంగు మస్కారా అందరికీ సరిపోతుంది.
- ● ఒకసారి మస్కారా రాసుకున్నాక కాసేపు ఆరనిచ్చి మరో కోటింగ్ వేస్తే కళ్లు బాగా కనిపిస్తాయి. అలాకాకుండా ఒకేసారి మందంగా వేయాలనుకుంటే అక్కడక్కడా ముద్దగా వస్తుంది.
- ● రంగు బాగా కలుస్తుందని మస్కారా సీసాను పైకీ కిందకీ కుదిపితే... గాలి బుడగలు ఏర్పడతాయి. దాంతో అది త్వరగా పొడారిపోతుంది. అలాకాకుండా దాన్ని అరచేతుల్లో పెట్టుకుని దొర్లిస్తే మేలు.

హవ్వ.. అంతర్జాతీయ పోలీసు స్టేషనట!



ఇంటర్నెట్ డెస్క్: ఇంటర్నేషనల్ పోలీస్ అండ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అనే పేరుతో నకిలీ పోలీస్ స్టేషన్‌ను తెరిచి ప్రజలను మోసగించేందుకు ప్రయత్నించిన ఓ ముఠా గుట్టును ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు రట్టు చేశారు. దీనికి సంబంధించి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారు నొయిడాలో అచ్చం పోలీస్ స్టేషన్‌ను తలపించేలా పది రోజుల కిందట ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. బయట బోర్డులు కూడా పెట్టారు. పోలీసు డిపార్ట్‌మెంటు మాదిరి లోగోలు, పలు కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన పోర్టల్ ప్రదర్శనలు, ఇంటర్‌పోల్, అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ తదితర సంస్థలతో అనుబంధం ఉన్నట్లు చూపించే డాక్యుమెంట్లు, అనేక ఐడీ కార్డులు, అధికారిక స్టాంపులను పోలీసులు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ నిందితులు ఓ వెబ్‌సైట్ ద్వారా విరాళాలను సేకరించినట్లు గుర్తించారు.

గణేశుడు వస్తున్నాడు..



గణపతి నవరాత్రులు పురస్కరించుకొని మహారాష్ట్ర రాజధాని ముంబయిలో వివిధ మండపాల్లో ప్రతిష్ఠించేందుకు వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

90 ఏళ్ల వయసులో అమ్మ న్యాయపోరాటం



బీజింగ్: వ్యాపార భాగస్వామి పెట్టిన కేసులో చిక్కుకున్న కుమారుడు లిన్ (57)ను కాపాడుకునేందుకు స్వయాన అతడి తల్లి రంగంలోకి దిగి న్యాయపోరాటం మొదలుపెట్టింది. 90 ఏళ్ల వయసులో క్రిమినల్ చట్టాల పుస్తకాలను తిరగేస్తూ కోర్టులో స్వయంగా వాదనలు వినిపించే ప్రయత్నాలు చేస్తోంది. కుటుంబసభ్యులు వారించినా వినకుండా, తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా గ్రంథాలయానికి వెళ్లి పాత కేసులను ఆమె అధ్యయనం చేస్తోంది. కొన్ని పుస్తకాలను కొనుగోలు కూడా చేసింది. తూర్పు చైనాలోని జెజియాంగ్ ప్రావిన్సుకు చెందిన ఈ మాతృమూర్తి కోర్టు హాలులో చేతులకు సంకెళ్లతో వచ్చిన కుమారుణ్ని చూసి తీవ్ర భావోద్వేగంతో ఒక్కసారిగా కుప్పకూలింది. తక్షణమే వైద్యపరీక్షలు చేయించుకోవాలని న్యాయస్థానం ఆదేశించినా ఆమె నిరాకరించింది. 2023లో అరెస్టయిన లిన్‌పై జౌషాన్ మున్సిపల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఇతడి తరఫున వాదించేందుకు ఓ న్యాయవాది ఉన్నప్పటికీ.. కుమారుడికి దూరంగా ఉండలేకపోతున్న ఆ మాతృమూర్తి కోర్టు చుట్టూ తిరుగుతోంది.

మారథాన్ ముగించి.. మృత్యుఒడికి!

థాణె: మహారాష్ట్రలోని థాణెలో విషాదం చోటుచేసుకుంది. 21 కి.మీ. మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసి ఇంటికి తిరిగొచ్చిన బేనె దేవాసి అనే వ్యక్తి ఉన్నట్టుండి కుప్పకూలాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

కాంగ్రెస్‌లో కీలక పదవికి ఆనంద్ శర్మ రాజీనామా

దిల్లీ: కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగ అధ్యక్ష పదవికి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ ఆదివారం రాజీనామా చేశారు. ఆ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించి సమర్థులైన యువ నేతలకు అవకాశం కల్పించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

నోటీసు లేకుండా జాబితా నుంచి పేరు తొలగించం

- సుప్రీం కోర్టుకు తెలిపిన ఈసీ



దిల్లీ: ముందస్తు నోటీసు జారీ చేయకుండా బిహార్ ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఏ ఓటరు పేరును తొలగించబోమని ఎన్నికల సంఘం(ఈసీ) సుప్రీం కోర్టుకు తెలిపింది. బిహార్‌లో శాసనసభ ఎన్నికలకు ముందు ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమానికి (ఎస్ఐఆర్) వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. శనివారం దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో మొత్తం 7.64 కోట్ల మంది ఓటర్లు నమోదై ఉన్నారంది. వాటిలో 65 లక్షలమంది పేర్లు తొలగిస్తున్నామని తెలిపింది. వీరిలో ఎక్కువ మంది చనిపోయి లేదా వలసవెళ్లిపోయి ఉంటారంది. అలాగే ఎస్ఐఆర్ మొదటి దశ పూర్తయిందని ఈసీ తెలిపింది. ఈ నెల 1న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించామని వివరించింది. ఓటర్ల జాబితా నుంచి అర్హత కలిగిన ఏ ఒక్కరిని మినహాయించకుండా చూసుకోవడానికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ పేర్కొంది. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి పేరును మినహాయించడం అంటే ఓటర్ల జాబితా నుంచి ఒక వ్యక్తిని తొలగించినట్లు కాదని పోల్ ప్యానెల్ పేర్కొంది. వారిని సంప్రదించడానికి సహాయం కోరాలని సీఈవో తదితరులను ఆదేశించినట్లు ఈసీ తెలిపింది.

'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రచారం

వెబ్‌పేజీని ప్రారంభించిన పార్టీ

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్త ప్రచారానికి హస్తం పార్టీ శ్రీకారం చుట్టింది. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఒక వెబ్‌పేజీని ప్రారంభించిన పార్టీ దీనిలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. దీని ప్రకారం. . ఈసీ నుంచి జవాబుదారీతనం కోరుతూ పేజీలో నమోదు చేసుకోవచ్చు. డిజిటల్ ఓటరు జాబితా కోసం ప్రతిపక్ష నేత డిమాండ్‌కు మద్దతు తెలపవచ్చు. "ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి జరుగుతున్న పోరాటం" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

అమెరికా తప్ప..

- మిగతా అన్ని దేశాలు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గళం
- ఐరాస భద్రతా మండలిలో గాజాపై వాడీవేడి చర్చ



గాజాలో స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేసిన ఆహారాన్ని తీసుకెళ్తున్న పాలస్తీనియులు

ఐరాస: ఒక్క అమెరికా తప్ప ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలన్నీ గాజా సిటీని స్వాధీనం చేసుకోవాలంటూ ఇజ్రాయెల్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. ఆదివారం భద్రతా మండలి అత్యవసర సమావేశంలో గాజా పరిస్థితిపై సమీక్ష జరిగింది. ఇజ్రాయెల్ సైనిక విస్తరణను ఫ్రాన్స్, బ్రిటన్, చైనా, రష్యా ఖండించాయి. గాజా సిటీని స్వాధీనం చేసుకోవడం తప్పు అని, ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఇజ్రాయెల్‌ను బ్రిటన్ కోరింది. ఫ్రాన్స్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. గాజా ఆక్రమణను చైనా తప్పుబట్టింది. నిర్లక్ష్యంగా ఉద్రిక్తతలను పెంచడాన్ని రష్యా ఆక్షేపించింది. అమెరికా మాత్రం ఇజ్రాయెల్‌ను సమర్థించింది. గాజాలో హింసకు హమాసే కారణమని తెలిపింది.

స్వాధీనం తప్పనిసరి: నెతన్యాహు

హమాస్‌ను అంతం చేయాలంటే గాజా సిటీని స్వాధీనం చేసుకోవడం మినహా తమకు మరో మార్గం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. యుద్ధం ముగించడానికి ఇది మెరుగైన మార్గమని అన్నారు. "గాజాను ఆక్రమించడం మా లక్ష్యం కాదు. స్వేచ్ఛను కల్పించడం లక్ష్యం" అని తెలిపారు.

మీకు మీరు ద్రోహం చేసుకుంటారా?




దీర్ఘకాలిక ప్రయోజనాలను కాకుండా తాత్కాలిక ఉపశమనాలను ఎంచుకోవడానికే మెదడు మనల్ని చాలా సందర్భాల్లో ఒత్తిడి చేస్తుంది. వ్యాయామం చేయడానికి బదులు.. నచ్చిన ఆహారాన్ని ఫుల్‌గా లాగించేందుకే ఓటేయాలని చెప్తుంది. పని చేయడానికి కాకుండా సోషల్ మీడియా స్క్రోలింగ్‌కే మొగ్గుచూపాలంటుంది. కానీ ప్రతిసారీ తాత్కాలిక సౌకర్యాలను ఎంచుకోవడమంటే మీకు మీరు ద్రోహం చేసుకోవడమే!

– రాజ్ శామని, మోటివేషనల్ స్పీకర్

బాస్ అనుకునేవాళ్లకు భారత్ వృద్ధి నచ్చలేదు

- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



రాయ్‌సేన్: భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత చురుగ్గా, క్రియాశీలంగా ఉందని, ఇది 'తామే అందరికీ బాస్'లము అనుకునేవాళ్లకు నచ్చట్లేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక సుంకాలను ప్రకటించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్ జిల్లాలో ఓ రైలు తయారీ సంస్థ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్ వేగంగా అభివృద్ధి చెందడాన్ని కొన్ని దేశాల అధినేతలు చూడలేకపోతున్నారని అన్నారు. తమతో సమానంగా భారత్ మారకూడదనే అహంకారంతో.. దేశాభివృద్ధిని కుంటుపడేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా దేశాభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. భారత్ అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని అన్నారు. మన దేశాన్ని తయారీ, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన 'మేకిన్ ఇండియా' వల్ల వివిధ రంగాల్లో స్వదేశీ ఉత్పత్తులు పెరుగుతున్నాయని తెలిపారు.

పోలీస్ ఐజీగా డాడీ నిర్ణయం తప్పు

- హైకోర్టులో వాదించి గెలిచిన కుమార్తె



కుమార్తె అనురాసింగ్‌తో రాకేశ్‌సింగ్

బరేలీ (యూపీ): రక్తసంబంధానికి, వృత్తిపరమైన నిబద్ధతకు మధ్య తలెత్తిన సంఘర్షణలో ఆమె వృత్తివైపే మొగ్గింది. స్వయంగా తన తండ్రి ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా బాధితుడి తరఫున వాదించి గెలిచింది. నాటకీయంగా జరిగిన ఈ ఘటనకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు వేదికగా మారింది. 2023 జనవరి 13న.. పీలీభీత్‌కు చెందిన ఓ బాలిక రైలులో వెళుతుండగా లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో పోలీసు కానిస్టేబులు తౌఫిక్ అహ్మద్‌పై పోక్సో కేసు నమోదైంది. దీంతో అప్పటి బరేలి రేంజ్ ఐజీ రాకేశ్‌సింగ్ (ప్రస్తుతం రిటైర్డ్) అతణ్ని సర్వీసు నుంచి తొలగించి, ఇదే కేసులో జైలుకు కూడా పంపారు. ఈ నిర్ణయాన్ని అహ్మద్ హైకోర్టులో సవాలు చేయగా.. అతడి తరఫున సాక్షాత్తు రాకేశ్‌సింగ్ కుమార్తె అనురా సింగ్ వాదించారు. విచారణ అధికారి నేరారోపణలను నిరూపించడంతోపాటు ఆయనే శిక్షను కూడా ఖరారు చేశారని, అది క్రమశిక్షణ యంత్రాంగం పనిగా కోర్టుకు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ పోలీస్ సబార్డినేట్ ర్యాంకుల (శిక్ష, అప్పీలు) నిబంధనలు - 1991ని దర్యాప్తు అధికారి ఉల్లంఘించారని ఆమె ఆక్షేపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ అజిత్‌కుమార్ పాత ఉత్తర్వులను కొట్టివేశారు. అహ్మద్‌ను తిరిగి విధుల్లోకి తీసుకొని, మూడు నెలల్లోపు కొత్త విచారణను పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. "నేను, నాన్న వృత్తిపరంగా ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించామంతే" అని తీర్పు అనంతరం అనురా సింగ్ స్పందించగా.. తన కుమార్తె వృత్తిపరమైన నిబద్ధతను చూసి గర్వపడుతున్నట్లు రాకేశ్‌సింగ్ ఆనందం వ్యక్తం చేశారు. తన తరఫున వాదించిన న్యాయవాది 'ఐజీ' కుమార్తె అని చివరిదాకా తెలియదని అహ్మద్ చెప్పటం ఈ ఉదంతంలో కొసమెరుపు.

మోదీ.. ఇందిర బాటలో పయనిస్తారా?

- అమెరికాను బాస్‌లా కాకుండా మిత్రదేశంగానే చూస్తారా..



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా ఇప్పుడు చైనాను వదిలేసి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. రష్యా నుంచి ముడి చమురును భారత్ కొనడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ఆయుధంగా మార్చుకున్నారు. భారత్‌పై ప్రతీకార సుంకాలను ఇష్టానుసారంగా పెంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏం చేయబోతున్నారు.. కాంగ్రెస్ పార్టీ సూచన మేరకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బాటలో పయనించి.. అమెరికా బాస్ కాదు స్నేహితురాలేనని తేల్చి చెబుతారా.. అగ్రరాజ్యం బెదిరింపులను చాకచక్యంగా ఎదుర్కొని సంక్షోభ పరిష్కార మార్గాన్ని కనుగొంటారా.. అనే ప్రశ్నలు ఇప్పుడు ఉదయిస్తున్నాయి. అమెరికా, భారత్ వాణిజ్య ఘర్షణతో భారతీయులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీని పరిష్కారం విషయంలో వారు మోదీని ఇందిరా గాంధీతో పోల్చి చూస్తున్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌ను ఇందిరా గాంధీ లౌక్యంగా ఎదిరించారు. అమెరికా బాస్ కాదు.. స్నేహితురాలని అని ఇందిర స్పష్టం చేశారు. ఆనాడు నిక్సన్‌ను ధిక్కరించినందుకు ఇందిరా గాంధీకి భారీగా మద్దతు లభించింది.

ఆరెస్సెస్ కార్యాలయాన్ని సందర్శించిన వెంకయ్యనాయుడు



ఈనాడు, దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని దేశ్‌బంధు గుప్తా రోడ్డులో రూ.235 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆరెస్సెస్ నూతన కార్యాలయం 'కేశవ్ కుంజ్'ను పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆదివారం తొలిసారి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సంఘ్ వ్యవస్థాపకులు కేశవ్ బలీరాం హెడ్గేవార్ విగ్రహానికి నివాళులర్పించారు. సంప్రదాయ భారతీయ నిర్మాణశైలిలో, అధునాతన వసతులతో నిర్మించిన సంఘ్ కార్యాలయం గత చరిత్రకు దర్పణంగా నిలవడమే కాకుండా, భవిష్యత్ భారత వికాసానికి చోదకశక్తులైన యువతకు స్ఫూర్తిని పంచుతుందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, తుమ్మల రంగారావు ఉన్నారు.

సుప్రీంకోర్టు గేట్ ముందే మాన్యువల్ స్కావెంజింగ్

- తీవ్రంగా పరిగణించిన సర్వోన్నత న్యాయస్థానం

దిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం గేట్ ముందు మాన్యువెల్ స్కావెంజింగ్ నిర్వహిస్తున్న ఫొటోలను సుప్రీంకోర్టు తీవ్రంగా తీసుకుంది. తూర్పు దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులిచ్చింది. వెంటనే స్పందన తెలియజేయాలని లేకపోతే సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని ఆదేశిస్తామని తెలిపింది. "సుప్రీంకోర్టు గేట్ 'ఎఫ్' ముందు మాన్యువెల్ స్కావెంజింగ్ జరుగుతున్న ఫొటోలను మాకు చూపించారు. దీనిపై సంబంధిత ప్రజా పనుల విభాగం అధికారి సమాధానం దాఖలు చేయాలి. సంతృప్తికర సమాధానం రాకపోతే సంబంధిత అధికారిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని ఆదేశమివ్వడం తప్ప మాకు మార్గం లేదు" అని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే నెల 10కి వాయిదా వేసింది.

యూఎస్ కమ్యూనికేషన్ శాటిలైట్‌ను ప్రయోగించనున్న ఇస్రో

- ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడి



దిల్లీ: భారత్-అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థలు ఇస్రో-నాసా అంతరిక్ష సహకారంలో మరో ముందడుగు వేయబోతున్నాయి. ఇటీవలే ఈ రెండు సంస్థలు నిసార్ ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతం చేశాయి. ఈ క్రమంలో అమెరికా తయారీ 6,500 కిలోల కమ్యూనికేషన్ శాటిలైట్‌ను మరికొన్ని నెలల్లో ఇస్రో ప్రయోగించనున్నట్లు సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. మన సొంత లాంచర్లతో అమెరికా ఉపగ్రహాలను భారత్ ప్రయోగిస్తోందనీ, ఇది అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన గణనీయ వృద్ధిని సూచిస్తోందని నారాయణన్ పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం శాటిలైట్ సాంకేతికత లేని ఒక దేశం, ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను తన సొంత రాకెట్ల నుంచి ప్రయోగించిందని వివరించారు.

మీ కుర్రాడు బాగా ఫైట్ చేశాడు.. ఇదిగో పతకం

- పుతిన్ శైలి మైండ్ గేమ్



ఇంటర్నెట్ డెస్క్: రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యేటప్పుడు పశ్చిమ దేశాల నేతలు, ప్రతినిధులకు లోపల ఏదో గుబులుగానే ఉంటుంది. ఎప్పుడూ తనదైన శైలిలో మైండ్ గేమ్స్‌తో వారిని ఆయన దిగ్భ్రాంతికి గురి చేస్తుంటారు. ఓ సారి జర్మనీ నేత వద్దకు పెంపుడు కుక్కను పంపి భయపెట్టగా.. మరోసారి ఫ్రాన్స్ నేతను అల్లంత దూరంలోనే కూర్చోబెట్టి మాట్లాడారు. ఈ సారి వంతు ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్‌ది. ఇటీవల ట్రంప్ తరఫున రాయబారానికి వచ్చిన ఆయనకు పుతిన్ ఇవ్వజూపిన గిఫ్ట్ చూసి ఎలా స్పందించాలో అర్థం కాలేదు. అమెరికా దూత స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల పుతిన్‌కు ట్రంప్ సందేశం చేరవేసేందుకు మాస్కో వెళ్లారు. ఈ సందర్భంగా తళతళలాడుతున్న 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పతకాన్ని తీసుకొచ్చి రష్యా అధినేత వాషింగ్టన్ దూతకు ఇవ్వబోయారు. దానిని సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియన్ గల్లినాకు అందజేయాలని సూచించారు. ఆ అధికారిణి 21 ఏళ్ల కుమారుడు మైఖేల్ గ్లోస్ రష్యా తరఫున ఉక్రెయిన్‌పై పోరాడి మరణించాడని.. అతడి సాహసానికి గౌరవంగా ఈ పతకం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జూలియన్ సీఐఏ డిజిటల్ ఇన్నోవేషన్ విభాగంలో పని చేస్తున్నారు. పుతిన్ అవార్డు ఇవ్వజూపిన సమయం, సందర్భాన్ని బట్టి చూస్తే కచ్చితంగా ఇది ఆయన మైండ్ గేమే అని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ప్రతినిధి ఈ అవార్డును తీసుకున్నారా.. లేదా అనే విషయంపై స్పష్టత లేదు. అటు శ్వేతసౌధం, సీఐఏ, ఇటు విట్‌కాఫ్ ఈ కథనాలపై నోరు మెదపలేదు. ఇక యుద్ధ రంగంలో మరణించినట్లు చెబుతున్న గ్లోస్. . సోషల్ మీడియాలో రష్యాకు మద్దతుగా పోస్టులు పెట్టాడు. మాస్కోలో దిగిన చిత్రాలూ ఉన్నాయి. గతేడాది ఏప్రిల్ 4వ తేదీన తూర్పు ఐరోపాలో అతడు మరణించినట్లు చెబుతున్నారు. అతడి మృతదేహం అమెరికా చేరుకున్న వేళ.. 2025 ఏప్రిల్‌లో సీఐఏ ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రోస్ మరణం జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాదని.. అతడు చాలా మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నాడని పేర్కొంది.

అపరిశుభ్రమైన సీటు.. ఇండిగోకు జరిమానా

ఇంటర్నెట్ డెస్క్: ఓ ప్రయాణికురాలికి అపరిశుభ్రమైన, అసౌకర్యవంతమైన సీటును కేటాయించినందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు దిల్లీ వినియోగదారుల ఫోరం రూ.1.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సదరు ప్రయాణికురాలికి చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 5న తాను ప్రయాణించిన బాకు-న్యూదిల్లీ విమానంలో తనకు అపరిశుభ్రమైన సీటు కేటాయించారని పింకీ అనే మహిళ దిల్లీలోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించింది. విచారణ జరిపిన కమిషన్ బాధితురాలికి పరిహారం చెల్లించాలని ఇండిగోను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి ఆమె ఖర్చు చేసిన రూ.25,000 కూడా చెల్లించాలని పేర్కొంది.

హెవోపీఈ నుంచి నేడు పరిశోధకులు బయటకు

దిల్లీ: లద్దాఖ్‌లో ఏర్పాటు చేసిన అంతరిక్ష సదృశ హ్యూమన్ అవుటర్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ (హెవోపీఈ) ప్రయోగశాలలో 10 రోజులు గడిపిన పరిశోధకులు ఎం.రాహుల్, యమన్ అకోట్ సోమవారం బయటకు రానున్నారు. చంద్రుడు, అంగారకుడిపై ఉండే జీవన పరిస్థితులను అందులో కృత్రిమంగా కల్పించారు. ఈ ప్రయోగం సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణంలో వ్యోమగాములకు ఎదురయ్యే శారీరక, మానసిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఈ నెల 1న ఆ ఇద్దరు పరిశోధకులు లేహ్‌కు 160 కి.మీ. దూరంలోని త్సో కర్ కొలను తీరంలో ఏర్పాటు చేసిన హెవోపీఈలో ప్రవేశించారు.

నా భార్యను చేర్చుకోవద్దని ఆసుపత్రిపై ప్రభుత్వం ఒత్తిడి

ఆర్జీకర్ మృతురాలి తండ్రి

కోల్‌కతా: పోలీసుల లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడిన తన భార్యను చేర్చుకోవద్దంటూ ఆసుపత్రిపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చిందని ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి తండ్రి ఆరోపించారు. "శనివారం సాయంత్రం నా భార్యకు వైద్యం అందించిన డాక్టర్ ఆమెను ఆసుపత్రిలో చేర్చాలని అన్నారు. ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత ఆసుపత్రి వర్గాల ప్రవర్తనలో అనూహ్యంగా మార్పు వచ్చింది. వైద్యం అందించడంలో తటపటాయించారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా నా భార్యను ఆసుపత్రిలో చేర్చుకోలేమని చెప్పారు" అని మృతురాలి తండ్రి వాపోయారు. కనీసం రెండు రోజులైనా ఆసుపత్రి పర్యవేక్షణలో తన భార్య ఉండాలని వైద్యులు అన్నారని... కానీ ఆదివారం మధ్యాహ్నమే ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు. తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్జీకర్ బాధితురాలి తల్లిదండ్రులు పిలుపునిచ్చిన నబన్నా చలో అభియాన్ (చలో సచివాలయం) ర్యాలీలో శనివారం పోలీసులు లాఠీఛార్జి జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మృతురాలి తల్లిదండ్రులిద్దరూ అనంతరం ఆసుపత్రిలో చేరారు.

తుర్కియేలో భూకంపం

12 భవనాలు నేలమట్టం

ఇస్తాంబుల్: తుర్కియేలోని బలికెసిర్ ప్రావిన్సులో ఆదివారం సాయంత్రం 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీనివల్ల 200 కి.మీ. దూరంలోని ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించింది. సింద్గిర్గి పట్టణంలో దాదాపు 12 భవనాలు కూలిపోయినట్లు స్థానిక మీడియా పేర్కొంది.



ఇటలీలోని సిసిలీ ద్వీపంలో ఎట్నా అగ్నిపర్వతం విస్ఫోటం అనంతరం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న బూడిద



పిల్లలను కొంగున కట్టేసుకొని కాలువలోకి దూకిన మహిళ

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాందా జిల్లా రిసౌరా గ్రామంలో ఓ ఇల్లాలు తన ముగ్గురు పిల్లలను కొంగున కట్టేసుకొని కాలువలోకి దూకింది. ఈ గ్రామానికి చెందిన రీనా (30), అఖిలేశ్ దంపతులకు ముగ్గురు సంతానం. శుక్రవారం రాత్రి తాగి ఇంటికొచ్చిన భర్తతో గొడవపడిన రీనా పిల్లలను తీసుకొని ఇల్లు వదిలి వెళ్లిపోయింది. మత్తు కారణంగా నిద్రపోయిన అఖిలేశ్ ఉదయం లేచి చూసుకొని వెదుకులాట ప్రారంభించాడు. గ్రామ శివారులోని కెన్ కాలువ వద్ద వారి దుస్తులు, చెప్పులు కనిపించాయి. ఈతగాళ్ల సాయంతో దాదాపు అయిదారు గంటలు గాలించాక రీనాతోపాటు పిల్లలు హిమాన్షు (9), అన్షి (5), ప్రిన్స్ (3)ల మృతదేహాలు దొరికాయి.

భాజపా ఓ ఎన్నికల అవినీతి వర్సిటీ: అఖిలేశ్

లఖ్‌నవూ: భాజపా.. ఓ 'ప్రపంచ ఎన్నికల అవినీతి విశ్వవిద్యాలయం' అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆదివారం ఆరోపించారు. ఆ పార్టీ ఓటర్ల హక్కులను హరించివేస్తుందని అన్నారు. "ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు భాజపా రచిస్తున్న కుట్రను మేం అనుమతించం" అని 'ఎక్స్' వేదికగా అఖిలేశ్ పేర్కొన్నారు.

ఎంపీల ఫ్లాట్లను నేడు ప్రారంభించనున్న మోదీ

దిల్లీ: పార్లమెంటు సభ్యుల కోసం దేశరాజధానిలో సకల సౌకర్యాలతో నిర్మించిన 184 ఫ్లాట్లను ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించనున్నారు. బాబా ఖడక్ సింగ్ మార్గ్‌లో ఈ బహుళ అంతస్తుల ఫ్లాట్లను భూకంపాలను సైతం తట్టుకొనేలా అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించారు.

పుతిన్‌తో భేటీకి జెలెన్‌స్కీ!

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఈ నెల 15న అమెరికాలోని అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరగనున్న భేటీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఆహ్వానించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌ను భాగం చేయాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలండ్, ఫిన్లాండ్ వంటి ఐరోపా దేశాలు అగ్ర రాజ్యానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఛాంపియన్

అర్జున్ పరాజయం

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్


నిహాల్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో అర్జున్ ఇరిగేశికి తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం నాలుగో రౌండ్లో నిహాల్ సరీన్ చేతిలో అతడు పరాజయం పాలయ్యాడు. విదిత్ గుజరాతి-ప్రణవ్, అనీశ్-విన్సెంట్ కీమర్, రాఏన్-లియాంగ్ గేమ్‌లు డ్రా అయ్యాయి. జోర్డాన్‌పై మురళీ కార్తికేయన్ గెలిచాడు. 4 రౌండ్ల తర్వాత 2.5 పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. కీమర్ (3.5) అగ్రస్థానంలో ఉన్నాడు. ఛాలెంజర్స్ విభాగం నాలుగో రౌండ్లో ద్రోణవల్లి హారిక.. ల్యూక్ మెండోంకా చేతిలో ఓడింది. అభిమన్యు పౌరాణిక్ చేతిలో వైశాలి ఓడిపోయింది. హర్షవర్ధన్‌పై దీప్తాయన్ ఘోష్ విజయం సాధించాడు. ఆధిబన్-ప్రణేశ్ గేమ్ డ్రాగా ముగిసింది. అభిమన్యు పౌరాణిక్ 3.5 పాయింట్లతో ముందంజలో ఉన్నాడు. హారిక (0.5) తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది.

ఆసియా సర్ఫింగ్‌లో రమేశ్‌కు కాంస్యం


రమేశ్

చెన్నై: ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా రమేశ్ బుదియాల్ ఘనత సాధించాడు. ఓపెన్ పురుషుల విభాగంలో అతడు ఆదివారం కాంస్య పతకం నెగ్గాడు. రమేశ్ 12.60 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. కొరియాకు చెందిన కనోవా హీజే (15.17) స్వర్ణం నెగ్గగా.. పజార్ అరియానా (ఇండోనేసియా) 14.57 పాయింట్లతో రజతం చేజిక్కించుకున్నాడు.

అండర్-20 మహిళల ఆసియాకప్ ఫుట్‌బాల్‌కు భారత్ అర్హత

యాంగూన్ (మయన్మార్): భారత్ రెండు దశాబ్దాల కాలంలో తొలిసారి ఏఎఫ్‌సీ అండర్-20 మహిళల ఆసియాకప్ ఫుట్‌బాల్‌కు అర్హత సాధించింది. గ్రూప్-డిలో తన ఆఖరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఆ జట్టు ఆదివారం 1-0తో మయన్మార్‌ను ఓడించింది. భారత్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను పూజ (27వ) చేసింది. మొత్తం ఏడు పాయింట్లతో ఆ జట్టు గ్రూపులో అగ్రస్థానంలో నిలిచింది. అండర్-20 ఆసియాకప్ వచ్చే ఏడాది థాయ్‌లాండ్‌లో జరుగుతుంది.

గాయాలతో ఇద్దరు జపాన్ బాక్సర్లు మృతి

టోక్యో: జపాన్‌లో జరిగిన ఓ బాక్సింగ్ టోర్నీలో గాయాలతో ఇద్దరు బాక్సర్లు మృతి చెందారు. టోక్యోలో నిర్వహించిన ఈ పోటీల్లో యొమటో హటాతో 12 రౌండ్ల పోరులో షిగ్ టోషి కొటారి (28) తలకు బలమైన గాయాలు కావడంతో రింగ్‌లో కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. మరోవైపు యోజి సయ్‌టోతో పోరులో హిరోమసా (28) కూడా తలకు గాయంతోనే మృత్యువాత పడ్డాడు.

'లక్ష్య' నిత్యకు రెండు పతకాలు

రజతం, కాంస్యం కైవసం

కాంటినెంటల్ అథ్లెటిక్స్ మీట్


నిత్య

భువనేశ్వర్: ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ మీట్‌లో 'ఈనాడు' సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' అథ్లెట్ నిత్య గంధే సత్తా చాటింది. ఈ ఈవెంట్లో ఆమె రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. ఆదివారం మహిళల 200 మీటర్ల పరుగులో నిత్య 24.11 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజతం సాధించింది. ఏంజెల్ (23.95 సె) పసిడి దక్కించుకోగా.. ఉన్నతి (24.56 సె) కాంస్యం గెలుచుకుంది. 100 మీటర్ల పరుగులో నిత్య 11.70 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్యం చేజిక్కించుకుంది. అభినయ (11.57సె), స్నేహ (11.70సె) స్వర్ణ, రజత పతకాలు గెలుచుకున్నారు. స్టార్ అథ్లెట్లు అన్నూ రాణీ, మురళీ శ్రీశంకర్ సత్తా చాటారు. మహిళల జావెలిన్‌లో అన్నూ 62.01 మీటర్ల త్రోతో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. మరో భారత అథ్లెట్ దీపిక (54.20మీ) మూడో స్థానంలో నిలిచింది. దిల్హారి (శ్రీలంక, 56.27మీ) రజతం గెలుచుకుంది. పురుషుల లాంగ్ జంప్‌లో మురళీ శ్రీశంకర్ తెల్లగా పసిడి నెగ్గాడు. అతడు 8.13 మీటర్ల దూరం దూకి అగ్రస్థానంలో నిలిచాడు. షనవాజ్ (8.04 మీ), లోకేశ్ (7.85 మీ)లకు రజత, కాంస్య పతకాలు దక్కాయి. మహిళల లాంగ్‌జంప్‌లో శైలి సింగ్ (6.28మీ) పసిడి సొంతం చేసుకుంది. భవాని (6.13 మీ), సంధ్రా బాబు (6.10 మీ) తర్వాతి స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల 200 మీటర్ల పరుగులో అనిమేశ్ కుజుర్ (20.77సెకన్లు) పసిడి ఎగరేసుకుపోయాడు. కొ సెంగ్‌వాన్ (కొరియా, 20.95సె), రాహుల్ కుమార్ (21.17సె) రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల జావెలిన్‌లో రోహిత్ యాదవ్ నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. రోహిత్ 80.35 త్రోతో నాలుగో స్థానంలో నిలవగా.. సచిన్ యాదవ్ (79.80మీ) ఐదవ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ విభాగంలో శివమ్ (80.73మీ) రజతం సాధించాడు. శ్రీలంక అథ్లెట్లు రమేశ్ పతిరగ (శ్రీలంక, 86.50 మీ) స్వర్ణం, సుమేధ రణసింఘే (80.65మీ) కాంస్యం గెలుచుకున్నారు. భారత పురుషుల 4×400 మీటర్ల రిలే బృందం రజతానికి పరిమితమైంది. ఫైనల్లో సంతోష్‌కుమార్, విశాల్, అమోజ్ జాకబ్, ధరంవీర్ చౌదరిలతో కూడిన జట్టు 3 నిమిషాల 8.37 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. పురుషుల 100 మీటర్ల పరుగులో మహ్మద్ అజీమ్ (10.35 సె) పసిడి గెలిచాడు. పూజ (1500 మీటర్లు), అబ్దుల్ అబుబాకర్ (ట్రిపుల్‌జంప్) విజేతలుగా నిలిచారు.

నిషా, ముస్కాన్‌కు స్వర్ణాలు

రాహుల్‌కూ పసిడి పతకం

- భారత్‌కు మరో అయిదు రజతాలు
- ఆసియా అండర్-19 బాక్సింగ్


ముస్కాన్

బ్యాంకాక్

ఆసియా అండర్-19 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. మహిళల విభాగంలో నిషా, ముస్కాన్.. పురుషుల విభాగంలో రాహుల్ కుండు పసిడి పతకాలు సాధించారు. భారత్ ఏడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలను కూడా గెలుచుకుంది. మహిళల విభాగంలో భారత్ నుంచి మొత్తం పది మంది అమ్మాయిలు పోటీపడగా, తొమ్మిది మంది పతకాలు గెలవడం విశేషం. 54 కిలోల విభాగంలో నిషా, 57 కిలోల విభాగంలో ముస్కాన్ పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్లో నిషా 4-1తో సియుచ్ (చైనా)పై నెగ్గగా.. ముస్కాన్ 3-2తో అయజాన్ ఎర్మెక్ (కజకిస్థాన్)ను ఓడించింది. ఆర్తి కుమారి (75కేజీ), కృతిక వాసన్ (80కేజీ), ప్రాచి తోకస్ (80+కేజీ), విని (60కేజీ), నిషా (65కేజీ) ఫైనల్లో ఓడిపోయి రజతాలతో సరిపెట్టుకున్నారు. యశ్రిక (51కేజీ), ఆకాంక్ష (70కేజీ) కాంస్యాలు చేజిక్కించుకున్నారు. పురుషుల 75కేజీ విభాగం ఫైనల్లో రాహుల్ 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన యాకుబ్‌బోవెక్‌పై విజయం సాధించాడు. మౌసమ్ సుహాగ్ (65కేజీ), హేమంత్ సంగ్వాన్ రజతాలు, శివమ్ (55కేజీ), గౌరవ్ (85కేజీ) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు అండర్-22లో భారత్‌కు ఇప్పటికే 13 పతకాలు ఖాయమయ్యాయి. అయిదుగురు బాక్సర్లు స్వర్ణం కోసం పోటీపడనున్నారు. అండర్-19, అండర్-22లో కలిసి భారత్ 40 మంది బాక్సర్లను బరిలోకి దించింది.


నిషా


రాహుల్

వాళ్లిద్దరి భవిష్యత్‌పై తొందరలేదు


కోహ్లి, రోహిత్

దిల్లీ: స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టీ20, టెస్టు ఫార్మాట్లకు ఇప్పటికే వీడ్కోలు పలికారు. ఇక మిగిలింది వన్డేలే! 2027 వన్డే ప్రపంచకప్ ఆడాలను కుంటున్నామని వాళ్లు ఇప్పటికే వెల్లడించారు. కానీ వారిపై భవిష్యత్తుపై జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే బీసీసీఐ వాళ్లపై నిర్ణయం తీసుకోవాలనే తొందరలో లేదు. "రోహిత్, కోహ్లిల మనసులో ఏమన్నా ఉంటే.. బీసీసీఐకి ఇంగ్లాండ్ పర్యటనకు ముందు చెప్పినట్లే చెబుతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే టీ20 ప్రపంచకప్ భారత్‌కు కీలకం. ఆ దిశగా జట్టును సిద్ధం చేయాల్సి ఉంది. ఇప్పుడు మాత్రం దృష్టంతా ఆసియాకప్ టీ20 టోర్నీకి మెరుగైన టీమ్‌ను పంపడంపైనే" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. వాళ్ల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశం బోర్డుకు లేదని తెలుస్తోంది. రోహిత్, కోహ్లి చివరగా ఆడిన టోర్నమెంట్ ఛాంపియన్స్ ట్రోఫీ. పాకిస్థాన్‌పై విజయవంతమైన ఛేదనలో కోహ్లి సెంచరీ చేయగా.. ఫైనల్లో రోహిత్ అర్ధశతకం సాధించాడు. రెండు నెలల నుంచి విరాట్, రోహిత్ మైదానానికి దూరంగా ఉన్నారు. ఇద్దరూ లండన్‌లో విరామాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19న ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే వన్డే సిరీస్‌లో ఈ స్టార్లు బరిలో దిగే అవకాశాలున్నాయి. తాజాగా కోహ్లి సాధన కూడా మొదలుపెట్టాడు.



కిర్మాణి ఆత్మకథ 'స్టంప్డ్' ఆవిష్కరణ

ఈనాడు - హైదరాబాద్

భారత జట్టు మాజీ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణి ఆత్మకథ 'స్టంప్డ్'ను ఆదివారం హైదరాబాద్‌లో క్రికెట్ ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. 1983 ప్రపంచకప్ ఫైనల్ హీరో మొహిందర్ అమర్‌నాథ్, కిర్మాణి, అజహర్, సిరాజ్, శివలాల్ యాదవ్, భారత ఫుట్‌బాల్ మాజీ ఆటగాడు షబ్బీర్ అలీ, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దిగ్గజ ఆటగాళ్లు సునీల్ గావస్కర్, కపిల్ దేవ్, కృష్ణమాచారి శ్రీకాంత్, వీవీఎస్ లక్ష్మణ్ వర్చువల్‌గా తమ సందేశాలిచ్చారు. "పాఠశాల స్థాయి నుంచి ప్రపంచ క్రికెట్ వరకు కిర్మాణితో కలిసి ఆడా. ఎన్నో విదేశీ పర్యటనలకు వెళ్లాం. కిర్మాణి లాంటి మంచి మనిషిని నేను చూడలేదు. అతని వికెట్ కీపింగ్ నైపుణ్యం అద్భుతం. ఎలాంటి అయోమయం, గందరగోళం ఉండదు. కిర్మాణి, అజహర్, శివలాల్ అందరం కలిసి ఆడాం. ఇంగ్లాండ్‌లో అద్భుతంగా ఆడిన సిరాజ్‌కు, భారత జట్టుకు అభినందనలు. ఆటగాళ్లంతా గొప్పగా ఆడారు. భారత జట్టు పట్ల గర్వంగా ఉంది. నా దృష్టిలో భారత్ 4-0తో గెలవాల్సింది. 2-2తో డ్రాగా ముగించడం కూడా మంచి ప్రదర్శనే" అని అమర్‌నాథ్ తెలిపాడు. ప్రపంచ క్రికెట్లో అత్యుత్తమ వికెట్ కీపర్లలో కిర్మాణి ఒకడని కపిల్ ప్రశంసించాడు. అతను తన హీరో అని చెప్పాడు. 70లు, 80లలో కళాత్మక వికెట్ కీపింగ్‌కు కిర్మాణి చిరునామా అని గావస్కర్ అన్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అతను ఎన్నో మధురానుభూతుల్ని అందించాడని తెలిపాడు. కిర్మాణితో కలిసి ఆడడం తన అదృష్టమని అజహర్ అన్నాడు. "ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్ల బౌలింగ్‌లో సమర్థంగా వికెట్ కీపింగ్ చేసిన వ్యక్తి కిర్మాణి. అతని కంటే గొప్ప వికెట్ కీపర్ లేడనడంలో సందేహం లేదు. అతనితో కలిసి ఆడటం నా అదృష్టం. కళాత్మక వికెట్ కీపింగ్ నైపుణ్యం అతని సొంతం. ఈ కార్యక్రమంలో సిరాజ్‌తో ఫొటో తీసుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. ఇంగ్లాండ్‌లో అతను అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. మీ హైదరాబాదీ అదరగొడుతున్నాడని చాలా మంది అన్నారు. సిరాజ్.. కపిల్ లాంటోడు. బాడీ బిల్డింగ్ చేసి కండలు పెంచడం కాదు.. ఒంట్లో దమ్ముండాలని నిరూపించాడు. కపిల్ కూడా అంతే. ఒక్కో స్పెల్‌లో 20-22 ఓవర్లు వేసేవాడు. సిరాజ్‌ది కూడా అలాంటి ఫిట్‌నెసే" అని అజహర్ వివరించాడు. "భారత జట్టు 1983 ప్రపంచకప్ గెలిచినప్పుడు నేను పుట్టలేదు. కాని కిర్మాణి వికెట్ కీపింగ్ నైపుణ్యం గురించి చాలామంది చెప్పారు. కిర్మాణి ఎంతోమందిలో స్ఫూర్తి నింపాడు. అందులో నేనూ ఒకడిని. వికెట్ల వెనుక కిర్మాణి నైపుణ్యానికి తిరుగులేదు. అతని నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతా. భారత క్రికెట్‌కు కిర్మాణి అందించిన సేవలకు కృతజ్ఞతలు" అని సిరాజ్ పేర్కొన్నాడు.

అజయ్‌కి ఐఎం హోదా


అజయ్ సంతోష్

రెంటచింతల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన అజయ్ సంతోష్ చదరంగంలో ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదా సాధించాడు. సెర్బియాలో జరిగిన అంతర్జాతీయ టోర్నీలో 9 రౌండ్లలో 5 పాయింట్లు సాధించిన అజయ్ టైటిల్ గెలుచుకున్నాడు. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాకు అవసరమైన మూడో నార్మ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం అతడికి 2460 లైవ్ రేటింగ్ ఉంది. 2024లో చెకొస్లోవేకియాలో జరిగిన టోర్నీలో తొలి ఎంఐ నార్మ్ అందుకున్న అజయ్.. ఈ ఏడాది ఫ్రాన్స్‌లో నిర్వహించిన డోలే ఓపెన్ టోర్నీలో నెగ్గి రెండో నార్మ్‌ను దక్కించుకున్నాడు.

కోహ్లి, ఏబీ అని తెలియకుండానే..

గరియాబంద్ (ఛత్తీస్‌గఢ్)


మనీశ్

విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్ లాంటి దిగ్గజాలతో మాట్లాడాలని ఏ అభిమానైనా కోరుకుంటాడు. మరి వాళ్లే నేరుగా ఫోన్ చేస్తే! ఇక ఆ అభిమానుల ఆనందానికి అవధులు ఉండవు. కానీ ఛత్తీస్‌గడ్‌లోని ఇద్దరు కుర్రాళ్లు తమకు తెలియకుండానే ఈ స్టార్లతో మాట్లాడారు. ఆ తర్వాత తెలిసి చాలా సంతోషపడ్డారు. టెలికాం నిబంధనల వల్లే వారికి ఈ అవకాశం లభించింది. ఛత్తీస్‌గడ్‌లోని గరియాబంద్‌కు చెందిన మనీశ్ ఇటీవలే ఒక జియో సిమ్ కొన్నాడు. తర్వాత తన ఫోన్‌లో వేసి వాట్సప్ యాక్టివేట్ చేసుకున్నాడు. డీపీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటీదార్‌ది వచ్చింది. సాంకేతిక తప్పిదంతో ఇలా జరిగింది అనుకుని సిమ్‌ను ఉపయోగించడం మొదలుపెట్టాడు. తర్వాత అతడికి కోహ్లి, డివిలియర్స్, యశ్ దయాళ్ లాంటి క్రికెటర్ల నుంచి ఫోన్లు రావడం మొదలయ్యాయి. తెలిసినవాళ్లే తనను ఏడిపించడం కోసం ఇలా వారి పేర్లు చెప్పి మాట్లాడుతున్నారని మనీశ్ అనుకున్నాడు. తన స్నేహితుడు ఖేమ్‌రాజ్‌తో కూడా మాట్లాడించాడు. ఒకరోజు పాటీదారే నేరుగా కాల్ చేశాడు. అతడితోనూ మనీశ్ జోకులు వేస్తూ మాట్లాడాడు. పాటీదార్ కాస్త సీరియస్ అయ్యే సరికి మనీశ్ సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేశాడు. పాటీదార్ కొంతకాలం తన సిమ్‌ను ఉపయోగించకపోయేసరికి టెలికాం నిబంధనల ప్రకారం అది డీయాక్టివేట్ అయింది. ఆ సిమ్‌నే మనీశ్‌కు కేటాయించారు. దీంతో ఆ నంబర్ పాటిదార్‌దే అని భావించి కోహ్లి, ఏబీ కాల్స్ చేశారు. తన సిమ్‌ను తనకు ఇప్పించాలని పాటిదార్ కూడా పోలీసులను కోరాడు. మనీశ్ అంగీకారంతో ఆ సిమ్‌ను తిరిగి పాటీదార్‌కు అందజేశారు. తాము మాట్లాడింది కోహ్లి, డివిలియర్స్ లాంటి స్టార్లతో అని ఆలస్యంగా తెలుసుకున్న మనీశ్, ఖేమ్‌రాజ్ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. "కోహ్లితో మాట్లాడతానని కలలో కూడా అనుకోలేదు. డివిలియర్స్ కాల్ చేసి ఇంగ్లిష్‌లో ఏదో మాట్లాడాడు. ఒక్క ముక్క అర్థం కాలేదు. ఏదైతేనేం భలే మజా వచ్చింది" అని మనీశ్ తెలిపాడు. "రజత్ పాటీదార్ కాల్ లిస్టులో ఉన్న క్రికెటర్లు మనీశ్‌కు ఫోన్లు చేశారు. దీంతో ఏం అర్థం కాక మధ్యప్రదేశ్ సైబర్ పోలీసులకు మనీశ్ సమాచారం ఇచ్చాడు. దర్యాప్తు చేశాక ఆ సిమ్ పాటీదార్ వాడిందని తెలుసుకున్నాం. ఆ సిమ్‌ను తిరిగి అతడికి అప్పగించాం" అని గరియాబంద్ డిప్యూటీ ఎస్పీ నేహా సిన్హా తెలిపారు.

తొలి టీ20లో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా విజయం


డేవిడ్

డార్విన్ (ఆస్ట్రేలియా): టిమ్ డేవిడ్ (83) చెలరేగడంతో ఆదివారం దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో ఆస్ట్రేలియా 17 పరుగుల తేడాతో గెలిచింది. మొదట ఆసీస్ 20 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్‌తో పాటు గ్రీన్ (35) రాణించాడు. ఛేదనలో దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 161 పరుగులే చేయగలిగింది. హేజిల్‌వుడ్ (3/27), డ్వార్షుయిస్ (3/26) ఆ జట్టును దెబ్బతీశారు. రికిల్‌టన్ (71) టాప్ స్కోరర్. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సంపాదించింది.

రోహిత్, కోహ్లి అప్పటిదాకా..


గంగూలీ

కోల్‌కతా: వన్డే క్రికెట్లో అద్భుతమైన రికార్డులున్న రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లి సత్తా చాటుతున్నంత ఆ కాలం ఫార్మాట్లో కొనసాగొచ్చని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోహ్లి, రోహిత్‌లకు చివరిది కావొచ్చన్న కథనాల గురించి తనకు తెలియదని గంగూలీ తెలిపాడు. "ఆ విషయం నాకు తెలియదు. దానిపై వ్యాఖ్యానించలేను. ఎవరు బాగా రాణిస్తారో వాళ్లే ఆడతారు. వాళ్లిద్దరు బాగా ఆడితే జట్టులో కొనసాగాలి. కోహ్లి, రోహిత్‌ల వన్డే రికార్డులు అసాధారణం. పరిమిత ఓవర్ల క్రికెట్లో వారిద్దరు అద్భుతమైన క్రికెటర్లు" అని గంగూలీ తెలిపాడు. అక్టోబరులో ఆసీస్ పర్యటన కోహ్లి, రోహిత్‌లకు చివరి వన్డే సిరీస్ కావొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అక్టోబరు 19న ప్రారంభమయ్యే ఆసీస్ పర్యటనలో పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో మూడు వన్డేలు జరుగనున్నాయి. డిసెంబరులో సొంతగడ్డపై మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. 2026లో న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్, వెస్టిండీస్‌లతో భారత్ వన్డే సిరీస్‌లు ఆడనుంది. ఇప్పటికే కోహ్లి, రోహిత్ టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. 2027 ప్రపంచకప్ విషయంలో వారిద్దరు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక సెప్టెంబరు 9న దుబాయ్‌లో ప్రారంభమయ్యే ఆసియా కప్‌లో భారత్ ఫేవరెట్ అని గంగూలీ తెలిపాడు. "ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్ తర్వాత భారత జట్టు విశ్రాంతి తీసుకుంటోంది. భారత ఆటగాళ్లు ఐపీఎల్ తర్వాత అయిదు టెస్టులు ఆడారు. వచ్చేనెలలో ఆసియా కప్‌లో బరిలో దిగనున్నారు. టెస్టుల్లో భారత్ బలంగా ఉందంటే.. తెలుపు బంతి ఫార్మాట్లో మరింత దుర్భేద్యంగా ఉంటుంది. నా దృష్టిలో భారత్ ఫేవరెట్. దుబాయ్ పిచ్‌లపై భారత్‌ను ఓడించడం అంత సులువు కాదు. టెస్టుల్లో భారత్‌కు శుభ్‌మన్ గిల్ అద్భుతంగా సారథ్యం వహించాడు. అతని భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. సభ్యులు కోరుకుంటే బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తా" అని గంగూలీ పేర్కొన్నాడు.

మూడో టీ20లోనూ భారత్-ఎ ఓటమి

సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా-ఎ

మెక్‌కే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా-ఎతో మూడు మ్యాచ్‌ల అనధికార మహిళల టీ20 సిరీస్‌ను భారత్-ఎ 0-3తో కోల్పోయింది. బంతితో రాణించినా బ్యాటుతో విఫలమైన భారత్. ఆదివారం ఆసక్తికరంగా సాగిన ఆఖరి టీ20లో 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ప్రేమ రావత్ (3/24), రాధ యాదవ్ (3/31) చక్కగా బౌలింగ్‌తో చేయడంతో భారత్ మొదట ఆస్ట్రేలియాను 144/8కే పరిమితం చేసింది. మేడ్‌లైన్ (39) టాప్ స్కోరర్. ఛేదనలో భారత్ తడబడింది. 8 వికెట్లకు 140 పరుగులే చేయగలిగింది. షెఫాలి వర్మ (41), మిన్ను మణి (30) రాణించారు. సియనా జింజర్ (4/16) భారత్‌ను దెబ్బతీసింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల అనధికార వన్డే సిరీస్ బుధవారం మొదలవుతుంది. సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా-ఎ: 144/8 (మేడ్‌లైన్ 39, అలీసా హీలీ 27; రాధ యాదవ్ 3/31, ప్రేమ రావత్ 3/24), భారత్-ఎ: 140/8 (షెఫాలి వర్మ 41, మిన్ను మణి 30, రాఘవీ బిష్ట్ 25)

నటుడు కమల్‌హాసన్‌కు బెదిరింపులు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: సనాతన ధర్మం గురించి వ్యాఖ్యానించిన ఎంఎన్‌ఎం అధ్యక్షుడు, ఎంపీ, సినీనటుడు కమల్‌హాసన్‌కు హత్యా బెదిరింపులు వచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇటీవల నటుడు సూర్య స్థాపించిన 'అగరం' ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కమల్‌హాసన్ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ బుల్లితెర నటుడు రవిచంద్రన్.. కమల్‌హాసన్ గొంతు కోస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు ఎంఎన్‌ఎం ఉపాధ్యక్షుడు, విశ్రాంత ఐజీ మౌర్య, పార్టీ ప్రముఖులు ఆదివారం చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఇయర్‌ఫోన్స్‌తో పట్టాలపై నడక..

రైలు ఢీకొని యువకుడి మృతి

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని రోడ్డుమీదే వెళ్లొద్దని చెబుతారు. కానీ ఆ యువకుడు ఏకంగా రైలు పట్టాల మీద నడుస్తూ ఇయర్‌ఫోన్స్‌లో సంగీతం వింటూ వెళ్లాడు. ఆ శబ్దం హోరుకు.. రైలు కూతలు కూడా వినిపించలేదు. దాంతో రైలు ఢీకొని అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ దుర్ఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని ఇసుకగుంట సమీపంలో చోటుచేసుకుంది. ఝార్ఖండ్‌లోని లాతెహార్‌కు చెందిన సచిన్ సింగ్(21) స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం స్నేహితుడితో కలిసి బహిర్భూమికి రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. స్నేహితుడు కొద్ది దూరంలో ఉండగా.. సచిన్ సింగ్ ఇయర్‌ఫోన్స్‌లో సంగీతం వింటూ పట్టాలపై నడుస్తూ ముందుకు వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి రైలు వస్తుండగా.. ఆ శబ్దం అతడికి వినిపించలేదు. దాంతో రైలు అతడిని ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్నేహితుడు స్థానికుల సహకారంతో అతడిని శ్రీకాళహస్తి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే సచిన్ సింగ్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

మండపాల అనుమతులు సరళతరం చేయండి

- ఏపీ గణేశ్ ఉత్సవ సమితి విజ్ఞప్తి



గణేశ్ ఉత్సవ సమితి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శశిభూషణ్, గోకరాజు గంగరాజు, చలసాని ఆంజనేయులు, త్రినాథరావు

ఈనాడు, అమరావతి: వినాయక మండపాల అనుమతులను సరళతరం చేయాలని ఏపీ గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పి.త్రినాథరావు కోరారు. ఆదివారం విజయవాడలో ఉత్సవ సమితి సర్వసభ్య సమావేశంలో 41 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు ప్రభుత్వ విభాగాలు సింగిల్‌విండో విధానంలో అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చలసాని ఆంజనేయులు, త్రినాథరావు మాట్లాడుతూ.. వేడుకల ఆరంభం నుంచి నిమజ్జనం వరకూ పోలీసు, విద్యుత్తు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగాలు సహకరించాలని కోరారు. గణేశ్ విగ్రహాల ఎత్తుపై ఆంక్షలు, అనుమతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుడు ఒకరు పాల్గొన్నారు.

అర్హత లేకున్నా.. ఈఎన్‌సీగా అందలం!

- వైకాపా ప్రభుత్వంలో అడ్డదారిలో పోస్టింగ్
- గుత్తేదారులు ఆయన అడిగినంతా ఇవ్వాల్సిందే.. లేకపోతే వేధింపులు
- ఏసీబీకి చిక్కిన సబ్బవరపు శ్రీనివాస్ లీలలు



సబ్బవరపు శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఈఎన్‌సీ కీలక పోస్టు. అర్హత లేకున్నా.. ఆ పోస్టును వైకాపా ప్రభుత్వ హయాంలో సబ్బవరపు శ్రీనివాస్‌కు కట్టబెట్టారు. ఈయన ఈఈగా ఉండగా.. ఎస్ఈ, సీఈ, ఈఎన్‌సీ పోస్టులన్నింటికీ ఒకేసారి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించి అందలమెక్కించారు. అప్పటికే ఆయనపై రెండు ఏసీబీ కేసుల విచారణలు సాగుతుండగా ఈఎన్‌సీ బాధ్యతలు ఎలా అప్పగిస్తారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అభ్యంతరం తెలిపింది. ఆయన్ను వెంటనే ఆ పోస్టు నుంచి తొలగించాలని కోరినా.. వైకాపా ప్రభుత్వం లెక్కచేయలేదు. తర్వాత ఆయన ఈఎన్‌సీ కార్యాలయాన్ని తన గుప్పిట పెట్టుకున్నారు. పనులపై గుత్తాధిపత్యం చెలాయించేందుకు ఎస్ఈ పోస్టుల్ని ఎవరికీ కట్టబెట్టకుండా కూటమి ప్రభుత్వం వచ్చేవరకు తన చేతిలోనే అట్టిపెట్టుకున్నారు. ఓ గుత్తేదారునితో కలిసి అనధికారికంగా కాంట్రాక్టులు నడిపారు. మెజారిటీ పనులు ఆ గుత్తేదారునికే దక్కేలా చేసేవారు. దీనికి గుడ్‌విల్ కింద కొంత మొత్తాన్ని తీసుకునే వారని సమాచారం. తాజాగా ఓ గుత్తేదారు నుంచి రూ.5 కోట్ల లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో సబ్బవరపు శ్రీనివాస్ అవినీతి నిరోధక విభాగానికి (ఏసీబీ) గురువారం అడ్డంగా దొరికిపోయిన విషయం తెలిసిందే.

అడిగినంత ఇవ్వకపోతే వేధింపులే..

గుత్తేదారులైనా.. కిందిస్థాయి అధికారులైనా శ్రీనివాస్ అడిగినంత ఇవ్వాల్సిందే. లేకపోతే తన చేతిలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని వారిపై ప్రయోగించేవారు. కొంతమందితో పిటిషన్లు వేయించి విజిలెన్స్ విచారణకు ఆదేశించేవారు. ఇందుకోసం తనకు నచ్చిన వారిని వినియోగించుకున్నారని సమాచారం. ఇలా కిందిస్థాయి అధికారులందరూ తన చెప్పుచేతల్లో నడిచేలా చేశారన్న చర్చ నడుస్తోంది. తన భాగస్వామిగా ఉన్న గుత్తేదారు సక్రమంగా పనులు చేయలేదని ఇద్దరు అధికారులు జరిమానా విధించగా, వారిలో ఒకరిని బదిలీ చేయించి.. మరొకరికి పదోన్నతి దక్కకుండా తొక్కిపెట్టారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

కూటమి ప్రభుత్వంలోనూ శ్రీనివాస్ అరాచకం యథేచ్ఛగా సాగింది. వైకాపా హయాంలో ఆయనకు అడ్డదారిలో ఈఎన్‌సీ పోస్ట్ దక్కేలా చేయడంలో ఉత్తరాంధ్రకు చెందిన వైకాపా కీలక నేత ప్రమేయముంది. ఈ నేతతో సఖ్యత కుదిర్చేందుకు శ్రీనివాస్ భాగస్వామి అయిన గుత్తేదారే మంత్రాంగం నడిపారు. పోస్ట్ దక్కడంతో వీరిద్దరూ ఆ వైకాపా నేతకు ఇంటి నిర్మాణంలో అన్ని రకాలుగా సహకరించినట్లు సమాచారం. తర్వాత మరో వైకాపా నేతకు విశాఖలో ఫ్లాట్ కట్టబెట్టారనే ప్రచారముంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఈఎన్‌సీ అరాచకానికి అడ్డుకట్ట పడుతుందని అధికారులు ఆశించినా అలా జరగలేదు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి, కీలక నేత మద్దతుగా నిలవడంతో ఈఎన్‌సీకి ఎదురే లేకుండా పోయింది. ఆయన వర్కింగ్ పార్ట్‌నర్ అయిన గుత్తేదారుని పనుల కొనసాగింపునకు సైతం వారు సిఫార్సులు చేశారు. ఆ స్థాయిలో ఈఎన్‌సీ హవా కొనసాగింది.

రూ.250 కోట్ల వినియోగానికి గ్రహణం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎమ్మెల్యేలు, స్థానికసంస్థల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో గ్రామ పంచాయతీ, జిల్లా, మండలపరిషత్ ఖాతాల్లో రూ.250 కోట్లకుపైగా 15వ ఆర్థిక సంఘం నిధులు మూలుగుతున్నాయి. వీటిలో అత్యధిక శాతం పంచాయతీల ఖాతాల్లోనే ఉన్నాయి. పనుల ఎంపికలో ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరని కారణంగా పలుచోట్ల అభివృద్ధి పనులకు ముందడుగు పడటం లేదు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రెండోవిడత నిధులు రూ.1,120 కోట్లు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. మిగులు నిధులతో కలిపి మొత్తం రూ.1,370 కోట్లు ఖర్చు చేయాలి. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకు 2020-21లో మొదలైన 15వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రంలో గ్రామీణ స్థానిక సంస్థలకు ఇప్పటివరకు రూ.3,172.17 కోట్లు కేంద్రం విడుదల చేసింది. వీటిలో నుంచి రూ.2,922.17 కోట్లు పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్తుల్లో ఖర్చు చేశారు.

పంచాయతీల్లోనే అసలు సమస్య

గ్రామీణ స్థానిక సంస్థలకు ఏటా విడుదల చేస్తున్న రూ.2వేల కోట్లకుపైగా ఆర్థిక సంఘం నిధుల్లో 70% పంచాయతీలకు, మిగిలిన 30% జిల్లా, మండల పరిషత్తులకు కేటాయిస్తున్నారు. 2020-21లో మొదలైన 15వ ఆర్థికసంఘం 2025-26తో ముగియనుంది. పంచాయతీలకు కేటాయిస్తున్న నిధులతో గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంతో పాటు రోడ్లు, కాలువల్లాంటి అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తుంటారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, శ్రీకాకుళం, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో కొందరు ఎమ్మెల్యేలు, సర్పంచుల మధ్య సమన్వయం కొరవడటం అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. దీంతో 5 వేల నుంచి 6 వేల పంచాయతీల ఖాతాల్లో నిధులు మూలుగుతున్నాయి. కొన్ని పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్నా, ఫలితం లేకుండా పోయింది.



కాలేయం బలహీనంగా ఉంటే..

- భోజనం తర్వాత తీపి పదార్థాలు తినాలని ఎక్కువగా అనిపించడం
- పొట్ట బాగా పెరగడం
- విశ్రాంతి బాగానే తీసుకుంటున్నా ఎప్పుడూ అలసటగా ఉండటం
- తరచూ అజీర్తి చేయడం
- దురద, మొటిమల వంటి చర్మ సమస్యలు తలెత్తడం

..ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తమవండి. కాలేయం బలహీనంగా ఉందని చెప్పే సంకేతాలివి.

– సుమిత్ శర్మ, వైద్యుడు

వేద విద్యకు ఊతం

- విద్యార్థిగా వస్తే పండితుడిగా వెళ్లొచ్చు
- గుంటూరు అంకిరెడ్డిపాలెంలో వేద పాఠశాల సిద్ధం



వేద పురుషుల విగ్రహాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: క్రేన్ రెలిజియస్ ట్రస్టు వ్యవస్థాపకులు గ్రంధి సుబ్బారావు, లక్ష్మీనరసమ్మ దంపతుల స్ఫూర్తితో ప్రస్తుత ఛైర్మన్ గ్రంధి కాంతారావు.. వేదవిద్యకు ఊతంగా నిలిచేందుకు వేద పాఠశాలను నిర్మించారు. ఇక్కడ విద్యార్థిగా చేరితే ఉచితంగా విద్య, వైద్యవసతి, భోజన తదితర సౌకర్యాలను పొంది పండితుడిగా ఎదిగి బయటకు వెళ్లి ఉపాధి పొందేలా ప్రణాళిక సిద్ధం చేశారు. విజయవాడ-చెన్నై హైవే పక్కన గుంటూరు అంకిరెడ్డిపాలెంలో క్రేన్ రెలిజియస్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర వేద ఆగమ స్మార్త పాఠశాల సిద్ధమైంది. ఈ నెల 12న చినజీయర్ స్వామి ఈ పాఠశాలను ప్రారంభిస్తారు. చతుర్వేద పురుషులు తమ పత్నుల సమేతంగా ఇక్కడ విగ్రహాలుగా దర్శనమిస్తుండడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



మండువా లోగిళ్ల పాఠశాల

ఏటా 50 మందికి ప్రవేశం

"ఈ పాఠశాల నిర్మాణం.. మా నాన్న గ్రంధి సుబ్బారావు, లక్ష్మీనరసమ్మల ఆశయం. ఇక్కడ కృష్ణ యజుర్వేదం, ఆపస్తంభ స్మార్తం, శైవాగమం, వైఖానసాగమం నేర్పిస్తాం. ప్రస్తుతం ఏటా 50 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాం. ఆరేళ్ల బోధనలో వీటితో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ఏఐ తరగతుల బోధన కూడా ఉంటుంది. ప్రశాంత వాతావరణం, త్రికాల సంధ్యావందనం, నిష్ణాతులైన పండితులతో విద్యాబోధన, ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటాయి. నిత్య, ధూప, దీప నైవేద్యాలు, అర్చనలు, అభిషేకాలతో ప్రత్యక్ష శిక్షణ ఉంటుంది. యాగాలు, హోమాల్లో ప్రత్యక్ష శిక్షణ.. చండీ, పంచాంగ పరిజ్ఞానంలో శిక్షణ ఉంటాయి. చక్కని భోజనం, వసతి, క్రీడల్లో శిక్షణ ఉంటుంది. ప్రతి ఏటా పండితులతో సదస్సులు నిర్వహిస్తాం. ఈ పాఠశాల పూర్తి సంప్రదాయ వాతావరణంలో ఉండాలని చెట్టినాడ్ శైలి మండువా లోగిళ్లలో నిర్మించాం. 40,000 వేద, పురాణ గ్రంథాలతో సంస్కృత పరిజ్ఞాన మహా గ్రంథాలయం ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులకు మేం చెప్పేది ఒక్కటే.. మీ పిల్లవాడిని విద్యార్థిగా చేర్పండి.. పండితునిగా తీసుకెళ్లండి. సమాజానికి మేలు చేయాలని, మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నదే మా ఆశయం''.

– క్రేన్ రెలిజియస్ ట్రస్టు ఛైర్మన్ గ్రంధి కాంతారావు

13న మండలి వెంకటకృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం



బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివంగత మాజీ మంత్రి, గాంధేయవాది మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలను పురస్కరించుకుని 'మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం-2025'ను ఈ నెల 13న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళామందిరంలో ఏర్పాటుచేసినట్లు కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరవుతారన్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు పాల్గొంటారన్నారు. అమెరికా ఆజో-విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సోలాపూర్ తెలుగు భాష అభివృద్ధి మండలి అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌లకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు బుద్ధప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణారావు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

52 దుంగలు స్వాధీనం చేసుకున్న మైదుకూరు పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు పోలీసులు శనివారం ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టుచేశారు. రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనంతో పాటు 1,087 కేజీల బరువున్న 52 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా చాపాడు మండలం ప్రొద్దుటూరు-అన్నవరం రోడ్డులోని చిన్న వరదాయపల్లె వద్ద పోలీసులు రెండు కార్లను ఆపి తనిఖీ చేశారు. అందులో ఎర్రచందనం దుంగలను గుర్తించి వాటితోపాటు మొత్తం 52 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో చాపాడు మండలానికి చెందిన ఇరగంరెడ్డి నాగదస్తగిరిరెడ్డి, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ముదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, ఉమ్మనబోయిన క్రిష్ణయ్య, పెండ్లిమర్రి మండలానికి చెందిన కాయలి శ్రీనివాసులు, శనివారపు బాలగంగిరెడ్డి, చక్రాయపేట మండలానికి చెందిన ఓబుల్‌రెడ్డి ఉన్నారు. నాగదస్తగిరిరెడ్డిపై ఇప్పటికే 86 ఎర్రచందనం అక్రమ రవాణా, 34 దొంగతనం కేసులు ఉన్నాయి. మూడుసార్లు పీడీ యాక్టుపై అరెస్టై బయటకు వచ్చాడు. ఉమ్మనబోయిన క్రిష్ణయ్యపై రెండు ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు, మూడు దొంగతనం కేసులు ఉన్నాయి.

ప్రాజెక్టుల పేరుతో బలవంతపు భూసేకరణ తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు. వేదికపై న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, వివిధ సంఘాల నాయకులు

విజయవాడ (కృష్ణలంక, రాఘవయ్యపార్క్ కూడలి), న్యూస్‌టుడే: ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో గత పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు 18 జిల్లాల్లో 1,91,472 ఎకరాల సారవంతమైన భూములను రైతుల నుంచి బలవంతంగా తీసుకున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టు న్యాయవాదులు-నిర్వాసితులతో ఆదివారం బహిరంగ చర్చా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండానే బలవంతంగా భూములు తీసుకున్నారని విమర్శించారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రాజెక్టులకు ఎక్కడా 2013 చట్టం ప్రకారం భూసేకరణ జరగలేదన్నారు. ఇటీవల కరేడులో చట్టాలన్నింటినీ తుంగలో తొక్కి భూములు తీసుకున్నారని దుయ్యబట్టారు.

EENADU Vol: 52, Issue: 2 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

వేతనాల కోసం సినీ కార్మికులు సమ్మెకి దిగడం... ఫిల్మ్ ఛాంబర్ సైతం నిర్మాతలు ఎవ్వరూ అనుమతి లేకుండా చిత్రీకరణలు చేయకూడదని సూచించడంతో తెలుగు చిత్రసీమ పూర్తిగా స్తంభించిపోయింది. దాదాపుగా స్టూడియోలు వెలవెలబోతున్నాయి. ఔట్ డోర్‌లో చిత్రీకరణల ఊసే లేదు. అటు కార్మికులు తమ డిమాండ్ల విషయంలోనూ.. ఇటు నిర్మాతలూ తాము విధించిన షరతుల పరంగానూ పట్టు వీడటం లేదు. సోమవారం కార్మిక శాఖ అధికారుల ఆధ్వర్యంలో చర్చలు జరగనున్నాయి. ఈ వివాదం సద్దుమణగకపోతే మరికొన్నాళ్ల పాటు చిత్రీకరణలకు అంతరాయం తప్పదనే సంకేతాలు వస్తున్నాయి. విడుదలకు సిద్ధమవుతున్న పలు సినిమాలపై ఈ సమ్మె తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

స్తంభించిన చిత్రసీమ

- ఆగిపోయిన చిత్రీకరణలు
- విడుదల తేదీలపై ప్రభావం తప్పదా!


చిరంజీవి


మహేశ్‌బాబు


ప్రభాస్


రామ్‌చరణ్

ఎప్పుడూ లేని రీతిలో పదికిపైగా అగ్ర తారల సినిమాలు చకచకా చిత్రీకరణ చేసుకొంటున్న సమయం. చాలా సినిమాలు కొత్తగా విడుదల తేదీల్ని ఖరారు చేసుకుని.. లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నాయి. మరోవైపు కొత్త సినిమాల్ని ప్రారంభించేందుకు పలు నిర్మాణ సంస్థలు రంగం సిద్ధం చేసుకొంటున్నాయి. ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న సినిమాలూ ఒకొక్కటిగా ప్రేక్షకుల ముందుకొస్తుండడంతో... చాలా రోజులుగా స్తబ్దుగానే కనిపించిన తెలుగు చిత్రసీమలో మళ్లీ సందడి వాతావరణం నెలకొంది. ఇలాంటి తరుణంలోనే 30 శాతం వేతనాల డిమాండ్‌తో సినీ కార్మికుల ఆందోళన బాట పట్టడంతో ఒక్కసారిగా తెలుగు చిత్రసీమ కుదుపునకు లోనైంది. కార్మికులు, నిర్మాతల మధ్య చర్చలు మొదలయ్యాయి. శనివారంతో వివాదం పరిష్కారం అవుతుందని ఆశించినా చర్చలు ఫలప్రదం కాలేదు. సోమవారం ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకొంటుందో చూడాలి.

అన్నిటికీ అంతరాయమే

విడుదల తేదీని ఖరారు చేసుకుని చిత్రీకరణ చేసుకొంటున్న సినిమాలు చాలానే ఉన్నాయి. చిరంజీవి - అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న సినిమా మొదలుకొని... ప్రభాస్ 'ది రాజాసాబ్', రామ్‌చరణ్ 'పెద్ది', బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న 'అఖండ2', నాని 'ప్యారడైజ్', రవితేజ 'మాస్ జాతర'తోపాటు, కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న మరో సినిమా, తేజ సజ్జా 'మిరాయ్' వరకూ పలు సినిమాలు ఆ జాబితాలో ఉన్నాయి. చిత్రీకరణలు నిలిచిపోవడంతో ఈ సినిమాలన్నిటిపైనా ఆ ప్రభావం పడే అవకాశాలున్నాయి. వీటితోపాటు మహేశ్‌బాబు - రాజమౌళి, ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ సినిమాలూ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. వీటికీ అంతరాయం తప్పదు. కొత్త చిత్రాలు, పలు చిన్న సినిమాలు.. ఇలా దాదాపు 50 సినిమాలకు పైగానే ఏదో రకంగా సమ్మె ప్రభావం పడటం ఖాయంగా కనిపిస్తోంది.

ఎవరి వాదన వారిదే...

తమ వేతనాల పెంపుని నిర్మాతలు ప్రధానమైన అంశంగానే పరిగణించడం లేదని, శనివారం జరిగిన చర్చల్లో కొన్ని యూనియన్లకి మాత్రమే వేతనాలు పెంచుతామని చెప్పడం భావ్యం కాదంటున్నాయి కార్మిక సంఘాలు. చిత్ర పరిశ్రమలో పరిస్థితులు ఏమాత్రం బాగోలేవని, అయినా వేతనాల పెంపుపై ఓ నిర్ణయానికొచ్చామని, పని విషయంలో తాము విధించిన నాలుగు షరతులు పూర్తిగా న్యాయబద్ధమే అయినా వాటినీ కార్మిక సంఘాల నాయకులు అంగీకరించడం లేదని నిర్మాతలు అంటున్నారు.

కమల్ సన్నాహాలు!


కమల్‌హాసన్

'థగ్ లైఫ్' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు కమల్ హాసన్. ఆయన తదుపరి చిత్రాన్ని స్టంట్ మాస్టర్స్ అన్బు-అరీవు దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. దీన్ని కమల్ తన సొంత నిర్మాణ సంస్థలో నిర్మించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభించుకోవాల్సిన ఈ సినిమా అనుకోని కారణాల వల్ల ఆలస్యమైంది. ఇప్పుడీ చిత్రాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల మూడో వారంలో దీనికి సంబంధించిన ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం కమల్ అక్టోబరు నుంచి రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఇదొక హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబు కానున్నట్లు తెలిసింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

తమిళంలో మరొకటి?

తెలుగులో వరుస అవకాశాలతో జోరు చూపిస్తున్న శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ తొలి అడుగులు వేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆమె నటిస్తున్న తొలి తమిళ చిత్రం 'పరాశక్తి' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. శివ కార్తికేయన్ హీరోగా సుధా కొంగర తెరకెక్కిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈలోగానే శ్రీలీల పేరు మరో తమిళ అగ్ర హీరో సినిమా విషయంలో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత ఈ కాంబో నుంచి రానున్న రెండో సినిమా ఇది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం చిత్ర బృందం శ్రీలీలను సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు జరిగినట్లు తమిళ సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. మరి దీనిపై స్పష్టత రావాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు. ఇప్పటికే ఈ సినిమాలో ఓ నాయికగా శ్రీనిధి శెట్టి ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.


శ్రీలీల

ఎన్టీఆర్ ఆశీస్సులు నాపై ఉన్నంతకాలం

నన్నెవ్వరూ ఆపలేరు!

'వార్ 2' వేడుకలో ఎన్టీఆర్


నాగవంశీ, ఎన్టీఆర్, అయాన్ ముఖర్జీ, హృతిక్‌రోషన్, అక్షయ్ విధానీ, త్రివిక్రమ్, దిల్‌రాజు

"పాతికేళ్ల ప్రయాణంలో ఎంతో ప్రేమని, వాత్సల్యాన్నీ పొందాను. ఈ జన్మకు ఇది చాలు, ఇంకేమీ వద్దు. నందమూరి హరికృష్ణ ఓ తనయుడిగా నాకు జన్మనిచ్చారు. నా ఈ జీవితం మాత్రం అభిమానులకే అంకితం. జీవితాంతం నన్ను ప్రేమిస్తున్న అందరినీ ఆనందంగా ఉంచడానికే నా అడుగులు పడతాయి తప్ప బాధ పెట్టడానికి కాదు. దేవుడు చల్లగా చూస్తే ఇంకొన్నేళ్లు అందరం కలిసే ముందుకు వెళదాం" అంటూ తన అభిమానుల్ని ఉద్దేశించి మాట్లాడారు ఎన్టీఆర్. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా తనని కడుపులో పెట్టుకుని, తప్పుల్ని క్షమిస్తూ తాను బాగుండాలని చేసిన ప్రార్థనలకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనన్నారు. ఈ ఏడాదితో ఆయన కథానాయకుడిగా పరిచయమై 25 ఏళ్లవుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లో మైలురాయి లాంటి ఈ సంవత్సరంలోనే బాలీవుడ్ స్టార్ హృతిక్‌రోషన్‌తో కలిసి 'వార్ 2'లో నటించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. కథానాయకులు ఎన్టీఆర్, హృతిక్‌రోషన్ వేడుకలో కాలర్ ఎగరేయడంతోపాటు, అభిమానుల్ని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

బొమ్మ అదిరిపోయింది

ఎన్టీఆర్ మాట్లాడుతూ "నా ప్రయాణం మొదలై 25 వసంతాలు కావడంతో అభిమానులందరినీ కలుసుకోవాలని ఉండేది. నన్ను ఒత్తిడి చేసి ఈ వేడుకని ఏర్పాటు చేసిన నిర్మాత నాగవంశీకి కృతజ్ఞతలు. 'వార్ 2' అనే చిత్రం నేను చేయడానికి కారణం నిర్మాత ఆదిత్య చోప్రా. ఈ చిత్రం కచ్చితంగా చేయాలని, నీ అభిమానులు గర్వపడేలా ఈ చిత్రాన్ని తీస్తాను, నన్ను నమ్ము అని భరోసా ఇచ్చారు. ఆయన మాటని నమ్మినందుకు గర్వంగా ఉంది. నేను హైదరాబాద్‌లోనే ఉన్నాననిపించేలా ఎంతో బాగా చూసుకున్నారు. మరే దర్శకుడూ ఇంతకంటే గొప్పగా తీయలేడనేలా, మన కాలంలో వచ్చిన ఓ గొప్ప సినిమా అనిపించేలా అయాన్ ముఖర్జీ 'వార్ 2'ని తెరకెక్కించారు. ఇద్దరు స్టార్స్‌ని, ఇద్దరు నటుల్ని పెట్టుకుని సినిమా తీయడం ఎంత కష్టమో నాకు తెలుసు. హృతిక్, నేను ఒకేసారి ప్రయాణం మొదలుపెట్టాం. మైఖేల్ జాక్సన్ తప్ప మరెవ్వరూ నాకు గొప్పగా అనిపించేవారు కాదు, కానీ 'కహోనా ప్యార్ హై' చిత్రంలో హృతిక్ డ్యాన్స్ చూసి ముచ్చటపడ్డా. ఆయన డ్యాన్స్ చూసి స్ఫూర్తి పొందిన నేను, 25 ఏళ్ల తర్వాత ఆయన పక్కన నటించడం, ఆయనతో కలిసి డ్యాన్స్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎవరెన్ని మాట్లాడుకున్నా... 'వార్ 2' బొమ్మ అదిరిపోయిందని, సినిమా చూశాక ఈ కథలోని మలుపుల్ని కుదిరినంతసేపూ బయట పెట్టొద్దని కోరారు ఎన్టీఆర్. తన పాతికేళ్ల ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ... "25 ఏళ్ల కిందట 'నిన్ను చూడాలని' అనే చిత్రంతో నా ప్రయాణం మొదలైంది. రామోజీరావు నన్ను ఆయన సంస్థ నుంచి పరిచయం చేశారు. భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చల్లని చూపు నాపైన ఎప్పుడూ ఉంటుంది. అందరికంటే ముఖ్యంగా ఎన్ని యుగాలు దాటినా మరవలేని పేరు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు. ఆయన ఆశీస్సులు నా మీద ఉన్నంతకాలం నన్నెవ్వరూ ఆపలేరు" అన్నారు. తారక్ మీ అందరికీ అన్న అయితే నాకు తమ్ముడు అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు హృతిక్‌రోషన్. "ఈ సినిమా ప్రయాణంలో తారక్‌లో నన్ను చూసుకున్నా. మా ఇద్దరి ప్రయాణంలో చాలా సారూప్యతలు ఉన్నాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత నాగవంశీ, అయాన్ ముఖర్జీ, దిల్‌రాజు, యశ్‌రాజ్ ఫిల్మ్స్ సీఈవో అక్షయ్ విధానీ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రతిబింబించేలా


శ్రేయ, వజ్రయోగి

వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'సి - మంతం'. సుధాకర్ పాణి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ టాటా నిర్మాత. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రచార చిత్రాన్ని ఇటీవల ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "నేర నేపథ్యంతోపాటు, థ్రిల్లింగ్, సస్పెన్స్ అంశాలతో ముడిపడిన కథ ఇది. వర్తమాన సమాజాన్ని ప్రతిబింబిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. భావోద్వేగాలు మనసుల్ని హత్తుకుంటాయి.

రెండేళ్లలో ఆరు సినిమాలు


శశిదేవి రెడ్డి, విజయ్

'భలే మంచి రోజు', 'ఆనందో బ్రహ్మ' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్. ఇప్పుడీ నిర్మాణ సంస్థ ఆరు కొత్త సినిమాల్ని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతోంది. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన స్క్రిప్టులను లాక్ చేస్తూ.. ఆదివారం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి మాట్లాడుతూ.. "మేమెప్పుడూ నాణ్యమైన కంటెంట్‌కే ప్రాధాన్యత ఇస్తాం. ఇప్పుడీ సంస్థ నుంచి రానున్న ఈ ఆరు సినిమాలూ అదే పంథాలో ఉండనున్నాయి. ఇవన్నీ సరికొత్త కాన్సెప్ట్‌లతో.. ప్రేక్షకులకు మంచి థియేటర్ అనుభూతిని అందించేలా ఉంటాయి. రానున్న రెండేళ్లలో ఈ ఆరు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి" అన్నారు. ఈ కొత్త సినిమాలకు సంబంధించిన దర్శకులు, హీరోల వివరాల్ని త్వరలో ప్రకటించనున్నారు.

నాకు మళ్లీ కల వచ్చింది


'ఓడుం కుతిర చాదుం కుతిర'

మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, కళ్యాణి ప్రియదర్శన్, రేవతి పిళ్లై ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓడుం కుతిర చాదుం కుతిర'. రొమాంటిక్ కామెడీ నేపథ్యంతో ఈ సినిమాను అల్తాఫ్ సలీం తెరకెక్కిస్తున్నారు. ఆషిక్ ఉస్మాన్ నిర్మించారు. ఈ నెల 29న విడుదల కానుందీ సినిమా. ఈ సందర్భంగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను పంచుకుంది. ఇందులో "అబీ నాకు మళ్లీ ఆ కల వచ్చింది. అద్భుతమైన కల. బొద్దుగా తెల్లటి హల్వాలా కనిపించే గుర్రం. ఆమె కొంచెం పిచ్చిది కాదు, పూర్తిగా పిచ్చిది!" అంటూ నవ్వులు పూయిస్తూనే.. చిలిపి సరదాలతో సాగే ప్రేమకథగా ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. లాల్, ధ్యాన్ శ్రీనివాసన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

భావోద్వేగాలతో నిండిన సస్పెన్స్ థ్రిల్లర్


కోటేశ్వరరావు, జంపన్న, వివేక్, కశికా, గగన్, సాహు గారపాటి

గగన్ బాబు, కశికా కపూర్ జంటగా ఏకే జంపన్న దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. సత్యం రాజేశ్, సాయి రోనక్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ కొట్టారు. వివేక్ కూచిబొట్ల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. లక్ష్మీ కోటేశ్వరరావు చిత్ర దర్శకుడికి స్క్రిప్టు అందించారు. వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు జంపన్న మాట్లాడుతూ.. "ఇది భావోద్వేగాలతో నిండిన సస్పెన్స్ థ్రిల్లర్ కథతో రూపొందుతోంది. దీంట్లో చాలా కోణాలుంటాయి. త్వరలో చిత్రీకరణ మొదలవుతుంది" అన్నారు. "ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుంది. క్లైమాక్స్ చాలా అద్భుతంగా ఉంటుంది" అన్నారు హీరో గగన్.

కెమెరాల కోసమే ఇదంతా అనుకుంటారు!


రష్మిక

"సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నాన"ని అంటోంది అందాల తార రష్మిక. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుంది భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. "నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది. దీంతో పాటు నా చుట్టూ ఉండే నెగిటివిటీతో ప్రభావితం కాకుండా ఉండటానికి కూడా చాలా కష్టపడుతున్నాన"ని చెప్పుకొచ్చింది.

నా భయమంతా బాక్సాఫీస్ లెక్కల గురించి కాదు!


సూరజ్ బర్జాత్య

బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా 'థామా' సినిమాతో తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆయన.. 'మైనే ప్యార్ కియా', 'హమ్ ఆప్కే హై కౌన్' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల్ని రూపొందించిన దర్శకుడు సూరజ్ బర్జాత్యతో తన రాబోయే సినిమా కోసం చేతులు కలిపినట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. శార్వరీ వాఘ్ కథానాయిక. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ.. "ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబయిలో జరుగుతుంది. ఆయుష్మాన్ అంకితభావం ఉన్న నటుడు. సరైన తారాగణంతో మంచి కథను తెరపైకి తీసుకొస్తున్నా. ప్రతి సినిమా షూటింగ్ ముందు నాకు కొంచెం భయం ఉంటుంది. నా తొలి చిత్రం 'మైనే ప్యార్ కియా' చేసినప్పుడు కూడా అలాగే ఉండేది. కానీ ఈ భయమంతా బాక్సాఫీసు లెక్కల గురించి కాదు.. సినిమాలోని సన్నివేశాలతో ప్రేక్షకులు కనెక్ట్ అవ్వగలరా లేదా అనే దాని గురించి. నేను సృష్టిస్తున్న ప్రపంచం నిజాయతీగా ఉందని అందరూ భావించాల"ని చెప్పుకొచ్చారు.

'కాక్‌టెయిల్ 2' సెట్లోకి రష్మిక?

కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తూ.. వరుస విజయాలతో జోరుచూపిస్తుంది అందాల తార రష్మిక. త్వరలో 'ది గర్ల్ ఫ్రెండ్', 'మైసా' లాంటి మహిళా ప్రాధాన్య చిత్రాలతో అలరించడానికి సిద్ధమవుతుందామె. వీటితో పాటు బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లోనూ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాకు హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. కృతి సనన్ కీలక పాత్ర పోషిస్తుంది. తాజాగా రష్మిక ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టినట్లు సమాచారం. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ముక్కోణపు ప్రేమకథగా రూపొంది ప్రేక్షకుల్ని అలరించిన 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా దీన్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ వారం 4 కొత్త ఐపీఓలు



దిల్లీ: ఈ వారం మార్కెట్‌లోకి నాలుగు కొత్త తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)లు రానున్నాయి. ప్రధాన విభాగంలో పటేల్ రిటెయిల్, శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్, రీగల్ రీసోర్సెస్, బ్లూస్టోన్ జువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ కంపెనీలు నిధులు సమీకరించనున్నాయి. గత వారం ప్రారంభమైన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ ఐపీఓలు నేడు ముగియనున్నాయి. ఇక గత వారం ఐపీఓలు ముగించుకున్న నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్, హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లు ఎక్స్ఛేంజీల్లో అరంగేట్రం చేయనున్నాయి.

- సూపర్‌మార్కెట్ స్టోర్లు నిర్వహించే పటేల్ రిటెయిల్ ఐపీఓ ఆగస్టు 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇష్యూలో భాగంగా 85.18 లక్షల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 10.02 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఈ ఐపీఓ పరిమాణం రూ.250- 300 కోట్లుగా ఉండొచ్చని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.
- షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ అందించే శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓ 19న ప్రారంభమై 21న ముగుస్తుంది. పూర్తిగా తాజా షేర్ల ఇష్యూ అయిన ఈ ఐపీఓలో కంపెనీ 1.63 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.
- బ్లూస్టోన్ జువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ ఐపీఓ 11న ప్రారంభమై 13న ముగుస్తుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.492-517 నిర్ణయించారు. కంపెనీ ఐపీఓ ద్వారా రూ.1540.65 కోట్లు సమీకరించనుంది. రిటెయిల్ మదుపర్లు కనీసం 29 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- రీగల్ రీసోర్సెస్ ఐపీఓ 12న ప్రారంభమై 14న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.96-102 నిర్ణయించారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 144 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. కంపెనీ ఐపీఓ ద్వారా రూ.306 కోట్లు సమీకరించనుంది.

ఐపీఓకు ముందు

భారత్‌పే నిధుల సమీకరణ

ఐపీఓకు రావడానికి ముందు నిధులు సమీకరించనున్నట్లు భారత్‌పే సీఈఓ నళిన్ నేగి పేర్కొన్నారు. అయితే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే ఐపీఓకు వస్తామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఐపీఓ ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. ఉద్యోగుల స్టాక్ ఓనర్‌షిప్ ప్రణాళికను మినహాయించిన తర్వాత నిర్వహణ లాభాన్ని కంపెనీ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈనాడు బిజినెస్

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.26 కోట్లు

హైదరాబాద్: విద్యుత్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో రూ.26.03 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.24.25 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 7.3% ఎక్కువ. మార్చి త్రైమాసిక లాభం రూ.20.68 కోట్లతో చూస్తే 25.8% వృద్ధి కనిపించింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.313.93 కోట్ల నుంచి రూ.347.22 కోట్లకు వృద్ధి చెందింది. ఇన్సులేటర్ విభాగ ఆదాయం 46.5% పెరిగి రూ.54.98 కోట్లకు చేరింది. ఇ-వాహన విభాగ ఆదాయం రూ.276.42 కోట్ల నుంచి 5.7% వృద్ధితో రూ.292.24 కోట్లకు పెరిగింది.

రష్యా చమురు లేకపోయినా భారతీయ రిఫైనరీలు పని చేయగలవు

విశ్లేషకుల అంచనా

దిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద రష్యా చమురు వినియోగదారు అయిన భారతీయ శుద్ధి కర్మాగారాలు సాంకేతికంగా మాస్కో నుంచి సరఫరా లేకుండా పని చేయగలవని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురు ధర తక్కువగా ఉండటంతో, రిఫైనరీలకు అధిక మార్జిన్ ఉండే అవకాశం ఉందని గ్లోబల్ రియల్-టైమ్ డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ తెలిపింది.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత వారం భారత్ నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అదనంగా మరో 25 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి వద్దన్నా భారత్, చమురు దిగుమతి చేసుకుంటోందన్న కారణంతో టారిఫ్‌ను 50 శాతానికి పెంచారు. అధిక సుంకాలు మన దేశం అమెరికాకు చేసే 27 బిలియన్ డాలర్ల మినహాయింపు లేని ఎగుమతులను దెబ్బ తీసే అవకాశం ఉన్నందున, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడం లేదా తగ్గించడం గురించి చర్చ జరుగుతోంది.

చమురు వాటా

1.7% నుంచి 35.1 శాతానికి..

2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దాడి చేసినందుకు పాశ్చాత్య దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించి, దాని చమురు సరఫరాలను ఆపేశాయి. మన దేశం మాత్రం తక్కువ (డిస్కౌంట్) ధరకు రష్యా చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. 2019-20లో మన దేశం మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 35.1 శాతానికి పెరిగింది. ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా ఉంది. పరిమాణం పరంగా, మన దేశం 2024-25లో రష్యా నుంచి 88 మిలియన్ టన్నుల చమురును దిగుమతి చేసుకుంది. గత నెలలో అయితే రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును మన దేశం దిగుమతి చేసుకుంది. చైనా 1 మిలియన్ బ్యారెళ్లు, తుర్కియే 5 లక్షల బ్యారెళ్ల ముడిచమురును అందుకున్నాయి.



రొయ్యల ఎగుమతులకు ప్రోత్సాహం అందించాలి

వాణిజ్య, ఆర్థిక శాఖలను కోరిన ఎస్‌ఈఏఐ


దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల కారణంగా, అమెరికాకు 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.17,400 కోట్ల) విలువైన రొయ్యల ఎగుమతులు.. తీవ్ర అంతరాయాలను ఎదుర్కొంటున్నాయని భారత సముద్ర ఆహార ఎగుమతి సంఘం (ఎస్‌ఈఏఐ) వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖలను సంప్రదించింది. అత్యవసర ఆర్థిక సాయం అందించాలని కోరింది. సాఫ్ట్ రుణాల ద్వారా వర్కింగ్ క్యాపిటల్‌లో 30 శాతం పెరుగుదలను అసోసియేషన్ అభ్యర్థించింది. అలాగే మార్జిన్‌లను వడ్డీ రాయితీ ద్వారా కవర్ చేయాలని, ప్యాకేజింగ్‌కు ముందు, తర్వాత కార్యకలాపాలకు 240 రోజుల మారటోరియం విధించాలని కోరింది. ట్రంప్ గత వారం సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచడంతో, సుమారు 2 బి.డాలర్ల విలువైన రొయ్యల ఎగుమతులకు తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయని ఎస్‌ఈఏఐ సెక్రటరీ జనరల్ కె.ఎన్.రాఘవన్ తెలిపారు. 2024లో మన దేశం అమెరికాకు 2.8 బి.డాలర్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 50 కోట్ల డాలర్ల విలువైన రొయ్యలను రవాణా చేసింది. చైనా, వియత్నాం, థాయ్‌ల్యాండ్‌లతో పోలిస్తే భారత సముద్ర ఆహార ఎగుమతులపై ఎక్కువ సుంకాలు ఉండటంతో పోటీని తట్టుకోవడం కష్టమవుతుందని రాఘవన్ అభిప్రాయపడ్డారు.

భారత్ ఆలోచించి అడుగేయాలి

ట్రంప్ భారతీయ వస్తువులపై అదనంగా 25 శాతం సుంకాన్ని ప్రకటించిన తర్వాత, రష్యా నుంచి చౌకగా దిగుమతి చేసుకునే చమురు 'విలువైనదేనా' అని భారత్ ఆలోచించాలని నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ తెలిపారు. అదనపు సుంకం 25 శాతం ఈ నెల 27 నుంచి అమల్లోకి రాబోతున్నందున, రష్యా చమురు దిగుమతులు మనకు అనుకూలంగా ఉంటాయా? లేదా? అనేది ఆలోచించి ఒకవేళ రష్యా నుంచి దిగుమతులు ఆపివేస్తే టారిఫ్‌లు తగ్గిస్తారేమో అమెరికాను అడగొచ్చని బీఎంఎల్ ముంజాల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అభిజిత్ వెల్లడించారు.

ఐసీఐసీఐ బ్యాంక్‌లోనే ఉద్యోగుల వలసలు తక్కువ

హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులతో పోలిస్తే..



దిల్లీ: గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో అతి తక్కువ వలసల రేటును ఐసీఐసీఐ బ్యాంక్ నమోదుచేసింది. మెరుగైన వేతనాలు, మంచి పని పరిస్థితుల కారణంగా ఉద్యోగులు ఇక్కడ పనిచేయడానికి మొగ్గుచూపుతున్నారు. ఏడాది ప్రాతిపదికన చూస్తే.. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో వలసల రేటు గణనీయంగా తగ్గింది. ఐసీఐసీఐ బ్యాంక్ తాజా బిజినెస్ రెస్పాన్సిబిలిటీ అండ్ సస్టెయినబిలిటీ రిపోర్టింగ్ (బీఆర్‌ఎస్‌ఆర్) నివేదిక ప్రకారం.. 2023-24లో 24.5 శాతంగా ఉన్న ఉద్యోగుల వలసల రేటు, 2024-25లో 18 శాతానికి తగ్గింది. 2022-23లో కూడా పోటీ బ్యాంకుల కంటే తక్కువగా 30.9% నమోదుచేసింది.

- ప్రైవేట్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వలసల రేటు 2023-24లో 26.9% నుంచి 2024-25లో 22.6 శాతానికి తగ్గింది. 2022-23లో ఇది 34.2 శాతంగా ఉంది.
- యాక్సిస్ బ్యాంక్ వలసల రేటు 28.8% నుంచి 25.5 శాతానికి పరిమితమైంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వలసల రేటు 39.6% నుంచి 33.3 శాతానికి చేరింది. ఇండస్ఇండ్ బ్యాంక్‌లో ఇది 37 శాతం నుంచి 29 శాతానికి తగ్గింది. 2022-23లో ఇక్కడ వలసలు 51 శాతంగా ఉన్నాయి.
- 2022-23 నుంచి 2024-25 మధ్య ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఉద్యోగుల వలసలు గణనీయంగా తగ్గాయి. బీఎఫ్‌ఎస్‌ఐ, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్రారంభ స్థాయి ఉద్యోగాలు మందకొడిగా ఉండటం, డిజిటల్ సేవల వృద్ధి ఇందుకు కారణమని ఒక బ్యాంక్ సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ వెల్లడించారు. కరోనా తర్వాత చాలా ప్రైవేట్ రంగ బ్యాంకులు భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం కూడా అధిక వలసల రేటుకు దారితీసింది.

మరణించిన ఖాతాదారుల క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్‌కు ప్రామాణిక ఫారంలు: ఆర్‌బీఐ

ముంబయి: మరణించిన ఖాతాదారుల బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్‌ల ప్రక్రియ కోసం ఫారంలను ప్రామాణీకరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) భావిస్తోంది. తద్వారా 15 రోజుల్లో క్లెయిమ్‌లు పరిష్కరించి, నామినీలకు పరిహారం అందించనుంది. మరణించిన ఖాతాదారుల సేఫ్ కస్టడీ లేదా డిపాజిట్ లాకర్లలో ఉంచిన వస్తువులకు సంబంధించిన క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ప్రామాణిక విధానాలను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. సెటిల్‌మెంట్‌ను మరింత సౌకర్యవంతంగా, సరళంగా పూర్తిచేయడమే దీని లక్ష్యం. ఇందు కోసం 'ముసాయిదా సర్క్యులర్- ఆర్‌బీఐ (మరణించిన బ్యాంకు ఖాతాదారుల క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్) ఆదేశాలు-2025'ను కేంద్ర బ్యాంక్ జారీ చేసింది.

నిర్మాణాత్మక భిన్నాభిప్రాయాలు కంపెనీకి బలం

- మహీంద్రా సీఈఓ, ఎండీ అనీశ్ షా



దిల్లీ: నిర్మాణాత్మక భిన్నాభిప్రాయాలు కంపెనీని బలపరుస్తాయని తాను బలంగా నమ్ముతున్నానని 'పీపుల్స్ సీఈఓ'గా పేరు గడించిన మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా వెల్లడించారు. పదకొండేళ్ల క్రితం మహీంద్రా గ్రూప్‌లో అతని పదవీ కాలం ప్రారంభమైన నెలలోపే, కంపెనీ బాస్ ఆనంద్ మహీంద్రా అతన్ని బోర్డులోకి తీసుకోవాలని ప్రతిపాదించగా దాన్ని సున్నితంగా తిరస్కరించారు. చివరకు అతని దృక్కోణమే గెలిచింది. బోర్డు ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. నేడు గ్రూప్ సీఈఓ, ఎండీగా తన జూనియర్ సహోద్యోగి నుంచి వచ్చిన 'నో' అభిప్రాయాన్ని ఆయన విలువైన బహుమతిగా భావిస్తుంటారు. మహీంద్రా గ్రూప్‌లో షా 2021 ఏప్రిల్‌లో సీఈఓగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. నిర్మాణాత్మక భిన్నాభిప్రాయాలకు విలువనిచ్చే అనీశ్ షా, అంతకు మించి కంపెనీకి ప్రాధాన్యత ఇచ్చే ఉద్యోగులను వెతుకుతుంటారు. తమ గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా కంపెనీలో సాధికారత, బహిరంగ వాతావరణాన్ని (ఓపెన్ ఎన్విరాన్‌మెంట్) కల్పించారని కొనియాడారు. సీఈఓ అంటే అన్ని పనులను అధికారంతో చేయించుకుంటారనే అపవాదు ఉందని, నిజమైన నాయకుడు మాత్రం ఇతరులు ఆ పని చేయడానికి ఇష్టపడతారు కాబట్టే వారితో చేయిస్తారని అనీశ్ షా తెలిపారు.

సంక్షిప్తంగా...

- మహారాష్ట్రలో యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలంటూ డీలర్లు, రైతులపై ఒత్తిడి చేస్తోందనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రీయ కెమికల్స్‌పై దర్యాప్తునకు కాంపిటీషన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు ఇచ్చింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలకు సుమారు 100 నిరర్థక ఆస్తుల ఖాతాలను పంజాబ్ నేషనల్ బ్యాంక్ విక్రయించనుంది. ఈ ఖాతాలకు సంబంధించి రావాల్సిన బకాయిల విలువ రూ.4000- 5000 కోట్ల వరకు ఉంటుందని పీఎన్‌బీ ఎండీ, సీఈఓ అశోక్ చంద్రా తెలిపారు.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నుంచి 'ఫ్రీడం సేల్'

రూ.1279 నుంచి ఛార్జీలు ప్రారంభం

కోచి: మన దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఫ్రీడం సేల్'ను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఆదివారం ప్రకటించింది. ఇందులో భాగంగా దేశీయ మార్గాల్లో రూ.1,279, అంతర్జాతీయ మార్గాల్లో రూ.4,279 ప్రారంభ ఛార్జీతో 50 లక్షల సీట్లను అందిస్తోంది. ఆగస్టు 15 వరకు ఈ ఆఫర్ కింద బుకింగ్స్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. 2025 ఆగస్టు 19 నుంచి 2026 మార్చి 31 మధ్య ప్రయాణానికి ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్ లేదా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకోవచ్చు. ఓనం, దుర్గాపూజ, దీపావళి, క్రిస్మస్ సహా పండగల సీజన్‌లో ప్రయాణానికి ఈ ఫ్రీడం సేల్ అనువుగా ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

- 26 లెగసీ బీ787-8 డ్రీమ్‌లైనర్ విమానాల్లో ఏవియానిక్స్, ఇతర కీలక విడిభాగాలను ఆధునికీకరించనున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. నిర్వహణపరమైన ఆటంకాలను తగ్గించడంతో పాటు మొత్తంగా పనితీరును మెరుగుపరిచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.



కోడి గుడ్లు

11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



హైదరాబాద్	470	గోదావరి	505
వరంగల్	472	విశాఖపట్నం	510
విజయవాడ	510	చిత్తూరు	533

పసిడి రాణింపు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.99,996 కంటే దిగువన చలించకుంటే మరింతగా రాణించే అవకాశం ఉంది. అయితే రూ.1,02,775 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,04,052; రూ.1,05,854 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.99,696 కంటే కిందకు వస్తే రూ.97,894; రూ.96,617 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,11,567 కంటే దిగువన చలిస్తే రూ.1,08,424 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.1,16,864 కంటే ఎగువన కదలాడితే రూ.1,19,018; రూ.1,22,161 వరకు పెరుగుతుందని భావించవచ్చు.

ప్రాథమిక లోహాలు



- **రాగి** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.885 కంటే దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.892.85 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.896.45; రూ.903.15 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.
- **సీసం** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.181.90 కంటే ఎగువన చలిస్తే రూ.183 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ స్థాయికి దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మంచిది.
- **జింక్** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.265.45 కంటే ఎగువన మాత్రమే లాంగ్ పొజిషన్లను తీసుకోవడం మంచిది. అలాగే రూ.261.60 కంటే కిందకు వస్తే రూ.259.10; రూ.256.15 వరకు దిగివచ్చే అవకాశం ఉంది.
- **అల్యూమినియం** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.256.15 కంటే పైన కదలాడకుంటే మరింతగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది.

ఇంధన రంగం



- **ముడి చమురు** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం కూడా మరింతగా దిగివచ్చే అవకాశం ఉంది. అయితే రూ.5,434 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,256; రూ.5,002 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా రూ.5,867 కంటే పైన కదలాడితే రూ.6,122; రూ.6,301 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.
- **సహజ వాయువు** ఆగస్టు కాంట్రాక్టును ఈవారం రూ.272 దిగువన మాత్రమే షార్ట్ సెల్ చేయడం మంచిది. ఎందుకంటే ఈ స్థాయికి ఎగువకు వెళితే రూ.284.15; రూ.293 వరకు పెరిగే అవకాశం ఉండటమే ఇందుకు కారణం.

వ్యవసాయ ఉత్పత్తులు



- **పసుపు** ఆగస్టు కాంట్రాక్టు రూ.12,810 కంటే కిందకు వస్తే రూ.12,589; రూ.12,234 వరకు దిగిరావచ్చు. రూ.13,296 కంటే పైకి వెళితే రూ.13,561- 13,782 వరకు రాణించవచ్చు.
- **పత్తి** ఆగస్టు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.56,890 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.56,740; రూ.58,480 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు. అదేవిధంగా రూ.55,300 కంటే కిందకు వస్తే రూ.53,560; రూ.53,710 వరకు దిద్దుబాటు కావచ్చు.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	99,171	1,01,498	2.35
వెండి (సెప్టెంబరు)	1,10,579	1,14,710	3.74
రాగి (ఆగస్టు)	882.70	889.30	0.75
సీసం (ఆగస్టు)	179.50	180.75	0.70
జింక్ (ఆగస్టు)	262.30	270.10	2.97
అల్యూమినియం (ఆగస్టు)	249.20	254.15	1.99
ముడి చమురు (ఆగస్టు)	5,876	5,613	(4.48)
సహజ వాయువు (ఆగస్టు)	268.00	261.00	(2.61)
పసుపు (ఆగస్టు)	13,130	13,032	(0.75)
పత్తి క్యాండీ (ఆగస్టు)	53,410	57,040	6.80

కొంత కాలం బలహీనంగానే..

స్టాక్ మార్కెట్ ఈ వారం

- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యం ● మధ్య-దీర్ఘకాలానికి బులిష్ ధోరణి
- బ్యాంకు, లోహ, ఐటీ షేర్లకు ప్రతికూలతలు ● విశ్లేషకుల అంచనాలు



భారత స్టాక్ మార్కెట్లు స్వల్పకాలానికి బలహీనంగా కొనసాగొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా టారిఫ్ బెదిరింపులపై భారత్ ఏ విధంగా అడుగులు వేస్తుందన్నదానిపై అనిశ్చితి ఉండడం ఇందుకు నేపథ్యం. అమెరికా టారిఫ్‌ల నుంచి ఫార్మా, ఎలక్ట్రానిక్స్ వస్తువులకు మినహాయింపునివ్వడమే ఊరట కలిగే అంశం. మధ్య నుంచి దీర్ఘకాలానికి మాత్రం ఈక్విటీలపై 'బులిష్'గానే ఉన్నట్లు విశ్లేషకులు అంటున్నారు. ద్వితీయార్థం నుంచి కార్పొరేట్ ఫలితాలు పుంజుకుంటాయని అంచనా వేస్తున్నారు. రష్యా చమురు దిగుమతి నిలిపేసి, వ్యవసాయ, ఆహార మార్కెట్లలోకి తమను అనుమతించాలంటున్న అమెరికా డిమాండ్ నేపథ్యంలో ఆయా పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- ఎస్‌బీఐ కార్పొరేట్ రుణ పుస్తకం 5.7% మాత్రమే పెరిగిన నేపథ్యంలో ప్రైవేటు మూలధన వ్యయాలు మందగమనం పాలవుతాయన్న అంచనాల మధ్య నిఫ్టీ బ్యాంక్ సూచీ నష్టాలను కొనసాగించొచ్చు. 54,700 స్థాయి కంటే దిగువకు చేరితేనే తాజా విక్రయాలు చోటు చేసుకుంటాయి. 55,300 పైకి వెళితే మాత్రం 55,700-56,000 స్థాయికి చేరొచ్చని అంచనా.
- లోహ కంపెనీల షేర్లు ప్రతికూల ధోరణితో ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. అమెరికా టారిఫ్‌ల కారణంగా అంతర్జాతీయ గిరాకీ బలహీనపడడంతో స్వల్పకాలంలో ఈ షేర్లలో అమ్మకాలు చోటు చేసుకోవచ్చు. మంగళవారం హిండాల్కో, జిందాల్ స్టీల్ ఫలితాలున్నాయి.
- ఎఫ్‌ఎంసీజీ షేర్ల పెద్దగా రాణించకపోవచ్చు. అమెరికా మరో 25% టారిఫ్ ప్రకటించడం, కార్పొరేట్ ఫలితాల్లో స్తబ్దత, దేశీయ మార్కెట్ల నుంచి నిధులు బయటకు వెళుతుండడం వంటివి ఇందుకు కారణాలుగా నిలవవచ్చు. గురువారం పతంజలి ఫుడ్స్ ఫలితాలను ప్రకటించనుంది.
- ఫార్మా దిగుమతులపై అమెరికా టారిఫ్ విధిస్తే మాత్రం ఫార్మా కంపెనీల షేర్లు నష్టాల పాలు కావొచ్చు. ఒక వేళ టారిఫ్ ప్రకటన ఉండకపోయినా.. జూన్ త్రైమాసిక ఫలితాలు మోస్తరుగా ఉన్నందున బలహీనంగానే కనిపించొచ్చు.
- అమెరికా టారిఫ్ ఆందోళనలు పెరిగిన నేపథ్యంలో సెంటిమెంటు ప్రతికూలంగా ఉండడంతో ఐటీ షేర్లు దిగాలు పడొచ్చు. అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజ అమెరికా కంపెనీల నుంచి కొత్త ఆర్డర్లు రద్దు కావడంతో ఆయా కంపెనీల ఐటీ వ్యయాలపై ఆందోళనలు నెలకొన్నాయి.
- మార్కెట్లో బలహీన సెంటిమెంటు కారణంగా యంత్రపరికరాల కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. అమెరికాతో ఎంచదగ్గరీతిలో వ్యాపారం చేసే హనీవెల్ ఆటోమేషన్ ఇండియా, టిమ్‌కెన్ ఇండియా, ఇంగర్‌సోల్-ర్యాండ్ కంపెనీల షేర్లు ఎక్కువ నష్టపోవచ్చు.
- రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఉన్న అనిశ్చితితో చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు స్వల్పకాలంలో బలహీనంగానే కొనసాగొచ్చు. రూ.30,000 కోట్ల పరిహారానికి కేబినెట్ ఆమోదం లభించిన నేపథ్యంలో చమురు మార్కెటింగ్ కంపెనీలు వెలుగులోకి రావొచ్చు.
- టారిఫ్ అనిశ్చితుల మధ్య వాహన, వాహన విడిభాగాల షేర్లు ఒత్తిడికి లోనుకావొచ్చు. పండగల సీజనులో గిరాకీ పెరగొచ్చన్న అంచనాలున్నాయి. శుక్రవారం మార్కెట్ తర్వాత ఫలితాలను వెలువరచిన టాటామోటార్స్‌ను మదుపర్లు పరిశీలించొచ్చు.
- ఎటువంటి ప్రధాన వార్తలూ లేనందున సిమెంటు కంపెనీల షేర్లు స్తబ్దుగా కదలాడవచ్చు. వర్షాకాలం అనంతరం గిరాకీ పుంజుకోవచ్చు. అపుడు ధరల పెంపునకు అవకాశం ఉంటుంది. మధ్య నుంచి దీర్ఘకాలానికి ఈ రంగ పనితీరుపై విశ్లేషకులు బులిష్‌గానే ఉన్నారు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	115.42	122.30	111.70
బజాజ్ ఆటో	8224.00	8320.70	8136.70
ఐషర్ మోటార్స్	5663.00	5732.70	5620.70
హీరో మోటోకార్ప్	4599.80	4757.20	4509.40
ఎం అండ్ ఎం	3144.20	3244.20	3085.60
మారుతీ	12590.00	12787.30	12465.30
టాటా మోటార్స్	633.70	661.80	615.90
టీవీఎస్ మోటార్	2968.90	3048.60	2920.20

ఎఫ్‌ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,387.00	5,546.30	5,300.30
కోల్గేట్ పామోలివ్	2,207.40	2,259.80	2,177.80
డాబర్ ఇండియా	507.25	524.80	497.20
ఇమామీ	576.10	592.00	562.10
హిందుస్థాన్ యునిలీవర్	2,498.60	2,548.30	2,461.70
ఐటీసీ	414.50	416.70	411.90
మారికో	703.95	725.20	692.10

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	222.71	231.60	217.80
సీజీ పవర్	666.40	690.10	652.10
ఎల్ అండ్ టీ	3607.60	3685.60	3561.00
సీమెన్స్	3031.80	3191.30	2943.30
థెర్మాక్స్	3272.70	3370.80	3183.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1042.10	1082.30	1019.10
బయోకాన్	343.35	374.70	325.50
సిప్లా	1485.80	1501.50	1470.50
డాక్టర్ రెడ్డీస్	1211.40	1226.90	1187.70
గ్లెన్‌మార్క్ ఫార్మా	2019.60	2083.90	1981.90
లుపిన్	1918.00	1950.10	1896.10

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,973.90	2,001.70	1956.00
ఐసీఐసీఐ బ్యాంక్	1,435.90	1,454.10	1,422.90
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	69.11	71.00	67.90
ఇండస్ఇండ్ బ్యాంక్	782.45	819.50	760.50
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1,952.70	2,018.10	1,915.50
పీఎన్‌బీ	103.95	105.50	102.70
ఎస్‌బీఐ	804.30	818.50	782.90

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	672.75	693.40	658.70
హిందుస్థాన్ జింక్	420.70	429.90	414.70
ఎన్‌ఎండీసీ	71.07	72.30	70.10
సెయిల్	121.07	124.90	118.80
టాటా స్టీల్	157.95	161.20	155.40
వేదాంతా	431.45	443.40	424.40

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1475.70	1495.50	1449.10
ఇన్ఫోసిస్	1423.10	1440.60	1408.40
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5105.50	5236.20	5020.20
టీసీఎస్	3036.40	3075.20	3005.60
టెక్ మహీంద్రా	1480.40	1505.60	1461.20
విప్రో	239.05	245.10	235.40

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1,367.80	1,408.90	1,344.50
బీపీసీఎల్	319.45	329.10	303.80
హెచ్‌పీసీఎల్	409.50	424.00	392.30
ఐఓసీఎల్	139.91	143.10	137.70
ఓఎన్‌జీసీ	233.44	236.20	231.30
ఆయిల్ ఇండియా	432.40	439.20	426.50

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1788.20	1840.90	1754.30
అంబుజా సిమెంట్స్	580.00	602.50	566.80
ఇండియా సిమెంట్స్	355.00	364.20	346.90
శ్రీ సిమెంట్	30415.00	31165.00	29955.00
అల్ట్రాటెక్ సిమెంట్	12157.00	12382.30	12022.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,858.60	1907.30	1831.70
ఎమ్‌టీఎన్‌ఎల్	43.84	45.00	43.00
టాటా కమ్యూనికేషన్స్	1654.50	1688.60	1622.40
వొడాఫోన్ ఐడియా	6.51	6.90	6.30

- టెలికాం షేర్లు స్వల్పకాలంలో స్థిరీకరణకు గురికావొచ్చు. ఇప్పటికే ఫలితాలను వెల్లడించిన భారతీ ఎయిర్‌టెల్ షేరు రూ.1800-1900 శ్రేణిలో కదలాడవచ్చు. ఫలితాలను ఇంకా ప్రకటించని వొడాఫోన్ ఐడియా రూ.7-8 మధ్య చలించొచ్చు.

ఉద్యోగ వ్యూహం!



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన జూనియర్ అసోసియేట్స్ పోస్టులకు మెరుగ్గా సన్నద్ధమయ్యేదెలాగో తెలుసుకుందాం!

ఎస్‌బీఐలో 6589 క్లర్క్ పోస్టులు

బ్యాక్‌లాగ్ ఖాళీలతో కలిపి దేశవ్యాప్తంగా 6589 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇవి రాష్ట్రాలవారీ నియామకాలు కాబట్టి తెలంగాణలో 320, ఆంధ్రప్రదేశ్‌లో 315 ఖాళీలు భర్తీ కానున్నాయి.

ఎంపిక: రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసిన రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన స్థానిక భాషపై నిర్వహించే భాషా ప్రవీణ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. అయితే 10/12వ తరగతిలో ఆ భాషను ఒక సబ్జెక్టుగా చదివితే.. ఈ పరీక్ష రాయనక్కర్లేదు. తుది ఎంపిక మెయిన్స్ మార్కుల ఆధారంగా ఉంటుంది.

విభాగాలవారీ ఉత్తీర్ణత అవసరం లేదు: ఇతర బ్యాంకు పరీక్షల మాదిరి కాకుండా ఎస్‌బీఐ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో ఉండే విభాగాల్లో అభ్యర్థులు కనీస మార్కులతో అర్హత సాధించాల్సిన అవసరం లేదు. అయితే సమయం విభాగాల వారీగా ఉంటుంది.

సన్నద్ధత మెలకువలు

పరీక్ష విధానం, సిలబస్: ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు ఎలా ఉంటాయి, ఏ టాపిక్స్ వస్తాయి, వేటికి ఎక్కువ ప్రాధాన్యం.. ముందుగా వీటిని బాగా తెలుసుకోవాలి. సిలబస్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలి.

స్టడీ ప్లాన్: సన్నద్ధత ప్రారంభించే ముందు స్పష్టమైన స్టడీ ప్లాన్ తయారు చేసుకోవాలి. ప్రిలిమ్స్, మెయిన్స్‌లలోని అన్ని విభాగాలకూ సమయాన్ని ప్రాధాన్య క్రమంలో కేటాయించాలి. ప్రతిరోజూ ఏ విభాగంలో ఏ టాపిక్స్ చదవాలో ముందుగా నిర్ణయించుకుని.. వాటిని తప్పనిసరిగా పూర్తిచేయండి. ఇలాగే వీక్లీ టైమ్‌టేబుల్ కూడా సిద్ధం చేసుకోండి. బలహీనంగా ఉన్న టాపిక్స్‌కి సమయం కేటాయించి వాటిపైనా పట్టు సాధించండి.

మాదిరి/పూర్వ ప్రశ్నపత్రాలు: గతంలో జరిగిన పరీక్ష పేపర్లను సాల్వ్ చేయండి. దీనివల్ల ప్రశ్నల తీరు తెలుస్తుంది. కొన్నిసార్లు అవే ప్రశ్నలు పునరావృతం కావొచ్చు. వారంలో కనీసం ఒకట్రెండు మోడల్ పేపర్స్ రాయండి. దీనివల్ల ఏ విభాగం ఎంత సమయంలో పూర్తిచేయాలో, మీరు ఎక్కడ సౌకర్యవంతంగా/ ఇబ్బందిగా ఉన్నారో తెలుస్తుంది. వాటిని అధిగమించేలా సన్నద్ధత మెరుగు పరుచుకోవచ్చు. పరీక్షకు 15 రోజుల ముందు నుంచీ ప్రతిరోజూ ఒకటి రెండు మాక్ టెస్టులు రాయండి.

స్పీడ్ అండ్ యాక్యురసీ: స్వల్ప సమయంలో వేగంగా ప్రశ్నలు సాధించాలి. రుణాత్మక మార్కులు ఉండటంతో కచ్చితత్వంతో జవాబులు గుర్తించాలి. అందుకని స్పీడ్ అండ్ యాక్యురసీపై దృష్టి సారించండి. వేగంగా సాధించడానికి షార్ట్‌కట్ పద్ధతులు నేర్చుకోండి. కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి స్పీడ్ మేథమెటిక్స్ టెక్నిక్స్ నేర్చుకుని ఉపయోగించండి. తప్పులు లేకుండా కచ్చితమైన సమాధానాల కోసం సాధన చేయాలి, చేస్తూనే ఉండాలి.

జనరల్ అవేర్‌నెస్‌పై సమాన దృష్టి: ఎక్కువమంది ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్‌లకు ప్రాధాన్యం ఇచ్చి జనరల్ అవేర్‌నెస్‌పై తక్కువ దృష్టి పెడతారు. కానీ అభ్యర్థుల ఎంపికకు ముఖ్యమైన మెయిన్స్‌లోని ఈ విభాగం మార్కులూ కీలకమే. కాబట్టి మొదటి నుంచీ దీనికీ సన్నద్ధమవ్వాలి. రోజూ దిన పత్రికలు చదువుతూ ముఖ్యమైన విషయాలను పాయింట్ల రూపంలో నోట్స్ రాసుకోండి. ప్రతివారం వాటిని పునశ్చరణ చేస్తే సరిపోతుంది.

పరీక్షల్లో వైఫల్యమా?

కొంతమంది తరచుగా పరీక్షలు రాస్తున్నప్పటికీ విఫలమవుతూ ఉంటారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే...

1 ప్రణాళిక లోపం: సన్నద్ధత ప్రణాళిక లేకుండా ఏది పడితే అది చదవడం, ముఖ్యాంశాలను కవర్ చేయలేకపోవడం వల్ల సన్నద్ధత అసంపూర్ణంగా ఉంటుంది.

2 సాధనలో వైవిధ్యం లేకపోవడం: ఒకే రకమైన ప్రశ్నలను పదే పదే సాధన చేయడం.. వివిధ రకాల ప్రశ్నలను సాధించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ప్రస్తుతం పరీక్షల్లో అడిగే తరహా ప్రశ్నలను గుర్తించి ఆ ట్రెండ్‌కు తగినట్లుగా సాధన కొనసాగించకపోవడం వల్ల పరీక్షలో మార్కులు సాధించలేరు.

3 బలహీన టాపిక్స్ వదిలేయడం: తాము బలహీనంగా ఉండే టాపిక్స్‌ను కొందరు వదిలేస్తుంటారు. అందువల్ల ఆ ప్రశ్నలను సాధించలేకపోతారు. 'నాకిది రాదు' అని ముందుగానే భావించి వాటిని నేర్చుకునే ప్రయత్నం చేయరు.

4 నచ్చిన విభాగాలకే అధిక సమయం: కొంతమంది తమకు నచ్చే/సౌకర్యంగా భావించే టాపిక్స్‌పైనే ఎక్కువ సమయం కేటాయిస్తారు. దీనివల్ల మిగిలిన విభాగాలపై తగినంత పట్టులేక విఫలమవుతుంటారు.

5 సరైన విశ్లేషణ లేకపోవడం: కొందరు రాసిన టెస్టులను సరిగా విశ్లేషించరు. పరీక్ష రాశాక దాన్ని విశ్లేషించుకున్నపుడే లోపాలు, తక్కువ స్కోరు చేస్తున్న టాపిక్స్ తెలుస్తాయి. వాటిని అధిగమించేలా సాధన చేసినప్పుడే స్కోరు పెరుగుతుంది.


6 అనవసర జాప్యం: 'పరీక్షకు సమయం ఉంది కదా' అనే భావంతో సన్నద్ధతను నిదానంగా మొదలుపెడతారు కొందరు. దాంతో చివరిలో సమయం సరిపోక, అసంపూర్ణ సన్నద్ధత వల్ల నష్టపోతారు.

7 పునశ్చరణ: చదివినవి పునశ్చరణ చేయనందున పట్టు సాధించలేరు. ముఖ్యమైన ఫార్ములాలు కూడా మరిచిపోతారు.

8 పోటీ స్థాయి: బ్యాంకు పరీక్షల్లో పోటీ ఎక్కువగా ఉంటుంది. దీన్ని గ్రహించకపోవడం, కటాఫ్, ప్రస్తుతం ప్రశ్నలు వచ్చే ట్రెండ్లను అర్థంచేసుకోకపోవడం.

9 పరీక్ష ఒత్తిడి: పరీక్షలంటే ఆందోళన, భయం ఉండటం వల్ల తెలిసిన ప్రశ్నల క్కూడా తప్పు సమాధానాలు గుర్తిస్తారు. వీలైనన్ని మాక్ టెస్టులను నిత్యం రాస్తుంటే భయం తగ్గుతుంది.

వీటన్నిటినీ సరిదిద్దుకుంటే తప్పక విజయం సాధిస్తారు.



– డా. జి.ఎస్.గిరిధర్
రేస్ ఇన్‌స్టిట్యూట్

ముఖ్యమైన టాపిక్స్

న్యూమరికల్ ఎబిలిటీ/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, డేటా సఫిషియెన్సీ (మెయిన్స్‌లో మాత్రమే), వివిధ అరిథ్‌మెటిక్ టాపిక్స్ (నంబర్ సిస్టమ్, రేషియో, పార్టనర్‌షిప్, యావరేజ్, ఏజెస్, పర్సంటేజ్, ప్రాఫిట్- లాస్, సింపుల్- కాంపౌండ్ ఇంటరెస్ట్, టైమ్- వర్క్, టైమ్- డిస్టెన్స్, ట్రెయిన్స్, బోట్స్ అండ్ స్ట్రీమ్స్, మెన్సురేషన్, ఎలిగేషన్ అండ్ మిక్చర్, పర్మ్యుటేషన్ అండ్ కాంబినేషన్, ప్రాబబిలిటీ). ప్రిలిమ్స్, మెయిన్స్‌లలో వచ్చే టాపిక్స్ ఒకటే అయినా మెయిన్స్ పరీక్షలోని ప్రశ్నలు హెచ్చు స్థాయిలో ఉంటాయి.

రీజనింగ్: సీటింగ్ అరేంజ్‌మెంట్ అండ్ పజిల్స్ నుంచి చాలా ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలుంటాయి. వీటితోపాటు, ఆల్ఫాన్యూమరిక్ సిరీస్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్ సెన్స్, ఇన్‌ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, సిలాజిజమ్ మొదలైన వాటితోపాటు మెయిన్స్ పరీక్షలో ఇన్‌పుట్- అవుట్‌పుట్, డేటా సఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్‌లోని స్టేట్‌మెంట్ ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ ప్రశ్నలు ఉంటాయి. సీటింగ్ అరేంజ్‌మెంట్, పజిల్స్ ప్రశ్నలు మెయిన్స్ పరీక్షలో హెచ్చు స్థాయిలో ఉంటాయి. ప్రతిరోజూ తప్పనిసరిగా రెండు మూడు పజిల్స్ సాల్వ్ చేయాలి.

ఇంగ్లిష్: దీనిలో ప్రిలిమ్స్, మెయిన్స్ రెండిటిలో రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి ఎక్కువ ప్రశ్నలు (7-10) ఉంటాయి. దీంతోపాటు ఒకాబ్యులరీ (సినానిమ్స్, యాంటనిమ్స్), గ్రామర్ ఆధార ప్రశ్నలు ఉంటాయి. క్లోజ్‌టెస్ట్, ఎర్రర్ డిటెక్షన్, పారా జంబుల్డ్, ఫిల్లర్స్ (సింగిల్, డబుల్), వర్డ్ యూసేజ్, మ్యాచ్ ద కాలమ్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్ మొదలైనవి).

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్: ఎకనామిక్/ బ్యాంకింగ్ రంగాల 6-8 మాసాల కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువ ప్రశ్నలుంటాయి. బ్యాంకింగ్ సిస్టమ్, ఆర్‌బీఐ, పేమెంట్ సిస్టమ్స్, ఫైనాన్షియల్ టర్మ్‌లు, ఎబ్రివేషన్స్, ప్రభుత్వ పథకాలు, బడ్జెట్ ముఖ్యాంశాలు, ముఖ్యమైన దినోత్సవాలు, బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, ఛైర్మన్‌లు, ముఖ్యమైన వార్తల్లో వ్యక్తులు, ప్రదేశాలు, పుస్తకాలు-రచయితలపై ప్రశ్నలు వస్తాయి.

కంప్యూటర్ అవేర్‌నెస్: ఇది రీజనింగ్ విభాగంలో భాగం. 4, 5 ప్రశ్నలు దీని నుంచి రావొచ్చు. దీని కోసం కంప్యూటర్ బేసిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్, ఎంఎస్-ఆఫీస్, ఇంటర్నెట్, నెట్-వర్కింగ్, కంప్యూటర్ సెక్యూరిటీ, డేటాబేస్ మేనేజ్‌మెంట్, షార్ట్‌కట్ కీలు, ఎబ్రివేషన్స్, ఫ్లో ఛార్టులు మొదలైనవి బాగా చూసుకోవాలి.

కొలువుకు అవరోధమా?

డిగ్రీ, చదివి పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాను. సర్పంచిగా పోటీ చేయాలనుకుంటున్నాను. విజయం సాధిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకూ, పథకాలకు అర్హత ఉండదా? - ఎ. మోతీరామ్



■ పంచాయతీ సర్పంచులూ, మాజీ సర్పంచులూ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి అర్హులే! సర్పంచిగా ఎన్నికైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా ప్రకటించే నిబంధన ఏమీ లేదు. ఉద్యోగాలకు సంబంధించిన అర్హత ప్రమాణాలు అందరికీ సమానంగా వర్తిస్తాయి. ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా కావలసిన విద్యార్హతలు, వయః పరిమితి, అనుభవం లేదా ఇతర ప్రత్యేక ప్రమాణాలు ఉంటే సర్పంచులూ, మాజీ సర్పంచులూ కూడా ఇతర అభ్యర్థుల్లా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే- విరామ కాలం నిబంధన ఉండొచ్చు. ముఖ్యంగా సర్పంచిగా పనిచేసిన పంచాయతీ పరిధిలోనే/ తన పదవీకాలంలో నేరుగా తనకు సంబంధమున్న ప్రభుత్వ శాఖలో ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే.. ఈ విరామ కాలం వర్తించవచ్చు. అయితే ఇది సాధారణంగా ఎక్కువ నియామకాల్లో ఉండదు. కొన్ని ప్రత్యేక నియామకాల్లో/ శాఖల్లో మాత్రమే ఉంటుంది. సర్పంచి పదవిని ప్రజాప్రతినిధి పదవిగా పరిగణిస్తారు కాబట్టి. సర్పంచిగా పనిచేసే సమయంలో ఆదాయ ఆధారిత పథకాలు, సబ్సిడీలు దక్కకపోయే అవకాశం ఉంది. కొన్ని గృహనిర్మాణ పథకాలు, ఆర్థిక సహాయ పథకాలు లేదా దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారికి ఇచ్చే సబ్సిడీలు పదవీకాలంలో వర్తించకపోవచ్చు. కానీ పదవీ కాలం ముగిశాక ఆదాయం, కేటగిరీ ప్రమాణాలు ప్రభుత్వం నిర్దేశించిన స్థాయికి తక్కువగా ఉంటే ఆ పథకాలకు మళ్లీ అర్హత పొందవచ్చు. సర్పంచిగా పోటీ చేసినప్పుడు కానీ, బాధ్యతలు నిర్వహించినప్పుడు గానీ ఏదైనా నేరం చేసినట్లు రుజువయితే మాత్రం ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయే ప్రమాదం ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

లా/ లీగల్

సంస్థ: నెక్సస్ లా, పీఎల్ఎల్‌సీ (సియాటెల్, యూఎస్) నైపుణ్యాలు: లీగల్ డ్రాఫ్టింగ్, లీగల్ రిసెర్చ్, లీగల్ రైటింగ్, స్టాచ్యుటరీ కంప్లయెన్స్
స్టైపెండ్: రూ.17,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 4
☛ https://shorturl.at/H6XpO

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: క్లయింట్లీ ఇంక్ నైపుణ్యాలు: ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ. 6,000-9,000
☛ https://shorturl.at/h6vlI

ఆపరేషన్స్ సపోర్ట్

సంస్థ: కోర్టి సోషల్ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం స్టైపెండ్: రూ. 6,000-8,000 ☛ https://shorturl.at/3LoMQ

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 5

ఆపరేషన్స్

సంస్థ: స్టేఫైండ్జ్ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-వర్డ్ స్టైపెండ్: రూ. 12,000-20,000 ☛ https://shorturl.at/wLeSF

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: సూపర్‌వైజర్.ఏఐ నైపుణ్యాలు: యాంగ్యులర్‌జేఎస్, ఏఐ, సీఎస్ఎస్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, హెచ్‌టీఎంఎల్, మైఎస్‌క్యూఎల్, నెక్ట్స్.జేఎస్, పైథాన్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, త్రీ.జేఎస్ స్టైపెండ్: రూ. 15,000-25,000
☛ https://shorturl.at/mPsfW

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 27

బ్యాక్ఎండ్ ఏఐ ఏజెంట్ (టైప్‌స్క్రిప్ట్/ నోడ్.జేఎస్/ ఎల్ఎల్ఎం)

సంస్థ: సమర్థ్ గుగ్నాని నైపుణ్యాలు: కర్సర్ (జన్ఏఐ, జనరేటివ్ ఏఐ టూల్స్, జావాస్క్రిప్ట్, ఎల్ఐఎం ఎవాల్యుయేషన్, నోడ్.జేఎస్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, టైప్‌స్క్రిప్ట్, వైబ్ కోడింగ్
స్టైపెండ్: రూ. 30,000-50,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 28
☛ https://shorturl.at/LYVFK

టెలికాలింగ్

సంస్థ: లీడ్ మైన్స్ మీడియా
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, రాయడం, మార్కెటింగ్, సేల్స్
స్టైపెండ్: రూ. 8,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 31
☛ https://shorturl.at/hZty2

ఏఐ గురించి మీకివి తెలుసా?

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ)... అన్ని రంగాలనూ చుట్టేస్తోంది. ముఖ్యంగా టెక్నాలజీ సంబంధిత జాబ్‌మార్కెట్లో ఈ నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై విద్యార్థుల్లో, ఉద్యోగార్థుల్లో ఉన్న కొన్ని సందేహాలకు సమాధానాలు..

ఇంజినీరింగ్ తప్పనిసరా?

ఏఐ అంటే కోడింగ్ మాత్రమేనా?
▼ కాదు. కోడింగ్ ఒక భాగం మాత్రమే. డేటా విశ్లేషణ, డొమైన్ పరిజ్ఞానం, సమస్యలను పరిష్కరించే దృష్టికోణం కూడా ఏఐకి చాలా ముఖ్యం.

ఈ రంగంలో అడుగుపెట్టడానికి తప్పనిసరిగా బీటెక్/బీఈ కావాలా?
▼ అసలు అవసరం లేదు. చదివే డిసిప్లిన్ ఏదైనా కావచ్చు. కానీ డేటా, మోడలింగ్, అర్థం చేసుకునే శక్తి ఉంటే చాలు.

ఎంట్రీ స్థాయి కొలువు కోసం కనీసంగా నేర్చుకోవాల్సినవి?
▼ పైథాన్ బేసిక్స్, ఎంఎల్ అల్గారిథమ్స్ ఓవర్ వ్యూ, బేసిక్ ఎస్‌క్యూఎల్, గిట్, వర్షన్ కంట్రోల్, డేటా విజువలైజేషన్.

ఏ కోర్సు చేయాలో ఎలా ఎంపిక చేసుకోవాలి?
▼ టూల్స్ కాకుండా ప్రాబ్లమ్ సాల్వింగ్ మీద ఫోకస్ చేసే కోర్సు ఉత్తమం. మెంటర్ సపోర్ట్ ఉంటే మేలు.

స్థూలంగా స్పెషలైజ్డ్ హార్డ్‌వేర్, సిస్టమ్ సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్ అనే మూడు కెరియర్ మార్గాలున్నాయి. విశ్వవిద్యాలయాల్లో, రిసెర్చి ల్యాబ్స్‌లో వీటిపై పరిశోధనలు జరుగుతున్నాయి. పెద్ద కంపెనీలూ, స్టార్టప్‌లూ బిజినెస్ నీడ్స్ డెవలప్‌మెంట్‌ను చేపడుతున్నాయి.

పైథాన్ నేర్చుకుంటే ఏఐ స్పెషలిస్ట్ అవుతారా?
▼ పైథాన్.. ఓ మొదటి అడుగు. కానీ అల్గారిథమ్స్, డిప్లాయ్‌మెంట్, ఎథిక్స్, డేటా హ్యాండ్లింగ్ మీద అవగాహన అవసరం.

పవర్ బీఐ లేదా టాబ్ల్యూ నేర్చుకోవాలా?
▼ విజువలైజేషన్ చాలా ముఖ్యం. ఏఐ వివరించడంలో చార్టులు సపోర్ట్ చేస్తాయి. కాబట్టి నేర్చుకోవాలి.


ఎన్ఎల్‌పీ వర్సెస్ సీవీ వర్సెస్ టాబ్యులార్ డేటా.. ఏది నేర్చుకోవాలి?
▼ మీరు ఏ పరిశ్రమలో పనిచేయాలనుకుంటున్నారో దాన్ని బట్టి. మొదట టాబ్యులార్ డేటా నేర్చుకోండి.

ఏఐ + క్లౌడ్ నాలెడ్జ్ అవసరమా?
▼ అవును. Azure, AWS, GCP లో Model Deployment ఎలా చేయాలో తెలుసుకోవాలి.

ఏఐలో పనిచేయదల్చుకున్నవారు పెంచుకోవాల్సిన కీలక నైపుణ్యాలు... మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో గట్టి పునాది. ముఖ్యంగా.. కాల్క్యులస్, లీనియర్ ఆల్జీబ్రా, ప్రాబబిలిటీ థియరీ, అల్గారిథమ్ ఫండమెంటల్స్. ట్రెడిషనల్ మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, టూల్స్‌తో పరిచయమూ కీలకమే.

రెజ్యూమెలో ఏం చూపాలి?

రెజ్యూమెలో ఏం హైలైట్ చేయాలి?
▼ ఫ్రెషర్లు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, యూట్యూబ్ లేదా ఓపెన్ సోర్స్ కంట్రిబ్యూషన్స్, టెక్ బ్లాగ్స్ లాంటివి రెజ్యూమెలో ఉంచాలి. మిగిలినవారు డేటా ఆధారంగా తీసుకున్న నిర్ణయాలు, పర్సనల్ ప్రాజెక్టులు, గిట్‌హబ్ కోడ్, కాగిల్ కంట్రిబ్యూషన్స్ చూపించాలి.



ప్రాజెక్టులు ఎలా తయారు చేయాలి?
▼ ఒక రియల్ వరల్డ్ సమస్య తీసుకుని దానికి డేటా, మోడల్, ఫలితాలు - ఈ మూడు దశల్లో పని చేయాలి.

ఇంటర్వ్యూలో ఏ ప్రశ్నలు ఎక్కువ వస్తాయి?
▼ లీనియర్ రిగ్రెషన్ ఎలా పని చేస్తుంది?, ఓవర్ ఫిటింగ్ అంటే?, యాక్యురసీ వర్సెస్ ఎఫ్-1 స్కోర్, డేటా క్లీనింగ్..

ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవల్‌కి ఎలా తీసుకువెళ్లవచ్చు?
▼ UI pageతో ఇంటిగ్రేట్ చేసి, గిట్‌హబ్ రీడ్‌మీ బాగా రాసి, షార్ట్ డెమో వీడియో క్రియేట్ చేయడం ద్వారా.

ప్రాజెక్ట్ వివరణలో మెప్పించాలంటే?
▼ మీ అప్రోచ్, ఎందుకు ఆ మోడల్ ఎంపిక చేశారో, ఎలా ఆప్టిమైజ్ చేశారో చెప్పగలిగితే చాలు.

సర్టిఫికేషన్ల వల్ల జాబ్ దొరుకుతుందా?
▼ సర్టిఫికేషన్లు మిమ్మల్ని వెరిఫై చేయడానికి ఉపయోగపడతాయి. కానీ ప్రాక్టికల్ ప్రాజెక్టులు లేకపోతే ఉపయోగం ఉండదు. అసలు ఏఐ జాబ్ పొందడంలో పెద్ద పొరపాటు- జాబ్ సర్టిఫికేషన్ల మీద ఆధారపడటం. రియల్ అప్లికేషన్ అనేదే ఇంటర్వ్యూల్లో గెలిచే ఆయుధం.

నాన్ కోడింగ్ వారి సంగతి?

ఏఐలో డిమాండ్ ఎక్కువగా ఉన్న జాబ్స్ ఏవి?
▼ ఎంఎల్ ఇంజినీర్, డేటా సైంటిస్ట్, ఏఐ ప్రాడక్ట్ మేనేజర్, జెన్ఏఐ ప్రాంప్ట్ ఇంజినీర్, ఎన్ఎల్‌పీ స్పెషలిస్ట్.

నాన్ కోడింగ్ నేపథ్యం నుంచి ఏఐలో ఉద్యోగం దొరుకుతుందా?
▼ అవును. ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏఐ కంటెంట్ స్ట్రాటజీ, ఏఐ ప్రాడక్ట్ మేనేజ్‌మెంట్ లాంటి నాన్ కోడింగ్ రోల్స్ ఉన్నాయి.

కేస్ స్టడీస్ ఎందుకు అవసరం?
▼ మీరు ఏఐని ఎలా రియల్ వరల్డ్‌లో ఉపయోగించారో చూపించే అవకాశం అది.

ఫ్రీలాన్సింగ్‌తో ఏఐ మొదలుపెట్టవచ్చా?
▼ అవును. Fiverr, Upwork, Turing.io ప్లాట్‌ఫామ్స్ ద్వారా మొదలుపెట్టవచ్చు.

ఓపెన్‌సోర్స్‌లో ఎలా కంట్రిబ్యూట్ చేయాలి?
▼ గిట్‌హబ్‌లో beginner friendly reposని చూసి, డాక్యుమెంటేషన్, కోడ్ లేదా బగ్ ఫిక్సెస్‌తో సహాయం చేయవచ్చు.

ఇంటర్న్‌షిప్ కోసం..

ఇంటర్న్‌షిప్ దొరకాలంటే ఏం చేయాలి?
▼ కాలేజ్ ప్రాజెక్ట్స్‌ను గిట్‌హబ్‌లో పెట్టండి. లింక్డ్‌ఇన్‌లో ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేయండి. కోల్డ్ మెయిల్స్ (పరిచయం చేసుకుని పంపే కెరియర్ సంబంధిత మెయిల్స్) పంపండి.

డేటా క్లీనింగ్ ఎందుకు అంత ముఖ్యమైంది?
▼ మోడల్ యాక్యురసీ కన్నా డేటా క్వాలిటీ ఎక్కువ ప్రభావితం చేస్తుంది. "Garbage in, garbage out."

కృత్రిమ మేధలో డొమైన్ నాలెడ్జ్ అవసరమా?
తప్పనిసరి. మీరు హెల్త్‌కేర్, రిటెయిల్, ఫైనాన్స్ లాంటి రంగాల్లో పనిచేస్తే డొమెయిన్ అవగాహన తప్పనిసరి.

రోజూ ఎదురయ్యే ప్రతి సమస్యనూ – డేటా ప్రాబ్లమ్‌గా మార్చండి. అదే నిజమైన ఏఐ థింకర్ మార్గం. మంచి మెంటర్స్, రైట్ ప్లాట్‌ఫార్మ్స్, యాక్చువల్ థింకింగ్ మైండ్‌సెట్ అనే మూడు కీలక అంశాలపైనే ఏఐలో సుదీర్ఘ విజయం ఆధారపడి ఉంటుంది.



– మధు వడ్లమాని, ఏఐ మేనేజర్, అడ్వైజర్

"నియంత్రణలో లేని విషయాల గురించి అనవసరంగా బాధపడటానికి బదులు నియంత్రించగలిగేవాటిపై దృష్టి సారించా'లని నిపుణులు సూచిస్తున్నారు.

విద్యార్థులు ఒకవేళ తమకు మార్కులు సరిగా రాకపోతే.. బాధపడుతూ కూర్చోవడం వృథా. తాము చదివే పద్ధతిని మెరుగుపరుచుకోవచ్చు. అధ్యయన వ్యూహాలకు పదును పెట్టడం.. నైపుణ్యాల అభివృద్ధికి ప్రయత్నించడం మేలు.

ఉద్యోగాలు

ఎయిర్ పోర్ట్ అథారిటీలో..

ఎయిర్ పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా వివిధ విభాగాల్లో 976 జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాల వారీ ఖాళీలు: ● ఆర్కిటెక్చర్: 11 ● సివిల్: 199 ● ఎలక్ట్రికల్: 208 ● ఎలక్ట్రానిక్స్: 527 ● ఐటీ: 31 **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ (ఆర్కిటెక్చర్/ సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 27.09.2025 నాటికి 27 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకి 10 ఏళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ. 40,000 - రూ. 1,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 28.08.2025
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.09.2025
దరఖాస్తు ఫీజు: రూ. 300. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://www.aai.aero/en/recruitment/release/618077

యూసీఎస్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

కర్ణాటకలోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 4 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● ఎలక్ట్రికల్: 01 ● మెకానికల్: 02 ● ఫైనాన్స్: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 05.09.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు రూ. 49,500 - రూ. 54,540.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ. 400. ఎస్సీ, ఎస్టీ పీడబ్ల్యూబీడీలకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.09.2025
వెబ్‌సైట్: https://udupicsl.com/index.php/careers/

నోటీస్ బోర్డు

ఇండియన్ రైల్వేస్‌లో 434 పారా మెడికల్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వివిధ పారా మెడికల్ కేటగిరీల్లో 434 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
● నర్సింగ్ సూపరింటెండెంట్: 272 ● డయాలిసిస్ టెక్నీషియన్: 04 ● హెల్త్ & మలేరియా ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-2: 33 ● ఫార్మసిస్ట్ (ఎంట్రీ గ్రేడ్): 105 ● రేడియోగ్రాఫర్ ఎక్స్‌రే టెక్నీషియన్: 04 ● ఈసీజీ టెక్నీషియన్: 04 ● లాబొరేటరీ టెక్నీషియన్ గ్రేడ్-2: 12 **అర్హత:** పోస్టును అనుసరించి ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ, డిప్లొమా, టెన్+2 లేదా డిప్లొమా (ఫార్మసి, రేడియోగ్రఫీ), డిగ్రీ, డీఎంఎల్‌టీ.
వయసు: 01.01.2026 నాటికి నర్సింగ్ సూపరింటెండెంట్‌కు 20 - 40 ఏళ్లు, డయాలిసిస్ టెక్నీషియన్‌కు 20 - 33 ఏళ్లు, హెల్త్ & మలేరియా ఇన్‌స్పెక్టర్‌కు 18 - 33 ఏళ్లు, ఫార్మసిస్ట్‌కు 20 - 35 ఏళ్లు, రేడియోగ్రాఫర్ ఎక్స్-రే టెక్నీషియన్‌కు 19 - 33 ఏళ్లు, ఈసీజీ టెక్నీషియన్‌కు 18 - 33 ఏళ్లు, లాబొరేటరీ అసిస్టెంట్‌కు 18 - 33 ఏళ్లు.
మూల వేతనం: నెలకు నర్సింగ్ సూపరింటెండెంట్‌కు రూ. 44,900, డయాలిసిస్ టెక్నీషియన్, హెల్త్ & మలేరియా ఇన్‌స్పెక్టర్‌లకు రూ. 35,400, ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్ ఎక్స్-రే టెక్నీషియన్‌లకు రూ. 29,200, ఈసీజీ టెక్నీషియన్‌కు రూ. 25,500, లాబొరేటరీ అసిస్టెంట్‌కు రూ. 21,700.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ. 500. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు రూ.. 250.
ఎంపిక: కంప్యూటర్ బేసిడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌తో.
వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/

న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో..

ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 550 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● రిస్క్ ఇంజినీర్స్: 50 ● ఆటోమొబైల్ ఇంజినీర్స్: 75
● లీగల్ స్పెషలిస్ట్స్: 50 ● అకౌంట్స్ స్పెషలిస్ట్స్: 25
● ఏఓ (హెల్త్): 50 ● ఐటీ స్పెషలిస్ట్స్: 25
● బిజినెస్ అనలిస్ట్స్: 75 ● కంపెనీ సెక్రటరీ: 02
● ఆక్చ్యూరియల్ స్పెషలిస్ట్స్: 05
● జనరలిస్ట్స్: 193
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంబీఏ, ఎంబీబీఎస్ లేదా బీడీఎస్/ఎండీఎస్ లేదా బీఏఎంఎస్/బీహెచ్‌ఎంఎస్‌లో 55 నుంచి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత, పని అనుభవం.
వయసు: 01.08.2025 నాటికి 21 ఏళ్ల నుంచి 30 ఏళ్లు. **వేతన శ్రేణి:** నెలకు రూ. 50,925 - రూ. 96,765.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ. 850, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ. 100.
ఎంపిక: ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలతో.
ప్రిలిమ్స్: 14.09.2025
మెయిన్స్: 29.10.2025
వెబ్‌సైట్: https://www.newindia.co.in/recruitment/list

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో..

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 35 షిప్‌డ్రాఫ్ట్‌మ్యాన్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● మెకానికల్: 20 ● ఎలక్ట్రికల్: 13 ● ఎలక్ట్రానిక్స్: 02
అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, సంబంధిత విభాగంలో డిప్లొమాతో పాటు పని అనుభవం.
వయసు: 25 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు మొదటి ఏడాది రూ. 14,000; రెండో ఏడాది రూ. 20,000.
ఎంపిక: ప్రాక్టికల్ టెస్ట్‌తో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 22.08.2025 **వెబ్‌సైట్:** https://www.cochinport.gov.in/careers

ఉడిపి షిప్‌యార్డ్‌లో సూపర్‌వైజర్‌లు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- ఒప్పంద ప్రాతిపదికన 10 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● మెకానికల్- 06 ● ఎలక్ట్రికల్- 02 ● పెయింటింగ్- 02
అర్హతలు: పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమాతో పాటు ఉద్యోగానుభవం. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ. 40,650; రెండో ఏడాది రూ. 41,490; మూడో ఏడాది రూ. 42,355; నాలుగో ఏడాది రూ. 43,246; ఐదో ఏడాది రూ. 44,164.
ఎంపిక: రాత పరీక్ష, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో **దరఖాస్తు ఫీజు:** రూ. 300; ఎస్సీ/ఎస్టీ పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 05.09.2025. **వెబ్‌సైట్:** https://udupicsl.com/

అప్రెంటిస్‌షిప్

ఐఓబీలో 750 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చెన్నై (ఐఓబీ) వివిధ రాష్ట్రాల్లో 750 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఏదైనా డిగ్రీ. **వయసు:** 20 - 28 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీకి 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్ల సడలింపు. **స్టైపెండ్:** నెలకు రూ. 10,000 - రూ. 15,000. **ఆన్‌లైన్ దరఖాస్తు గడువు:** 20.08.2025 **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కు రూ. 944. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రూ. 708, పీడబ్ల్యూబీడీలకు రూ. 472. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్థానిక భాష పరీక్షతో. **వెబ్‌సైట్:** https://iob.in/Careers

ఏడాది కాలంలో పొందిన మొత్తం లాభం?



భాగస్వామ్యం

ముఖ్యాంశాలు

- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి చేసే వ్యాపారాన్ని భాగస్వామ్య వ్యాపారం లేదా ఉమ్మడి వ్యాపారం అంటారు.
- వ్యాపారంలో పెట్టే మొత్తాన్ని పెట్టుబడి లేదా మూలధనం అంటారు.
- పెట్టుబడి, లాభాలు అనులోమానుపాతంలో ఉంటాయి.
- ఒకవేళ వేర్వేరు వ్యక్తుల పెట్టుబడులు, వారి పెట్టుబడుల కాలాలు వేర్వేరుగా ఉన్నట్లయితే వారు తమ లాభాన్ని పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తిలో పంచుకోవాలి.

P - లాభం, I - పెట్టుబడి, T - కాలం

$P_A : P_B : P_C = (I_A \times T_A) : (I_B \times T_B) : (I_C \times T_C)$

ఇదేవిధంగా, $T_A : T_B : T_C = \frac{P_A}{I_A} : \frac{P_B}{I_B} : \frac{P_C}{I_C}$

$I_A : I_B : I_C = \frac{P_A}{T_A} : \frac{P_B}{T_B} : \frac{P_C}{T_C}$

1. హరి, రవి, ప్రకాశ్‌లు కలిసి ఒక వ్యాపారాన్ని ప్రారంభించారు. హరి 5 నెలలకు రూ.2,10,000, రవి 6 నెలలకు రూ. 1,25,000, ప్రకాశ్ 4 నెలలకి రూ.1,50,000లు పెట్టుబడి పెట్టారు. వ్యాపారాన్ని నిర్వహించడానికి మొత్తం లాభాల్లో 6% ప్రకాశ్ తీసుకున్నాడు. మొత్తం లాభం రూ.1,44,000 వచ్చినట్లయితే దానిలో హరి వాటా ఎంత? (రూ.లలో)

1) 57,220 2) 59,022 3) 59,220 4) 59,202

సాధన: హరి, రవి, ప్రకాశ్‌ల పెట్టుబడుల నిష్పత్తి = లాభాల వాటా నిష్పత్తి

$= (5 \times 2,10,000) : (6 \times 1,25,000) : (4 \times 1,50,000)$

$= 7 : 5 : 4$

ప్రకాశ్ నిర్వహణ వాటా $= 1,44,000 \times 6\% = 8,640$

మిగిలిన లాభం $= 1,44,000 - 8640 = 1,35,360$

మొత్తం లాభంలో హరి వాటా $= \frac{7}{16} \times 1,35,360$

= రూ. 59,220

సమాధానం: 3

2. భాగస్వామ్య వ్యాపారం ప్రారంభంలో B పెట్టుబడి A పెట్టుబడికి 4/3 రెట్లు. 6 నెలల తర్వాత తన పెట్టుబడిలో సగం మొత్తాన్ని B ఉపసంహరించుకున్నాడు. 7 నెలల తర్వాత A తన పెట్టుబడిలో 1/5వ భాగాన్ని వెనక్కి తీసుకున్నాడు. ఏడాది చివరలో మొత్తం లాభం రూ.46,000. అయితే B వాటా ఎంత? (రూ.లలో)

1) 24,000 2) 23,500 3) 25,500 4) 25,000

సాధన: A పెట్టుబడి రూ. 3x అనుకుందాం.

B పెట్టుబడి $= \frac{4}{3} \times 3x$ = రూ. 4x

A, B లాభాల వాటా నిష్పత్తి

$= 7(3x) + 5\left(3x \times \frac{4}{5}\right) : 6(4x) + 6\left(4x \times \frac{1}{2}\right)$

$= (21x + 12x) : (24x + 12x) = 33x : 36x = 11 : 12$

మొత్తం లాభంలో B వాటా $= \frac{12}{23} \times 46,000$ = రూ. 24,000

సమాధానం: 1

3. ఒక వ్యాపారాన్ని P, Q లు 7 : 10 పెట్టుబడితో ప్రారంభించారు. ఏడాది తర్వాత వచ్చిన లాభంలో 35% సొమ్మును తిరిగి ప్రారంభించిన మూలధనంలో పెట్టుబడిగా పెట్టారు. మిగతా లాభాన్ని వారిద్దరూ పంచుకోగా P లాభం వాటాగా రూ.68,250 వచ్చాయి. అయితే సంవత్సరం అనంతరం వ్యాపారంలో వచ్చిన మొత్తం లాభం ఎంత? (రూ.లలో)

1) 2,50,000 2) 2,55,000
3) 2,45,000 4) 2,60,000

సాధన: P కి చెందిన 65% లాభం విలువ = 68,250

P కి చెందిన 100% లాభం విలువ $= 68,250 \times \frac{100}{65}$

= రూ. 1,05,000

వ్యాపారంలో వచ్చిన మొత్తం లాభం $= \left(\frac{1,05,000}{7}\right) \times 17$

= రూ. 2,55,000

సమాధానం: 2

4. A, B, C లు ఉమ్మడి వ్యాపారం ప్రారంభంలో 3/2 : 5/3 : 7/5 నిష్పత్తిలో పెట్టుబడి పెట్టారు. 7 నెలల తర్వాత C తన పెట్టుబడిని 20% పెంచాడు. ఒక సంవత్సరం పిదప ఆ వ్యాపారంలో వచ్చిన లాభం రూ. 28,100. అయితే B వాటా ఎంత? (రూ.లలో)

1) 9800 2) 9100 3) 9000 4) 10,000

సాధన: A, B, C ల ప్రారంభ పెట్టుబడుల నిష్పత్తి

$= \frac{3}{2} : \frac{5}{3} : \frac{7}{5} = \frac{45 : 50 : 42}{30} = 45 : 50 : 42$

A, B, C ల లాభాల వాటా నిష్పత్తి

$= (12 \times 45) : (12 \times 50) : (7 \times 42 + 5 \times 120\% \times 42)$

$(12 \times 45) : (12 \times 50) : (7 \times 42) + \left(5 \times \frac{120}{100} \times 42\right)$

$(12 \times 45) : (12 \times 50) : 294 + 252$

$12 \times 45 : 12 \times 50 : 546 = 90 : 100 : 91$

మొత్తం లాభంలో B వాటా $= \frac{100}{281} \times 28100$

= రూ. 10,000

సమాధానం: 4

5. A, B, C అనే ముగ్గురు ఒక వ్యాపారంలో మూలధనంగా 4 : 7 : 6లో పెట్టుబడి పెట్టారు. పెట్టుబడుల సమయం x : y : z. అయితే వారి లాభాలను 32 : 35 : 42 నిష్పత్తిలో పంపిణీ చేస్తే x : y : z ఎంత?

1) 8 : 7 : 5 2) 8 : 5 : 7 3) 5 : 7 : 8 4) 5 : 8 : 7

సాధన: $I_A : I_B : I_C = 4 : 7 : 6$, $T_A : T_B : T_C = x : y : z$

$P_A : P_B : P_C = 32 : 35 : 42$

$T_A : T_B : T_C = x : y : z$

$= \frac{P_A}{I_A} : \frac{P_B}{I_B} : \frac{P_C}{I_C}$

$= \frac{32}{4} : \frac{35}{7} : \frac{42}{6} = 8 : 5 : 7$

సమాధానం: 2

6. కొంత పెట్టుబడితో మధు అనే వ్యక్తి ఒక వ్యాపారాన్ని ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రఘు అనే వ్యక్తి మధు పెట్టుబడి కంటే 45% ఎక్కువ పెట్టుబడితో వ్యాపారంలో చేరాడు. ఏడాది చివర మధు కంటే రఘుకు రూ.5,600లు ఎక్కువగా లాభం వస్తే మధు లాభం ఎంత? (రూ.లలో)

1) 60,000 2) 61,000 3) 62,000 4) 64,000

సాధన: మధు, రఘుల పెట్టుబడుల నిష్పత్తి

$= 100 : 145 = 20 : 29$

వారి కాలాల నిష్పత్తి $= 12 : 9 = 4 : 3$

వారి లాభాల వాటాల నిష్పత్తి

$= (20 \times 4) : (29 \times 3)$

$= 80 : 87$

$87 - 80 = 7$ భాగాల విలువ

= 5,600

1 భాగం విలువ = 800

మధు లాభం = 80 భాగాల విలువ $= 80 \times 800$

= రూ. 64,000

సమాధానం: 4



రచయిత
డా. వంగల శ్రీనివాస్
అసిస్టెంట్ ప్రొఫెసర్

738 Word of the Day

Taciturn

Telugu meaning: నిశ్శబ్ద, మాట్లాడని

English meaning: The word taciturn (ట్యాసిటర్న్) is an adjective that describes someone who is habitually silent, reserved, or uncommunicative.

Synonyms: Reserved, Quiet

Antonyms: Talkative, Chatty

Usage: **1.** Despite being highly intelligent, he remained taciturn in most social gatherings.

2. Her taciturn nature often made people think she was unfriendly, though she was simply shy.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

భారతదేశంలోని పంట మొక్కలు



ఏదైనా ప్రాంతంలో ఒకే జాతికి చెందిన మొక్కలను వరుసల్లో లేదా క్రమపద్ధతిలో పెద్ద ఎత్తున సాగు చేయడాన్ని పంట అంటారు. దీన్నే వ్యవసాయంగా పేర్కొంటారు. సాధారణంగా మానవుడు ఆహార అవసరాలతో పాటు వాణిజ్యపరంగా లాభం పొందేందుకు పంట సాగు చేస్తాడు. పంటలు పండేందుకు సరైన వాతావరణం, నేల, నీరు అవసరం. ఇవన్నీ మొక్కల పెరుగుదల, పంట దిగుబడిపై ప్రభావాన్ని చూపుతాయి. భారతదేశంలోని వైవిధ్యమైన వాతావరణం, సమృద్ధిగా ఉన్న నేలలు అనేక రకాల పంట మొక్కలను పండించడానికి అనుకూలం. మన దేశంలోని వ్యవసాయం ముఖ్య లక్షణాలు, పంట మొక్కల అవసరం, వాటి ఆర్థిక ప్రాముఖ్యత మొదలైన వాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

వ్యవసాయ లక్షణాలు

భారతీయ వ్యవసాయాన్ని ప్రత్యేకంగా ప్రభావితం చేసే కొన్ని ముఖ్య లక్షణాలు ఉన్నాయి. **అవి:**

- విభిన్న వాతావరణాలకు అనుకూలత
- వివిధ రకాల పంటలు
- రుతుపవనాలపై ఆధారపడటం
- మిశ్రమ పంటలు
- స్వదేశీ పరిజ్ఞానం

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానిది కీలకపాత్ర.

- దేశంలో పంట మొక్కల సాగు అవసరంలో కింది విషయాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

1. ఆహార భద్రత 2. ఉపాధి
3. ఎగుమతులు
4. పారిశ్రామిక ముడి పదార్థాలు
5. ఆర్థిక వృద్ధి

దేశంలోని ముఖ్యమైన నేలలు

- ఒండ్రు
- నల్లరేగడి
- లేటరైట్
- ఎర్ర నేలలు

పంట రకాలు, ఆర్థిక ప్రాముఖ్యత, ఉదాహరణలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్

దేశంలో మౌలిక వసతుల కల్పనకు, సాంకేతిక విద్యాభివృద్ధికి కేంద్ర మంత్రి మండలి 2025, ఆగస్టు 8న కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.52,667 కోట్ల విలువైన ప్రాజెక్టులు, పథకాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా సాంకేతిక విద్యలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు తెచ్చిన మెరిట్ పథకానికి రూ.4,200 కోట్ల బడ్జెట్ కేటాయించింది. ఈ మొత్తాన్ని రానున్న అయిదేళ్లలో ఖర్చు చేయనున్నారు.

- మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (మెరిట్) పేరుతో అమలయ్యే ఈ పథకంతో దేశంలోని 175 ఇంజినీరింగ్ కళాశాలలు, 100 పాలిటెక్నిక్‌లు లబ్ధి పొందనున్నాయి.

ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న నలుగురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా లభించింది. శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌ల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2025, ఆగస్టు 8న ఆమోదముద్ర వేశారు. ఈ నలుగురూ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21 నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన భారత - దక్షిణ ఆసియా విభాగాలకు ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా యూగెన్ వెస్ట్‌మెయర్‌ను నియమించింది. ప్రస్తుతం సంస్థలో ఎగ్జిక్యూటివ్ వైస్-ప్రెసిడెంట్, ముఖ్య ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన, 2025, సెప్టెంబరు 1న నూతన బాధ్యతలు చేపడతారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టడీ జోన్: అత్యంత వేగవంతమైన మొబైల్ ఇంటర్నెట్ ఉన్న టాప్-10 దేశాలు

ఒకప్పుడు మొబైల్ ఫోన్లను కేవలం మాట్లాడటానికి, సమాచారాన్ని మెసేజెస్‌ల రూపంలో పంచుకోవడానికి ఉపయోగించేవారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ల ద్వారా ఇంటర్నెట్‌ను వినియోగించడంతో డిజిటల్ సేవలు ఊపందుకున్నాయి. వినోదం, వ్యాపారం, ఆన్‌లైన్ విద్య ఇలా అన్ని సేవలను ఒకే దగ్గర అందిస్తూ, మొత్తం ప్రపంచాన్ని మన చేతుల్లో ఉంచే సాధనంగా మారాయి. వీటిని ఉపయోగించేవారి సంఖ్య కూడా నానాటికీ పెరుగుతోంది. బ్యాంక్‌మై సెల్ వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం, 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 743 కోట్ల స్మార్ట్‌ఫోన్లు ఉండగా, వాటిని వినియోగించే వారి సంఖ్య 528 కోట్లుగా ఉంది.



- భారతదేశ టెలికం విభాగం గణాంకాల ప్రకారం, ప్రస్తుతం మన దేశంలో 116.50 కోట్ల మొబైల్ ఫోన్లు ఉన్నాయి. వారిలో 91.4 కోట్ల మంది మొబైల్ ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు.
- 5జీ సేవల ప్రారంభంతో టెలికం రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. గతంతో పోలిస్తే ఇంటర్నెట్ వేగం ఎన్నో రెట్లు పెరిగింది. ఉదాహరణకు 4జీ నెట్‌వర్క్‌లో గరిష్ఠ డౌన్‌లోడ్ స్పీడ్ సెకనుకు సగటున 100 ఎంబీ ఉంటే, 5జీలో అది దాదాపు 10 జీబీగా ఉంది. ఈ వేగాన్ని మరింత పెంచుకునే అవకాశం కూడా ఉంది. గ్లోబల్ మొబైల్ సప్లయర్స్ అసోసియేషన్ ప్రకారం 2025, ఏప్రిల్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 188 దేశాల్లో 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంది.
- మెరుగైన సాంకేతికత, బలమైన నెట్‌వర్క్ వ్యవస్థలతో కొన్ని దేశాలు ఇతరుల కంటే వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నాయి. ప్రపంచంలో వేగవంతమైన మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న దేశాలపై స్పీడ్‌టెస్ట్ వెబ్‌సైట్ సర్వే నిర్వహించి 'స్పీడ్ టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్' పేరుతో జాబితా విడుదల చేసింది. భారత్ 133.51 ఎంబీపీఎస్ సగటు స్పీడ్‌తో 26వ స్థానంలో ఉంది.

అత్యంత వేగవంతమైన మొబైల్ ఇంటర్నెట్ ఉన్న టాప్-10 దేశాలను పరిశీలిస్తే..

ర్యాంక్	దేశం	వేగం (ఎంబీపీఎస్)
1	యూఏఈ	546.14
2	ఖతార్	517.44
3	కువైట్	378.45
4	బహ్రెయిన్	236.77
5	బ్రెజిల్	228.89
6	బల్గేరియా	224.46
7	సౌత్ కొరియా	218.06
8	చైనా	201.67
9	సౌదీ అరేబియా	198.39
10	డెన్మార్క్	196.27

Latest Updates

Senior Resident Jobs

All India Institute of Medical Sciences Rishikesh (AIIMS Rishikesh) is inviting applications for the Senior Resident posts in various departments on a contractual basis. The total no. of posts is 77. The application fee is Rs.1200. The last date for receipt of online applications is 9 September 2025.

Engineer & Supervisor Posts

Bharat Heavy Electricals Limited, Hyderabad (BHEL) is inviting applications for the Engineer and Supervisor posts in various departments. The total no. of posts is 12. The application fee is Rs. 600 + GST. Eligible candidates can apply online before 28 August 2025.

Posts In Cochin Shipyard Limited

Cochin Shipyard Limited is inviting applications for the Ship Draftsmen posts in various departments. The total no. of posts is 35. The last date for online applications is 22 August 2025.

Did You Apply..?

Today (August 11) is the last date for the following Jobs

- 3,500 Nursing Officer Posts In AIIMS, New Delhi.
- AAI Apprentice Recruitment 2025 - 197 posts.
- 32 Manager Posts in NALCO.
Qualification: Degree, CA, PG, PG Diploma.

For more information and other notifications - scan QR code

Homonyms

Directions (1 - 25): *Select the most appropriate homonyms to fill in the blanks.*

1. The lawyer advised her client not to ...... any information that might weaken their case in court.
A) cite B) sight
C) site D) slight

2. The architect had to ...... the old structure before finalizing the restoration plan.
A) aprise B) apprise
C) arise D) appraise

3. The committee decided to ...... the outdated policy after public criticism.
A) repeal B) repel
C) repine D) reply

4. The young prodigy's skills seemed to ...... those of the seasoned experts.
A) surface B) surpass
C) suppress D) surmise

5. The villagers had to ...... their homes when the river began to flood.
A) descent B) dessert
C) desert D) dissent

6. The politician's remarks were so vague that they could easily be ...... to avoid controversy.
A) interpreted B) interrupted
C) interred D) intertwined

7. The scientist had to ...... over the data before publishing the research paper.
A) pour B) pore
C) poor D) power

8. The manager asked the staff to ...... the new guidelines for better compliance.
A) adjure B) adder
C) adhere D) allure

9. The teacher asked the students to ...... their essays before final submission.
A) avid B) audit
C) evade D) edit

10. The activist wanted to ...... awareness about environmental conservation.
A) race B) rays
C) raze D) raise

11. The general decided to ...... his troops at the northern border.
A) statue B) stature
C) station D) status

12. The historian discovered an ancient scroll hidden in the temple's ....
A) alter B) altar
C) halter D) falter

13. The company had to ...... its expansion plans due to financial constraints.
A) curtail B) curtain
C) carton D) certain

SSC Exams

English

14. The CEO's decision will ...... the company's future for years to come.
A) affect B) effect
C) afflict D) infect

15. The lawyer was careful to ...... all relevant documents in her evidence file.
A) include B) deduce
C) enclose D) conclude

16. The police decided to ...... the suspect until further investigation.
A) retain B) detain
C) attain D) pertain

17. The community gathered to ......the victims of the disaster.
A) more B) moor
C) morn D) mourn

18. The author's style tends to ...... complex ideas into simple language.
A) derail B) distil
C) drill D) still

19. The climbers had to ...... against strong winds to reach the summit.
A) wrest B) rest
C) wrestle D) west

20. The teacher used humour to ...... the tense atmosphere in the classroom.
A) confuse B) diffuse
C) refuse D) defuse

21. The minister's sudden resignation will ...... a by-election.
A) trigger B) tricker
C) ticker D) tracker

22. The engineer will ...... the blueprint before final approval.
A) review B) revue
C) reveal D) renew

23. The sailor managed to ...... the rope before the storm hit.
A) note B) not
C) knot D) net

24. The judge decided to ...... the sentence after reviewing the evidence.
A) commit B) commute
C) committee D) comment

25. The speaker tried to ...... his voice to reach the entire audience.
A) eject B) reject
C) protect
D) project

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కరెంట్ అఫైర్స్



★ వాషింగ్టన్ డీసీలో ఇటీవల జరిగిన 8వ వార్షిక నాయకత్వ సదస్సులో యూఎస్ - ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం (యూఎస్ ఐఎస్‌పీఎఫ్) గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డును ఎవరికి ప్రదానం చేశారు?
జ: కుమార్ మంగళం బిర్లా (ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్)

★ 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏ

మాదిరి ప్రశ్నలు

థీమ్‌తో నిర్వహించారు? (ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు)
జ: 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్'

★ పోలండ్ నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (ప్రత్యర్థి రాఫెల్ ట్రజాస్కోవ్‌స్కీపై పోటీపడి ఎన్నికల్లో 50.89 శాతం ఓట్లను సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.) జ: కరోల్ నవ్రోకి

★ భారత సాయుధ దళాలకు చెందిన ట్రై-సర్వీసెస్ ఆల్ - ఉమెన్ సెయిలింగ్ ఎక్స్‌పెడిషన్ బృందం ఇటీవల దేశం మొదటి అంతర్జాతీయ ఓషన్-సీ సెయిలింగ్ యాత్రను ఏ దేశానికి వెళ్లి పూర్తిచేసింది? (1800 నాటికల్ మైళ్ల ప్రయాణాన్ని 56 అడుగుల ఐఏఎస్‌వీ త్రివేణి అనే స్వదేశీ నౌకలో ఈ మహిళా బృందం పూర్తిచేసింది.) జ: సీషెల్స్

మరింత సమాచారం

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల నిర్మాణం, వృద్ధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ జరిగిన నాటికి (1956) రాష్ట్రంలో చిన్న తరహా, గ్రామీణ కుటీర పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉండేవి. అప్పటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం మూడు భారీ పరిశ్రమలే ఉన్నాయి. 1) హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ - విశాఖపట్నం (కేంద్ర ప్రభుత్వ సంస్థ) 2) నిజాం షుగర్ కంపెనీ - నిజామాబాద్ 3) ఆల్విన్ కంపెనీ - హైదరాబాద్.

పరిశ్రమ నిర్వచనం: ఎంఎస్ఎంఈడీ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్) చట్టం - 2006 దేశంలో పరిశ్రమలను నిర్వచించింది. ఉత్పత్తి రంగంలోని పరిశ్రమలను యంత్రాలపై పెట్టే పెట్టుబడి ఆధారంగా, సేవా రంగంలో అయితే పరికరాలపై పెట్టుబడి ఆధారంగా వర్గీకరణ చేసింది.

రకాలు	ఉత్పత్తి రంగంలో పెట్టుబడి (రూ.)	సేవారంగంలో పెట్టుబడి (రూ.)
1. సూక్ష్మతరహా పరిశ్రమలు (మైక్రో)	25 లక్షల వరకు	10 లక్షల వరకు
2. చిన్నతరహా పరిశ్రమలు (స్మాల్)	25 లక్షల పైన - 5 కోట్ల వరకు	10 లక్షలపైన - 2 కోట్ల వరకు
3. మధ్యతరహా పరిశ్రమలు (మీడియం)	5 కోట్ల పైన - 10 కోట్ల వరకు	2 కోట్ల పైన - 5 కోట్ల వరకు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకారం 'మెగా ప్రాజెక్టు' అంటే కనీస పెట్టుబడి రూ.500 కోట్లు లేదా ప్రత్యక్షంగా 2000 మందికి ఉపాధి అందించే పరిశ్రమలు. వస్త్రపరిశ్రమలో మెగా ప్రాజెక్టు అంటే పెట్టుబడి పరిమితి రూ.125 కోట్లు, కనీసం 2000 మందికి ఉపాధి అందించాలి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బయోటెక్ రంగాల్లో రూ.50 కోట్లు పెట్టుబడి పరిమితి ఉండి, కనీసం 200 మందికి ఉపాధి కల్పిస్తే మెగా ప్రాజెక్టులు అంటారు. మెగా ఇంటిగ్రేటెడ్ ఆటోమొబైల్ ప్రాజెక్టు అంటే ఇంజిన్ తయారీ, బాడీ షాపు, ట్రాన్స్‌మిషన్ లాంటి అంశాల్లో పెట్టుబడి రూ.1500 కోట్లు లేదా అంతకుమించి పెట్టుబడులు ఉండాలి.

జీఎస్‌డీపీలో పారిశ్రామిక రంగ వాటా, వృద్ధి రేటు (ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం)

సంవత్సరం	జీఎస్‌డీపీలో వాటా	వృద్ధి రేటు
2021 - 22	24.33 %	21.71 %
2022 - 23	25.73 %	16.06 %
2023 - 24	25.69 %	8.46 %

✦ భారతదేశ జీడీపీలో పారిశ్రామిక రంగ వాటా 30 శాతానికి మించి ఉంటే రాష్ట్ర జీఎస్‌డీపీలో పారిశ్రామిక రంగ వాటా 25% మాత్రమే ఉంది. అదే ఏపీలో స్థిర ధరల ప్రకారం జీఎస్‌డీపీలో పారిశ్రామిక రంగ వాటా 30%గా ఉంది.

✦ 2023-24 ప్రస్తుత మార్కెట్ ధరల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్‌డీపీలో పారిశ్రామిక ఉపరంగాల వాటాను పరిశీలిస్తే తయారీ పరిశ్రమలు 12.23%, నిర్మాణం రంగం 7.83%, గనులు, తవ్వకాలు 2.92%, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా రంగం వాటా 2.71%గా ఉంది. 2023-24 సంవత్సరానికి పారిశ్రామిక రంగానికి అధిక విలువ అందిస్తున్న ఉపరంగం 'తయారీ పరిశ్రమలు' కాగా, అధిక వృద్ధిరేటు నమోదైన ఉపరంగం 'నిర్మాణ రంగం'.

✦ దేశంలోనే అగ్రగామి ఎగుమతి హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ ఎగుమతి ప్రోత్సాహక విధానం (ఏపీఈఎక్స్) 2022 - 2027 ను విడుదల చేసింది. ప్రస్తుతం దేశంలో ఆరో అతిపెద్ద ఎగుమతి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. 2023-24లో ఏపీ నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల విలువ రూ.1,63,563 కోట్లు. వృద్ధిని ప్రోత్సహించడానికి, ఉపాధి మార్గాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ), చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ)ల అభివృద్ధి ద్వారా ఏపీని తయారీరంగ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ పారిశ్రామిక నడవాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి ముందడుగు వేస్తోంది.

ఎదుగుతూ.. ఎగుమతులను ప్రోత్సహిస్తూ!

ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, స్థిరమైన వృద్ధికి ఆలంబనగా నిలిచేవే పరిశ్రమలు. స్థానికంగా ఉపాధి కల్పన, సామాజిక అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాన్ని పెంచడంలో ముందుంటాయి. అందుకే ప్రభుత్వ విధానాలను ఎప్పుడూ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించే విధంగా రూపొందిస్తారు. రాష్ట్ర విభజనతో ప్రధాన పరిశ్రమలను కోల్పోయినప్పటికీ నవ్యాంధ్రలో పారిశ్రామిక ప్రగతికి అనువైన వాతావరణం, వనరులు ఉన్నాయి. విశాఖపట్నం పారిశ్రామిక కేంద్రంగా నిలవగా, పారిశ్రామిక నడవాల ద్వారా మిగతా ప్రాంతాల్లోనూ పెట్టుబడులను ఆకర్షించి, తయారీ రంగాన్ని పరుగులు తీయించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రభుత్వరంగ పరిశ్రమలు, వాటి ఉత్పత్తులు, కార్యకలాపాలు, ప్రాధాన్యం గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం, ఎగుమతులు పెంచే దిశగా సిద్ధం చేస్తున్న ప్రభుత్వ ప్రణాళికలను స్థూలంగా తెలుసుకోవాలి.



వైజాగ్ స్టీల్‌ప్లాంటు

జనరల్ స్టడీస్
ఏపీ ఎకానమీ

ప్రభుత్వ రంగ పరిశ్రమలు

రాష్ట్రంలో నెలకొల్పిన ప్రభుత్వ పరిశ్రమలు రెండు రకాలు.
1) కేంద్రం ఏర్పాటు చేసిన పరిశ్రమలు (సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్)
2) రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరిశ్రమలు (స్టేట్ లెవెల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్)

కేంద్ర పరిశ్రమలు

1) హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్‌వైఎల్)–1952: విశాఖపట్నం కేంద్రంగా 1941లో 'సింధియా నావిగేషన్ కంపెనీ'ని స్థాపించగా, 1952లో భారత ప్రభుత్వం దీనిని జాతీయం చేసి హిందుస్థాన్ షిప్‌యార్డ్‌గా మార్చింది. రాష్ట్రంలో స్థాపించిన మొదటి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇదే. ఇందులో నిర్మించిన మొదటి ఓడ 'జల ఉష'. ఇక్కడ సరకు రవాణా నౌకలు నిర్మిస్తారు. 2009లో ఈ కంపెనీని భారత నౌకాదళానికి అప్పగించడంతో ఇక్కడే యుద్ధనౌకల నిర్మాణం ప్రారంభమైంది.



2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)–1954: బీఈఎల్ మొదటి యూనిట్‌ను హైదరాబాద్‌లో, 1987లో 2వ యూనిట్‌ను మచిలీపట్నం వద్ద ఏర్పాటు చేశారు. బీఈఎల్ నుంచి రక్షణ రంగానికి అవసరమైన పరికరాలు ఉత్పత్తి అవుతాయి. కృష్ణా జిల్లా 'పామర్రు' వద్ద రూ.300 కోట్లతో ఒక ప్లాంటు ఏర్పాటు చేశారు.

3) హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ – 1960: దీని ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో ఉంది. సిమెంట్, ఎరువుల తయారీకి వినియోగించే జింక్ ఉత్పత్తి చేస్తారు.

4) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐఎల్) – 1964: కడప జిల్లా ఎర్రగుంట్ల వద్ద సిమెంట్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు.



5) ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) – 1967: దేశంలో మొదటిసారి టీవీ తయారుచేసిన ప్రభుత్వ సంస్థ. ఇటీవలి కాలంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లను తయారు చేస్తోంది. ఈసీఐఎల్‌కు తిరుపతిలో చిన్న యూనిట్ ఉంది.

6) నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) – 1975: విశాఖపట్నం వద్ద సింహాద్రి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని ఎన్‌టీపీసీ సాయంతో స్థాపించారు. దేశంలో అతిపెద్ద బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ.

7) డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్)–1976: ఓడరేవుల్లో ఏర్పడిన ఇసుక మేటలను తొలగించడం డీసీఐఎల్ పని. దీని ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో ఉంది.

8) సదరన్ పెస్టిసైడ్స్ లిమిటెడ్–1980: పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో ఉంది. ఇక్కడ పురుగుమందులు, రసాయనాలు ఉత్పత్తి చేస్తారు.

9) వైజాగ్ స్టీల్– 1982: అధికారిక పేరు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్). 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో జరిగిన ఉద్యమాల ఫలితంగా 1982లో విశాఖపట్నంలో ప్లాంటు ప్రారంభించారు. 1992లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు జాతికి అంకితం చేశారు. సముద్ర తీరంలో నిర్మించిన మొదటి స్టీల్ ప్లాంటుగా, తక్కువ ఖర్చుతో స్టీల్ ఉత్పత్తి చేసే 'ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్యాక్టరీ'గా గుర్తింపు పొందింది. సంక్షోభంలో ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంటు పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2025, జనవరిలో రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది.

10) బీహెచ్ఈఎల్–ఎన్‌టీపీసీ యూనిట్–2011: చిత్తూరు జిల్లా మన్నవరం వద్ద బీహెచ్ఈఎల్ - ఎన్‌టీపీసీ సంయుక్త భాగస్వామ్యంతో 'విద్యుత్తు ఉత్పత్తి'కి వినియోగించే పరికరాలు, యంత్రాలను తయారుచేయడానికి ఈ యూనిట్‌ను ఏర్పాటుచేశారు.



ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న 'ఆర్ఐఎన్ఎల్', 'డీసీఐఎల్' నవరత్న హోదా పొందాయి.

రాష్ట్ర పరిశ్రమలు: ఆంధ్రప్రదేశ్‌లో 2022-23 నాటికి ఉన్న రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థలు- 116. వీటిలో రాష్ట్ర ప్రభుత్వానికి 51% లేదా అంతకుమించి వాటా ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో మూలధన పరంగా పెద్ద కంపెనీలు: 1) ఏపీ జెన్‌కో- ఏపీ పవర్ జనరేటర్ కంపెనీ. 2) ఏపీపీడీసీఎల్ - ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్. 3) ఏపీటీఐడీసీఓ - ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.

అత్యధిక లాభాలు గడించే కంపెనీలు: 1) ఏపీపీడీసీఎల్ 2) ఏపీపీఎఫ్‌సీఎల్ (ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్) 3) ఏపీఎస్ఎఫ్‌సీ (ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్).

✦ 2023-24 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం రాష్ట్రస్థాయి ప్రభుత్వరంగ సంస్థలు 123 ఉన్నాయి. వీటిలో మూలధన పరంగా పెద్ద కంపెనీగానే కాకుండా అత్యధిక లాభం గడించే కంపెనీగానూ 'ఏపీస్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్' నిలిచింది.



రచయిత: పి.వి.సుబ్బారెడ్డి

తీరాన్ని తాకే రాకాసి అలలు!



ప్రశాంతంగా ఉండే సముద్రం ఒక్కసారిగా ఉవ్వెత్తున ఉప్పొంగితే వచ్చే విలయమే సునామీ. పెద్ద ఎత్తున ఎగసి పడే రాకాసి అలలు తీర ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టిస్తాయి. సముద్రంలో సంభవించే భూకంపాలు, అగ్నిపర్వత పేలుళ్లతో పుట్టే తరంగాలు వేగంగా భూభాగాలను చేరి అపార ఆస్తి, ప్రాణనష్టాలను కలిగిస్తాయి. తలచుకుంటేనే వెన్నులో వణుకు పుట్టించే ఈ విపత్తుకు ఆస్కారం ఉన్న ప్రాంతంలోనే భారతదేశం, ప్రత్యేకించి తూర్పు తీరం ఉన్నాయి. సునామీకి ప్రధాన కారణాలు, వీటి తీవ్రతను నిర్ణయించే అంశాలు, ఇప్పటి వరకు నమోదైన అతిపెద్ద దుర్ఘటనలు, ప్రభావిత ప్రాంతాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సునామీని ఎదుర్కొనే వ్యూహాలు, తీర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఏర్పాటైన సునామీ హెచ్చరిక వ్యవస్థలు, వాటి కేంద్ర స్థానాలతో పాటు గతంలో సునామీ విలయం మిగిల్చిన విషాదాన్ని గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - విపత్తు నిర్వహణ

సునామీ - కారణాలు, ప్రభావాలు

1. సునామీ అనే మాట ఏ భాష నుంచి వచ్చింది?
   1) రష్యన్ 2) జపనీస్ 3) ఫ్రెంచ్ 4) అరబిక్
2. జపనీస్‌లో 'సు' అంటే అర్థం ఏమిటి?
   1) ఓడరేవు 2) సునామీ 3) వర్షం 4) భూమి
3. జపనీస్‌లో 'నామి' అంటే ఏమిటి?
   1) ఓడరేవు 2) తరంగాలు 3) పగలడం 4) సునామీ
4. తమిళంలో సునామీని ఏమంటారు?
   1) ఆఝి పెరలై 2) నిఘె పెరల్ 3) అఝి పెరల్స్ 4) ఏదీకాదు
5. ఎక్కడ జరిగిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సులో సునామీ అనే పదాన్ని సార్వత్రికంగా వినియోగించేందుకు ఆమోదించారు?
   1) అమెరికా 2) చైనా 3) భారత్ 4) బంగ్లాదేశ్
6. చరిత్రలో నమోదైన మొదటి సునామీ ఎప్పుడు సంభవించింది?
   1) క్రీ.పూ.479 2) క్రీ.పూ.450 3) క్రీ.పూ.120 4) క్రీ.పూ.469
7. సునామీలకు చెందిన మొదటి జాబితాను ఎవరు రూపొందించారు?
   1) హెక్ 2) హెన్రీ 3) క్లాయిజ్ 4) బెకర్వాల్
8. సునామీలు ఏయే కారణాల వల్ల తలెత్తుతాయి?
   1) భూకంపంతోపాటు వచ్చే భ్రంశ చలనాలు
   2) భూపాతం, అగ్నిపర్వత విస్ఫోటం
   3) ఉల్కాపాతం 4) పైవన్నీ
9. భూపాతం కారణంగా అతిపెద్ద సునామీ ఎప్పుడు ఏర్పడింది?




   1) 1947 2) 1958 3) 1962 4) 1971
10. భూపాతం కారణంగా అతిపెద్ద సునామీ ఎక్కడ ఏర్పడింది?
   1) అలస్కా 2) ఇండోనేసియా 3) చైనా 4) థాయ్‌లాండ్
11. సముద్ర గర్భంలో భూకంపం వల్ల సునామీ సంభవించే శాతం?
   1) 80% 2) 75% 3) 40% 4) 30%
12. వాతావరణంలో మార్పుల కారణంగా సునామీ సంభవించే శాతం?
   1) 2% 2) 5% 3) 6% 4) 12%
13. సునామీ సాధారణ లక్షణాలు?
   1) సునామీ ఏ సమయంలోనైనా సంభవించవచ్చు.
   2) సునామీలు మహాసముద్రాల్లోకి దారితీసే నదులు, ప్రవాహాల వైపు కూడా ప్రయాణించవచ్చు.
   3) సునామీ తరంగాల శ్రేణిని కలిగి ఉంటుంది.
   4) పైవన్నీ
14. కింది వాటిలో సునామీ హెచ్చరిక వ్యవస్థలు?
   1) అంతర్జాతీయ సునామీ హెచ్చరికలు
   2) ప్రాంతీయ హెచ్చరిక వ్యవస్థలు
   3) 1, 2 4) ఏదీకాదు
15. అత్యధిక శాతం సునామీలు ఏ సముద్రంలో ఏర్పడ్డాయి?
   1) పసిఫిక్ మహాసముద్రం
   2) హిందూ మహాసముద్రం
   3) అరేబియా మహాసముద్రం
   4) బంగాళాఖాతం
16. పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ (పీటీడబ్ల్యూసీ)ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?



   1) 1947 2) 1948 3) 1946 4) 1945
17. పీటీడబ్ల్యూసీని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) హవాయి 2) థాయ్‌లాండ్ 3) న్యూయార్క్ 4) ఢాకా
18. కింది వాటిలో సునామీ అవగాహన దినం?
   1) నవంబరు 1 2) నవంబరు 5 3) నవంబరు 6 4) నవంబరు7
19. ఐఎన్‌సీఓఐఎస్ ప్రకారం భారతదేశ తీరాన్ని సునామీ తాకాలంటే రిక్టర్ స్కేలుపై ఎంతకంటే అధిక తీవ్రత ఉన్న భూకంపం సంభవించాలి?
   1) 5.0 2) 7.0 3) 4.0 4) 3.0
20. భారతదేశంలో సునామీకి మూలాలు?
   1) భూకంపాలు మహాసముద్ర అగాథంలో 100 కి.మీ. లేదా అంతకంటే తక్కువ లోతులో రావాలి.
   2) సముద్ర నేలలో ఊర్ధ్వ చలనం ఉండాలి.
   3) మంద చిద్ర వేగాలు అత్యంత ప్రమాదకరమైన సునామీలను సృష్టిస్తాయి.
   4) పైవన్నీ
21. అంతర్జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం ఎక్కడ ఉంది?
   1) గోవా 2) టోక్యో 3) జకార్తా 4) హొనలులు
22. ఏ సంవత్సరంలో ఇండోనేసియాలోని క్రాకటావ్ ప్రాంతంలో పర్వత సంబంధ తీవ్ర విస్ఫోటం వల్ల 40 అడుగుల సునామీలు సంభవించాయి?



   1) 1881 2) 1882 3) 1883 4) 1884
23. సముద్ర గర్భంలో భూకంపాన్ని ఏమంటారు?
   1) ఉరుము 2) మెరుపు 3) తుపాను 4) సునామీ
24. సునామీ అలలు దేనివల్ల ఉద్భవిస్తాయి?
   1) సముద్రగర్భ భూకంపాలు
   2) అగ్నిపర్వత సంబంధ పగుళ్లు
   3) 1, 2 4) ఏదీకాదు
25. భారతదేశంలో ఏ ప్రాంతాన్ని సునామీలు తరచుగా ప్రభావితం చేస్తాయి?
   1) గల్ఫ్ ఆఫ్ కంబట్ 2) రాణ్ ఆఫ్ కచ్ 3) తూర్పు తీర ప్రాంతం 4) మలబార్ తీర ప్రాంతం
26. 'ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్'ను ఎప్పుడు ఏర్పాటుచేశారు?
   1) 1999 2) 2001 3) 2003 4) 2005
27. భారతదేశ సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?



   1) చెన్నై 2) హైదరాబాద్ 3) విజయవాడ 4) మంగళగిరి
28. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) గోవా 2) పుణె 3) హైదరాబాద్ 4) అమరావతి
29. భూకంపం, సునామీ, అగ్నిప్రమాదం, అణువిపత్తు ఒకేసారి జపాన్‌లో ఏ సంవత్సరంలో వచ్చాయి?
   1) 2011 2) 2010 3) 2012 4) 2009
30. 2004, డిసెంబరు 26న వచ్చిన సునామీ ఏయే దేశాలపై అధిక ప్రభావాన్ని చూపించింది?
   1) ఇండోనేసియా 2) థాయ్‌లాండ్ 3) భారత్ 4) పైవన్నీ
31. నికోబార్‌కు సమీపంలో 7.5 తీవ్రతతో భూకంపం వస్తే, అది నికోబార్‌లోని సమీప తీరాన్ని తాకడానికి ఎంత సమయం పడుతుంది?
   1) 10 - 20 నిమిషాలు 2) 20 - 30 నిమిషాలు 3) 30 - 40 నిమిషాలు 4) 1 గంట
32. నికోబార్‌కు సమీపంలో 7.5 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం వస్తే, అది భారత ప్రధాన భూభాగాన్ని తాకడానికి ఎన్ని గంటల సమయం పట్టవచ్చు?
   1) ఒక గంట 2) 2 గం. 3) 2 - 3 గం. 4) 4 గం.
33. భారత్ తీరప్రాంత దుర్బలత్వ సూచీ (కోస్టల్ వల్నరబులిటీ ఇండెక్స్ – సీవీఐ)ని ఎప్పుడు విడుదల చేశారు?
   1) 2012 2) 2014 3) 2016 4) 2018
34. భారత తీరప్రాంత దుర్బలత్వ సూచీ (సీవీఐ)ని ఎవరు విడుదల చేశారు?
   1) WMO 2) IMO 3) INCOIS 4) IGNIS
35. సీవీఐ ప్రకారం తమిళనాడులో ఏ జిల్లాకు అధిక సునామీ ముప్పు ఉంది?
   1) తిరువళ్లూరు 2) చెన్నై 3) కాంచీపురం 4) 2, 3
36. ఆంధ్రప్రదేశ్‌లో ఏ జిల్లాల మధ్య ఉన్న తీరరేఖకు అధిక సునామీ ముప్పు ఉంది?
   1) తూర్పు గోదావరి 2) విశాఖపట్నం 3) 1, 2 4) ఏదీకాదు
37. సునామీ ముప్పు దగ్గరగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?
   1) తీరరేఖ నుంచి వందల మీటర్ల వరకు భవన నిర్మాణాలు చేయరాదు.
   2) వరదలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.
   3) స్థానిక అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలి.
   4) పైవన్నీ
38. ఏ రోజున 11 ఆగ్నేయాసియా దేశాల్లో సంభవించిన సునామీ రెండున్నర లక్షల మంది మరణానికి కారణమైంది?



   1) 2004, అక్టోబరు 26 2) 2003, అక్టోబరు 26 3) 2004, నవంబరు 26 4) 2004, డిసెంబరు 26
39. జపాన్‌లో 23 అడుగుల సునామీ ఎప్పుడు సంభవించింది?
   1) 2010, మార్చి 11 2) 2011, ఫిబ్రవరి 11 3) 2010, ఫిబ్రవరి 11 4) 2011, మార్చి 11
40. సునామీ ఒక...
   1) తుపాను 2) రక్తం పీల్చుకునే ఈగ
   3) దిండు రూపంలో ఏర్పడి ఉన్న చిన్న భూమి
   4) సముద్ర కంపం లేదా సముద్ర గర్భంలో అగ్నిపర్వత పేలుడు వల్ల ఏర్పడే అతిపెద్ద సముద్రపు అల
41. సముద్రంలో గంటకు సునామీ గరిష్ఠంగా ఎన్ని మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది?
   1) 485 2) 100 3) 50 4) 1000

సమాధానాలు

1-2; 2-1; 3-2; 4-1; 5-1; 6-1; 7-1; 8-4; 9-2; 10-1; 11-2; 12-1; 13-4; 14-3; 15-1; 16-2; 17-1; 18-2; 19-2; 20-4; 21-4; 22-3; 23-4; 24-3; 25-3; 26-1; 27-2; 28-3; 29-1; 30-4; 31-2; 32-3; 33-1; 34-3; 35-4; 36-3; 37-4; 38-4; 39-4; 40-4; 41-1.

'ఇద్దరి భూమి' యుద్ధం ఆపేనా?

అలాస్కాలో రష్యా, ఉక్రెయిన్‌లకు పరిష్కారం లభిస్తుందా.. ● ట్రంప్ పుతిన్ భేటీపై ఆశగా ఎదురుచూస్తున్న ప్రపంచం

అనంతంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం..
అతలాకుతలం చేస్తున్న ట్రంప్ సుంకాల పంతం..
ప్రపంచ ఆర్థిక సంక్షోభం..
ఇన్ని సమస్యల మధ్య సుదీర్ఘ కాలం తర్వాత ఈ నెల 15న అమెరికా, రష్యా అధినేతల ముఖాముఖి సమావేశం జరుగుతోంది..
..ప్రపంచమంతా ఆశగా చూస్తున్న ఈ శిఖరాగ్ర సమావేశానికి అలాస్కా వేదిక కాబోతోంది!





అరుదైన సమావేశానికి ఆతిథ్యమిస్తున్న ఈ అలాస్కాకూ అత్యంత అరుదైన చరిత్ర ఉంది. ఉప్పునిప్పుల వ్యవహరిస్తున్న అమెరికా, రష్యాలు రెండూ అనుభవించిన భూభాగమిది. సమకాలీన ప్రపంచ చరిత్రలో అనూహ్య పరిణామాలకు కారణమైన అలాస్కా.. రావణ కాష్టంలా, సమాధానంలేని ప్రశ్నలా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించేందుకు వేదిక అవుతుందా.. ట్రంప్, పుతిన్‌ల మధ్య సయోధ్యకు బీజం వేస్తుందా.. అనేది బిలియన్ డాలర్ల ప్రశ్న.

అలాస్కా చరిత్రలోకి తొంగి చూస్తే..

✦ అలాస్కా ప్రస్తుతం.. అమెరికా 49వ రాష్ట్రం. కానీ ఇది ఒకప్పుడు రష్యా భూభాగం.

✦ 1867 అక్టోబరులో రష్యా అమ్మేస్తే అమెరికా అయిష్టంగా కొనుక్కున్న ప్రాంతం. నాడు వద్దనుకున్న ఈ భూమి నేడు అమెరికాకు బంగారం. సహజ వనరుల పరంగా, భౌగోళికంగా, వ్యూహాత్మకంగా ఎంతో కీలకం.

✦ పద్దెనిమిదో శతాబ్ది తొలినాళ్లలో ఉత్తర అమెరికా దాకా రష్యా భూభాగం విస్తరించి ఉండేది. అదే అలాస్కా. మంచు, దట్టమైన అడవులు, పర్వతాలతో కూడిన ఈ ప్రాంతం అంతగా నివాసయోగ్యం కాదు.

క్రిమియా యుద్ధంతో..

1853-1856 క్రిమియా యుద్ధం అలాస్కాను రష్యా కోల్పోయేలా చేసింది. బల్గేరియా, రుమేనియా, మాల్డోవా, క్రిమియాలు అప్పట్లో ఆటమన్ (టర్కీయే) సామ్రాజ్యంలో భాగంగా ఉండేవి. ముస్లిం చక్రవర్తి పాలనలోని ఈ ప్రాంతాల్లోని క్రైస్తవుల రక్షణ పేరుతో రష్యా రంగంలోకి దిగడంతో క్రిమియా యుద్ధం మొదలైంది. నల్ల సముద్రంలో రష్యా నౌకా బలగాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆ యుద్ధంలో ఆటమన్ సామ్రాజ్యానికి మద్దతిచ్చాయి. ఆ పోరులో రష్యా దారుణంగా దెబ్బతిని అప్పుల్లో కూరుకుపోయింది. దీంతో రష్యా జార్ చక్రవర్తి అలెగ్జాండర్-2 అలాస్కాను అమ్మేయాలనుకున్నారు.

అమెరికాతో బంధం..

ఆ సమయానికి బ్రిటిష్ సామ్రాజ్యంపై అమెరికాకూ అయిష్టత ఉండేది. అలా రష్యా, అమెరికా దగ్గరయ్యాయి. యుద్ధంలో తమకు వ్యతిరేకంగా పోరాడిన బ్రిటన్‌కు కాకుండా అలాస్కాను అమెరికాకు అమ్మడానికి రష్యా ఇష్టపడింది. 1859లో అలాస్కాను అమ్మకానికి పెట్టింది. కానీ అమెరికా అంతగా ఇష్టం చూపలేదు. కారణం అలాస్కా అంతగా విలువైంది కాదనుకోవడంతోపాటు అప్పటికి అమెరికా అంతర్యుద్ధంలో మునిగితేలుతోంది. 1865లో అప్పటి అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ మరణించి, అంతర్యుద్ధం ముగియడంతో అలాస్కాపై రెండు దేశాల మధ్య సంప్రదింపులు మళ్లీ మొదలయ్యాయి.

అబ్బే.. దండగన్నారు

మొత్తానికి రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. 1867 అక్టోబరు 18న అలాస్కా, రష్యా చేతుల్లోంచి అమెరికాకు వెళ్లింది. 5,86,412 చదరపు మైళ్ల (సుమారు 36,50,00000 ఎకరాలు) భూమిని కేవలం 70 లక్షల డాలర్లకు రష్యా అమ్మేసింది. తక్కువ ధరకు కొనుగోలు చేసినా అమెరికాలోని వారు పెదవి విరిచారు.

పన్ను లేదక్కడ..

✦ అమెరికాలో విస్తీర్ణపరంగా పెద్ద రాష్ట్రం అలాస్కా. అత్యంత సంపన్న రాష్ట్రాల్లో ఒకటి.

✦ ఆర్కిటిక్ తీర ప్రాంతం మొత్తాని కంటే అలాస్కా తీర ప్రాంతం పెద్దది.

✦ రెండు టైమ్ జోన్లు, 3 వేలకుపైగా నదులు.. 30 లక్షల చెరువులు, లక్ష హిమానీ నదాలు (గ్లేసియర్లు), 100కు పైగా అగ్నిపర్వతాలు ఉన్నాయిక్కడ.


✦ ఇక్కడ ఆదాయపు పన్ను ఉండదు. సరికదా.. ఈ రాష్ట్రంలో నివసించే వారికి ప్రభుత్వమే ఏటా స్టైపెండ్ ఇస్తుంది.

బంగారం కొండ..

అప్పట్లో అలాస్కాలో దాగిన విలువ.. అమ్మిన రష్యాకు తెలియదు.. కొన్న అమెరికాకూ తెలియదు. కొన్న తర్వాత దాదాపు 30 సంవత్సరాలపాటు అమెరికా అలాస్కాను పట్టించుకోలేదు. పౌర ప్రభుత్వాన్నీ ఏర్పాటు చేయలేదు. 1884లో తొలిసారిగా అక్కడ పౌర ప్రభుత్వం ఏర్పడింది. 1896లో అక్కడ అపారమైన బంగారం, చమురు ఇతర ఖనిజాలున్నాయని తేలడంతో దాని రూపురేఖలు మారిపోయాయి. రెండో ప్రపంచ యుద్ధంలో భౌగోళికంగా వ్యూహాత్మకంగా అత్యంత కీలక ప్రాంతమైంది. ఆసియా-పసిఫిక్‌పై అమెరికా పట్టుకు కేంద్రమైంది. 1959 జనవరి 3న అలాస్కా సంయుక్త అమెరికాలో 49వ రాష్ట్రంగా ఆవిర్భవించింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

1971 యుద్ధ యోధుడి కన్నుమూత


డీకే పరుల్కర్

దిల్లీ, పుణె: భారత వాయుసేన వెటరన్ గ్రూప్ కెప్టెన్, 1971 యుద్ధ యోధుడు డీకే పరుల్కర్ కన్నుమూశారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం ఉదయం ఆయన కార్డియాక్ అరెస్టుతో మరణించారు. ఆయన వయసు 82 ఏళ్లు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. 1971 యుద్ధంలో పరుల్కర్‌ను పాకిస్థాన్ బందీగా పట్టుకుంది. అయితే ఆయన చాకచక్యంగా తప్పించుకుని భారత్‌కు చేరుకున్నారు. 1963లో పరుల్కర్ భారత వాయుసేనలో చేరారు. పలు పదవులను నిర్వహించారు. వాయుసేన అకాడమీలో శిక్షకుడిగానూ సేవలందించారు. 1965లో భారత్, పాక్ యుద్ధం సందర్భంగా.. ఆయన ప్రయాణిస్తున్న విమానం శత్రు దేశ మంటల్లో చిక్కుకుంది. దీంతో ఆయన కుడి భుజానికి గాయమైంది. విమానంలో నుంచి దూకి పారాషూట్ సాయంతో వెళ్లిపోవాలని సూచించినా ఆయన గాయంతోనే విమానాన్ని ఎయిర్‌బేస్‌కు తీసుకొని వచ్చారు. ఈ సాహసానికిగానూ ఆయనకు వాయుసేన మెడల్ దక్కింది. 1971లో వింగ్ కమాండర్‌గా ఉన్న పరుల్కర్‌ను పాకిస్థాన్ యుద్ధ ఖైదీగా బంధించింది. అక్కడి నుంచి ఇద్దరు సహచరులతో కలిసి ఆయన పాకిస్థాన్ యుద్ధ క్యాంపు నుంచి తప్పించుకుని భారత్‌కు వచ్చారు.

ఉప రాష్ట్రపతి ఎన్నిక వేళ..

కశ్మీర్‌లో రాజ్యసభ స్థానాలన్నీ ఖాళీ

- పంజాబ్, ఝార్ఖండ్‌లలో చెరొకటి
- లోక్‌సభలో ఒక్కటి

దిల్లీ: సెప్టెంబరు 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక నిర్వహించనున్న తరుణంలో జమ్మూకశ్మీర్‌లోని మొత్తం నాలుగు రాజ్యసభ స్థానాలూ ఖాళీగానే ఉండబోతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కలిసి ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి ఉండగా, జమ్మూకశ్మీర్ నుంచి ఎగువసభకు నాలుగేళ్లుగా ప్రాతినిధ్యమే లేకపోవడం గమనార్హం. 2021 ఫిబ్రవరి నాటికి అప్పటి నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఎమ్మెల్యేలు తమ రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంత పరిధిలోని రాజ్యసభ సభ్యులను ఎన్నుకుంటారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసి 10 నెలలవుతోంది. కానీ ఇప్పటికీ ఎన్నికల సంఘం ఇక్కడి రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పంజాబ్, ఝార్ఖండ్‌ల నుంచి ఒక్కో సీటు చొప్పున రాజ్యసభలో మొత్తం ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. లోక్‌సభకు సంబంధించి పశ్చిమ బెంగాల్ నుంచి బసీర్‌హాట్ స్థానం మాత్రమే ఖాళీగా ఉంది.

తప్పించుకునే సమాధానాలిచ్చిన వాద్రా

- తప్పంతా సహాయకులపై నెట్టేశారు
- ఈడీ ఆరోపణ

దిల్లీ: హరియాణా గురుగ్రామ్‌లోని శికోపుర్ గ్రామంలో 2008లో చోటుచేసుకున్న మోసపూరిత భూ లావాదేవీల కేసు విచారణలో ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త అయిన రాబర్ట్ వాద్రా తప్పించుకునే సమాధానాలిచ్చారని, తప్పంతా సహాయకులపై నెట్టేసే ప్రయత్నం చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. రియల్ ఎస్టేట్ నగదు లావాదేవీలో అప్పటి ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా ద్వారా ప్రభుత్వ అధికారులను ప్రభావితం చేసి మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంది. జులై 17వ తేదీన దిల్లీలోని పీఎంఎల్‌ఏ (మనీ లాండరింగ్ నిరోధక చట్టం) కోర్టుకు సమర్పించిన 332 పేజీల అభియోగ పత్రంలో ఈ వివరాలను ఈడీ పేర్కొంది. వాద్రాకు రూ.58 కోట్లు ముట్టాయని తెలిపింది. ఈ కేసులో వాద్రా తొలి ముద్దాయిగా ఉన్నారు. ఈడీ ఆరోపణలపై వాద్రా తరఫు న్యాయవాదులు ఇంకా స్పందించలేదు.

విద్యుత్ అంతరాయాలను సత్వరమే పరిష్కరించాలి

మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పరిస్థితిపై మూడు డిస్కంల సీఎండీలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. సమస్యలను ఎప్పటికప్పుడు చక్కదిద్దాలని సూచించారు.

రహదారులు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: భారీ వర్షాల కారణంగా కోతకు గురయ్యే అవకాశమున్న రహదారులు, కల్వర్టులు, వంతెనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పింగళి, సీపీ బ్రౌన్ జయంతులను రాష్ట్ర పండగలుగా ప్రకటించాలి

శాసనసభ ఉపసభాపతి రఘురామ

ఈనాడు, అమరావతి: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, తెలుగుభాష ఉన్నతికి విశేషకృషి చేసిన సీపీ బ్రౌన్ జయంతులను రాష్ట్ర పండగలుగా ప్రకటించాలని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు కోరారు. ఏటా ఆగస్టు 2న పింగళి వెంకయ్య, నవంబరు 10న సీపీ బ్రౌన్ జయంతులను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆదివారం ఆయన లేఖ రాశారు. ఆ ఇద్దరి విశిష్టతల గురించి అందులో ప్రస్తావించారు.

స్టడీ సర్కిళ్ల ఏర్పాటుపై గిరిజన విద్యార్థి సమాఖ్య హర్షం

ఈనాడు, అమరావతి: గిరిజన యువత కోసం కూటమి ప్రభుత్వం మూడు స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయడం హర్షణీయమని గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ పేర్కొన్నారు. ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు రూ.4.50 కోట్ల నిధులు విడుదల చేయడం సంతోషదాయకమని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

విపక్ష నేతలకు నేడు ఖర్గే విందు

దిల్లీ: ఇండియా కూటమి నేతలకు దిల్లీలోని చాణక్యపురి సమీపంలో గల హోటల్ తాజ్ ప్యాలెస్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం విందు ఇవ్వనున్నారు. ఓటు చోరీ ఆరోపణలు, బిహార్‌లోని ఎస్ఐఆర్‌పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఇండియా కూటమి నాయకులు ఆగస్టు 11న పార్లమెంటు నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు నిరసనలు చేస్తూ ర్యాలీ చేయనున్నారు. అదే రోజు రాత్రి ఖర్గే విందు ఇవ్వనున్నట్లు సమాచారం. కాగా, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంట్ ఉభయసభల్లో ఎస్ఐఆర్‌పై నిరసనలు వ్యక్తంచేస్తున్న విపక్షాలు దీనిపై చర్చకు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేట్‌కు సన్నాహాలు..

రాబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఉమ్మడి అభ్యర్థిని నామినేట్ చేయాలని ఇండియా కూటమి సన్నాహాలు చేస్తోంది. దీనిపై ఏకాభిప్రాయం కోసం మల్లికార్జున ఖర్గే ప్రతిపక్షాలతో చర్చలు జరుపుతున్నారని సమాచారం. పేర్లను అన్వేషించి, దానిపై ఏకాభిప్రాయానికి రావడానికి ఖర్గే పార్టీలను సంప్రదిస్తున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరును ప్రకటించిన తర్వాతే కూటమి అభ్యర్థిని ఖరారు చేయాలని యోచిస్తోంది.

రెండుసార్లు ఓటేసిన మహిళ వివరాలివ్వండి

- రాహుల్‌ను కోరిన కర్ణాటక సీఈవో

దిల్లీ: ఓ మహిళ రెండుసార్లు ఓటేశారంటూ చేసిన ఆరోపణలకు సంబంధించిన పత్రాలను తమకు సమర్పించాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కర్ణాటక ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) నోటీసిచ్చారు. విచారణకు ఆ పత్రాలు సహకరిస్తాయని పేర్కొన్నారు. కర్ణాటక, హరియాణా, మహారాష్ట్రల్లో ఓట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రమాణపత్రం సమర్పించాలని మరోసారి ఈసీ రాహుల్‌ను కోరింది. లేదంటే అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు జాతికి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

యుద్ధప్రాతిపదికన 90 అడుగుల వంతెన

- ఉత్తర కాశీలో ఊపందుకున్న సహాయక చర్యలు
- ఇంకా జాడ తెలియని 49 మంది

ఉత్తర కాశీ: మేఘ విస్ఫోటంతో వరద పోటెత్తిన ఉత్తర కాశీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. గంగోత్రి జాతీయ రహదారిపై 90 అడుగుల బెయిలీ వంతెనను యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. దీంతో సహాయక చర్యలు ఊపందుకున్నాయి. గంగ్నానీ, హర్సిల్ మధ్యన బెయిలీ మాడ్యులర్ వంతెనను ఒక్క రోజులో భారత సైన్యం, సరిహద్దు రోడ్ల సంస్థ (బీఆర్‌వో) కలిసి నిర్మించాయి. ముందుగా తయారు చేసిన పార్టులతో (ప్రి ఫ్యాబ్రికేటెడ్) దీనిని ప్రతికూల వాతావరణం మధ్య నిర్మించినట్లు ఇంజినీర్లు తెలిపారు. దీంతోపాటు హర్సిల్, ధరాలీ మధ్య ప్రత్యామ్నాయ రహదారినీ ఏర్పాటు చేశారు. రెండువైపులా రహదారులు అందుబాటులోకి రావడంతో సహాయక సామగ్రిని ఆదివారం ఆయా గ్రామాలకు పంపారు. సోంగడ్, దబ్రానీ, హర్సిల్, ధరాలీ ప్రాంతాల్లోని రహదారులను పునరుద్ధరిస్తున్నారు.



✦ ఆదివారం 177 మందిని హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దీంతో ఇప్పటిదాకా 1,200 మందిని తరలించినట్లయింది. ధరాలీతోపాటు సమీప గ్రామాల్లో ఇంకా 49 మంది ఆచూకీ తెలియడం లేదు. వారి కోసం స్నిఫర్ జాగిలాలను రంగంలోకి దించారు. థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ధరాలీలో 10 నుంచి 12 రోజులకు సరిపడా ఆహార పదార్థాలను కోటక్ మహీంద్రా బ్యాంకు సమకూర్చింది.

ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని పోయిన ప్రాణం

ఇంటర్నెట్ డెస్క్: అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. మహారాష్ట్రలోని ముంబయి సమీపంలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పాల్ఘర్ జిల్లాకు చెందిన ఛాయా పూరవ్ (45) అనే మహిళ తమ ఇంటి సమీపంలో చెట్టుకొమ్మ విరిగి మీదపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆమె పక్కటెముకలు, భుజాలు, తల భాగంలో గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రి సిబ్బంది ఆమెను ముంబయిలోని హిందుజా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. 100 కి.మీ. ప్రయాణానికి సాధారణంగా రెండున్నర గంటల సమయం పడుతుందన్న ఉద్దేశంతో ఆమెకు అనస్థీషియా ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అంబులెన్సులో బయల్దేరగా.. ఎన్‌హెచ్-48లో భారీ ట్రాఫిక్ జామ్‌లో వాహనం చిక్కుకుపోయింది. దీంతో సాయంత్రం 6గంటలకల్లా సగం దూరం మాత్రమే చేరుకోగలిగారు. ఈ నేపథ్యంలో ఆమెకు అనస్థీషియా ప్రభావం తగ్గడంతో విపరీతమైన నొప్పి భరించలేక విలవిల్లాడిపోయారు. ఈ క్రమంలో తక్షణ వైద్య సాయం అందించేందుకు అంబులెన్స్ సిబ్బంది రాత్రి 7 గంటల సమయంలో మీరా రోడ్‌లోని ఆర్బిట్ ఆసుపత్రికి (హిందుజా ఆస్పత్రికి 30కి.మీ.ల దూరంలో) తీసుకెళ్లారు. కానీ అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఆమెను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు. కనీసం 30 నిమిషాల ముందు ఆస్పత్రికి తీసుకొచ్చి ఉంటే కాపాడేవాళ్లమని ఆమె భర్త కౌశిక్‌కు తెలిపారు.



ప్రధాన స్రవంతిలోకి 15 మందికి పైగా కశ్మీరీ వేర్పాటువాదులు

ఇంటర్నెట్ డెస్క్: జమ్మూ కశ్మీర్‌లో ఈ ఏడాది ఇప్పటివరకూ 15 మందికిపైగా మాజీ వేర్పాటువాద నాయకులు.. దేశంతోపాటు రాజ్యాంగంపట్ల నిబద్ధతను ప్రకటించేందుకు అఫిడవిట్లు సమర్పించారు. సయ్యద్ అలీ షా గిలానీ మాజీ సన్నిహితుడు, డెమోక్రటిక్ పొలిటికల్ మూవ్‌మెంట్ (డీపీఎం) నేత మహమ్మద్ షఫీ రేషి, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్ ఛైర్మన్ షాహిద్ సలీమ్ తదితర కీలక నేతలు ఈ జాబితాలో ఉన్నారు. జమ్మూ కశ్మీర్ సాల్వేషన్ మూవ్‌మెంట్ నేత జాఫర్ అక్బర్ భట్ సతీమణి నిలోఫర్ అక్బర్ భట్.. ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫరెన్స్‌తో తన కుటుంబం అనుబంధాన్ని బహిరంగంగా తెగదెంపులు చేసుకున్నారు. జమ్మూ కశ్మీర్ మాస్ మూవ్‌మెంట్ ఛైర్‌పర్సన్ ఫరీదా బెహెన్‌జీ సైతం ఏపీహెచ్‌సీతో సంబంధాలను తెంచుకున్నట్లు ప్రకటించారు.

ఐఎస్ఎస్‌కు వెళ్లొచ్చిన లద్దాఖ్ విత్తనాలు

దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు తీసుకెళ్లి కొద్ది రోజులపాటు అక్కడ ఉంచిన రెండు రకాల పంటలకు చెందిన విత్తనాలు భూమికి తిరిగొచ్చాయి. అవి మనదేశంలోని లద్దాఖ్ ప్రాంతానికి చెందిన అత్యధిక పోషక విలువలు కలిగిన సీబక్‌థార్న్, హిమాలయన్ బక్‌వీట్ విత్తులు కావడం విశేషం. నాసాకు చెందిన వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లిన ఆ విత్తనాలను కొద్ది రోజుల తర్వాత క్రూ-10 మిషన్‌లో భాగంగా ఈ నెల 9న తిరిగి భూమిపైకి తీసుకొచ్చారు. అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష దేశాల స్పేస్ ఫర్ అగ్రికల్చర్ - అగ్రికల్చర్ ఫర్ స్పేస్ ప్రయోగాల్లో భాగంగా ఆ విత్తనాలను అంతరిక్షంలో తీసుకువెళ్లి తిరిగి తీసుకొచ్చి వాటిపై పరిశోధనలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సూక్ష్మ గురుత్వాకర్షణ, అణుధార్మికత, తీవ్ర ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు సహా మొక్కలు ప్రత్యేకమైన అంతరిక్ష ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాయి? అన్న అంశాలను ప్రయోగశాలల్లో పరిశీలిస్తారు. అలాగే విత్తనాల్లో జన్యు ఉత్పరివర్తనలు, నిర్మాణ మార్పులు, కక్ష్య వాతావరణంలో ప్రేరేపించబడిన జీవక్రియ తేడాలను గమనిస్తారు. ఆ విశ్లేషణలు వాతావరణ మార్పులను తట్టుకోగలిగే దృఢమైన వంగడాల అభివృద్ధికి ఉపకరిస్తాయి.



పాక్ సైన్యాధిపతి మునీర్ అమెరికా పర్యటన

- రెండు నెలల్లో రెండోసారి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ అమెరికాలో పర్యటించారు. అక్కడి రాజకీయ, సైనిక ఉన్నతాధికారులతోపాటు ప్రవాస పాకిస్థానీలతోనూ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన విందులో పాల్గొన్న మునీర్.. రెండు నెలల వ్యవధిలోనే మరోసారి అక్కడ పర్యటించారు. ముఖ్యంగా భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ తాజా పరిణామం చోటుచేసుకుంది. తమ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సీవోఏఎస్) అమెరికాలో అధికారిక పర్యటన చేస్తున్నట్లు పాక్ ఆర్మీ ఓ ప్రకటన చేసింది. అయితే, ఆయన అక్కడికి ఎప్పుడు చేరుకున్నారు? ఎన్ని రోజులు ఉంటారనే విషయాలను వెల్లడించలేదు. యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ మైఖేల్ ఈ.కురిల్లా పదవీవిరమణ కార్యక్రమంలో మునీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సైనిక సహకారంలో కురిల్లా నాయకత్వం ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఇతర సైనికాధికారులతో మునీర్ భేటీ అయ్యారు. పాక్ ప్రవాసులతో ముచ్చటించిన మునీర్, పాక్‌కు మంచి భవిష్యత్తు ఉందని, పెట్టుబడులు తేవడంలో సహకరించాలని చెప్పారు.



బిహార్ ఉప ముఖ్యమంత్రికి రెండు ఓటరు ఐడీలు

- ఆర్జేడీ నేత ఆరోపణ

పట్నా: బిహార్ ఉపముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాకు రెండు ఓటరు ఐడీ కార్డులు ఉన్నాయని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. "విజయ్ కుమార్ సిన్హా రెండు వేరు వేరు జిల్లాలోని వేర్వేరు నియోజక వర్గాల ఓటరు. ఆయనకు లఖిసరాయ్ నియోజక వర్గంలో ఈపీఐసీ నంబరు ఐఏఎఫ్ 3939337 ఉండగా, పట్నాలోని బాంకీపుర్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఐడీ నంబరు ఏఎఫ్ఎస్ 0853341తో ఓటు ఉంది. సిన్హా ఉద్దేశపూర్వకంగానే రెండు వేర్వేరు ప్రదేశాల్లో ఓటును నమోదు చేసుకున్నారు. ఆయన దరఖాస్తుపై సంతకం చేయకుండానే ఈసీ ఓట్లను సృష్టించిందా'' అని తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. మరోవైపు విజయ్ సిన్హా రెండు ఓట్లకు సంబంధించిన స్క్రీన్ షాట్లను కాంగ్రెస్ 'ఎక్స్'లో పోస్టు చేసింది.

తేజస్వీ క్షమాపణలు చెప్పాలి

తేజస్వీ ఆరోపణలపై విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ.. "గతంలో నా కుటుంబ సభ్యుల పేర్లు బాంకీపుర్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఉన్నాయి. వాటిని తొలగించేందుకు దరఖాస్తు నింపాను. కానీ, నా పేరు బాంకీపుర్ నుంచి తొలగించలేదు. అది ముసాయిదా ఓటరు జాబితాలో ఉంది. దాంతో బీఎల్‌వోను సంప్రదించి నా పేరు తొలగించాలని కోరుతూ రసీదు తీసుకున్నాను'' అని వెల్లడించారు. తేజస్వీ యాదవ్ నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అందుకు క్షమాపణలు చెప్పాలని సిన్హా కోరారు. మరోవైపు రెండు ఓట్లను కలిగి ఉండటంపై వివరణ ఇవ్వాలంటూ విజయ్‌కుమార్ సిన్హాకు ఈసీ నోటీసులు పంపింది.

అవయవ మార్పిడిలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వండి

- రాష్ట్రాలకు కేంద్రం అడ్వైజరీ

దిల్లీ: లింగ వివక్షను తొలగించేందుకు అవయవ మార్పిడి సమయంలో మహిళలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని కేంద్రం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అడ్వైజరీ జారీచేసింది. దానం చేసిన మృతుడి దగ్గరి బంధువులు ఎవరైనా అవయవ మార్పిడి అవసరం అయితే వారికి ముందుగా ఆపరేషన్ చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించింది. ఆగస్టు 2న 15వ అవయవ దానం దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ(ఎన్ఓటీటీఓ) పలు సూచనలు చేసింది. మరణించిన అవయవ దాతలను గౌరవించడం, వారికి గౌరవప్రదంగా అంత్యక్రియలు జరిగేలా చూసుకోవడం, జాతీయ దినోత్సవాలు, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సమయంలో దాతల కుటుంబాలను సత్కరించాలని ఎన్ఓటీటీఓ కోరింది. అవయవ మార్పిడిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రాలు బ్రాండ్ అంబాసిడర్‌ను సైతం నియమించాలని సూచించింది. అవయవ దాతలు, గ్రహీతల వివరాలను ఆసుపత్రులు ఎప్పటికప్పుడు ఎన్ఓటీటీఓతో పంచుకోవాలని తెలిపింది.

అటవీ భూముల వర్గీకరణ వివరాల క్రోడీకరణకు చర్యలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న అటవీ భూముల వర్గీకరణ వివరాలను క్రోడీకరిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో రకమైన పేరుతో ఉన్న అటవీ భూముల పేర్లు రికార్డుల్లో నమోదయ్యాయి. రిజర్వు ఫారెస్టు, అడవి, చిట్టడివి, అడవి పోరంబోకు వంటి పేర్లతో ఉన్నందున కొన్ని సార్లు తికమక పడే పరిస్థితులు వస్తున్నాయి. దీంతో వెబ్‌ల్యాండ్‌లో అటవీ భూముల వివరాలు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎల్పీఎం, సర్వే జరగని గ్రామాల్లో సర్వే నంబర్ల వారీగా భూముల వివరాల్లో స్పష్టత తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,71,574.45 ఎకరాల అటవీ భూమి ఉంది. అత్యధికంగా వైఎస్సార్ కడప జిల్లాలో 2,74,411.72, నెల్లూరులో 2,06,852.97, అనంతపురంలో 1,77,546.92, తిరుపతిలో 1,12,838.03 ఎకరాలు ఉన్నాయి. వివాదాలు తలెత్తినప్పుడు రకరకాల పేర్లతో ఉన్న ఈ భూముల వివరాలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఇప్పటివరకు 7,99,725.85 ఎకరాల వరకే పరిశీలన జరిగింది. నెల్లూరు, సత్యసాయి, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, అనకాపల్లి, అన్నమయ్య, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పరిశీలన ప్రాథమిక దశలోనే ఉంది. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని రెవెన్యూశాఖ సదరు జిల్లాల అధికారులను ఆదేశించింది.

ఇళ్లైనా కట్టాలి.. లేదా అడ్వాన్స్ అయినా తిరిగివ్వాలి

- గృహనిర్మాణ లబ్ధిదారులకు పలుచోట్ల నోటీసులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో చేపట్టిన అస్తవ్యస్త ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులను ఇక్కట్ల పాలు చేస్తోంది. స్టేజ్ అప్డేషన్ కోసమంటూ 2023లో నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు నిబంధనలకు విరుద్ధంగా కేంద్రప్రభుత్వ నిధుల్ని అడ్వాన్స్ రూపంలో అందించారు. అందులో కొంతమందికి రూ.10 వేలు, మరికొందరికి రూ.15 వేలు ఇచ్చారు. ఇలా వీరికి రూ.179 కోట్లు చెల్లించారు. ఊరి చివరనో, శ్మశానాల పక్కనో స్థలాలు కేటాయించడంతో చాలామంది నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇప్పటికే ఇలా అడ్వాన్స్ రూపంలో నగదు చెల్లించడంపై కాగ్ అభ్యంతరాలు లేవనెత్తింది. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 గడువు ముగిసిపోనుంది. దీంతో తీసుకున్న అడ్వాన్స్ మొత్తంతో ఇంటి నిర్మాణం ప్రారంభించాలని, లేదా ఆ నగదును వెనక్కి ఇవ్వాలని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో మౌఖికంగా చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా అడ్వాన్స్ తీసుకున్న లబ్ధిదారులు 90 వేల మంది వరకు ఉన్నారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు త్వరలో 'రేడియో' పాఠాలు

దిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వామ్య పక్షాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సీబీఎస్ఈకి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కమ్యూనిటీ రేడియోకు సంబంధించిన అనుమతి(లైసెన్స్) తదితర అంశాలపై భాగస్వామ్య పక్షాలు, నిపుణులతో చర్చించేందుకు రానున్న ఆరు నెలల్లో సమావేశాలు నిర్వహించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. కాగా, 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులకు ఉపయోగపడేలా 'శిక్షా వాణి' పేరుతో వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఆడియో కంటెంట్‌ను పాడ్‌కాస్ట్ రూపంలో ఇప్పటికే సీబీఎస్ఈ అందిస్తోంది. దీనికి సంబంధించిన 'సీబీఎస్ఈ- శిక్షా వాణి' యాప్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. అందులో దాదాపు 400 పాడ్‌కాస్ట్‌లు ఉన్నాయి.